తెలుగులో పాలన

నూర్‌బాషా రహంతుల్లా

తెలుగుమిత్ర ప్రచురణలు
11-121, పోలకంపాడు - 522 501
తాడేపల్లి, గుంటూరు జిల్లా
ఫోన్ : 08645 - 273789, 9948878833

తెలుగులో పాలన

(TelugulO Palana)

రచన : నూర్‌బాషా రహంతుల్లా

మొదటి ముద్రణ : జూలై 2018

ముఖపత్రాలంకరణ :
షేక్ అబ్దుల్లా, 9394822411
విజయవాడ

కాపీలు : 1000

తెలుగుమిత్ర ప్రచురణలు
11-121, **పోలకంపాడు**, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501
ఫోన్ : 08645 - 273789, 9948878833

e.book :

ముద్రణ :
శ్రీశ్రీ ప్రింటర్స్
విజయవాడ - 520 002
సెల్ : 9490634849

వెల : రూ. 60/-

అమ్మ నాన్నలకు

అంకితం...



రోశమ్మ (రోషన్‌బీ)
1938 - 25.4.2000

మౌలాలి
1930 - 17.10.2006

విషయ సూచిక



డాక్టర్ నాగులపల్లి శ్రీకాంత్ ఐ.ఎ.ఎస్.
రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి (రాజకీయ)

తెలుగులో పాలన జరగాలి

శ్రీ నూర్ బాషా రహంతుల్లా తెలుగు భాషాభిమాని . తెలుగులోనే ప్రభుత్వ పాలన జరగాలని కోరుతూ వివిధ సందర్భాలలో సంబంధిత అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తూ ఉన్నారు. గతంలో నాకూ ఆయన రాసిన "తెలుగు దేవభాష" పుస్తకాన్ని ఇచ్చారు. పాలనా రంగంలో పూర్తి స్థాయిలో తెలుగు వాడకాన్ని అమలు చేసేందుకు కొన్ని కోర్కెలు సూచనలతో అభ్యర్ధన పత్రమూ సమర్పించారు . ఇప్పుడు "తెలుగులో పాలన " పేరుతో పుస్తకాన్ని తెస్తున్నారు .

ప్రతి వ్యక్తికీ తన మాతృభాషలోనే పాలన జరగాలనే కోరిక ఉండటం సహజం. ప్రజలకూ ప్రభుత్వానికీ మధ్య అనుసంధానంగా మాతృభాష ఉన్నప్పుడే పరిపాలన సులభంగా ఉంటుందనే కారణంతోనే ప్రభుత్వం "తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ"ను ఏర్పాటు చేయబోతోంది. తెలుగు మాధ్యమంలోనే చదువుకున్న విద్యార్ధులకు ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి . మానవ జీవన గమనాన్ని మలుపుతిప్పిన శాస్త్ర సాంకేతిక రంగాలలోని ప్రపంచ ప్రఖ్యాత వైజ్ఞానిక గ్రంథాలన్నీ నిర్ణీత సమయాల్లో సులభమైన తెలుగు వాడుక భాషలోకి అనువాదం చెయ్యాలి .

నేను భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా ఉన్నప్పుడు రాష్ట్రంలోని అన్ని దుకాణాలు ,సముదాయాల బోర్డులు ప్రభుత్వ పధకాల ప్రారంభోత్సవ నామఫలకాలు,శంకుస్థాపన శిలాఫలకాలు తెలుగులోనే రాయించాలని ఉత్తర్వులు వెలువడ్డాయి.(ప్రభుత్వ

ఉత్తర్వు సంఖ్య 11 (యువజన & సాంస్కృతిక అధికార భాష శాఖ) తేదీ. 14.9.2016). 15 రాష్ట్ర చట్టాలను తెలుగులోకి అనువదించి గజెట్ లో ప్రచురించాలని న్యాయ శాఖ ఉత్తర్వులు కూడా ఇచ్చింది. క్రమేణా మనభాషలోకి అన్ని చట్టాలనూ మార్చుకుందాం. ప్రజల భాషలో పాలన జరగాలని నేను కోరుకుంటున్నాను. మాతృభాషలో పాలన అవసరమే.అది సమంజసమైన కోరిక. అయితే దానికి కలుగుతున్న అవరోధాలను ఎప్పటికప్పుడు అధిగమిస్తూ ముందుకు పోదాం. మన కార్యాలయాలలో తెలుగు దస్త్రాల శాతం పెరగాలి. తెలుగులో పాలన సిద్ధించటానికి నావంతు సహకారం నేను తప్పనిసరిగా అందిస్తాను. ఈ ప్రజోపయోగ కార్యక్రమానికి అందరి సహకారం లభించాలని ఆశిస్తున్నాను.



అన్నీ తెలుగు శాఖ గొడుగు కిందికే!

ఈనాడు 30.12.2012

ఏడు కొండల చెంత ఏడు తీర్మానాలు

ఈనాడు, తిరుపతి: కొత్తగా ఏర్పాటు చేయబోయే 'తెలుగు మంత్రిత్వ శాఖ' గొడుకు కిందకే తెలుగుకు సంబంధించిన అన్ని విభాగాలు, సంస్థలను చేర్చాలని ఇక్కడ ముగిసిన నాలుగో ప్రపంచ తెలుగు మహాసభలు తీర్మానం చేశాయి. తెలుగు భాష అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తున్నట్లు తొలిరోజు సభల్లో ముఖ్యమంత్రి కిరన్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. దీనికి మహాసభలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపాయి. మహాసభలు మొత్తం ఏడు కీలక తీర్మానాలు చేసింది. అధికార భాషా సంఘం అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ ఈ తీర్మానాలను చదివి సభికుల హర్షామోదాల మధ్య ఆమోదం పొందినట్లు ప్రకటించారు. అవి..

1. కృతజ్ఞతలు: తెలుగు భాష, సంస్కృతికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, సాహిత్య, లలిత, సంగీత, నాటక అకాడమీలను పునురద్ధరిస్తాం, ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగు భాషను పాఠ్యాంశంగా తప్పనిసరి చేస్తామని ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఇందుకు ఆయనకు, ఆయన మంత్రివర్గ సహచరులకు తెలుగు ప్రజల పక్షాన ధన్యవాదాలు.

2. ఒకేగొడుగు: ఈ మంత్రిత్వ శాఖ పరిధిలోకే ఇతర రాష్ట్రాల భాషా, సంస్కృతి అంశాలు, తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ, తెలుగు అధికార భాషా సంఘాన్ని కూడా చేర్చాలి.

3. పల్లె నుంచి: గ్రామస్థాయి నుంచి అన్ని ప్రభుత్వ శాఖలు అధికార భాషగా తెలుగును అమలు చేయాలి. ఇందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలి.

4. తెలుగు భాషా సంవత్సరం: తెలుగు జానపదకళలు, ఇతర కళారూపాలు, సాహిత్యం చరిత్ర తదితర అంశాలపై పరిశోధన, ప్రదర్శన, పరిరక్షణ లక్ష్యాలతో ప్రత్యేక రూపొందించి అమలు చేయాలి. ఇందుకోసం 2013ను తెలుగు భాషా సంస్కృతుల సంవత్సరంగా ప్రకటించాలి.

5. పాఠ్యపుస్తకాలు : విదేశాల్లో, ఇతరరాష్ట్రాల్లోని తెలుగు వారి పిల్లలు తెలుగు నేర్చుకునేందుకు అవసరమైన పాఠ్యపుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించాలి. బోధనకు ఉపాధ్యాయులను కూడా ప్రభుత్వం నుంచి సమకూర్చాలి.

6. విద్యలో సంస్కృతి: ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని విద్యాసంస్థల్లో ఒకటి నుంచి ఇంటర్ వరకు సాంస్కృతిక విద్యను ప్రత్యేక అంశంగా చేర్చి విద్యార్థికి ఇష్టమైన ఏదైనా లలిత కళను అభ్యసించేలా చేయాలి. అందులో వచ్చిన మార్కులను విధిగా అన్ని సందర్భాల్లోనూ పరిగణనలోకి తీసుకోవాలి.

7. మలి సభలు అమెరికాలో: ప్రతి ఐదేళ్లకోసారి ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించాలి. అయిదో ప్రపంచ తెలుగు మహాసభలను అమెరికాలో నిర్వహించాలని అక్కడి తెలుగు వారు కోరారు. వారి కోర్కెను పరిశీలించాలి.



శ్రీరాము సత్యనారాయణ, ఐ.ఎ.ఎస్
జిల్లాకలక్టర్ ,కర్నూలు

తేట తెలుగులో పాలన కోసం బాటలు వేద్దాం

విశ్వకవి శ్రీ రవీంద్రనాథ్ టాగూర్ మనసులోని భావాలను స్వేచ్ఛగా, స్వచ్ఛంగా వ్యక్తం చేసేందుకు మాతృ భాషే, మహోత్తరమైన వాహకం అన్నారు. ఏ విషయాన్నైనా మనం మాతృ బాషలో అర్థం చేసుకున్నంత సులువుగా పరాయి భాషలో అర్థం చేసుకోలేమన్నది నిర్వివాదాంశం. పుడమి పొరను తొలుచుకొని మొలుచుకొచ్చే మొగ్గలాగా మాతృ బాషలో మన భావాలు సహజంగా ఉబికివస్తాయి. చెరువు గట్టున నిలబడి చల్లని గాలిని పారవశ్యంతో అనుభవించినట్లు, చెరకు గడను నమిలి తీయందనాన్ని అస్వాదించినట్లు, మాతృ బాషలోని భావాన్ని సులభంగా, అవలీలగా అర్థం చేసుకోవచ్చు. నారికేళ పాకం కన్నా, పంచదార మాధుర్యం కన్నా తేట తెనుగు తీయదనం మిన్న. తన మాతృ బాష తెలుగు కాకపోయినా సాహితీసమరాంగణ సార్వభౌముడిగా గణతికెక్కిన శ్రీ కృష్ణదేవరాయలు తెలుగు పై అపారమైన తృష్ణగలిగి తెలుగు బాషను తెలుగు తల్లి సిగలో నందివర్ధనమై వర్ధిల్లేటట్లు చేశారు. అష్టదిగ్గజ కవులతో భువన విజయమును ఏర్పాటుచేసి తెలుగు బాషా వైభవాన్ని దశదిశలా చాటారు. తెలుగేతరులు తెలుగు భాషకు చేసిన సేవను స్మరిస్తున్నపుడు మనం తప్పనిసరిగా పేర్కొనదగిన మహనీయుడు సి.పి.బ్రౌన్

తెలుగు మాధుర్యానికి ముగ్ధుడై తెలుగును అమితంగా ప్రేమించిన బ్రౌన్ గారు బ్రౌణ్యనిఘంటువును రూపొందించడం, ప్రజాకవి వేమన పద్యాలను ఆంగ్లం లోనికి అనువదించి ప్రపంచానికి పరిచయం చేయడం తెలుగు భాషకు జరిగిన అరుదైన సత్కారంగా భావించాలి. తెలుగేతరులు చాలా మంది తెలుగు బాష అనే మందార మొక్కకు నీరుపోసి అనేక

కావ్యమందారాలు పూయించి ఆంధ్రావనిని సుందర బృందావనిగా తీర్చిదిద్దారు. అటువంటి సుందర బృందావనిలో ప్రబంధ కావ్యసుమాలు, ధ్వని కావ్య సుమదళాలు, ఆధ్యాత్మిక కావ్య పుష్పాలు, ఎన్నెనో గుబాళించి తెలుగు బాషను పరిపుష్టం చేశాయి. ఇంతటి పవిత్రమైన తులసి మొక్కల సరసన పరభాషా గంజాయి మొక్కలు పెరగడం దురదృష్టకరం.

నూర్ బాషా రహంతుల్లా మాతృభాష తెలుగు. ఆయన తెలుగు ముస్లిం. ఆయన తెలుగు భాషలో నూర్ (వెలుగు) పెంచడం కొరకు, పంచడం కొరకు అనునిత్యం కృషిచేయడం అభినందనీయం. 1988లో అప్పటి ఆంధ్ర ప్రదేశ్ సచివాలయం తనకు రాసిన తెలుగు ఉత్తరాన్ని ఆయన భద్రపరిచి దానిని తెలుగులో పాలనకు అత్యుత్తమ ఉదాహరణగా ఉటంకించడం తెలుగు అమలు పై ఆయనకున్న చిత్తశుద్ధిని చాటి చెబుతుంది. దాదాపు మూడు దశాబ్దాలుగా అయన తెలుగును పాలనా భాషగా అమలు చేయించడం కోసం అపారమైన కృషి చేస్తున్నారు. కార్యాలయాలలోని దస్త్రాలు తెలుగులోనే రూపొందిస్తే ప్రభుత్వ ఆదేశాలను ప్రజలు సులభంగా అర్థం చేసుకునేందుకు మార్గం సుగమమవుతుంది. దస్త్రం తెలుగు లో ఉంటేనే సంతకం చేస్తానని అలనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చెప్పినట్లు పాలకులందరూ పట్టుబట్టి ఒక తపస్సులాగా చిత్తశుద్ధితో అమలు చేస్తే తెలుగులో పాలన సాధ్యమవుతుంది.

ప్రస్తుతం ఆంగ్లంలో రూపొందుతున్న కార్యవర్తనములలోని పదాలను తెలుగులో రూపొందిస్తూ ఒక నిఘంటువును తయారుచేసి అంతర్జాలంలో అందుబాటులో ఉంచినట్లయితే దస్త్రాలు రూపొందించే వారికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. తెలుగులో దస్త్రాలు రూపొందించడం పై ఉద్యగులందరికి తరచుగా శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటుచేయడం అత్యవసరం.

పల్లెసీమల్లో నివసిస్తున్న సామాన్య ప్రజలే నేడు తెలుగు భాషను బ్రతికించుకుంటున్నారు. పట్టణాలు, నగరాలలో పెరుగుతున్న ఆంగ్లమాధ్యమ వ్యామోహం తెలుగు ప్రాధాన్యతను తగ్గిస్తుంది. ఈ వైఖరిని అంతమొందించి భావితరాల వారికి తెలుగు భాష పట్ల ఆసక్తిని పెంపొందించాల్సిన ఆవశ్యకత ఉంది. రాష్ట్ర ప్రభుత్వం 2018 సంవత్సరాన్ని తెలుగుభాషా సంవత్సరంగా ప్రకటించింది. ఈ సంవత్సరంలోనే తెలుగు పాలనా భాషగా పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అందరం కంకణ బద్ధులమవుదాం. మనతేట తెలుగులో పాలన కోసం బాటలు వేద్దాం



సందేశం

డా. డి. విజయభాస్కర్
సంచాలకులు, భాష, సాంస్కృతిక శాఖ

మాతృభాషలో బోధన, మాతృభాషలో పాలన ఇటీవల కాలంలో ఊపందుకున్న నినాదం. ఈ నినాదం వెనుక ఒక గొప్ప ఆశయముంది. ఆకాంక్ష ఉంది. ఒక బిడ్డ తల్లి గర్భంలో ఉండగానే ప్రపంచంతో సంబంధం ఏర్పరచుకుంటాడు. అది మాతృభాషతో మొదలవుతుంది. తన పసితనంలో సంజ్ఞల ద్వారా చిన్ని చిన్ని మాటల ద్వారా జరిపే సంభాషణంతా అమ్మనుడితో సాగుతుంది. తర్వాత బడిలో జరిపే బోధన దాని కొనసాగింపుగా మాతృభాషలో జరిగితే అతని అవగాహన సవ్యంగా ఉంటుంది. అలా కాకుండా ఒక్కసారి పరాయి భాష వచ్చి పడేసరికి విద్యార్థి గంద్రగోళ పరిస్థితికి గురవుతాడు. మాతృభాషలో నిష్ణాతుడైన వాడు ఇతర భాషల్లో కూడా ప్రావీణ్యత సాధిస్తాడని శాస్త్రీయంగా నిరూపితమైన సత్యం .

ఇక పరిపాలనకొస్తే, సామాన్యుడే పాలకుడ్ని ఎన్నుకునే అద్భుతమైన వ్యవస్థ వర్థిల్లుతున్న దేశం మనది. ఈ దేశంలో తయారయ్యే చట్టాలు, నియమాలు, నిబంధనలు ప్రజల భాషలో ఉండటం సంస్కారవంతమైన విధానంగా పరిగణించాలి. ఈనాడు ప్రజల అవసరాలు పెరిగాయి. పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగింది. అధికార్లతో మాటామంతీ పెరిగింది. ఈ నేపథ్యంలో పరిపాలన విదేశీ భాష నుండి స్వదేశీభాషలో అందులోనూ మాతృభాషలోకి మార్చుకోవాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తుంది.

ఆంగ్లేయులు వదిలివెళ్లిన అనేకమైన అవశేషాల్లో ఆంగ్ల భాష ఒకటి. ఇంగ్లీష్ అవసరాన్ని తక్కువ చెయ్యలేం. అలాగే తెలుగు భాష

గొప్పదనాన్ని తక్కువ చెయ్యలేం. సంస్కృతం మొదలుకొని నిన్న మొన్నటి ఆంగ్ల భాష వరకు అనేక భాషలతో ఏర్పడిన సంపర్కంతో తెలుగు భాష సుసంపన్నమైంది. పురాణ, ప్రబంధ, కావ్య నాటక ప్రక్రియలకు, తాత్విక, ఆధ్యాత్మిక, న్యాయ వైశేషిక జ్ఞానాన్ని, ఆధునిక శాస్త్రీయ, వైజ్ఞానిక విషయ పరిజ్ఞానాన్ని తనలో ఇముడ్చుకొని అపారమైన శక్తి సంతరించుకుంది తెలుగుభాష.

ఇటువంటి తెలుగు భాషను బోధన భాషగా, పాలన భాషగా ఉపయోగించడంలో చొరవ చూపినవారు అతికొద్ది మంది అధికార్లున్నారు. వారిలో నూర్ భాషా రహంతుల్లా ఒకరు. తెలుగు వాడుక భాషలో పరిపాలన జరగాలని గట్టి పట్టుదలతో పనిచేస్తున్నారు. వారు అనేక సందర్భాల్లో తెలుగువాడకాన్ని సోదాహరణంగా చూపిస్తూ వ్రాసిన పుస్తకం ఇది. ఇందులో పొందుపర్చిన విషయాలు మిగిలిన వారికి ఆదర్శంగా నిలవాలని ఆశిస్తూ, వారి కృషిని అభినందిస్తున్నాను.

అన్నీ ఉత్తర్వులే!

★ మెమో నెం..167 (19.03.1988): ఆంగ్లంలో వచ్చిన ఏ ఉత్తరం, ప్రతిపాదనపైనా చర్యా తీసుకోకుండా.. తిప్పి పంపేసే అధికారం రాష్ట్రంలోని ప్రతి గెజిటెడ్ అధికారికీ ఉంది. తమకంటే పైకార్యాలయాల నుంచి ఆంగ్లంలో వచ్చిన వాటిపట్లా ఇలాగే చెయ్యొచ్చు. ఈ విధంగా చేయడం వల్ల జరిగే కష్టనష్టాలు, జాప్యాలకూ వాటిని ఆంగ్లంలో పంపిన కార్యాలయానిదే బాధ్యత!

★ జీవో ఎంఎస్‌నెం.587 (28.10.1988): నవంబరు 1, 1988 నుంచి రాష్ట్రంలో ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే జరగాలి. అన్ని ప్రభుత్వ ఉత్తర్వుల జారీకి తెలుగు భాషనే వినియోగించాలి. ఆంగ్లం వాడకూడదు. కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు, మన రాష్ట్రం వెలుపలున్న చిరునామాదారులతో మాత్రమే ఆంగ్లం ఉపయోగించాలి.

★ జీవో ఎం.ఎస్.నెం.218 (22.03.1990): రాష్ట్ర ప్రభుత్వ అన్ని కార్యాలయాలతో, పంచాయతీ రాజ్, స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యం, నియంత్రణలో ఉన్న అన్ని సంస్థలతో తెలుగులోనే ఉత్తరప్రత్యుత్తరాలు ఉండాలి. శాసనేతర అవసరాలకు, ప్రజలతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలకు తెలుగు భాషనే ఉపయోగించాలి.

★ జీవో ఎం.ఎస్.నెం.420 (13.09.2005): రాష్ట్ర ప్రభుత్వం జారీచేసే ఉత్తర్వులు, నియమాలు, నిబంధనలు, ఉపవిధులు అన్నీ కూడా తెలుగు భాషలోనే ఉండాలి.

ఈ ప్రభుత్వ ఉత్తర్వులన్నీ చదవటానికి ఘనంగా ఉన్నా.. వాస్తవానికి వీటిలో ఏ ఒక్కటీ అమలుకావటం లేదు. అసలు ఇటువంటి ఆదేశాలున్నాయన్న సంగతి కూడా రాష్ట్రంలోని చాలా మంది అధికారులకు తెలియదన్నా ఆశ్చర్యం లేదు.

ఈనాడు 17.12.2012



డా. చిలకపాటి విజయరాఘవాచార్యులు
M.A.,Ph.D.,B.Ed.,D.I.S.
సంచాలకులు
హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు (HDPT)
కార్యదర్శి & ఆర్థిక సలహాదారు

ప్రశంస

తమిళ మహాకవి అప్పయ్య దీక్షితులు తెలుగుభాషను ప్రశంసించారు. తెలుగువాడిగా పుట్టడం, తెలుగుభాష మాట్లాడటం మహాతపస్వికి మాత్రమే సాధ్యమట! రాయప్రోలు వారు 'అవమానమేలరా అనుమానమేలరా... పాడరా నీ తెలుగు బాలగీతములు' అన్నారు . అలాగే శ్రీకాకుళం ఆంధ్రమహావిష్ణువు శ్రీకృష్ణదేవరాయల వారిని 'ఆముక్తమాల్యద' కావ్యనిర్మాణం చేయమని ఆనతి ఇచ్చిన సందర్భంలో స్మరణీయం ఇది "తెలుగదేలయన్న దేశంబు తెలుగు యేను తెలుగు వల్లభుండ తెలుగొకండ ఎల్లనృపులు గొలువ ఎరుగవే బాసాడి దేశ భాషలందు తెలుగు లెస్స"!

శ్రీ నూర్ బాషా రహంతుల్లా గారు ప్రభుత్వ రెవిన్యూ శాఖలో ఉన్నతాధికారి. గత 30 సంవత్సరాలుగా తెలుగు రాజభాష కావాలనీ, గ్రామచావడి మొదలు రాష్ట్ర సచివాలయం దాకా తెలుగు కనపడాలనీ, వినపడాలనీ తెలుగులో ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు సాగాలనీ, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ కావాలనీ తపిస్తున్న సుహృత్తు ఆయన. 'తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు...." అన్న చందాన సాగుతున్న అధికారభాషగా తెలుగు అమలు ప్రయత్నాలు అంతంత మాత్రంగా జరుగుతుంటే, విసిగి వేసారిపోతున్న రహంతుల్లా గారు అక్షర మహాయజ్ఞాన్ని నిర్వహిస్తూ అనేక ప్రసార మాధ్యమాల ద్వారా తన

“బుసబుస’లను వ్యాసాల రూపంలో ఆవిష్కరిస్తున్నారు. ఒకవిధంగా శ్రీ రహంతుల్లా గారు అధికారభాషా సంఘంలో ఉండదగిన శ్రద్ధాళువు. వారికి తెలుగుభాషపై వున్న ప్రీతి, మమకారం గమనిస్తే మనం మాతృభాషను ఎంత చిన్నచూపు చూస్తున్నామో అర్ధమవుతుంది. తెలుగును దేవభాషగా వారు కీర్తిస్తారు. వారు వ్రాసిన అనేక వ్యాసాలు హైస్కూల్ స్థాయిలో పాఠ్యాంశంగా పెట్టదగినవి. అలా జరిగితే కనీసం విద్యార్థులు ఉద్యోగులుగా ఎదిగేనాటికి ఆంధ్రభాషకు అధికార పట్టాభిషేకం జరిగి తీరుతుంది.

ఈ మధ్యకాలంలో తెలుగువాడు మరొక తెలుగువాడిని కలిస్తే తెలుగే రానివాడిలాగా ఇంగ్లీషులో మాట్లాడుతున్నారు. ఇది మన తెలుగురాష్ట్రాలలో ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో కనిపిస్తున్న దుస్థితి. మహానుభావుడు ఎన్.టి.రామారావు గారు ముఖ్యమంత్రిగా వున్న కాలంలో తెలుగులో ఫైలు పంపిస్తేనే చూస్తానని ప్రకటించారు. వారున్న కాలంలో తెలుగువాడి ఆత్మగౌరవం, తెలుగుభాష ఔన్నత్యం పరిఢవిల్లింది. క్రమంగా వారి తరువాత అధికారభాష అమలు వేగం నత్తనడక నడుస్తోంది. ఏదైనా రాజకీయ నిబద్దత లేకుండా ఏ సంస్కరణ అమలులోకి రాదు కదా!

శ్రీ నూర్ బాషా రహంతుల్లా గారు గత 30 ఏళ్ళుగా చేస్తున్న తెలుగుసేవ ఎంతో అభినందనీయం. వారు వ్రాసిన అనేక వ్యాసాలను వర్గీకరించి, చక్కగా గ్రంథంగా పేర్చి మనకు అందిస్తున్నారు. ఇది వారి వ్యాసమాలిక. అధికారులకు, అధికారభాషా ప్రియులకు ఇది చక్కని మేల్కొలుపుగా, మేలు కలుపుగా ఉపకరిస్తుందని భావిస్తున్నాను. తెలుగు అధికారభాష కావాలని 1945 నుండి అద్భుతమైన కృషి చేసిన మహానుభావులు వేటూరి ప్రభాకరశాస్త్రి గారు, అధికారభాష సంఘ అధ్యక్షులుగా పనిచేసిన వావిలాల గోపాలక్రిష్ణయ్య గారు, నండూరి రామకృష్ణమాచార్యుల వారు, గజ్జెల మల్లారెడ్డి గారు, ఎ.బి.కె.ప్రసాద్ గారు,మండలి బుద్ధప్రసాద్ గారు ప్రభృతులు. అధికారభాషా చట్టం 1966లోనే వచ్చింది. 1988 నవంబరు 1 నుంచి అన్ని ప్రభుత్వ ఉత్తర్వులు, ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే ఉండాలని, ఇంగ్లీషు కేవలం అనుసంధానభాషగా కేంద్ర ప్రభుత్వంతోను, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలతోను ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

అంతేకాకుండా అధికారభాషగా తెలుగుభాష మాట్లాడే భాషగానే ఉండాలనేది ఉత్తర్వులు. అలాగే ప్రజలతో ఉత్తర ప్రత్యుత్తరాలు, బహిరంగ విచారణలు కూడా మాట్లాడేవిధంగా తెలుగుభాషలోనే ఉండాలనేది ప్రభుత్వ ఉత్తర్వులు. కానీ ఇంతవరకు అధికారభాషగా తెలుగు గ్రామ కార్యాలయాలలో సైతం కనబడకపోవటం దురదృష్టకరం. ఇలాంటి పరిస్థితులలో మిత్రులు నూర్ బాషా రహంతుల్లా గారు తీసుకువస్తున్న ఈ వ్యాసమాలిక స్వాగతించదగినది. నూర్ బాషా గారికి హార్దికమైన అభినందనలు తెలియజేస్తున్నాను.

తెలుగు భాషా వికాస సంవత్సరంగా 2018

అధికారికంగా ప్రకటించిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018ని తెలుగు భాషా వికాస సంవత్సరంగా అధికారికంగా ప్రకటించింది. తెలుగుభాష పరిరక్షణ, అభివృద్ధి, వ్యాప్తికి అవసరమైన కార్యక్రమాలను రూపొందించి ఈ సంవత్సరం పొడవునా అమలు చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక, వారసత్వ, అధికారిక భాషా శాఖ కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి 1న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన విజయవాడ పుస్తక మహోత్సవ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి తెలుగు అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు శుక్రవారం ఉత్తర్వులు వెలువరించారు.

ఈనాడు 7.2.2018)



డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి డైరెక్టర్ ,తిరుపతి
9440732392

ఈ నూరుడు నడిపే భాషా రథం

కావలి వెంకట బొర్రయ్య (1776-1803) తొలి భారతీయ ఆంగ్ల రచయిత. ఈ మహాశయుడు 1793 లో నే ఉత్తర భారత కొండజాతుల వారిపై ఆంగ్లంలో పుస్తకాన్ని రచించారు. కావలి సోదరులుగా పిలవబడే ముగ్గురు కల్నల్ మెకెంజి దొరకు దోహదపడ్డారు. ఈ ముగ్గురిలో పెద్దవారు బొర్రయ్య. మామిడి వెంకయ్య(1764-1834) రచించిన 'ఆంధ్రదీపిక' తొలి అకారాది తెలుగు నిఘంటువు. పోకల లక్ష్మీ నరసు రచించిన బౌద్ధసారం అనే ఆంగ్ల గ్రంథం 1740 ప్రాంతాల్లో అంబేద్కర్ ను చాలా ప్రభావితం చేసింది. అందువల్లనే ఈ గ్రంథాన్ని అంబేద్కర్ 1948 లో స్వీయ పరిచయంలో పునర్ముద్రించారు.

తెలుగుకు సంబంధించీ, తెలుగు వారికి సంబంధించీ మనం సదా గర్వపడి, స్ఫూర్తి పొందగలిగే ఇలాంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అయితే మనకు అభిమానం లేకపోవడంతోనే ప్రస్తుత దురవస్థ. పరాయి పాలనలో కూడా నాణేలపై ఉన్న నాలుగు భాషలలో ఒకటిగా తలెత్తుకుని గౌరవం పొందినది తెలుగు. ఇలాంటి గత వైభవాన్నీ, ప్రస్తుత స్థితినీ తలచుకున్నప్పుడు ఎంతో నిరాశా, నిర్వేదం, నిర్లిప్తత తప్పక కలుగుతాయి. అయితే, అలాంటి, సందర్భాల్లో మనకు ఆశలు నింపి, ఆకాంక్షలు రేపే వ్యక్తి నూర్ బాషా రహంతుల్లా! వారు నాకు రెండు దశాబ్దాలుగా తెలుసు. వారి డీఎన్ఏ లో తెలుగు వినబడుతుంది, కనబడుతుంది, పరిమళిస్తుంది. వెలుగు రథాన్ని నడిపే సూర్యుడు సారథిని అనూరుడు అంటారు. దానికి మించి తెలుగు వెలుగు రథంలాగా సాగాలంటారు ఈ నూరుడు !

నూర్ బాషా రహంతుల్లా ప్రస్తుత వ్యాస సంపుటిలో ఆవేశం ఉంది.

ఆలోచన ఉంది, ఆక్రోశం ఉంది, ఆర్తి ఉంది. ఇవన్నీ కూడా తెలుగు పట్లనే! విక్టోరియా మహారాణి బంగారు పతకం తెలుగులో ఉందని చరిత్ర గుర్తుచేస్తారు. తెలుగు భాషకు సేవ చేసే ఛాన్స్ వచ్చిందని సర్వీసు కమీషన్లకు బాధ్యత గుర్తు చేస్తాడు. చిన్న భాషల్ని మింగేస్తున్న పెద్ద భాషలంటూ పిడికిలి బిగిస్తారు. ప్రాంతీయ భాషలు చచ్చి పోవాలా అని గొంతెత్తుతారు. పార్లమెంటులో తెలుగు వినబడాలని ఆశిస్తారు. తెలుగు లిపిని ఆంగ్లలిపిలా సంస్కరిస్తేనే మంచి రోజులంటారు. తెలుగులో పాలన చేయలేమా అంటూ ప్రశ్నిస్తారు! ఇది బాషా గారి భాషా ప్రణాళిక! ఏ మాత్రం అవకాశం దొరికినా, ఎక్కడ వీలు దొరికినా తెలుగు కుండే సౌలభ్యం, హేతుబద్ధత, ఔన్నత్యం, అందుకోవాల్సిన దార్శనికత గురించి వివరిస్తాడు. వీరి కృషి ఇలాగే, మరింత సమగ్రంగా, తీక్షణంగా సాగాలి. వీరి తపనా, ఆర్తి అందుకుని మేధావులు, రచయితలు, రాజకీయనాయకులు, ప్రజలు సవ్యంగా స్పందించాలని కర్తవ్యోన్ముఖులు కావాలని నా ఆశా, అభిలాషా!




తెలుగు మీడియం చదివితే..10% ఉద్యోగ కోటా!

- భాషా, సంస్కృతి వృద్ధికి ఇదేదారి
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాను
- సానుకూల నిర్ణయమే రావచ్చు
- భాషా ప్రతినిధులకు మంత్రి పల్లె హామీ
- ప్రత్యేక శాఖ ఏర్పాటుపైనా ఆలోచన

తిరుపతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు మీడియంలో చదువుకున్న యువకులకు ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ప్రయత్నిస్తామని సమాచార శాఖ మంత్రి పల్లె రఘునాథరెడ్డి వెల్లడించారు. తెలుగు భాష, సంస్కృతిని ప్రోత్సహించడంలో భాగంగా.. తెలుగు భాషా పండితులు, సాహితీ సంస్థల ప్రతినిధులు చేసిన ప్రతిపాదనపై మంత్రి ఈ మేరకు స్పందించారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఆయన హామీ ఇచ్చారు. తిరుపతిలో గురువారం జరిగిన తెలుగు భాష, సంస్కృతి అభివృద్ధి అధ్యయన కమిటీ సమావేశానికి పల్లె అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి తెలుగు భాషా పండితులు, సాహితీసంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. "తెలుగు మీడియం చదువుకుంటే ఉద్యోగాలు రావనే అభిప్రాయం సమాజంలో బలంగా ఉంది. ఈ పరిస్థితిని అధిగమించడం కోసం, తెలుగు మీడియం చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పించాల"ని వారు మంత్రిని కోరారు. తెలుగు భాషాభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వశాఖతో పాటు నిధులు కేటాయించే అంశాన్నీ పరిశీలించాలని సూచించారు. దీనిపై కమిటీ అధ్యక్షుని హోదాలో.. పల్లె సానుకూలంగా స్పందించారు. "మీ ప్రతిపాదనలతో కమిటీ కూడా ఏకీభవిస్తోంది. తప్పకుండా ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించే అవకాశం ఉంద"ని మంత్రి పేర్కొన్నారు. ఇంటర్ వరకు తెలుగును తప్పని సరి చేస్తామని, ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, కాలేజీలకు కూడా ఈ నిబంధన వర్తింపజేస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు, కోర్టు తీర్పులు మాతృభాషలో వచ్చేలా, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రజలతో తెలుగులోనే మాట్లాడేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, ఎమ్మెల్యే సుగుణ, హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి ప్రయాగ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి Fri, 09 December 2016
epaper.andhrajyothy.com/c/15217650



నందివెలుగు ముక్తేశ్వరరావు, ఐ.ఎ.ఎస్
ప్రాజెక్టుల ప్రత్యేక అధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానాలు
తిరుపతి

ఒజ్జబంతి

చిరకాలంగా భాషోద్యమంలో 'నేను సైతం' అంటూ కార్యకర్తగా పనిచేస్తున్న రహంతుల్లా గారిని గురించి భాషానుబంధం ఉన్న మిత్రులందరికీ తెలుసు.

పనిచేసిన ప్రతిచోటా అందరికీ అర్థం అయ్యేటట్టు తన పరిపాలనారంగాన్ని తెలుగించిన అపురూపమైన వ్యక్తిత్వం ఆయనది.

వారు వివిధ సందర్భాలలో అనేక పత్రికలలో వ్యాసాల రూపంగా వెలువరించిన వ్యాసాల సంకలనం ఈ పుస్తకం. ఆసక్తి ఉన్నవాళ్ళు అప్పటికప్పుడు చదివినా, వాటిలో శ్రేష్ఠమైనవాటిని తారామణిహారంగా తీర్చిదిద్ది "తెలుగులో పాలన' అనే ఈ పుస్తకాన్ని తీసుకువస్తున్నారు. రహంతుల్లా గారు పేరుకు ఉద్యోగి అయినా చేసేదిమాత్రం ఉద్యమమే. డిప్యూటీ కలెక్టర్ లాంటి కీలకస్థానంలో ఉండి తనని, తన చుట్టూ ఉన్న యంత్రాంగాన్ని ఉద్యమ స్ఫూర్తితో నడిపిస్తున్న ఆయన మన అందరికీ ఆదర్శం.

పూర్వకాలంలో అధ్యాపకుడు ఏదైనా ఒక అంశాన్ని చాలా చక్కగా, గుండ్రంగా వ్రాసియిచ్చి దాన్ని అనుకరిస్తూ పిల్లల్ని గుండ్రంగా దస్తూరి వ్రాయడం నేర్చుకోమనేవారు. దీనిని "ఒజ్జబంతి" అంటారు. ఆదర్శవంతమైన ఏదైనా పనినిచేస్తే దానిని కూడా ఒజ్జబంతి అంటారు. అలాంటివారిలో రహ్మాంతుల్లాగారు ఒకరు అని నమ్ముతున్నాను. వారి చిత్తశుద్ధి అక్షరాలా తేటతెల్లం చేస్తూన్న ఈ వ్యాసాలు అపురూపంగా భావిస్తున్నాను.

భాషా విధానం గురించి మాట్లాడుతున్నపుడు ఈ మధ్య జరిగిన ఒక సంఘటనని మనవి చేస్తాను. ఒరిస్సా రాష్ట్రంలో ఆగి ఉన్న ఒక రైలు (ఇంజిన్ కూడా లేదు) ఏ కారణంగానో దానంతట అదే బయలుదేరి వెళ్లసాగడం మొదలెట్టింది. దీన్ని ఆపేటప్పటికి రైల్వే వాళ్ళకి తలప్రాణం తోకకు వచ్చింది. ఇంజిన్ ఉంటే బ్రేక్, గేర్లు మొదలైన సిస్టమ్స్ అన్నీ పనిచేస్తాయి. ఈ కదలుతున్న రైలుకు అవి ఏమీ లేవు. అందువల్ల దానికి గమనము లేదు గమ్యమూ లేదు. ప్రస్తుతం మన భాషావిధానం కూడా ఇలానే ఉందని సవినయంగా మనవి చేస్తున్నాను. ఇలాంటి సన్నివేశ నేపధ్యంలో ఇందులో ఉన్న వ్యాసాలన్నీ ఒక క్రొత్త వెలుగుని ప్రసాదిస్తాయని నేను నమ్ముతున్నాను,

అన్ని రంగాలలో విత్తశుద్ధి మాత్రమే ఉన్న మనుషులు పెరిగిపోతున్న తరుణంలో చిత్తశుద్ధి మాత్రమే ఉన్న అరుదైన వ్యక్తిత్వం ఉన్న రహ్మాంతుల్లా గారికి అక్షరలక్షనమస్సులు.

తెలుగు వస్తేనే రాష్ట్రంలో ఉద్యోగం

4.10.2017

రాష్ట్ర ప్రభుత్వానికి ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉద్యోగం కావాలంటే తెలుగు వచ్చి ఉండాలన్న నిబంధనను ప్రవేశపెట్టాలని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అలాగే, పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు భాషను కచ్చితంగా నేర్చుకోవాలనే నిబంధననూ అమలుచేయాలని, తెలంగాణ రాష్ట్రంలో తన సూచనల మేరకే అక్కడి సీఎం కె. చంద్రశేఖర్‌రావు ఇటీవల ఆ మేరకు ఉత్తర్వులు జారీచేశారని ఆయన గుర్తుచేశారు.



ప్రబోధానంద యోగీశ్వరులు

ప్రబోధాశ్రమం, చిన్న పొలమడ, తాడిపత్రి

నా ఉద్దేశ్యము

ఉన్నత ఉద్యోగములో పని చేయుచున్న రహంతుల్లాగారు తెలుగు భాషపట్ల తనకున్న అభిమానమును తెలియజేస్తూ, తెలుగు భాష పతనమును గురించి ఒక ప్రక్క ఆవేదనను తెలియజేస్తూ, మరో ప్రక్క తెలుగు భాష అభివృద్ధికి తన సూచనలు తెలియజేస్తూ, వార్తాపత్రికలలో అనేక వ్యాసములను వ్రాశారు.ఈయన తెలుగు ముస్లిం.తెలుగే ఆయన మాతృభాష. ఆయన తెలుగు భాషపట్ల తెలిపిన అభిప్రాయములన్నియు అక్షర సత్యములు. నిత్యము మనముందర కనిపించుచున్న యదార్థములు, అయినా రహంతుల్లాగారు చెప్పేంతవరకు నేను కూడా అంత లోతుగా గమనించలేదని చెప్పుచున్నాను

తెలుగు భాష రహంతుల్లాగారు గారు చెప్పినట్లు ప్రజలలోనే కాక, ప్రభుత్వములో కూడా ఆదరణకు దూరముగా యున్నదని కనిపించుచున్నది. తొమ్మిది కోట్లమంది తెలుగు భాషను వాడుచున్నా, భాషను సంపూర్ణ అవగాహనతో వాడలేదని తెలియుచున్నది. ఉదాహరణకు ఒక వ్యక్తి ఇలా అంటున్నాడు. నేను బాత్ రూమ్ పోతున్నాను' ఆ మాటను వినేవారికి అర్థమయినా అది సంపూర్ణ వాక్యముగా లేదు. ఆ మాటను చెప్పవలసిన రీతిలో చెప్పలేదు. నేను బాత్రూమ్ కు పోతున్నాను అని చెప్పితే అది సరియైన వాక్యమగును. రూమ్ అను పదము ప్రక్కన 'కు' అను అక్షరము లేనిదానివలన తెలుగు భాషను సగము చంపి వాడినట్లగుచున్నది. అలాగే "జ్ఞానము తెలిస్తే మనము మోక్షమునకు పోతాము" అను వాక్యమును చూస్తే జ్ఞానముకు మనము తెలిస్తే మోక్షానికి పోతామా? మనకు జ్ఞానము తెలిస్తే మోక్షానికి పోతామా? అని అనుమానము రాకతప్పదు. ఈ విధముగా తెలుగు భాష తెలుగు వారి మధ్యలో యున్నా అది కొంత అనారోగ్యముతో బ్రతుకుచున్నదని తెలియుచున్నది.

ఏది ఏమయినా నూర్ భాషా రహంతుల్లాగారు వ్రాసిన వ్యాసములను చూస్తే 'పవర్ తగ్గిన బ్యాటరికీ తిరిగి చార్జింగ్ పెట్టినట్లు అయినది. ఆయన వ్యాసములను చదివిన ఎవరయినా తెలుగు భాషపట్ల కనువిప్పు పొందవలసిందే. ఎంతమంది మాట్లాడుతున్నారను విషయమును గుర్తు చేయుచూ, 26 భాషలను ఆరుకోట్ల వరకు మాట్లాడుతున్నారనీ తెలుపడము అభినందనీయము. అంతేకాక ఏ భాష, ఏ భాష చేతిలో కలిసిపోయి అంతరించి పోవుచున్నదో, అటువంటి 17 భాషలను గురించి తెలియజేసిన విషయము ఈ గ్రంథములో మీరు చూడవచ్చును. ముఖ్యముగా ఈ రెండు వ్యాసములను చూచిన తర్వాత అంతో ఇంతో తెలుగు భాష అభిమానినయిన నాకే ఆశ్చర్యమయినది. వాస్తవముగా నాకు గానీ, ఇతరులకుగానీ తెలియని విషయములను తెలిపిన నూర్ భాషా రహంతుల్లా గారిని అభినందించక తప్పదు.

"వ్యాసము" అను పదము అచ్చమయిన తెలుగు పదము. ఐదువేల సంవత్సరముల పూర్వము వ్యాసములను కూర్చి వేదములను వ్రాసిన ఆయన పేరును వేదవ్యాసుడు అని పిలిచారంటే, ఆ దినములలో ఆ ప్రాంతములో తెలుగు భాష వాడుకలో ఉండేదని అర్థమగుచున్నది. వేదములను, తర్వాత భగవద్గీతను సంస్కృత భాషలో హిందీ లిపితో వ్రాసినా, అది వ్యాసుడు తనవాడుక భాషలో వ్రాసేదానికంటే కొందరికి మాత్రమే తెలిసిన భాషలో వ్రాస్తే తనకు విలువయుంటుందని తలచి అలా వ్రాశాడని అర్థమగుచున్నది. తర్వాత గతించిన కాలములో తెలుగు కుంచించుక పోవడము, హిందీ వ్యాపించుక పోవడము జరిగినది. వంద సంవత్సరములప్పుడు అటు చెన్నపట్నము వరకు ఇటు బళ్ళారి వరకు వ్యాపించిన తెలుగు, నేడు ఒకవైపు దాదాపు 200 కిలోమీటర్లు జరిగి పుత్తూరు వరకు వచ్చినది. రెండవ వైపు 30 కిలోమీటర్ల వరకు వచ్చినది. తెలుగు భాషలో 'చెన్నపట్నము' అను పిలువబడుచున్న పేరు నేడు 'చెన్నై' అని పిలువబడుచున్నది. ఈ విధముగా పదివేల సంవత్సరముల పూర్వము భారతదేశములోనే కాక, శ్రీలంకలో కూడా తెలుగు ఉండేది. దానికి సాక్ష్యముగా నేటికీ కొన్ని ప్రాంతములలో తెలుగువారుంటూ

తమ మాతృభాషను ఇళ్ళల్లో మాట్లాడుకొనుచున్నారు. వీరి పూర్వీకులందరూ లంకవారే అయివుండడము వలన పూర్వము లంకలో తెలుగు ఉండేదని తెలియుచున్నది.

నేడు కాళ్లు విరిగి ఒక్క ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాలలో మాత్రమే కనిపించు తెలుగు, సృష్ట్యాదిలో ప్రపంచ వ్యాప్తముగా ఉండేదని గతములో మేమే చెప్పియున్నాము. ప్రస్తుత కాలములో కొంత ప్రాంతమునకు, కొంతమందికే పరిమితమైన తెలుగు భాష భవిష్యత్తులో అంతరించిపోతుందన్న భయము కొందరిలో ఉన్నా, అది సంభవించదని మనిషిలో దైవము మీద విశ్వాసమున్నంతవరకు తెలుగు బ్రతికియుంటుందని చెప్పక తప్పదు. ఎందుకనగా! ఆధ్యాత్మికమంతయూ తెలుగు భాషతో ముడివేయబడియున్నది. మొదట ఆధ్యాత్మికము తెలుగు భాషలోనే పుట్టింది. తర్వాత తెలుగు భాషలోనే బ్రతుకుచున్నది. అందువలన దేవుడు శాశ్వతమే, తెలుగు శాశ్వతమే...



అమరావతి, ఆంధ్రప్రభ: విద్యార్థులను ఒత్తిడి చేసేలా చదువులు వద్దని ఇష్టంతో చదువుకునేలా బోధనా పద్ధతులు ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. ఆదివారం విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలామ్ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రతిభా అవార్డుల బహూకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ చదువుల విషయంలో పిల్లలపై తీవ్ర స్థాయి ఒత్తిడి విధానం వద్దన్నారు. ఇలా చేయడం వల్లే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు అభిప్రాయపడ్డారు. ఇష్టపడి చదివే విధంగా పిల్లలను ప్రోత్సహించాలన్నారు. చదువుల్లో ఇబ్బంది ఎదురైతే, అర్ధగంట సేపు వారికి ఇష్టమైన ఆటలు, పాటలు


8వ పేజీలో...

వర్శిటీల్లోనూ తెలుగు

- తప్పని సరి చేస్తాం
- త్వరలో జీవో: సీఎం
- వచ్చే ఏడాది నుంచి అమలు

2లో

ఆంధ్రప్రభ Mon, 16 October 2017
epaper.prabhanews.com//c/22954059



ఆప్తవాక్యం

సయ్యద్ నశీర్ అహమ్మద్
ప్రముఖ రచయిత, చరిత్రకారుడు
ఫోన్ నంబరు 94402 41727

తెలుగు భాషోద్యమకారులు శ్రీ నూర్ బాషా రహంతుల్లా 2000 లో నాకు పరిచయమయ్యారు. ఆయన సోదరులు, నా మిత్రులు డాక్టర్ నూర్ బాషా అబ్దుల్ (ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయం, గుంటూరు) ద్వారా అప్పట్లో ఆకివీడు మండల రెవెన్యూ అధికారిగా ఉద్యోగం చేస్తున్న శ్రీ రహంతుల్లాతో నాకు స్నేహం కుదిరింది. నేను 2001 లో రాసిన 'భారత స్వాతంత్రోద్యమం : ఆంధ్రప్రదేశ్ ముస్లింలు' పుస్తకాన్ని చదివిన శ్రీ రహంతుల్లా ఈ పుస్తకాన్ని ప్రజాప్రతినిధులకు అందజేయాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ తనకు పరిచయం ఉన్న ఆకివీడు పెద్దల ద్వారా నాలుగు వందల ప్రతులను ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు పంపిణి చేయించారు. ఈ విధంగా ఆరంభమైన మా స్నేహం ఆయన గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పోలకంపాడులో ఇల్లు కొని స్థిరపడ్డాక ఆ ఇంటి సమీపాన నా గృహం కూడా ఉండటంతో మా మిత్రత్వం మరింతగా బలపడింది. ఆ తరువాత 2006 నుండి మేమిరువురం ఉదయం పూట నడకకు వెళ్ళటం ప్రారంభించాము. ఆ ఉదయం పూట నడక ఈనాటికీ కొనసాగుతుండటం, మా ఇళ్ళ మధ్య 12 ఏండ్లుగా రాకపోకలు, వివిధ అంశాల మీద చర్చలు-సమాలోచనలు, వాదోపవాదనలు మా ఇరువురి మధ్య నిత్యం కొనసాగుతూరావడం వలన ఆయనను కొంతలో కొంత అర్థం చేసుకున్నాననుకుంటున్నా. ఆ కారణంగా శ్రీ రహంతుల్లా రచించిన 'తెలుగులో పాలన' పుస్తకానికి 'ఆప్తవాక్యం' రాస్తున్నాను.

చిన్నతనం నుండి తెలుగు బాషపట్ల మక్కువ ఏర్పర్చుకున్న శ్రీ నూర్ బాషా రహంతుల్లా 1974 నుండి రాయటం ఆరంభించారు. 1974 లో తొలిసారిగా ఆయన ఒక కథను రాశారు. ఆ కథను ఆయన ఉంటున్న బాపట్ల ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ సంరక్షకులు శ్రీ రంగారావు

చూసి అభినందించడంతో ఉత్సాహభరితుడైన శ్రీ రహంతుల్లా పుస్తకాలను విస్తృతంగా చదవడం, రాయడం ఆరంభించారు. ఆ క్రమంలో ముందుగా ప్రజల సమస్యలను స్వయంగా తనకు ఎదురైన సమస్యల గురించి వివిధ తెలుగు పత్రికలకు లేఖలు రాయడం ప్రారంభించారు. ఈ ప్రవృత్తిని ఆయన 1978 లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగంలో చేరాక కూడా సాగించారు. ఆయనకు, ప్రజలకు ఎదురయ్యే సమస్యలను అధికారులకు ఆ సమస్యల పూర్వాపరాలను వివరిస్తూ, పరిష్కారమార్గాలను సూచిస్తూ వినతిపత్రాలను పంపటం అలవాటుగా చేసుకున్నారు.

మంచి చదువరి అయిన శ్రీ రహంతుల్లా విద్యార్థి దశలోనే క్రైస్తవ ధార్మిక సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేశారు. సంవత్సరాల తరబడి సాగిన ఈ అధ్యయనానికి ప్రతిఫలంగా వివిధ వ్యక్తులు, సంస్థలు, వ్యవస్థల నుండి ప్రసంశలు, వందలాది ప్రశంసా పత్రాలను పొందారు. క్రైస్తవ ధార్మిక వ్యవస్థలోని పలు మౌలిక అంశాల మీద శ్రీ రహంతుల్లా వందలాది వ్యాసాలు రాశారు. 1976 నుండి 1996 వరకు వందలాది క్రైస్తవ ధార్మిక వ్యాసాలను ఆంగ్ల భాష నుండి తెలుగులోకి అనువదించారు. ఈ వ్యాసాలు సత్యసువార్త (పాలకొల్లు), సత్యస్వరం(హైదరాబాద్), ఎక్లీసియా (రాజమండ్రి) తదితర పత్రికలలో చోటుచేసుకున్నాయి. ఆయన 1980 లో భగవద్గీతను గ్రాంధిక బాష నుండి వాడుక బాషలోకి స్వయంగా మార్చుకుని అధ్యయనం చేశారు. ఆ తరువాత ఉద్యోగరీత్యా హైదరాబాద్ తరలివెళ్ళినప్పుడు సహచర ఉద్యోగి, ప్రముఖ రచయిత శ్రీ అబుల్ ఇర్ఫాన్ ప్రోద్బలం వలన ఇస్లామిక్ ధార్మిక గ్రంథాల అధ్యయనం ఆరంభించారు. ఆ గ్రంథాలయంలో ప్రధానంగా 'ఎన్ సైక్లోపీడియా ఆఫ్ ఇస్లాం' లోని అన్ని సంపుటాలను లోతుగా అధ్యయనం చేయడం మాత్రమే కాకుండా వందలాది పుటల నోట్స్ కూడా తయారుచేసుకున్నారు.

ఈ మేరకు సమకూర్చుకున్న సమాచారంతో ఇస్లాంకు సంబంధించిన వందలాది వ్యాసాలు రాశారు. ఈ వ్యాసాలు 'గీటురాయి' (హైదరాబాద్), 'నెలవంక' (పాలకొల్లు), 'ఆంధ్రపత్రిక' (హైదరాబాద్) లాంటి వివిధ వార, మాస, దినపత్రికలలో వెలువడ్డాయి. వెలువడుతున్నాయి. సర్వమత సమభావన ప్రదర్శించే శ్రీ రహంతుల్లా అన్ని ధార్మిక గ్రంథాలను అందరూ చదవాలి. అన్నిటినీ వివక్ష లేకుండా అధ్యయనం

చేయాలంటారు. ఈ ధార్మిక గ్రంథాల అధ్యయనంలో, ఆయా మతస్థుల ఆచరణలో తనకు నచ్చిన విషయాలపట్ల తన రచనలలో ఎంతటి గౌరవాన్ని వ్యక్తం చేస్తారో ఆయనకు నచ్చని విషయాల పట్ల కూడా అంత తీవ్రంగా స్పందిస్తారు. తనను తాను 'ఆస్తిక హేతువాది' గా ప్రకటించుకున్న ఆయన తనకు నచ్చిన లేక నచ్చని విషయాలను ప్రజలు ధార్మిక పండితులతో చర్చకు పెడతారు. శ్రీ రహంతుల్లా 'తెలుగు బాషలో నమాజు' (19-7-1987, ఆంధ్రపత్రిక) అనే వ్యాసం ద్వారా 'తెలుగులో వారిని ఖురాను చదువుకోనివ్వడం, నమాజు చేసుకోనివ్వడం, వివాహాలు జరుపుకోనివ్వడం మేలు, ఈ విషయంలో సంస్కరణలు జరగాలి' అంటూ సూచనలు చేశారు. ఈ వ్యాసం ప్రజలు, ధార్మిక పండితులలో చాలా కాలం చర్చనీయాంశం అయ్యింది. మన దేశంలో ముస్లిం ప్రజానీకంలో పెళ్ళిళ్ళు 'నిఖానామా' ను ఉర్దూ భాషలో నిర్వహిస్తారు. ఆ నిఖానామా మీద వధువు- వరుడు, సాక్షుల చేత తమకొచ్చిన భాషలో సంతకాలు చేయిస్తారు. ప్రతి దంపతుల జీవితంలో ఎంతో ప్రాధాన్యత గల 'నిఖానామా' ఉర్దూ భాష రాని తెలుగు ముస్లిముల కోసం తెలుగులో రూపకల్పన చేయాలంటూ పదిమందిలో చర్చకు పెట్టారు (సాక్షి దిపత్రిక 19-10-2010). ఆ విధంగా చర్చకు పెట్టి ఊరకుండకుండా ఉర్దూ-అరబ్బీ-తెలుగు భాషలు తెలిసిన ధార్మిక పండితులను సంప్రదించారు. ఆ పండితుల సహకారంతో 'నిఖానామా' తెలుగు భాషలో రూపొందించారు. ఆ 'నిఖానామా' ను తాను 2012 లో వెలువరించిన 'తెలుగు దేవభాషే' గ్రంథంలో 'తెలుగులో పెళ్ళి'(పుట 130-133) శీర్షికన ప్రచురించి పదిమంది దృష్టికి తెచ్చారు.అలాగే తెలుగు ఉర్దూ ప్రజలకు పరస్పరం ఒకరి భాష మరొకరికి అర్థం కావాలంటే నిఘంటువులు రావాలంటారు. 1938 నాటి ఐ. కొండలరావు గారి ఉర్దూ తెలుగు నిఘంటువును సంపాదించి అధికార భాషా సంఘం అధ్యక్షులు ఎబికె ప్రసాద్ గారికి ఇచ్చి ప్రచురింపజేశారు.

తెలుగును అమితంగా ప్రేమించే శ్రీ రహంతుల్లా తెలుగు భాషోద్ధరణ, పరిరక్షణకు కంకణం కట్టుకుని తెలుగు బాషకు మరింత ఆయుష్షు పోసేందుకు నిరంతర అధ్యయనం, రచన, ప్రచురణ సాగిస్తున్నారు. ప్రస్తుత 'తెలుగులో పాలన' గ్రంథానికి ముందు 2004 లో 'తెలుగు అధికార భాష కావాలంటే', 2012 లో 'తెలుగు దేవభాషే' అను గ్రంథాలను శ్రీ రహంతుల్లా ప్రచురించారు. ఈ పుస్తక ప్రచురణ

సమయంలో శ్రీ రహంతుల్లా కు నా వంతు ప్రోత్సాహాన్ని అందించాను. ఆ రెండు గ్రంథాలకు కూడా ముందుమాట రాయమని ఆయన నన్ను కోరారు. తెలుగు భాషోద్యమంలో పాల్గొంటున్న పెద్దల ద్వారా ముందుమాటలు రాయిస్తే మంచిదన్న భావనతో నేను కాదన్నాను. గత 18 ఏండ్ల మా పరోక్ష పరిచయం 12 ఏండ్లుగా సాగుతున్న ప్రత్యక్ష పరిచయం వలన శ్రీ రహంతుల్లాను అతి సమీపం నుండి చూడటం, ఆయనతో కలసి తెలుగు భాషోద్యమంలో పాల్గొనడం, తెలుగు భాష పట్ల ఆయనకున్న మమకారాన్ని గమనించడం, ప్రజలకు పరిపాలన తెలుగు భాషలో అందాలన్న ఆయనలోని పట్టుదలను, అందుకు అనునిత్యం ఆయన పడుతున్న తపనను అర్థం చేసుకున్నాక ఈసారి కాదనడం నాకు సాధ్యం కాలేదు. ఆ కారణంగా ముందుమాటకు బదులుగా 'ఆప్తవాక్యం' అందిస్తున్నాను.

శ్రీ నూర్ బాషా రహంతుల్లా అక్షర పోరాట యోధుడు, అక్షరం ద్వారా తెలుగు భాషా పరిరక్షణకు కంకణ బద్ధుడైయున్నారు. తెలుగు భాష పరిరక్షణకు సాగుతున్న ఉద్యమాలలో ఆయన భౌతిక ఉద్యమాలలో కన్పించరు. ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినా, తెలుగు భాషా పరిరక్షణ మహాసభలు జరిగినా, తెలుగు భాషోద్యమ సభలు, సమావేశాలు, సదస్సులు, చిన్న చిన్న గోష్ఠులు ఎక్కడ జరిగినా ఆహ్వానం అందటంతోనే అక్కడకు రెక్కలు కట్టుకుని వాలిపోతారు. ఆయా సభలు-సమావేశాల్లో క్రియాత్మకంగా పాల్గొంటూ చర్విత చర్వణంతో సభికులను సహన పరీక్షకు గురిచెయ్యకుండా, నిర్వాహకులకు అసౌకర్యం కల్గించకుండా తన నిర్మాణాత్మక సూచనలను చెప్పి ఆయా వినతి పత్రాలను సంబంధితులకు అందించి వినయంగా నిష్క్రమిస్తారు. ఏ ప్రముఖుడికి సూచనలు, సలహాలు అందజేసిన ఏ సభలో, ఏ సమావేశంలో ప్రసంగించినా ఆయా విషయాలను ఖచ్చితంగా పత్రాల రూపంలో సంబంధితులకు అందించడం మాత్రమే కాకుండా ఆయా పత్రాల జిరాక్స్ కాపీలను తీసి తనకు తెలిసిన తెలుగు భాషోద్యమకారులకు అందించి, అంతర్జాలం ద్వారా పదిమందికి అందుబాటులోకి తెస్తారు.

మొదటి నుండి తెలుగు భాషాప్రియుడిగా తెలుగు భాషాభివృద్ధి,పరిరక్షణ, విస్తృతిని ఆకాంక్షిస్తున్న శ్రీ రహంతుల్లా 1974 నుండి తెలుగు భాషా రంగాన అక్షరయోధుడిగా ఉద్యమించారు.

తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వ పాలన ఆంగ్లభాషలో సాగుతున్నందున పరాయి భాష ఏ మాత్రం పరిచయం లేని సామాన్య తెలుగు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా, ఉన్నతాధికారిగా అత్యంత సమీపం నుండి ఆచరణాత్మకంగా గమనించారు, గుర్తించారు. పరాయి భాష పరిచయం లేనందున తెలుగు ప్రజల పరాధీనత, నిస్సహాయతను తద్వారా అనుభవిస్తున్న అధిక వ్యయప్రయాసలను, అవమానాలను చూస్తూ ఆయన సహించలేక పోయారు. తెలుగు రాష్ట్రాలలో తెలుగు భాషకు దూరంగా సాగుతున్న పాలన వలన తెలుగు ప్రజలు పడుతున్న వెతలను రూపుమాపుటకు తీసుకోవాల్సిన ఆచరణయోగ్యమైన చర్యలను ప్రభుత్వాధినేతలకు ఎరుక పరచాలన్న ఉద్దేశ్యంతో 1972 నుండి 'లేఖాస్త్రం' చేబట్టారు. ఆనాటి నుండి తెలుగు భాషా పరిరక్షణోద్యమం మాత్రమే కాకుండా, తెలుగులో పరిపాలనోద్యమాన్ని కూడా శ్రీ రహంతుల్లా సమాంతరంగా సాగిస్తున్నారు.

తెలుగు భాషోద్యమకారుడిగా లేఖాస్త్రాలను సంధించడం దగ్గర నుండి ఆరంభమైన ఆయన ఉద్యమకార్యాచరణ మెల్లగా వ్యాసాల రూపం దిద్దుకుంది. ఆయన మస్తిష్కంలో మెరిసిన ప్రత్యేక విషయంగాని, అనుభవంలోకి వచ్చిన సార్వజననీయమైన అంశంగాని ఏదైనా సరే ఆ విషయాన్ని ఒక వ్యాసంగా రూపొందించి సమాచారాన్ని ప్రజలలోకి ప్రవహింపజేయడానికి పత్రికలను, ప్రధాన సాధనంగా చేసుకున్నారు. ఆ లక్ష్యసాధనలో భాగంగా శ్రీ రహంతుల్లా అసంఖ్యాకంగా వ్యాసాలు రాశారు. ఆ వ్యాసాలలో తెలుగు భాషోద్యమానికి సంబంధించిన వ్యాసాలు మచ్చుకు కొన్ని 'తెలుగు భాషలో నమాజు' (ఆంధ్రపత్రిక, 19-7-1987), 'అధికార భాషగా తెలుగు' (6-7-1988, ఆంధ్రపత్రిక), 'తెలుగువారు పలికే ఉర్దూపదాలు' (గీటురాయి, 27-1-1989), 'తెలుగు అధికార భాష కావాలంటే' (15-2-1990), 'మాతృభాషలో జరిగే పాలనలో దళారులు ఉండరు' (ఆకాశవాణి విశాఖపట్నం 21-2-2007), 'అధికారులారా! ఇలా మీరెందుకు రాయలేరు?! ' (సమ్మతి అవార్డు,సమాచార నేత్రం, జనవరి 2009), 'తెలుగు భాషకు సత్యసాయి అండ' (నడుస్తున్న చరిత్ర, ఏప్రిల్ 2012), 'తెలుగు సాహిత్యంలో ముస్లిం కవులు, రచయితలు' (గీటురాయి, 18-5-2012), 'పార్లమెంటులో తెలుగు వినపడాలి' (తెలుగు వెలుగు, ఆగస్టు 2014),

'సర్వీసు కమీషన్లకు తెలుగు భాషా సేవ చేసే అవకాశం' (సూర్య 12-11-2016), 'ఇంటి భాషలంటే ఎంత చులకనో! ' (31-3-2016 గీటురాయి), 'దేవుడికి తెలుగు రాదు' (17-12-2017, ఆంధ్రప్రభ), 'ఎక్కడున్న తెలుగు అక్కడే' (తెలుగు వెలుగు, డిసెంబర్ 2017), 'జనభాషకు జేజేలు' (ఆంధ్రప్రభ 29-11-2017), 'జనభాషకు జేజేలు' (ఆంధ్రప్రక్ష 29-11-2017), 'చిన్న భాషల్ని మింగేస్తున్న పెద్ద భాషలు' (ఆంధ్రప్రభ, 15-12-2017), 'లిపిని సంస్కరిస్తేనే మంచి రోజులు' (ఆంధ్రప్రభ 21-2-2018), 'విక్టోరియా మహారాణి బంగారు పతకం తెలుగు లిపిలో ఉంది' (అమ్మనుడి, ఫిబ్రవరి 2018), 'తెలుగులో పెళ్ళి' (తెలుగు దేవ భాషే, పుట 139-138), 'అన్ని భాషలూ దేవ భాషలే' (తెలుగు దేవ భాషే 118-129), 'తెలుగు తల్లి భాష కూడా దేవ భాషే' (తెలుగు దేవ భాషే, పుట 106-117), ఈ వ్యాసాల శీర్షికలే ఆ వ్యాసాంశాన్ని వెల్లడి చేస్తాయి. ఈ వ్యాసాలు శ్రీ రహంతుల్లాలోని తెలుగు భాషా ప్రియత్వాన్ని వెల్లడిస్తాయి.

తెలుగు భాషాభివృద్ధికి, పరిరక్షణకు శ్రీ రహంతుల్లా దాదాపు మూడు దశాబ్దాల నుండి కృషి చేస్తున్నారు. తెలుగు మాధ్యమ అభ్యర్థులకు పోటీ పరీక్షలలో ప్రత్యేక ప్రోత్సాహక మార్కుల్ని, ఉద్యోగాలలో రిజర్వేషన్లను కల్పించాలని ప్రభుత్వాధినేతలను కోరుతూ వివిధ వేదికల ద్వారా, లేఖల ద్వారా తన డిమాండ్ ను వెల్లడిస్తున్నారు. తెలుగు విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ సర్వీస్ కమీషన్ పరీక్షలలో తెలుగు భాషలో రాసిన అభ్యర్థులకు 1976లో జరిగిన ప్రధమ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా చేసిన తీర్మానం మేరకు ఐదుశాతం ప్రోత్సాహక మార్కులని కల్పించింది రాష్ట్రప్రభుత్వం. ఈ ప్రోత్సాహక మార్కులు 1990 నుండి ఆగిపోయాయి. ఈ విధంగా ఆపేయడం సరికాదంటూ ఐదుశాతం అదనపు మార్కుల ప్రోత్సాహకాన్ని పునరుద్ధరించాల్సిందిగా శ్రీ రహంతుల్లా ఆనాటినుండీ డిమాండ్ చేస్తున్నారు. ('ఎక్కడున్న తెలుగు అక్కడే', తెలుగు వెలుగు మాసపత్రిక, డిసెంబర్ 2017).

తెలుగు భాష పరిరక్షణ విషయంలో శ్రీ రహంతుల్లా గిరి గీసుకుని కూర్చోలేదు. తెలుగు భాషలోకి వచ్చి కూర్చున్న అన్యభాషా పదాల విషయంలో ఆయన చాలా ఉదారవాది. ఏ భాషలోంచి ఏ పదం వచ్చినా అవి తెలుగు ప్రజల వాడుకలో స్థిరపడిపోయినట్టయితే,

అటువంటి పదాలను స్వాగతించి తెలుగు ప్రజలు స్వంతం చేసుకోవాలంటారు. అసంఖ్యాకంగా తెలుగులో కలసిపోయి ఉన్న అన్య భాషా పదాలకు సమానమైన, సరైన తెలుగు పదాల కోసం శ్రమించడం, ఆ ప్రయత్నంలో సమయం వృధా చేయడం ఉచితం కాదన్నది ఆయన అభిప్రాయం. శతాబ్దాలుగా తెలుగు ప్రజల వాడుకలోకి వచ్చేసిన కొన్ని పరాయి భాషా పదాలను కూడా తెలుగు నిఘంటువులోకి చేర్చుకోవాలంటారు. ఆ విధంగా తెలుగు పద సంపద పెరుగుతుందని ఆయన అభిప్రాయం. ఆయనకు భాషకు సంబంధించిన లిపి గురించి కూడా పట్టింపులేదు. భాషగాని, లిపి గాని అందంగా కన్పించడం కంటె ప్రజల అవసరం తీర్చడం అత్యవసరం అంటారు. ఈ విషయాలు ఆయన రాసిన 'తెలుగు నిఘంటువులో చేరాల్సిన ఇంగ్లీషు పదాలు (గీటురాయి, 3-10-2003)', 'ఇంగ్లీషునే లింకు లిపిగా చేస్తే ? ' (గీటురాయి, 11-6-2014). 'ప్రజల పదాలతో నిఘంటువు చేయాలి' (గీటురాయి, ఈటీవీ ఇంటర్వ్యూ, 20-5-2007) లాంటి పలు వ్యాసాల ద్వారా రూఢీ అవుతుంది. ఈ వ్యాసాల ద్వారా ఆంగ్ల, ఉర్దూ తదితర భాషల్లోని వందలాది పదాలు ఏ విధంగా తెలుగు భాషలో కలసిపోయి తెలుగుతనాన్ని సంతరించుకున్నాయో ఆయన సాధికారికంగా వివరిస్తారు. ఈ విషయంలో తెలుగు భాషా పండితులు తమ సొంత అభిప్రాయాలను తెలుగు ప్రజల నెత్తిన రుద్దుతున్నారని ఆరోపిస్తారు. ఆ ఆరోపణలకు తగిన సాక్ష్యాధారాలను తన వ్యాసాల ద్వారా ప్రజల, పండితుల ఎరుకలోకి తెస్తారు. సామాన్య ప్రజలు వాడే భాష పట్ల పండితులకు గాని మరెవ్వరికీ గానీ చిన్న చూపు ఉండటం సరికాదంటారు. కూడికను సంకలనం అంటూ, తీసివేతను వ్యవకలనం అంటూ తెలుగు పదాల పేరుతో సంస్కృత పదాలను తెచ్చిపెడుతున్నారంటూ విచారం వ్యక్తం చేస్తారు. అసంఖ్యాక సామాన్య ప్రజలు ఉపయగించే అలతి అలతి తెలుగు పదాలన్నిటిని ఏర్చి, కూర్చి తెలుగు నిఘంటువులో చేర్చుకుంటూ నిఘంటువులను పరిపుష్టం చేయాలని వాంఛిస్తారు. ఈ ఆలోచనల మేరకు ఒక తెలుగు మహానిఘంటువును రూపొందించాలన్నది తన అభిమతమంటారు.

మన దేశంలోని వివిధ రాష్ట్రాలలోని ప్రజలు తమ తమ భాషల అభివృద్ధికి, పరిరక్షణకు అనుసరిస్తున్న విధానాలను శ్రీ రహంతుల్లా అధ్యయనం చేస్తుంటారు. ఆయా ప్రాంతాల మాతృభాషా ప్రియులు,

ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చర్యలను తెలుసుకుని మనమూ ఆచరించదగిన చర్యలను లేఖలు, వ్యాసాల రూపంలో ఇటు తెలుగు భాషోద్యమ నాయకులకు, అటు రాష్ట్ర ప్రభుత్వాధినేతల దృష్టికి తెస్తుంటారు. మన పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో తమిళ సోదరులు తమ భాష పట్ల వ్యక్తం చేస్తున్న అవ్యాజ్య ప్రేమాభిమానాలను వివరిస్తూ ఆయన వ్యాసాలు రాశారు. 'అయ్యయ్యో...తెలుగు' (గీటురాయి, 16-7-2004) అంటూ తెలుగు భాష ఊపిరితో నిలబడడానికి ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏకరువు పెడుతూ వ్యాసం రాస్తూ, 'తమిళ నాయకులను చూసైనా నేర్చుకోవాలి' శీర్షికన మరొక వ్యాసం రాసి తమిళ తంబీలు అనుసరిస్తున్న పద్ధతులు, తమిళనాడు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజల దృష్టికి తెచ్చారు (తెలుగు అధికార భాష కావాలంటే 2006, పుట 104-105), తమిళ మాధ్యమంలో డిగ్రీ వరకు విద్యాభ్యాసం చేసిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో తమిళనాడు ప్రభుత్వం 20 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించటాన్ని తమిళనాడు ఉన్నత న్యాయస్థానం కూడా పూర్తిగా సమర్థించింది. తమిళనాడు రాష్ట్రంలో అమలులో ఉన్నట్టు మన రాష్ట్రంలో కూడా 20 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాధినేతలకు విజ్ఞప్తి చేస్తున్నారు (ఎక్కడున్న తెలుగు అక్కడే, తెలుగు వెలుగు మాసపత్రిక, డిసెంబర్ 2017). ఈమధ్య తెలుగు మాధ్యమ అభ్యర్థులకూ పదిశాతం ఉద్యోగాలిస్తామని మన మంత్రులు వాగ్ధానం చేశారు.ఈ వాగ్దానాన్ని పదే పదే ప్రభుత్వాధినేతలకు గుర్తుచేస్తున్నారు.

ప్రజల జీవన పద్ధతులు, ఆచార సాంప్రదాయాలను ఏకరువు పెట్టి, అతి పెద్ద విషయాన్ని అతి తేలిగ్గా అర్థం చేసుకోడానికి వీలు కల్పించే సామెతల పట్ల ఆయనకు ఆసక్తి అధ్యయనం ఎక్కువ. ఆ జిజ్ఞాస కారణంగా వేలాది సామెతలను సేకరించుకున్నారు. ఆయన ఎటువంటి జ్ఞానాన్ని సంతరించుకున్నా, పది మందికి ఉపయుక్తం కాగల ఎలాంటి సమాచారాన్ని సంపాదించుకున్నా ఆ భావ సంపద/ అక్షర సంపదను అందరితో పంచుకుంటారు. తాను సేకరించుకున్న సామెతలను తన వ్యాసాలలో అలవోకగా ప్రయోగిస్తారు. తెలుగు వాక్యాలకు ధీటుగా తెలుగు సామెతలకు అధిక ప్రాధాన్యతనిస్తూ 'ఉబుసుపోక' శీర్షికతో చిన్న చిన్న ఖండికలను హైదరాబాద్ నుండి

వెలువడుతున్న 'గీటురాయి' వారపత్రికలో ధారావాహికంగా రాశారు. ఆయన మనస్సునుగాని, మస్తిష్కాన్ని గాని స్పృశించిన సమకాలీన సమస్యలను, వింత-విశేషాలలో ప్రజోపకరమైన ఏ అంశాన్ని వదలకుండా తనదైన శైలిలో సున్నిత హాస్యాన్ని, చమత్కారాన్ని జోడిస్తూ గంభీరమైన వ్యవహారాన్ని కూడా సరిపడే భావాన్ని అందించగల తెలుగు సామెతలతో 'ఉబుసుపోక' ఖండికలను ఆయన రూపొందించారు. 1986 నుండి 1993 వరకు వారం వారం ప్రత్యేక కథనాలతో 'గీటురాయి' లో ప్రచురితమైన 'ఉబుసుపోక' అసంఖ్యాక పాఠకులను ఆకర్షించింది.

శ్రీ రహంతుల్లా తన ఎరుకలోకి వచ్చిన ప్రజా సమస్యలు, తెలుగు భాష వరకు మాత్రమే తన రచనా వ్యాసాంగాన్ని పరిమితం చేయలేదు. తెలుగు భాషను పరిపాలనకు మాత్రమే సరి పెట్టకుండా ఆర్థిక, సాంఘిక, విద్యా, వైద్య, సాంకేతిక, ధార్మిక తదితర ప్రజా జీవన రంగంతో ముడి పెట్టారు. ఆ కారణంగా భాషాపరంగా ఉద్యమిస్తున్న తెలుగు భాషోద్యమకారుడుగా మాత్రమే కాదు, ప్రజలు తమదైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను, ప్రతి సామాజిక సమస్యను శ్రీ రహంతుల్లా తన లేఖాస్త్రానికి వస్తువుగా స్వీకరించారు. ప్రజల జీవనాన్ని మరింత సౌకర్యవంతం చేయగల మార్పులు చేర్పులను కూడా ఆయన చేపట్టారు. ప్రభుత్వపరంగా, పాలనా పరంగా జరిగిన, జరుగుతున్న అవకతవకలను, ప్రజల అలసత్వం, కాబట్టనితనం వలన సభ్య సమాజం అనుభవిస్తున్న వెతలను చూస్తూ ఆయనలోని సామాజిక ఉద్యమకారుడు, రచయిత మిన్నకుండలేక పోయాడు. ఆ కారణంగా శ్రీ రహంతుల్లా లేఖాస్త్రంతోపాటుగా వ్యాసాలను అస్త్రాలుగా మార్చి సంబంధితుల దిశగా సంధించడం ఆరంభించారు. ఈ మేరకు 'ఖజానా శాఖకు మోక్షం ఎప్పుడు? ' (25-5-1986, ఆంధ్రపత్రిక), 'చిన్న జిల్లాలే ప్రజలకు మేలు' (28-12-1987, ఆంధ్రపత్రిక), 'కోస్తా అభివృద్ధి కోసం కొన్ని చర్యలు' (ఆంధ్రపత్రిక), 'అందరికి ఇల్లు ఆశయం ఫలించేనా' (9-5-1989, ఆంధ్రప్రభ), 'హైకోర్టు బెంచ్ ల ఏర్పాటు' (1986, ఆంధ్రప్రభ), 'రోజ్‌గార్ యోజనలో ప్రయోజనమెంత? ' (ఆంధ్రప్రభ, 21-5-1989), 'అక్కరకు రాని అపార భూసంపద' (ఆంధ్రప్రభ, 13-6-1989), 'న్యాయవ్యవస్థ ప్రక్షాళన జరిగేదెలా? ' (28-6-1990, ఆంధ్రపత్రిక), 'ప్రజలకు పనికొచ్చేలా పాలనా వ్యవస్థ'

(ఆంధ్రప్రభ), 'రుణ భారతం మంచిది కాదు- అప్పుల సుడిగుండంలో అభివృద్ధి నావ' (31-3-1989), 'రిజర్వేషన్ల పరుగులో వెనుకబడిన కులాలు' (8-8-1989, ఆంధ్రప్రభ), 'హైకోర్టుల స్థాపనలో శాస్త్రబద్ధత శూన్యం-కోస్తా రాయలసీమ ప్రజల పాలిట శాపం' (గీటురాయి, 17-9-1993), తదితర వ్యాసాలను ఆయన వెలువరించారు. ఈ వ్యాసాల ద్వారా శ్రీ నూర్ బాషా రహంతుల్లాలోని భాషోద్యమకారుడితోపాటుగా సామాజిక ఉద్యమకారుడు కూడా బహిర్గతమవుతాడు.

రాష్ట్రప్రభుత్వంలో ఉన్నతాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీ రహంతుల్లా ప్రజలపక్షం, ప్రజాసామ్యంలో ప్రజలు పాలకులు కనుక ప్రజల సంక్షేమమే శిరోధార్యంగా ఆయన వ్యవహరించారు. ప్రజల పక్షంగా వ్యవహరించడంలో ఆయన ఎటువంటి జంకుగొంకూ లేకుండా తన ఉద్యోగ భాధ్యత నిర్వహిస్తున్నారు. ఒక ప్రభుత్వాధికారిగా క్రమశిక్షణ, నిషేదాలు ఉన్నా ఆయన ప్రజల సంక్షేమం ప్రదానం అనుకున్నప్పుడు ఎవ్వరినీ ఖాతరు చెయ్యలేదు. ఆయన ప్రభుత్వాధినేతలకు కూడా నేరుగా ఉత్తరాలు రాసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రజల వద్దకు పాలనను సునాయాసంగా తీసుకెళ్ళాలంటే సువిశాలంగా ఉన్న (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) రాష్ట్రంలో మరిన్ని జిల్లాలను సృష్టించాలని భావించి అప్పటి ముఖ్యమంత్రులు డాక్టర్ నందమూరి తారకరామారావుకు 1990 లో, డాక్టర్ మర్రి చెన్నారెడ్డికి 1987 లో ప్రజల సమస్య పూర్వాపరాలను వివరిస్తూ, చిన్న చిన్న జిల్లాల ఉపయోగాన్ని విశదీకరిస్తూ లేఖలు రాసి తెలుగులోనే సమాధానాలు పొందారు. ఆనాడు శ్రీ రహంతుల్లా రాసిన వ్యాసాలలో 'చిన్నజిల్లాల నిర్మాణం-నేటి అవసరం'(29-6-1980, ఆంధ్రపత్రిక), ' ప్రజలకు చేరువలో ప్రభుత్వం : చిన్న చిన్న జిల్లాలు లేనిదే ఎలా సాద్యం ' (గీటురాయి, 18-8-1995) వెల్లడించినట్టుగా ప్రస్తుతం తెలంగాణలో చిన్న జిల్లాలు ఏర్పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా చిన్న జిల్లాల ఏర్పాటు గురించి అధికార అనధికార వర్గాలలో చర్చ జరుగుతుండటం విశేషం. చిన్న చిన్న జిల్లాలు మాత్రమే కాకుండా చిన్న రాష్ట్రాలు ఏర్పడినప్పుడు మాత్రమే పరిపాలన ప్రజలకు చేరువవుతుందని ఆయన భావించి ప్రచారం చేశారు. ఈ విషయాన్ని 1990లో తాను రాసిన వ్యాసాలు ' చిన్న రాష్ట్రాల వాదన విచ్ఛిన్నకరమా? (ఆంధ్రప్రభ 3-3-1990), చింతలు దూరం చేసే చిన్న రాష్ట్రాలు

(2-4-1991,ఆంధ్రప్రభ)' ద్వారా ప్రజలతో పంచుకున్నారు.

తెలుగులో పాలన కోరుకుంటున్న శ్రీ రహంతుల్లా రాష్ట్ర రెవెన్యూ శాఖలో ఉన్నతాధికారిగా ప్రజలకు చేరువయ్యేందుకు తెలుగు భాషలో పాలనా పద్ధతులను పాటిస్తున్నారు. ఆయన తహసీల్దార్ గా రెవెన్యూ శాఖలో చేరినప్పటి నుండి తన పరిధిలో తెలుగు భాషను అమలు చేయడానికి చర్యలు తీసుకున్నారు. తెలుగు భాషలో పాలన జరిగితే మధ్యదళారుల ప్రమేయం తగ్గుతుందని గట్టిగా నమ్మిన ఆయన 2004 లో రంపచోడవరంలో 'సంచార న్యాయాధికారి' గా బాధ్యతలు చేపట్టినప్పుడు న్యాయస్థానంలో తెలుగును ఉపయోగించ పూనుకున్నారు. న్యాయవాదుల సహకారం లేకపోవడం, చట్టపరమైన కొన్ని అవరోధాల కారణంగా ఆయన ప్రయోగం విజయవంతం కాలేదు. ఆ తరువాత 2007 లో పులిచింతలలో డిప్యూటీ కలెక్టర్ గా పనిచేస్తున్నప్పుడు 'సమ్మతి అవార్డు' ను పూర్తిగా తెలుగులో ప్రకటించి ఇటు ప్రజల నుండి అటు తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షులు శ్రీ ఏబికె ప్రసాద్ ల నుండి ప్రశంసలు అందుకున్నారు. 2015 లో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలోని 'సిఆర్ డి ఎ' లో ఉన్నతాధికారిగా బాధ్యతలు చేపట్టినా తన ప్రయత్నాలను విరమించుకోలేదు. తెలుగు భాషలో సమాచారాన్ని అందించవచ్చని ప్రభుత్వ ఉత్తర్వులున్నా ఆచరణలో అవి న్యాయస్థానాలలో విఫలమౌతున్నాయన్నారు. 2017 లో ఒక వివాదం విషయమై రాష్ట్ర ప్రభుత్వ అధికారిగా హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదికి తెలుగులోనే ప్రతివాదనలు పంపారు.అందుకు ఆ ప్రభుత్వ న్యాయవాది "ఇంగ్లీషు రాకుండా డిప్యూటీ కలక్టర్ ఎలా అయ్యారు?" అని ప్రశ్నించగా, 'ఇది మీ ఆంగ్లభాషాహంకారానికి గుర్తు' మీకు తెలుగురాదా? న్యాయం తెలుగులోనూ చెప్పవచ్చు అని శ్రీ రహంతుల్లా ఆ న్యాయవాదికి సంబందిత ప్రభుత్వ ఉత్తర్వులను చూపించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది .

తెలుగు భాష పట్ల అలవికానంత ప్రేమ కలిగియున్న శ్రీ రహంతుల్లాలో 'పరిశోధకుడు' కూడా దాగున్నాడు. తెలుగు భాష ఔన్నత్యాన్ని, ప్రాధాన్యతను చాటే విషయాలను, తెలుగు భాషకు ఆలంబనగా నిలిచే దృష్టాంతరాల కోసం ఆయనలోని పరిశోధకుడు వెతుకులాడుతుంటాడు. ఆయన కర్నూలులో డిప్యూటీ కలెక్టర్ గా పనిచేస్తున్న సందర్భంగా, కొయిలకుంట్లకు చెందిన వదాన్యులు శ్రీ

బుద్ధా వెంగళ రెడ్డికి విక్టోరియా మహారాణి 1866 లో తెలుగు భాషలో ప్రశంసాపత్రాన్ని తయారు చేసి పంపించిందన్న సమాచారం తెలిసింది. ఆ విషయం తెలియగానే ఆఘమేఘాల మీద ఆయన శ్రీ బుద్ధా వెంగళ రెడ్డి వారసుల వద్దకు వెళ్ళి, అలనాటి పతకాలను, ఆయా పత్రాలను పరిశీలించి వాటి ఛాయా చిత్రాలతో సహా వ్యాసం రాసి ఈ చారిత్రక విశేష సమాచారాన్ని ప్రజలకు తెలిపారు (' అమ్మనుడి ' మాసపత్రిక, 2018 ఫిబ్రవరి). ఈ విధంగా వెలికితీతల కార్యక్రమంలో భాగంగా ఎక్కడైనా ఎప్పుడైనా ఏ ప్రముఖుడైనా తెలుగు భాష గురించి వెల్లడించిన సానుకూల వాక్యాలు, మాటలు ఉన్నట్లయితే శ్రమకోర్చి వెతికిపట్టుకుని తన వ్యాసాలలో ఆ అంశాలను పొందుపర్చి తద్వారా ప్రజల దృష్టికి తెస్తుంటారు. ఈ క్రమంలో శ్రీ పుట్టపర్తి సత్యసాయి బాబా తెలుగు ప్రాశస్త్యాన్ని వెల్లడిస్తూ చేసిన వ్యాఖ్యలను వెల్లడించడం మాత్రమే కాకుండా శ్రీ సాయిబాబా తెలుగులో రాసిన లేఖను కూడా ఆయన ప్రచురించారు(తెలుగు భాషకు సత్యసాయి అండ (వ్యాసం), నడుస్తున్న చరిత్ర, ఏప్రిల్ 2012).

ఈ ప్రయత్నాలన్నీ ఒక ఎత్తయితే పరుగులెత్తుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒడిసి పట్టుకుని ఆ సాంకేతికతను తెలుగు భాషోద్యమానికి శ్రీ రహంతుల్లా ఉపయోగిస్తారు. ఆయనకు 2004 లో అంతర్జాలం అందుబాటులోకి వచ్చింది. అప్పటి నుండి అంతర్జాలం ద్వారా సమాచార మార్పిడికి అందుబాటులోకి వచ్చిన 'ముఖపుస్తకం', 'బ్లాగులు', 'వాట్సాప్', 'టెలిగ్రాం' లాంటి సమాచార చేరవేత వ్యవస్థలను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. 'తెలుగు ముస్లింలు', 'తెలుగు అధికార భాష కావాలంటే', 'సందేశాత్మక గీతాలు' లాంటి పలు బ్లాగులను 2007 లో ఆరంభించి సంబంధిత సమాచారాన్ని ఆయా బ్లాగులలో పొందుపర్చి ప్రజల పరం చేస్తున్నారు. ఈ వ్యవస్థలలో తన వ్యాసాలు, తాను సేకరించిన సమాచారంతో సుసంపన్నం చేస్తున్నారు. 'ముఖపుస్తకం', 'బ్లాగ్స్', 'వాట్సాప్', 'టెలిగ్రాం' లాంటి సమాచార చేరవేత వ్యవస్థలను ఆయన బాగా ఉపయోగించుకోవడం మాత్రమే కాకుండా ఇతరులు కూడా ఆయా వ్యవస్థలను సులువుగా ఉపయోగించుకోవడానికి అవసరమగు సాంకేతిక సమాచారం, పరిజ్ఞానాన్ని తనదైన రీతిలో తెలుగులో రూపొందించి కరపత్రాలు ప్రచురిస్తున్నారు. ఈ కరపత్రాలను తెలుగు భాషోద్యమ సభలు, సమావేశాల్లో , ప్రజల్లో పంపిణీ చేస్తున్నారు.

ఆయా కరపత్రాలను తన గ్రంథాలలో కూడా పొందుపర్చుతూ పుస్తక ప్రియులకు అందుబాటులోకి తెచ్చి మరింత ఉపయుక్తం చేస్తున్నారు (కంప్యూటర్లో తెలుగు-తెలుగు వెబ్ సైట్లు, తెలుగు దేవభాషే, 2012, పుట 82-86).

ఈ కృషిలో భాగంగా 2010 లో 'ముఖపుస్తకం' ఆరంభించి ఆసక్తిదాయకమైన పలు అంశాలతోపాటుగా ప్రజలకు ప్రయోజనకరమని భావించిన ప్రతి సమాచారాన్ని సేకరించి పోస్టు చేస్తున్నారు. ఆయన ప్రజా జీవన రంగాలను ప్రభావితం చేస్తున్న ప్రతి అంశాన్ని కూడా తన ముఖపుస్తకం ద్వారా చర్చకు పెడుతున్నారు. ఈ పోస్టింగ్స్ వలన అనుకూల-ప్రతికూల చర్చలు జరిగినా , ఆ చర్చల ఫలితంగా సరికొత్త సమాచారం వెలుగులోకి రావడం మాత్రమే కాకుండా నూతన కోణాలు కూడా బహిర్గతం అవుతాయని శ్రీ రహంతుల్లా భావిస్తారు. "మన ముఖం మనకుండగా మనకో "ముఖపుస్తకం" ఎందుకు? " అంటూ సాంకేతిక ప్రగతి సాధనాల వాడకం మీద వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్న "ప్రముఖుల" ఐహేతుక విమర్శలకు సమాధానంగా మనం రూపొందించుకున్న సాంకేతిక సాధనాలు మంచికి చెడుకు ఉపయుక్తం. సాంకేతిక సాధనాలను మంచిగా ఉపయోగించుకోకుండా చెడుకు వినియోగించుకునే వారిని చూపుతూ అసలు సాంకేతిక ప్రగతి సాధనాలనే ఉపయోగించుకోవద్దంటున్న "పెద్దల" పద్ధతి సమాజ ప్రగతికి అవరోధం కాగలదని శ్రీ రహంతుల్లా ఆవేదన వ్యక్తం చేస్తారు. ఆ కారణంగా నిష్ప్రయోజనకర విమర్శలకు దూరంగా తన ప్రచారాన్ని తాను నిశ్శబ్దంగా నిబద్ధతతో చేసుకుపోతుంటారు.

ఒక అంశాన్ని ప్రతిపాదించినప్పుడు ఆ అంశం మీద ప్రతి ఒక్కరిని స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయనివ్వాలని ఈ విషయంలో నియంతృత్వం ఏ మాత్రం పనికిరాదంటారు. భావ ప్రకటనా స్వేచ్ఛకు అడ్డు పడటం సరికాదన్నది ఆయన అభిప్రాయం. ఆయన భావాలతో ఏకీభవించని విమర్శకులకు కూడా తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ మాత్రమే కాదు సమయం కూడా ఇవ్వాలంటారు. నూతనంగా ఆవిష్కృతమవుతున్న ప్రతి అంతర్జాల సాధనాలను తెలుగు భాషోద్యమం విస్తృతికి ఉపయోగించాలని ఆయన భావిస్తారు. ఈ మేరకు తనకు తెలిసిన ప్రతి అంశాన్ని ఇతరులతో పంచుకుంటారు. తనకు తెలియని విషయాన్ని ఇతరులను అడిగి

తెలుసుకోటానికి శ్రీ రహంతుల్లా ఏ మాత్రం సంకోచించరు.

శ్రీ రహంతుల్లా ప్రత్యేకంగా తెలుగు అక్షర రూపాల (ఖతులు) మీద శ్రద్ధ చూపుతున్నారు. అక్షర రూపం ఏ రకంగా ఉన్నా ఆ అక్షర రూపాన్ని ప్రపంచంలో ఎవరెక్కడ ఉన్నా 'ఏకరూపత' (యూనీకోడ్) లోకి మార్చుకోడానికి అవసరమగు మార్పిడి సాధనాల (కన్వర్టర్లు) కోసం అవిశ్రాంతంగా అంతర్జాల సాంకేతిక నిపుణులతో సాగించారు. ఈ దిశగా ఆయన నిరంతరం సాగించిన ప్రయత్నాల మూలంగా అంతర్జాల సాంకేతిక నిపుణులు శ్రీ కొలిచాల సురేశ్ గారు శ్రీ రహంతుల్లా పేరిట ఒక కన్వర్టర్ ను కూడా రూపొందించారు. మన తెలుగు రాష్ట్రాలలోని తెలుగు పత్రికలు తమ పత్రికలకోసమే రూపొందించుకున్న ప్రత్యేక అక్షర రూపాలతో పత్రికలను ప్రచురించేవి. ఆ కారణంగా ఆయా పత్రికలలో ప్రచురితం అయిన సమాచారాన్ని 'కాపీ' చేసి 'పేస్ట్' చేయడానికి వీలయ్యేదికాదు.అలా కాకుండా అన్ని పత్రికలు 'ఏకరూపత' లోకి మారినట్టయితే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు పత్రికలలోని అవసర సమాచారాన్ని తేలిగ్గా తీసుకుని ఉపయోగించుకోడానికి అవకాశం ఉంటుందని శ్రీ రహంతుల్లా ఎప్పటి నుండో విజ్ఞప్తులు చేసేవారు.ప్రస్తుతం ప్రచురణ సంస్థలలో ఉన్న వివిధ అక్షర రూపాలకు (ఖతులు) బదులుగా ఏకరూపత అక్షర రూపాలు (యూనీకోడ్)లో గ్రంథాల ప్రచురణ సాగించి నట్టయితే ఆయా గ్రంథాలలోని సమాచారాన్ని అంతర్జాలం సాధనాల ద్వారా ప్రపంచ వ్యాప్తం చేయవచ్చంటారు.

'తెలిసి నడుచుకొమ్మ తెలుగు బిడ్డ'శీర్షికన 2012 లో శ్రీ రహంతుల్లా వెలువరించిన 'తెలుగు అధికార భాష కావాలంటే', 'తెలుగు దేవభాషే' రెండు గ్రంథాలలోని సమాచారం ఆధారంగా శ్రీ ఆకురాతి గోపాలకృష్ణ శతకం రాశారు. ఈ పుస్తకాన్ని వ్యయప్రయాసలకోర్చి మొత్తంగా 'ఏకరూపత' తెలుగు అక్షర రూపంలో ప్రచురించారు. ఆ కారణంగా అంతర్జాలంలో ఈ శతకం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు భాషాప్రియులకు చేరింది. ఈ పుస్తకాన్ని 2013 లో తిరుపతిలో జరిగిన తెలుగు ప్రపంచ మహాసభలలో ఆవిష్కరించి ప్రజలకు మహాసభల చిరుకానుకగా శ్రీ రహంతుల్లా అందించారు. ఈ శతకంలోని పద్యాలను తెలుగు భాషోద్యమ నిర్మాణానికి విస్తృతికి నినాదాలుగా, సందేశాలుగా ఉపయోగించుకోవాలని తెలుగు భాషోద్యమకారులు శ్రీ సామల రమేష్

బాబు (సంపాదకులు 'నడుస్తున్న చరిత్ర' మాసపత్రిక) ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఉపసభాపతి శ్రీ మండలి బుద్ధప్రసాద్ సూచించడం ద్వారా 'తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ' శతకం ఎంతటి ప్రయోజనకరంగా రూపొందిందో అర్థం చేసుకోవచ్చు.

అలాగే తన సన్నిహిత మిత్రులు ప్రముఖ ధార్మిక పండితులు శ్రీ అబుల్ ఇర్ఫాన్ రూపొందించిన 'ఖురాన్ బావామృతం' అను బృహత్తర గ్రంథాన్ని అంతర్జాల సాంకేతిక నిపుణులు శ్రీ షేక్ రహమానుద్దీన్ (విజయవాడ) ద్వారా ఏకరూపత అక్షర రూపంలోకి మార్పించి 'తెలుగు వికీపీడియా' ద్వారా అందరికి అందుబాటులోకి తెచ్చారు. భారత స్వాతంత్రోద్యమంలో ముస్లింల పాత్రను వివరిస్తూ 1998 నుండి నేను రాసిన 11 గ్రంథాలను కూడా ఏకరూపత అక్షరరూపంలోకి మార్పించి తెలుగు 'వికి సోర్స్' కు అందజేయడంలో నన్ను కూడా శ్రీ రహంతుల్లా ప్రోత్సహించారు. తన మూడవ గ్రంథం "తెలుగులో పాలన" యూనీ కోడ్ లోనే ప్రింటు చేయిస్తున్నారు. తెలుగు వికీపీడియా ను మరింత సమాచార యుక్తం చేయడానికి నిరంతరం కృషి సాగిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలలోని చరిత్ర ప్రసిద్ధికెక్కిన గ్రామాలు, పట్టణాలు మాత్రమే కాకుండా వివిధ రంగాలలో లబ్దప్రతిష్టులైన ప్రముఖులకు సంబంధించిన సమాచారాన్ని శ్రమకోర్చి సేకరించి తెలుగు వికీపీడియా లో నిక్షిప్తం చేస్తున్నారు. ప్రజలకు ఉపకరించే ఎటువంటి జ్ఞానమైనా ప్రజాపరం కావాలంటే ఇటువంటి చర్యలు, విధానాలు, ఆవిష్కరణలు చాలా అవసరమని శ్రీ రహంతుల్లా అభిప్రాయపడతారు.

తెలుగు భాషోద్యమకారుడిగా, తెలుగు భాషాప్రియుడిగా, సాంఘికోద్యమకారుడిగా, దార్శనికుడిగా, ప్రజల సంక్షేమం ఆశించే నిబద్ధత గలిగిన ప్రభుత్వాధికారిగా శ్రీ రహంతుల్లాతో నాకున్న పరిచయంలో నేను అర్థం చేసుకున్న, ఆయన రచనల ద్వారా, నాతో ఆయన సాగించిన అసంఖ్యాక సంభాషణల ద్వారా నేను అవగతం చేసుకున్నంత మేరకు 'ఆప్తవాక్యం' రూపొందించాను. ఒక లేఖకుడిగా, వ్యాసకర్తగా, విమర్శకుడిగా, గ్రంథ రచయితగా నిత్యం నూతనత్వాన్ని సంతరించుకుంటూ తన ప్రజ్ఞాపాటవాలను తెలుగు భాషాభివృద్ధి, పరిరక్షణల కోసం బహుముఖంగా వెల్లడిచేస్తున్న మిత్రులు శ్రీ నూర్ బాషా రహంతుల్లా మూడవ గ్రంథం 'తెలుగులో పాలన' ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నందుకు నా హృదయ పూర్వక శుభాభినందనలు.



నాదో చిన్న మాట

ఎర్రాప్రగడ రామకృష్ణ
ఈనాడు రచయిత ,రాజమండ్రి

శ్రీ నూర్ బాషా రహంతుల్లా తెలుగు బాషాభిమానిగా సుప్రసిద్ధులు. వారితో నాకు ముఖపరిచయం లేకున్నా ముఖగ్రంథ (ఫేస్ బుక్) పరిచయం చాలాకాలంగానే ఉంది. వ్యాసరచయితగానూ వారు నాకు సుపరిచితులే ! మూడు దశాబ్దాలుగా ఈనాడు దినపత్రిక లో నేను రాసిన వ్యాసాలు – నా దగ్గర లేనివి కూడా వారి వద్ద భద్రంగాఉన్నాయని తెలిసి నేను ముందు ఆశ్చర్య పోయాను, దరిమిలా తీరిగ్గా గర్వపడ్డాను. ప్రస్తుతం ఈ పుస్తకానికి తొలిపలుకులు రాసే క్రమంలో వారికున్న మాతృభాషాభిమానాన్ని గ్రహించి కొంచెం సిగ్గుపడుతున్నాను. సుమారు 15 వేల వ్యాసాలను రచించిన నాకు తెలుగుపట్ల వారికున్నంత నిబద్ధత లేకపోవటం దానికి కారణం.

వారిది ఏ స్థాయి అంకిత భావమంటే అధికార రీత్యా కూడా అవకాశం ఉన్న చోటల్లా తెలుగును వాడుక లోకి తేవాలన్నది ఆయన పట్టుదల. ఈ పుస్తకం నిండా దానికి గట్టి ఆధారాలు ఎన్నో లభిస్తాయి. వ్యక్తిగతంగా ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పాత్ర పోషిస్తూనే తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తూ, దానితో ఆగి పోకుండా, లిపి సంస్కరణల నుంచి నాయకుల, అధికారుల అలసత్వాన్ని ప్రశ్నించే పాటి గుండె దిటవు నన్ను ఆశ్చర్య చకితుణ్ని చేసింది. అధికార భాషా సంఘం అలసత్వాన్ని , యూపీపీఎస్సీ నిర్వాహకులను ప్రశ్నించడం నన్ను విస్మయానికి గురిచేసింది. ధృఢమైన నిశ్చయం తీవ్రమైన నిబద్ధత విశేషభాషాభిమానం కల్గిన ఇలాంటి అధికారులు ఎందరో ఉన్నా మరీ మన తెలుగు భాష ఎందుకు ఇంతగా వెనుకబడి ఉందనేది నన్ను ఎన్నో ఆలోచనల్లోకి నెట్టింది. ఈ నేపధ్యాన్ని దృష్టిలో పెట్టుకొని భాష పట్ల నా అవగాహనను మీతో పంచుకోవాలనిపిస్తోంది. నా తెలుగుతల్లికి మల్లెపూదండ తెలుగును 'అజంత' భాషగా పిలుస్తారు. మాటలన్నీ అచ్చులతో అంతమవడం దానికి కారణం. తెలుగు సాహిత్యం ఏదేశ

భాషకూ తీసిపోదు. సాక్షాత్తు శ్రీకాకుళ ఆంధ్రమహావిష్ణువే 'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్నాడు. 'తెలుగదేలయన్న దేశంబు తెనుగు, ఏను తెలుగు వల్లభుండ తెలుగొకండ' అని ఒక నిర్ణయానికి వచ్చాడు కృష్ణరాయలు. 'భాషలొక పది తెలసిన ప్రభువు మదిని గెలుచుకున్నట్టి మేటి మా తెలుగుభాష' అని తెలుగువారు గర్వపడుతుంటారు. గీర్వాణ భాషలోని అమరకావ్యాలను తెలుగులోకి అనువదించే అవకాశం లభిస్తే కవులు పొంగిపోయేవారు. 'నన్నయ తిక్కనాది కవులీయుర్విన్ పురాణావళుల్ తెనుగుం జేయుచు, మత్పురాకృత శుభాధిక్యంబు' ఫలించి భాగవతం మాత్రం తనకు వదిలిపెట్టారని పోతన్న ఎంతో ముచ్చటపడ్డాడు. నిజానికి అది పోతన్న అదృష్టం కాదు. తెలుగు వారి పుణ్యఫలం. అలాంటి కవులు జన్మించడం జాతికే గర్వకారణం!

తెలుగుభాషను సుసంపన్నం చేసిన ఖ్యాతి ఎందరో సత్కవులకు దక్కుతుంది. ఆది కవి నన్నయ మొదలు- ఆధునిక కవుల వరకు చాలామందికి ఆ పుణ్యంలో భాగం ఉంది. 'తెరపి వెన్నెల ఆణిముత్యాల సొబగు పునుగు జవ్వాది ఆమని పూలవలపు, మురళి రవళులు కస్తూరి పరిమళములు కలసి ఏర్పడె సుమ్ము మా తెలుగుభాష' అన్న నండూరి రామకృష్ణమాచార్య పలుకుల్లో సాహిత్యాభిమానుల గుండె చప్పుళ్ళు ప్రతిధ్వనిస్తాయి. ఆ అభిరుచి విశేషాన్ని ప్రశంసిస్తూ రాయప్రోలు, 'సంతోషింపగదమ్మ ఆంధ్రజననీ! సారస్వత స్నాన విశ్రాంతి ప్రీతుల, నీదు పుత్రకుల, దీక్షాబద్ధులం చూచి' అని తెలుగు తల్లికి విన్నవించారు. చక్కని తెలుగు వింటుంటే సంగీతం విన్నట్లుంటుందన్నది చాలామందికి అనుభవం. విశ్వనాథ 'ఒక్క సంగీతమేదో పాడునట్లు భాషించునప్డు విన్పించు భాష' అంటూ తీపి పలుకును కొనియాడారు. నండూరి దృష్టిలో తెలుగు భాష 'సాహితీ తరంగ సంగీత రసధుని!' ఈ కవులంతా పూర్వీకుల సత్తాను పరిచయం చేయడం ద్వారా పాఠకులకు అభిరుచిని నేర్పారు. రసజ్ఞతను మప్పారు. 'పలికిన పల్కు పల్కునను పట్టున పిండిన క్రొత్త తేనియల్' చవి చూపించారు. భాషపై ప్రేమను పెంచారు. పరంపరను కాపాడుతూ వచ్చారు. మన వరకు తెలిసేలా చేశారు. తుమ్మల మాటల్లో 'ఏ పుణ్యలేశమ్ము నా పాలిదాయెనో నీ పావనోదార శ్రీపరంపరలలో నీ

పదార్చకులలో నేను నొక్కడనైతిని‘ అని మనం గర్వించేలా చేశారు.

చిరిగిన చొక్కా అయినా తొడుక్కో, మంచి పుస్తకం మాత్రం కొనుక్కో‘ అని కందుకూరి వీరేశలింగం చెప్పినంత కాకపోయినా యువతరానికి తెలుగుభాషా సాహిత్యాల పట్ల చెప్పుకోదగ్గ సదభిప్రాయం అంటూ ఉంది. అయితే చాలామందికి చదివే ఓపిక, తీరిక లేవు. ‘పొట్టకూటికి కాదివి గిట్టుబాటు‘ అన్న భావంతో కొందరు దూరం పెట్టారు. పట్టుతేనె రుచి తెలియక శాక్రిన్ తీపితో మురిసిపోతున్నారు మరికొందరు.శివకేరా ప్రసిద్ధ వ్యక్తిత్వ వికాస గ్రంథం ‘యుకెన్విన్‘ అట్టమీద వాక్యం ‘విన్నర్స్ డోన్ట్ డూ ది డిఫరెంట్ థింగ్స్, దేడూ ది థింగ్స్ డిఫరెంట్లీ, ‘అన్నదాన్ని అరవై ఏళ్ళ క్రితమే విశ్వనాధ అంతకన్నా ప్రభావవంతంగా చెప్పారని యువతకు గుర్తు చేసేవారు కరువయ్యారు. రాముడి గురించి మారీచుడు “అందరి వలె మాట్లాడడు,అందరివలె చేయడేదియైనన్ తన ఆత్మం ఒలుకబోసిన చందంబున పలుకు సేయు సర్వము తానై” అని రావణుడికి చెప్పాడు. ఆ వాక్యాన్ని శివకేరా మాటలతో పోల్చి చెబితే ఏది మెరుగైనదో యువత తేల్చుకోగలరు.

తెలుగుభాషా సంధర్భాన్ని తిలకించిన వారు, దాని మాధుర్యాన్ని ఆస్వాదించిన వారు యువతకు వాటిని పరిచయం చేయాలన్నది శ్రీ రహంతుల్లా గారి వాదన. దానికి అనుగుణంగా ఆయన చేస్తున్న సూచనలు మెచ్చుకోదగినట్లున్నాయి. లిపిని సంస్కరిస్తేనే మంచి రోజులు , దేవుడికి తెలుగు రాదు వంటి వ్యాసాల్లో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలను మనం ఈ కోణంలోనే అర్థం చేసుకోవాలి.

పార్లమెంటులో తెలుగు వినపడాలి అన్న వ్యాసం చదివినప్పుడు నాకు తమిళుల భాషాభిమానం గుర్తుకొచ్చింది. ఈ విషయంలో మనం చాలా వెనుకబడ్డాం.

తమిళుల మాతృభాషాభిమానం ఎంత తీవ్రమైనదో మనకు తెలుసు.భాషవిషయంలో వారిదికేవలంమథనకుతూహలంకాదు,కదన కుతూహలమూ వారిలో ఎక్కువే. 1999 లో భాజపా ప్రభుత్వం

సంస్కృత భాషకు రాజసత్కారం తలపెడితే మా తమిళం సంగతేమిటని ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. నిరసన దీక్షలు పూనారు. ప్రభుత్వం స్వయంగా బంద్ నిర్వహించింది. జనజీవనం స్తంభించింది. పరభాషా నాయికలు తమిళ చిత్రాలలో నటించడానికి అభ్యంతరం లేదు. అయితే తమిళ భాష నేర్చి, సంభాషణలు స్వయంగా పలికి తీరాలన్నది అక్కడి ప్రజల పట్టుదల. తమ మాతృభాష పట్ల వారికింత ప్రచండమైనది నిబద్ధత, ధృడవైఖరి ఉన్నాయి కాబట్టే – రాజకీయ పక్షాలూ ఆదారినే నడుస్తున్నాయి. 1999 ఆందోళనల్లో తమ భాషకోసం రాజకీయనేతలు జైళ్ళకు వెళ్లారు. అంతెందుకు 1996 ఎన్నికల ముందు తిరుచ్చిలో జరిగిన డిఎంకె సదస్సు తమిళాన్ని కేంద్రం ప్రాచీనభాషగా గుర్తించి తీరాలని రాజకీయ తీర్మానం చేసింది. దాన్ని తమ ఎన్నికల వాగ్దానాలలో ప్రముఖంగా ప్రజల ముందుకు తెచ్చింది. ఈ వైఖరిని తెలుగు ప్రజలు ఏరకంగా అర్థంచేసుకోవాలి?

తమిళ మహాసభలు కోయంబత్తూర్ లో వైభవంగా జరిగాయి. కొన్నేళ్ళక్రితం అప్పటి ముఖ్యమంత్రి డా||కరుణానిధి మహాసభల భూమికను వివరిస్తూ ఇరవై రోజుల ముందుగా 'హిందూ' పత్రికలో విపులమైన వ్యాసం రాశారు. ప్రాచీన భాషగా గుర్తింపు పొందేందుకై తమ ముందుతరం చేసిన విశేష కృషిని శ్లాఘిస్తూ మొదలైన ఆ వ్యాసం దానికై తమిళానికి గల అర్హతను, ఔచిత్యాన్ని నిరూపిస్తూ సాగింది. రాబోయే తరాలకు సర్వసత్తాకమైన భాషను అందించడానికి అవసరమైన దిశానిర్దేశం చేస్తూ ముగిసింది. "శాస్త్ర సాంకేతిక రంగాల ప్రగతిని దృష్టిలో పెట్టుకుని, ఆదునిక యుగ అవసరాలకు సరితూగేలా తమిళభాష తగినంత పరిపుష్టిని సాధించుకోవడానికి ఈ మహాసభలు దారిచూపిస్తాయి. రాబోయే శతాబ్దంలోకి భాషను సగర్వంగా తోడ్కొని వెళతాయి" అని డా||కరుణానిధి తమ ధృడసంకల్పాన్ని వెల్లడి చేశారు. తానే స్వయంగా సమావేశాల ఇతివృత్త గీతాన్ని (థీమ్ సాంగ్) రచించి, అంతటి పెద్దవయసులోనూ ఉత్సవ నిర్వహణకు తానే పూనుకున్నారు. దీంతో ప్రజలు ఎంత ఉత్తేజితులై ఉంటారో మనం ఊహించుకోవచ్చు. మన పొరుగునే ఉన్న తమిళ ప్రజల, రాజకీయ నేతల తపన, భాషపట్ల అంకిత భావం, చిత్తశుద్ధి, దీక్షల నుండి మనం ఏమైనా నేర్చుకోగల్గితే ఎంత బాగుండును !

శ్రీ రహంతుల్లా గారి అభి ప్రాయాలతో మనం పూర్తి గా ఏకీభవించక పోవచ్చు. కాని వారి చిత్తశుద్ధి మాత్రం తప్పక ఆకట్టుకుంటుంది. వారి సూచనలు సర్వదా ఆమోద యోగ్యం అనిపిస్తాయి. వాటికోసం తెలుగువారంతా ఈ వ్యాసాలను తప్పక అనుశీలించాలి. మరోసారి వారిని మనసారా అభినందిస్తూ, వారి నుంచి మరిన్ని వ్యాసాలను ఆహ్వానిస్తున్నాను.



తెలుగు తప్పనిసరి

ప్రభుత్వ, ప్రైవేటు, కేంద్ర స్కూళ్లలో తప్పనిసరి సబ్జెక్టు

» మాతృభాష పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

» శాసనసభలో ముఖ్యమంత్రి వెల్లడి

పండుగలు ఉత్సవాలుగా..

ఆంధ్రజ్యోతి Thu, 30 November 2017 epaper.andhrajyothy.com/c/24104666



నూర్ భాషాభిమానం

కర్లపాలెం హనుమంతరావు
ఈనాడు రచయిత

'కూరలు బేరం చేయడానికి తప్ప తెలుగు దేనికీ పనికి రాదు' అంటారు కొడవటిగంటి. ఇవాళ తెలుగు మాట్లాడే జనం సంఖ్య 9 కోట్ల పై చిలుకు. పొరుగునున్న మరాఠీ, తమిళం కన్నా తెలుగు మాట్లాడే వాళ్ల సంఖ్యే ఎక్కువ. దేశభాషలందు తెలుగు ఏ విదంగా లెస్సు?

1975 లో జరిగిన మొదటి తెలుగు ప్రపంచ మహా సభలకు మొన్నటి 2017 లో జరిగిన మహాసభలకు మధ్య ప్రభుత్వాలు, ప్రజలు మాతృభాష తెలుగును మన్నించే తీరులో మార్పేమన్నా వచ్చిందా? అని పలు కోణాల్లో సాధికారికంగా తర్కించారు ఈ ప్రభుత్వ అధికారి. 'మార్పయితే వచ్చింది.. కానీ తిరోగమన రీతిలో' అని సందర్భాలను బటి ఉదాహరణలతో సహా మరీ తేల్చేసారు.

నూర్ బాషా రహంతుల్లాగారు ప్రభుత్వ ఉన్నత పదవుల్లో చాలా ఏళ్ల బట్టి ఉన్న పెద్దలు. ఉద్యోగ రీత్యా తనకు ఎదురైన సవాళ్ళు ఎలాంటివో.. వాటిని ఎలాంటి మొక్కవోని దీక్షతో తాను ఎదుర్కొన్నారో వినాలనుకునే వారు ఈ వ్యాసాలను ఓ పాఠ్యగ్రంథంలా పరిశీలించవలసిన అవసరం ఉంది.

మొదటి నుంచి మన తెలుగువాడికి పెరటి చెట్టంటే చులకనే. తెలుగుభాషను ఉద్ధరించే పని పెట్టుకున్నానని గంటం పట్టుకున్న నన్నయకైనా మహాభారతం మొదటి పర్వం కనీసం మంచి తెలుగుపద్యంతో మొదలు పెట్టాలన్న ధ్యాస కలగలేదు! గురజాడ అప్పారావుగారు తెలుగోడి పరభాషాభిమానాన్ని కన్యాశుల్కంలో ఉతికి ఆరేసారు. మేధావులు సైతం ఎట్లా ఆంగ్లభాష మాయాజాలంలో పడి కొట్టుకుపోతున్నారో రచయిత పలు వ్యాసాలలో సాధికారికంగా నిరూపించారు. అవసరమైన విషయాలను సున్నితంగా, నచ్చచెప్పే తీరు నిజాయితీగా ఉన్నప్పుడు ప్రభుత్వాలు సైతం సామరస్యంగానే

స్పందిస్తాయి. అందుకు తార్కాణం నూర్ బాషా గారికి ప్రభుత్వాల తరుఫు నుంచి కూడా అందుతున్న సహకారం. కుంటి సాకులతో మంచి పనులకు పిల్లి శకునాలు చెప్పే ప్రభుత్వ బాధ్యులందరూ నూర్ బాషా గారిని స్ఫూర్తి దాయకంగా తీసుకుంటే తెలుగు అధికారభాష హోదాకున్న పెద్ద అడ్డంకి తొలగినట్లే!

తెలుగు భాష దుస్థితికి మందు వేయాలంటే రోగానికి మూలమెక్కడుందో ముందు కనిపెట్టాలి కదా! ఆ భాషాచికిత్సకు చక్కని వైద్యపరికరాలు ఎన్నో ఇక్కడి నూర్ బాషా వ్యాసాలలో మనకు లభిస్తాయి. తెలుగుభాషకు పూర్వ వైభవం నవీన సాంకేతికయుగం ద్వారా అందివచ్చే హూందాతనం రెండూ సమకూర్చాలన్న దీక్ష పుష్కలంగా కల భాషాభిమానులందరికి సరైన దారులు సూచించిన నూర్ బాషా గారిని కొత్తతరం భాషామార్గదర్శకులు అంటున్నాను నేను. కార్యాలయాలు, ఠాణాలు, న్యాయస్థానాలు, ఆసుపత్రులు, సమాచార మాధ్యమాలు అన్నింటా ఇంగ్లీషేనా? పేరుకి స్వతంత్రులమై డెబ్బైయ్యేళ్ళు దాటినప్పటికీ తెలుగువాళ్లం భాషరీత్యా అస్వతంత్రులం, పరభాషకు బానిసలం!తెలుగు రాష్ట్రాల విభజన సమయంలో నాటి ఎం.పి నందమూరి హరికృష్ణ రాజ్యసభలో తెలుగు ప్రసంగం చేస్తానంటే గేలిచేసారు సాక్షాత్తు సభాపతి. అనువాదకులు లేరని కుంటి సాకులతో విషయం దాటేసినప్పుడు కనీసం నిరసన ప్రదర్శించిందా ఆంధ్రావని?మన బంగారం మంచిది కానప్పుడు కంసాలిని ఎన్ని అని ప్రయోజనమేముంది?ఆసుపత్రుల్లో వైద్యులు వల్లించే రోగాలు, మందు చీటీల్లో రాసిచ్చే ఔషధాలపేర్లు ఇంగ్లీషే! ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించే, వినిపించే తెలుగు వాస్తవానికి ఓ కంటి తుడుపు చర్య. తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ జరగాలన్న నిబంధనలు ఎన్ని వస్తున్నా అమలు చేసే చిత్తశుద్ధి, సిబ్బందిలో కరువవుతున్నప్పుడు 'ఇక తెలుగుభాషకు నిజమైన అధికార హోదా దక్కేది ఎప్పుడు? తల్లివంటి తెలుగు పలుకును ఈ దయనీయమైన దుస్థితి నుంచి గట్టున పడేసే పద్ధతులేమిటో అంటూ తన బుర్రకు పదును పెట్టిన కార్యవాది రహంతుల్లా . వృత్తిరీత్యా వారు ఎదుర్కొన్న సవాళ్లు ఎలాంటివో మొక్కవోని దీక్షతో వాటిని మట్టు పెట్టేటందుకు అధికారిగా వారు ఎన్నుకొన్న మార్గాలు ఏమిటో తెలుసుకోవాలన్న ఆసక్తి గల తెలుగు భాషాభిమానులంతా తప్పక తెలుసుకోదగ్గ కొత్తవిశేషాలు ఎన్నో ప్రతీ

వ్యాసంలో తారసపడతాయి.. అదీ ఈ పుస్తకం విశిష్టత. అసలు తెలుగుభాష బతక్కపోతేనేమయ్యా మన బతుగ్గడవదా? అని ఎదురడిగే మహానుభావులకి 'భాష ఉన్నది కేవలం బతుకు గడిచేటందుకేనా? బతుకు కమ్మగా గడిపేటందుకు కాదా?' అని ఎదురడిగే దమ్ము ఈ అధికారి క్రియాశీలతను పరిశీలించే ఎవరికైనా కలిగి తీరాలి. నిజంగా బతుకు తెరువుకు ఒక మంచి దారి చూపిస్తుందా ఇప్పుడున్న తెలుగు?అంటూ నిలదీస్తాయి ఇందులోని పలు వ్యాసాలు.

తల్లిభాషతో లోకాన్ని స్వయంగా అవగాహన చేసుకున్న మెదళ్లే ఎదిగే కొద్దీ జీవితంలో ఎన్ని సవాళ్లనయినా సమర్థవంతంగా అధిగమించేది. ఉన్నతశిఖరాలు అధిరోహించడంలో చిన్ననాటి చదువు సంధ్యలపాత్ర ఎనలేనిది. సినిమాలకు, టీవీలకు, గాసిప్పులకి, కొట్లాటలకి పనికొచ్చే తెలుగు బళ్లల్లో చదువుకొనేటందుకు ఎందుకు దండగ సరుకవుతున్నట్లు?! తేరగా చదువుచెపుతామన్నా తెలుగు ప్రభుత్వ పాఠశాలల వైపు కన్నెత్తైనా చూడడం లేదు కనీసం బీదాబిక్కీ జనమైనా! ఇంట్లో హాయిగా వాడుకొనే తెలుగు మాట గడప దాటంగానే ఎందుకు వెగటవుతుందో? భేషజం కోసమా భాష? ఆంగ్లభాషా వ్యామోహం ఓ మహమ్మారి. ఏ మహామంత్రంతో ఈ మాయలాడి ఆటను కట్టడి చేయాలో చెప్పే తారకమంత్రాలతో పలుశ్రమదమాదుల కోర్చి నూర్ బాషా రహంతుల్లా గారు రూపొందించినది ఈ అపురూపమైన మార్గదర్శక గ్రంథం.మన కోసమే మనం అవుపోసన పట్టవలసి ఉంది. సర్కారు కొలువుల్లో చేరేందుకు ఏ విధంగానూ ఉపయోగపడని భాష మీద ఎవరికైనా గౌరవం ఎందుకుంటుంది? ఎందుకూ కొరగాని మందబుద్ధి మాత్రమే ఎంచుకొనే మీడియం తెలుగు అన్న ధోరణి జనసామాన్యంలోనూ పెరిగేందుకు కారకులెవరు? ఇప్పుడంటే తెలుగు రాష్ట్రాలు కనీసం పది, పన్నెండు తరగతుల వరకైనా తెలుగును తప్పనిసరి మాధ్యమం చెయ్యాలని తలపోస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు ఈ పాలకులే గురుకులాల తెలుగుకు సైతం మంగళం పాడేందుకు సిద్ధమయారు! ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ మార్పుకైనా ముందు మామూలు జనం వైపు నుంచే చొరవ రావాలన్న మూలసూత్రం తెలిసిన మేధావి అధికారి నూర్ బాషా రహంతుల్లా గారు! ముందుగా ఓ ప్రభుత్వ బాధ్యుడిగా తన పక్షం నుంచి వీలైనన్ని భాషాసంస్కరణలకు శ్రీకారం చుట్టారు. చిత్తశుద్ధితో పనులు చేశారు, చేస్తున్నారు.

పాలనాధికారి స్థాయిలో ఎన్నో పని వత్తిళ్లున్నా అదే పనిగా పెట్టుకొని మాతృభాషకు సేవలందించే నూర్ బాషా రహంతుల్లా గారి మాతృభాషాభిమానం ఎందరికో స్ఫూర్తిదాయకం! తాను ఎమ్మార్వోగా ఉన్న రోజుల్లో పట్టుబట్టి ముఖ్యమైన కొన్ని ధరఖాస్తులను తెలుగుభాషలో అందుబాటులోకి తెచ్చారు. ఎవరి సాయం అవసర పడకుండానే అర్జీపత్రాన్ని సామాన్యుడు సైతం సులభంగా నింపగలిగే పరిస్థితి కల్పించడం చిన్న విషయం కాదు. విద్యార్థి దశలో వివిధ రకాలైన ధృవీకరణ పత్రాలు తెలుగులో సాధించేందుకు తాను పడిన ఇబ్బందులేవీ మర్చిపోని మాతృభాషాప్రేమి నూర్ బాషా స్వామి. పెద్ద కుర్చీలు ఎక్కినా చిన్నప్పటి తిప్పల్ని గుర్తుంచుకుని వాటిని అధిగమించేందుకు ఎంత మంది అధికారులు నూర్ బాషా మాదిరి ఏటికి ఎదురీది మరీ అనుకున్నది సాధించేది?

'వట్టి మాటలు కట్టి పెట్టోయ్.. గట్టి మేల్ తలపెట్టవోయ్' అన్న గురుజాడవారి సూక్తి గట్టిగా వంటబట్టించుకోబట్టే 2008లో పులిచింతల ప్రాజెక్టులో భూసేకరణ సమ్మతి అవార్డు తెలుగులో ఇచ్చి కొత్త వరవడి సృష్టించారు నూర్ బాషా రహంతుల్లా .ఎలాంటి మాదిరి పత్రం లేని పరిస్థితుల్లో సైతం సరికొత్త అనువాదానికి స్వయంగా పూనుకుని రాసిన ఆ అవార్డు రాష్ట్రంలో మొదటి తెలుగు అవార్డు! బడుల్లో చదువుకోవలసిన పిల్లలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వృథాగా ఎందుకు ప్రదక్షిణాలు చెయ్యాలన్న తలంపుతో.. శాశ్వత కుల, నివాస స్థల, పుట్టిన తేదీల వంటి ఎన్నో అవసరమైన ధ్రువీకరణపత్రాలను వారి వారి పాఠశాలల్లోనే నేరుగా పిల్లలకు పంపిణీ చేయించే విధానానికి శ్రీకారం చుట్టడం అప్పట్లో ఎమ్మార్వోగా నూర్బాషాగారు సృష్టించిన సంచలనం. పట్టాదారు పాసు పుస్తకాలు రైతుల ఇళ్లకు చేరవేయించి మనసున్న మా రాజుకు మార్గం దానంతట అదే ఎలా దొరుకుతుందో నిరూపించారు. ఇలాంటి స్ఫూర్తితోనే ఆంధ్రప్రదేశ్‌లో 'విద్యార్థుల సేవలో రెవెన్యూ' అనే మంచి కార్యక్రమం కొనసాగుతున్నట్లు వింటున్నాం! ఎవరో ఒకరు.. ఎపుడో అపుడు' అన్న తెలుగు సినిమా పాటకు అచ్చమైన నిలువెత్తు ఆచరణ దర్పణం నూర్ బాషా రహంతుల్లాగారు. ఆ ఆదర్శమూర్తి తన ఆశయసిద్ధికి ఏ ముళ్ళదారుల వెంటబడి ముందుకు సాగారో ముందు తరాలకి తెలపాలంటే ముందు మన వంతుగా పెద్దలం పలు సంస్కరణలతో నిండిన ఈ వ్యాస సంకలనం

పరిశీలించడం అవసరం.

దారేలేని ముళ్ల డొంకల గుండా కాయా కంపా కాళ్ల కడ్డుపడి ఇబ్బంది పెడుతున్నా మొక్కవోని దీక్షతో ముందుకు సాగే మొండి సాహసం కొంతమందికే ఎందుకు వరమవుతుందో.. నూర్బాషాగారి వంటి కార్యదీక్షాపరుల జీవితాలను పరిశీలిస్తే గానీ బోధపడదనిపిస్తుంది! గిరిజన ప్రాంతం రంపచోడవరం మొబైల్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ గా అచ్చమైన తెలుగువాళ్ళకు స్వచ్ఛమైన తెలుగులో తీర్పులిచ్చే అవకాశం వచ్చిందని ఆయన ఉత్సాహపడ్డారు. నల్లకోట్ల వకీళ్లు ఎప్పట్లానే 'యువరానర్' అంటూ ఆంగ్లం పరిభాషలో ముందు కొచ్చి మరీ పిల్లి శకునం చెప్పబోయారు. అంతో ఇంతో గుండె పటుత్వం ఉన్న ఎంత పెద్ద అధికారయినా నిజానికి నీళ్లు కారిపోక తప్పదు అట్లాంటి పరిస్థితుల్లో! అంత తేలికగా లొంగే ఘటమా నూర్బాషాగారు! తన తెలుగుభాషాదీక్షకు అదో పరీక్షా సమయమని బావించారు. ఆదర్శాల వల్లెవేత చెవులకు ఎంత ఆకర్షణీయం. ఆచరణలోనే అవి ఒక్కోసారి ఎంత అసాధ్యాలో, దుస్సాహసాలో.. అప్పుడు గాని నూర్బాషాగారి స్వీయానుభవానికి వచ్చింది కాదు. వాద, ప్రతివాదనలు, సాక్షుల వాంగ్మూలాలన్నీ చెప్పింది చెప్పినట్లు తెలుగులో టైప్ చేసేందుకు చేతి కష్టం చాలా ఉందనీ , ఆంగ్లంలో తర్జుమా చేసి చెబితే తప్ప పని ముందుకు సాగదని సిబ్బంది తమ ఇబ్బందులు మొరపెట్టుకొన్నప్పుడు గానీ జ్ఞాననేత్రం విచ్చుకొన్నది కాదు.తెలుగు మీద అభిమానం ఎంత పుష్కలంగా ఉంటేనేమి? తెలుగులో తీర్పులు ఎందుకు రావో రచయితగారికి అప్పటికి గానీ బోధపడింది కాదు.ఎన్నో ఇడుములకోర్చి ఏవో తంటాలు పడ్డా 'తెలుగు తీర్పుల'కు ఉండే చట్టబద్ధత మాటేమిటి? అధికార హోదా అన్ని స్థాయిలలో ఆచరణలో కొస్తే తప్ప తెలుగుభాషకు వెలుగులు అసాద్యమని నూర్ బాషా రహంతుల్లా గారు నేర్చుకొన్న నీతిసారాన్నే పొందుపరుచుకొన్నాయి ఇక్కడి వ్యాసాలన్నీ! తెలుగు భాషకు పూర్వ వైభవం తిరిగి తెచ్చేటందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలూ నడుం కడుతున్న ఈ శుభ సందర్భానికి అవసరమైన ఉపకరణాలెన్నో నూర్బాషాగారి ఈ వ్యాసాలలో పొందుపరిచి ఉన్నాయి. ఈయన తన అనుభవసారం, అభిరుచులు రెండింటినీ రంగరించి మరీ రాసిన ఈ వ్యాసాలనన్నింటినీ ఆమూలాగ్రం చదివిన పిదప రాసిన ఈ రెండు మాటలు నిజానికి కొండను అద్దంలో చూపించే చిరుప్రయత్నం కన్నా

చిన్నవి.

తెలుగులో చదువుకున్న వారికి పోటీ పరీక్షల్లో అయిదు శాతం ప్రోత్సాహక మార్కులు, ఉద్యోగాలలో 20 శాతం రిజర్వేషన్లు ఇప్పించమని ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం బాధ్యులు మండలి బుద్ధప్రసాద్ గారి ఎదుట పెట్టిన డిమాండ్లు నూర్బాషాగారి మదిలో మెదిలే వందలాది కోరికల్లో కొన్ని మాత్రమే! నూర్ బాషారహంతుల్లాగారితో నాది పరోక్ష పరిచయం. నిరంతరంగా ప్రవహించే ఈ గురుతుల్యుల తెలుగుభాషా మమకార స్రవంతి నుంచి సందర్భం తటస్థించినప్పుడల్లా ఓ పుడిసెడు మంచితీర్థంలా పుచ్చుకుని దప్పిక తీర్చుకొనే వారి ఆశేష అభిమాన సందోహంలో నేనూ ఒక బిందువుని ప్రాచీన హోదా కోసం పాకులాడే కథ సగంలో ఉండగానే అధునాతన యుగ సాంకేతిక అవసరాలకూ తెలుగుభాషను ఎలా సంసిద్ధం చేయాల్సుందో.. వివిధ నవీన అంతర్జాల పరికరాల సాయంతో లిపి, పద నిర్మాణం, నిఘంటువుల తయారీ, జనంభాషతో కలగలసిపోయే తారకమంత్రం, కుల మత వర్గ వృత్తుల వారీ వాడుక, మాండలిక పదజాలాలకూ పండితభాషల పక్కనే సమానమైన పీఠం దక్కే తంత్రం, పెరుగుతున్న జీవితావసరాలకు తగిన విధంగా ఆంగ్లభాష విస్తరణ దారిలోనే ఏ భేషజాలకు పోకుండా అంతర్జాతీయ, జాతీయ పదజాలాలను తెలుగు సొంతం చేసుకొనే యంత్రాంగం.. వంటి ఇంకెన్నో సరికొత్త ఆలోచనా విధానాలతో తెలుగుభాషాభిమాని నూర్ బాషా రహంతుల్లాగారు సాగించారీ వ్యాసాల పరంపర. తెలుగును దేవభాషగా నూర్బాషాగారు నిరూపించబోయిన విధానం నా వరకు సరికొత్తది.

మన తల్లిభాష తెలుగుకు మళ్లీ మంచి రోజులు రావాలనే రచయిత తహతహతో నేనూ పాలుపంచుకుంటున్నాను. గురుతుల్యులు నూర్ బాషారహంతుల్లాగారికి నిండు మనసుతో శతకోటి నమస్కార కృతజ్ఞతాంజలులు!



నా మాట

1952 లో తెలుగు భాష పేరుతో మన రాష్ట్రం ఏర్పడింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలలో మనదే మొదటి రాష్ట్రం.భాషాప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు ఉద్దేశం ఏమిటి? తెలుగు రాష్ట్రాన్ని తెలుగులోనే పరిపాలించటం. గత 66 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో తెలుగు పాలన సిద్ధించిందా? ఏమి ఆశించి భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేశారో ఆ ఉద్దేశాలు ఈనాటికీ నెరవేరకపోగా భవిష్యత్తులో కూడా ప్రజల భాషలో పాలన నడుస్తుందనే ఆశలుకూడా వదులుకోవాలనే హెచ్చరికలు వస్తున్నాయి. అసలు పాలించటానికి మీ భాష బ్రతికి ఉంటుందా అనే సవాళ్ళు నిత్యమూ ఎదురవుతున్నాయి. తెలుగు జనమే ఇంగ్లీషు కాన్వెంట్లకు ఎగబడుతుంటే తెలుగు బడులు నిలుస్తాయా తెలుగులో ఫైళ్ళు నడుస్తాయా అని కార్పొరేట్ యజమానులు, ఆంగ్లాధికారులూ పరిహాసాలు ఆడుతున్నారు.

తెలుగు జాతీయ భాష కావాలి జాతీయ భాష కాగల అర్హత తెలుగుకే ఉందన్నాడు జేబీ హాల్డెన్. నిజమేననుకొని సంబరపడ్డాం. కానీ ప్రాంతీయభాషగా కూడా నిలదొక్కుకోలేక ఈనాడు తెలుగు తల్లడిల్లుతోంది. ఉపాధి కోసం జనం కూడా ఆంగ్లం మోజులో పడి కొట్టుకుపోతున్నారు. తెలుగు సొంతగడ్డపైనే మనుగడ కోల్పోతున్నది. పిల్లల మానసిక ఎదుగుదలకు మాతృభాష ఎంతో కీలకం. పాఠశాలల్లో పదవ తరగతి వరకు విధిగా తెలుగు మాధ్యమంలోనే బోధన సాగాలి. ప్రతి బడీ అమ్మ భాషకు గుడి అయినప్పుడే పిల్లలకు సొంత భాష వస్తుంది. మాతృభాషలోనే అన్ని విషయాలూ నేర్చుకున్న పిల్లలే తమ సొంత భాషలో పాలన చేయగలుగుతారు.

ప్రపంచవ్యాప్తంగా అధిక సంఖ్యాకులు మాట్లాడే భాషల్లో తెలుగుది ఆరోస్థానం. మన ప్రజల నాలుకలపై అది నిత్యం నడయాడాలంటే ,మన పిల్లలు తెలుగు నేర్చుకోవాలి. మాతృభాష కళ్లు అయితే, పరాయిభాష కళ్లజోడు అన్నాడు అన్నాదురై. తమిళం,మరాఠీ, కన్నడ బోధనలను తప్పనిసరి చేస్తూ అక్కడ గట్టి చట్టాలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగును రాష్ట్ర భాషగా గుర్తిస్తూ 1966లోనే అధికార భాషా చట్టాన్ని చేశారు. అధికార భాషా సంఘం ఏర్పాటయ్యింది.

తెలుగు రాష్ట్రం అన్న పేరేగాని చట్టసభల్లో, పాలన వ్యవహారాల్లో, పాఠశాలల్లో, తెలుగు అమలు లేదు. ప్రభుత్వ పాలన కూడా తెలుగులో జరగాలని పాలకులు ఆశిస్తున్నారో లేక ఆశిస్తున్నట్లు నటిస్తున్నారో అని అనుమానం కలుగుతోంది. కాబట్టి శాసన నిర్మాణ క్రతువులో, పాలన వ్యవహారాల్లో తెలుగును తప్పనిసరి చేయాలి. అబ్దుల్ కలాం గారు చెప్పినట్లు జపాన్, జర్మనీ, చైనా, రష్యా తమ భాషల్ని సాంకేతిక ప్రగతికోసం తీర్చిదిద్దుకొన్నట్లు మన తెలుగు భాషనూ ఆధునిక అవసరాలకు తగినట్లు సంస్కరించుకోవాలి. తెలుగులో చదివి పట్టభద్రులైనవారికి ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి.పోటీ పరీక్షలలో 5శాతం ప్రోత్సాహక మార్కులు ఇవ్వాలి. తమిళనాడులో ఇస్తున్నట్లుగా మన పిల్లలకూ ఉద్యోగాలలో 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. రాష్ట్రపతి కోవింద్ కోరినట్లు కక్షిదారుల భాషలోనే హైకోర్టు తీర్పులుండాలి. శాసన, కార్యనిర్వాహక, న్యాయవిభాగాలన్నిటిలో తెలుగు రాజ్యమేలాలి. ప్రజలు కూడా తెలుగును దేవభాషగా గౌరవించాలి. తెలుగులో మాట్లాడటం గౌరవప్రదంగా భావించాలి. మతాల ఆచరణలన్నీ తెలుగు లోకి మారాలి .

తెలుగు మాత్రమే వచ్చిన వాళ్ళు పార్లమెంటు సభ్యులైతే?

రాజ్యసభలో హరికృష్ణ తెలుగులో మాట్లాడారు. నాకు అర్ధంకావటంలేదని,ఇంగ్లీషులోనో హిందీలోనో మాట్లాడాలని వెటకారంగా మాట్లాడిన డిప్యూటీ ఛైర్మన్ కురియన్ కు అనువాదకుల్ని పెట్టుకోవటం మీబాధ్యత అని గట్టిగా బుద్ధిచెప్పారు. తన మాతృభాషలో మాట్లాడే స్వేచ్ఛ ప్రతి సభ్యుడికీ ఉందని వెంకయ్యనాయుడు వెనకేసుకొచ్చారు. అందుకే ఇంగ్లీషుగానీ హిందీగానీ రాని, తెలుగు మాత్రమే వచ్చిన సభ్యులనే మనం ఇకమీదట ఎన్నుకొంటుంటే వాళ్ళే కేంద్రం మెడలు వంచి తెలుగును వెలుగులోకి తెస్తారు. ఇంగ్లీషు రాకపోవటం పాపం కాదు.దాన్ని అందరిమీదా రుద్దటం నేరం. అగ్రభాషలు చిన్న భాషల మీద ఇలాగే స్వారీ చేస్తుంటాయి. ప్రజాస్వామ్య ప్రభుత్వం అన్ని భాషలకూ అనువాదకుల్ని పెట్టాలిగానీ ఇలా అహంకారంగా ప్రవర్తించకూడదు. హిందీ, ఇంగ్లీషు రాకపోతే ఏంచేస్తారు?తన మాతృభాష లోనేకదా మాట్లాడేది?నోరు మూసుకోమంటే ఎలా ఉంటుంది? తెలుగును వదిలి పిల్లల్ని ఇంగ్లీషులో చదివించేది ఉపాధికోసమే అని అందరికీ తెలుసు. అందుకని మాతృభాషలు

వదిలెయ్యాలా?ఎవరి పిల్లల్ని ఏ భాషలో చదివించుకోవాలో వారి తల్లిదండ్రులు నిర్ణయించుకుంటారు. ఎన్ని భాషలు వస్తే అంత మంచిది. కానీ మరో భాష రాని వాళ్ళ మీద ఎక్కువ భాషలు వచ్చినవాళ్ళు తమ బహు భాషా ప్రతాపం చూపకూడదు. ఎవరి భాషలో వారిని మాట్లాడనివ్వాలి. తెలుగులో మాట్లాడొద్దు అనటం ఏమిటి?తెలుగులో మాట్లాడొద్దని పిల్లల మెడలో పలకలు వేలగట్టిన స్కూళ్ళకూ రాజ్యసభకూ తేడా ఏమిటి?ఇది తెలుగు భాషకు అవమానమే. మాతృభాషలో మాట్లాడటానికి ముందుగా పర్మిషన్ తీసుకోవాలని నియమం పెట్టటంలోనే హిందీ వాళ్ళ అహంకారం ఉంది. వారికి పర భాషా సహనం కూడా అవసరం.అనువాదకుల్ని పెట్టకపోవటం మరోతప్పు. భాష ప్రతి మనిషికీ అత్యవసరమైన సమాచార సాధనం. దేశ ప్రజలు వద్దన్నా ఇంగ్లీషు, హిందీ నేర్చుకుంటున్నారు. అవసరం అలాంటిది. పేదరికం, ఆకలిచావులు,ఉద్యోగాలు...ఇలా ఏ అంశాన్నైనా చర్చించాలంటే ఏదో ఒక భాష కావాల్సిందే. మనిషితో పాటు సర్వజీవులూ కోరికలను తమ మాతృభాషలో చెప్పగలిగినంత సుళువుగా స్పష్టంగా పరాయి భాషలో చెప్పలేవు. అది సర్వ ప్రాణులకూ ఉండే సహజ బలహీనత. దేశ సర్వోన్నత సభలు ఈ బలహీనతమీద దెబ్బకొట్టి అవమానించకుండా, రాజ్యాంగంలోని షెడ్యూల్డ్ భాషలన్నిటికీ అనువాదకులను సభలో సదా సిద్ధంగా ఉంచటం ప్రజాస్వామిక ధర్మం. 30 ఏళ్ళ క్రితం ఎన్టీరామారావు గారి పాలనలో తెలుగులోనే సచివాలయం నుండి నాకు ఇచ్చిన జవాబు ఈ పుస్తకంలోనే ఒక అధ్యాయం 'తెలుగులో పాలన చేయగలమా?'లో ఉంది చూడండి. జన భాషలోకే పాలన రావాలంటే ఎప్పటికప్పుడు ఆ భాషకు మరిన్ని ఆర్థిక సాంకేతిక సౌకర్యాలు సమకూర్చాలి. ఉపాధి అవకాశాలు పెరగాలి. రాజకీయ శక్తులూ దన్నుగా నిలవాలి.

ఒక్కసారే పుస్తకంరాయలేక అప్పుడప్పుడు పత్రికలకు రాసిన వ్యాసాలే పుస్తకాలుగా తెచ్చాను. తెలుగు అధికార బాష కావాలంటే?(2004,2006),తెలుగు దేవభాషే (2012) తరువాత తెలుగులో పాలన (2018) తెస్తున్నాను. ఇవన్నీ వివిధ పత్రికలలో అచ్చయిన వ్యాసాలే. ఈ వ్యాసాలను కూడా నా బ్లాగు 'అధికార భాష తెలుగు" లో చేర్చాను.https://www.blogger.com blogger.g?blogID=6982090862782011703#allposts/src=sidebar .
వీటిని అవసరమొచ్చిన చోట స్వేచ్ఛగా వాడుకోండి.

ఈ పుస్తకానికి ముందు మాటలు రాసిన పెద్దలలో ఎంతోకాలం తెలుగులో పరిపాలన నడిపిన అనుభవజ్ఞులున్నారు. తెలుగుకు కార్యాలయాలలో అధికారమిచ్చి ఆనందించిన సహృదయులున్నారు. తెలుగే దేవభాష అంటూ దాని ఆధ్యాత్మిక మూలాలను వివరించగల సమర్థులున్నారు. తెలుగు భాష మాధురీ మహిమను ప్రజలకు పంచిన ప్రముఖ రచయితలున్నారు. చరిత్రకారులున్నారు. వీరంతా -"తెలుగులో పాలన జరగాలి " అనే ఒక్క మాట దగ్గర ఏకమయ్యారు.

మనిషి జీవితం చిన్నది. నా మటుకు నా తరం తెలుగులోనే గడిచింది, తెలుగులోనే ముగుస్తుంది. నలభై ఏళ్ళపాటు తెలుగు పాలనా రంగంలో కూడా ఏలాలని పోరాడాను. గెలిచి సాధించుకోలేకపోయానుగాని నా పోరాటమంతటినీ గ్రంథస్థం చేశాను. విఫలయత్నం కూడా సంతృప్తినిచ్చింది. నాది తెలుగుతో సరిపెట్టుకున్న జీవితం. తెలుగు మాత్రమే వచ్చిన వాళ్ళ మధ్యన బ్రతికిన జీవితం. నా తల్లి నాకు నేర్పిన భాష రాజ్యమేలాలని ఉద్యోగంలో అడుగుపెట్టింది మొదలు నేటి వరకు క్రమశిక్షణతో పని చేసి నందుకు నాకు ఎంతో గర్వంగా ఉంది, ఆనందంగా ఉంది.ఇన్నేళ్ళపాటు ఈ పనిలో నాకు తోడ్పడిన అనేకమంది పెద్దలకు నా వందనాలు తెలియజేస్తున్నాను.

రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కార్యదర్శి **డాక్టర్ నాగులపల్లి శ్రీకాంత్ గారికి** నల్గొండ జిల్లా మాజీ కలక్టర్, తిరుమల తిరుపతి దేవస్థానాల టీవీ చానెల్ అధికారి నండివెలుగు ముక్తేశ్వరరావు గారికీ, కర్నూలు జిల్లా కలక్టర్ శ్రీరాము సత్యనారాయణ గారికీ, రాష్ట్ర దేవస్థానాల నిర్వహణ సంస్థ డైరెక్టర్ చిలకపాటి విజయ రాఘువాచార్యులు గారికీ, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ గారికీ, తిరుపతి ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్ నాగసూరి వేణుగోపాల్ గారికీ, త్రైత సిద్ధాంత కర్త ప్రబోధానంద యోగీశ్వరులు గారికి, ఈనాడు ప్రముఖ రచయిత యర్రాప్రగడ రామకృష్ణ గారికీ, ప్రముఖ రచయిత కర్లపాలెం హనుమంతరావు గారికీ, ప్రముఖ చరిత్రకారుడు సయ్యద్ నసీర్ అహమద్ గారికీ, టైటిల్ పేజీ రూపకర్త షేక్ అబ్దుల్లా గారికీ, వ్యాసాలను టైపుచేసిన నా కుమార్తె నూర్ బాషా జమీలాకు, పుస్తక ముద్రాపకులు శ్రీ విశ్వేశ్వరరావు గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.



1. ఎక్కడ ఉన్న తెలుగు అక్కడే

"విద్య, పని ప్రదేశాలు, ప్రసార, ప్రచురణ మాధ్యమాలు, ప్రభుత్వ వ్యవహారాల్లో వాడుకలో ఉండే భాష మాత్రమే ఎల్లకాలం నిలుస్తుంది" అని ఐక్యరాజ్యసమితి విద్య, శాస్త్ర, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) ఘంటాపథంగా చెప్పింది. కానీ, దురదృష్టవశాత్తూ ప్రసార, ప్రచురణ మాధ్యమాల్లో తప్ప మన మాతృభాష ఎక్కడా కనపడట్లేదు. ముఖ్యంగా పరిపాలన భాషగా తెలుగు అమలు మరీ తీసికట్టుగా ఉంది.

ఈ పరిస్థితి ఎప్పటికి మారుతుంది?

పాలనా వ్యవహారాలన్నీ తెలుగులోనే నిర్వహించేలా త్వరలోనే అన్ని ఏర్పాట్లూ చేస్తామని మొదటి ప్రపంచ తెలుగు మహాసభల ప్రారంభోత్సవంలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రకటించారు. ఆ మహాసభలు జరిగి 40 ఏళ్లు దాటిపోయినా పరిపాలనా భాషగా తెలుగు అమలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉంది. భాషా ప్రాతిపదిక మీద ఏర్పడిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. తమిళభాష ఆధిపత్యాన్ని వదిలించుకుని మన తెలుగు భాషలో మనల్ని మనమే పరిపాలించుకుందామనే సదాశయంతో ఆనాడు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రోద్యమం జరిగింది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయ్యింది. ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండూ తెలుగు రాష్ట్రాలే. ఉమ్మడి రాష్ట్రంలోని భాషాపరమైన కోరికలే ఇప్పటికీ తెలుగు ప్రజల్లో ఉన్నాయి, ఎప్పటికీ ఉంటాయి. అవి తీరేదాకా ప్రజలు అడుగుతూనే ఉంటారు. ప్రజల భాషలో పరిపాలన జరగాలనే కోరిక అతి సహజమైంది.

'జిల్లాస్థాయి, దిగువస్థాయి న్యాయస్థానాల్లో వాద ప్రతివాదాలు తెలుగులో జరగాలి. తీర్పులన్నీ తెలుగులోనే ఇవ్వాలి' అంటూ మార్చి 29, 1974 నాడు మొదటి ప్రభుత్వ ఉత్తర్వు (జీవో నం.485) వెలువడింది. ఆ తర్వాత తెలుగులో పాలన సాగించడం కోసం 1988 నుంచి రాష్ట్ర విభజన ముందు వరకు నాలుగు ముఖ్యమైన ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాయి. వాటి ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికార భాషగా తెలుగును కచ్చితంగా అమలు చెయ్యాలి. జీవోలిచ్చారు గానీ ఆ ఉత్తర్వులు ఎన్నడూ సరిగా అమలు కాలేదు. అవేంటో చూద్దాం.

* ఆంగ్లంలో వచ్చిన ఏ ఉత్తరంపైనా, ప్రతిపాదనపైనా ఎలాంటి చర్య తీసుకోకుండా తిప్పి పంపే అధికారం ప్రతి గజిటెడ్ అధికారికీ ఉంది. తమకంటే పైఅధికారుల నుంచి వచ్చినా సరే ఆంగ్లంలోని లేఖలను తిప్పి పంపవచ్చు. ఇలా చేయడం వల్ల జరిగే కష్టనష్టాలకు, జాప్యానికీ వాటిని ఆంగ్లంలో పంపిన అధికారులదీ, కార్యాలయాలదే బాధ్యత. (ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 167, 19.03.1988)

* 1988 నవంబరు 1వ తేదీ నుంచి రాష్ట్రంలో ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే జరగాలి. అన్ని ప్రభుత్వ ఉత్తర్వుల జారీకి తెలుగుభాషనే ఉపయోగించాలి. ఆంగ్లం వాడకూడదు. కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు, రాష్ట్రం వెలుపల ఉన్న చిరునామాదారులతో మాత్రమే ఆంగ్లం ఉపయోగించాలి. (ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 587, 28.10.1988)

* అన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్న అన్ని సంస్థలు, అన్ని స్థానిక సంస్థలు తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలి. అన్ని శాసనేతర అవసరాలకు, ప్రజలతో జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలకూ తెలుగు భాషనే ఉపయోగించాలి. (ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 218, 22.03.1990)

* రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే ఉత్తర్వులు, నియమాలు, నిబంధనలు, ఉపవిధులు అన్నీ కూడా తెలుగుభాషలోనే ఉండాలి. (ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 420, 13.09.2005)

వీటితో పాటు 'రాష్ట్రంలోని అన్ని దుకాణాలు, సముదాయాల బోర్డులు ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవ నామఫలకాలు, శంకుస్థాపన శిలాఫలకాలు తెలుగులోనే రాయించాలి' అంటూ సెప్టెంబరు 14, 2016న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజన, సాంస్కృతిక, అధికార భాషా మంత్రిత్వ శాఖ జీవో నం.11ను వెలువరించింది. ఈ ఉత్తర్వులన్నింటినీ కచ్చితంగా అమలు చేస్తే పరిపాలన పూర్తిగా తెలుగులోనే జరుగుతుంది. జరిగి తీరాలి.

రెండు రాష్ట్రాల్లోనూ ఎందుకీ పరిస్థితి?

తెలుగువాడిగా పుట్టడం ఎన్నో జన్మల పుణ్యఫలమనీ, రాయల కాలంనాటి రాజభాష అనీ గొప్పలు చెప్పుకోవటమే గానీ క్రమంగా తెలుగు భాష పాలనకు దూరమైంది. కవులకూ కవిత్వాలకు మాత్రమే పరిమితమైపోయింది. తెలుగులో చదువుకునే పిల్లలు

తగ్గిపోయారు. తెలుగు బడులు మన కళ్లముందే ఇంగ్లీషు కాన్వెంట్లుగా మారిపోయాయి. 'తెలుగులో చదివితే ఉద్యోగాలు రావు' అనే అభిప్రాయానికి ప్రజలు వచ్చారు. ప్రాథమిక పాఠశాలలు కూడా ఆంగ్ల మాధ్యమానివే కావాలని పట్టుబడుతున్నారు. ఎందుకంటే తెలుగు మాత్రమే చదివితే ఉద్యోగాలు రాని పరిస్థితి నెలకొంది. తెలుగు భాష ద్వారా కూడా ఉద్యోగాలూ, డబ్బు వస్తుంటే అప్పుడు కొందరైనా స్వార్థం కొంత చంపుకొని తెలుగు చదువుతారు.

ప్రజల భాష పాలనా భాషగా మారకపోతే ఆ భాష చచ్చిపోతుంది. తెలుగు ప్రజలు ఇంట్లో తెలుగులో మాట్లాడుకున్నా.. కార్యాలయాల్లో, న్యాయస్థానాల్లో ఆంగ్లం మాట్లాడాల్సి వస్తోంది. తెలుగు మనిషి మనసుతో పనిలేని ఓ యంత్రంలాగా మారాడు. అలా కాకుండా కార్యాలయాల్లో కూడా మన మనసే (మాతృభాష) రాజ్యమేలాలి అంటే ఆ భాష బాగా నేర్చిన వారిని మాత్రమే అధికారులుగా రానివ్వాలి. అయితే... పాలకులకు ఆచరణలో కొన్ని భాషాపరమైన అవసరాలు, సమస్యలు పదేపదే ఎదురవుతాయి. వాటితో పాటు మన భాషలో పరిపాలన బాగా జరగటానికి ఇంకా ఏమేమి సమస్యలు ప్రతిబంధకాలు అవుతున్నాయో, వాటిని అధిగమించి ఎలా పనులు చెయ్యాలో చూద్దాం. అన్ని దరఖాస్తులూ తెలుగులోనే... రెండు రాష్ట్రాల్లో ఉన్న తొమ్మిది కోట్ల మంది తెలుగువారికి సేవలందించవలసిన లక్షలాది మంది ఉద్యోగులు నిజానికి తెలుగులోనే పనిచేయాలి. ప్రజలకు వారి భాషలోనే పనులు చేసిపెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీదా, అధికారుల మీదా ఉంది. ప్రభుత్వ కార్యకలాపాలన్నీ విధిగా తెలుగు భాషలోనే సాగించాలన్న సంకల్పం పాలకులకు ఉండాలి. నేను ఎమ్మార్వోగా ఉన్నప్పుడు కొన్ని దరఖాస్తులు తెలుగులోకి అనువదిస్తే ఎవరికివారే నింపి ఇచ్చారు. అలా ప్రభుత్వ దరఖాస్తులన్నింటినీ మన భాషలోకి తెచ్చుకోవాలి. దానివల్ల ఆంగ్లం తెలిసిన వాళ్ల కోసం వెతుక్కునే పరిస్థితి తొలిగిపోతుంది.

మన భాషలోనే ధ్రువీకరణ పత్రాలు విద్యార్థి దశలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహశీల్దారు కార్యాలయానికి వారం రోజులపాటు తిరిగేవాణ్ని. ఆనాడు అనుకున్నాను.. నేనే కనుక తహశీల్దారునైతే చిన్న పిల్లలకు చకచకా సంతకాలు చేసి పంపిస్తానని.

తహశీల్దారునయ్యాక మాట నిలుపుకున్నాను. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకూ ఒక నమూనా ఇచ్చి, వారి బడిలోని పిల్లలందరికీ కులం, స్వస్థలం, పుట్టిన తేదీ లాంటి వివరాలు నింపి ధ్రువీకరించి పంపమని కోరాను. ఆయా గ్రామ పాలనాధికారులు కూడా ఆ వివరాలను ధ్రువీకరించారు. పిల్లలెవరూ మండల కార్యాలయానికి రానక్కరలేకుండా శాశ్వత కుల, నివాసస్థల, పుట్టిన తేదీ ధ్రువపత్రాన్ని వారి ఫొటోలు అంటించి, వారి వారి పాఠశాలల్లోనే పంపిణీ చేశాం. పట్టాదారు పాసు పుస్తకాలు రైతుల ఇళ్లకు పంపిణీ చేయించాం. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో 'విద్యార్థుల సేవలో రెవెన్యూ' అనే మంచి కార్యక్రమం జరుగుతోంది.

ఇంకా మెరుగైన అనువాదాలు 2008లో పులిచింతల ప్రాజెక్టులో భూసేకరణ సమ్మతి అవార్డు తెలుగులో ఇచ్చాను. అంతకుముందు ఎలాంటి మాదిరీ లేని పరిస్థితుల్లో కొత్తగా అనువాదానికి పూనుకుని రాసిన ఆ అవార్డు రాష్ట్రంలో మొదటి తెలుగు అవార్డు అయ్యింది. ఎవరో ఒకరు పూనుకొని కొత్త పత్రాలను తయారు చేయాలి. అవే కాలక్రమేణ మెరుగుపడుతూ వాడుక భాషలోకి మారుతూ అందరికీ మార్గదర్శకమవుతాయి.

ప్రస్తుతం ఇంగ్లీషు నుంచి తెలుగులోకి, తెలుగు నుంచి ఇంగ్లీషులోకి కంప్యూటర్‌పై జరిగే అనువాదాలు సవాలక్ష లోపాలతో ఉన్నాయి. తెలుగువారు సాంకేతికంగా ఎంత ఎదిగినా నేటి వరకూ అనువాద యంత్రాల తయారీలో బాగా వెనకబడే ఉన్నారు. తెలుగులో ఉత్తమ సాఫ్ట్‌వేర్‌లు తయారు చేసిన వారికి, తెలుగు భాషకు ఉపకరించే సులభ ఉపకరణాలను రూపొందించిన వారికి తెలుగు వైతాళికుల పేరు మీద ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలి. తెలుగులోకి తర్జుమాలో తప్పులు రాకుండా మెరుగు పరిచే వారికి ఆర్థిక సాయం చెయ్యాలి. అనువాద ఉపకరణాలు లెక్కకు మిక్కిలిగా రావాలి. అనువాదంలో చోటు చేసుకున్న లోపాలను తప్పుల్నీ సరిదిద్దడానికి తెలుగు సాంకేతిక నిపుణులు అందరూ పూనుకోవాలి. ఈ అనువాద సామగ్రి ఎంత నాణ్యంగా అభివృద్ధి చెందితే తెలుగులో పాలన అంత నాణ్యంగా ఉంటుంది.

నిఘంటువుల్లో వాడుక భాష మన రెండు రాష్ట్రాల్లో తెలుగు మొదటి అధికార భాష అయితే, ఉర్దూ రెండో అధికార భాష. ఈ రెండు భాషల ప్రజల మధ్య వారివారి భాషా పదాల పరిచయం, అవగాహన, మరింత పెరగటానికి నిఘంటువులు ఎంతగానో తోడ్పడతాయి. ఉర్దూ-తెలుగు జాతీయాలు, తెలుగు-ఉర్దూ సామెతలు లాంటి పుస్తకాలు ముద్రించాలి. తెలుగు-ఉర్దూ, ఉర్దూ-తెలుగు నిఘంటువులు కావాలి. వక్ఫ్‌బోర్డు నిఖా నామాలు (వివాహ ధ్రువపత్రాలు) తెలుగు భాషలో కూడా ప్రచురించాలి. తెలుగు జాతీయాలూ, నుడికారాలూ, పదబంధాలూ కూర్చిన నిఘంటువుల అవసరమూ ఉంది. ఆన్‌లైన్‌లోనే నిఘంటువులకు కొత్త పదాలను జోడించే అవకాశం అందరికీ ఇవ్వాలి. ఏయే ప్రాంతాల్లో ఏ పదాన్ని ఎందుకు, ఎలా వాడుతుంటారో ఆయా ప్రాంతాల ప్రజలనే చెప్పనివ్వాలి. సరిగా ఉన్నట్లు భావించిన కొత్తపదాలను ఎప్పటికప్పుడు నిఘంటువుల్లో చేరుస్తూ పోవాలి.

ఖతులు, లిపి సమస్యలూ.. తిరుపతి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా 'శ్రీకృష్ణదేవరాయ, పెద్దన, తిమ్మన, సురవరం' తదితర 18 తెలుగు ఖతులను (ఫాంట్లను) విడుదల చేశారు. కానీ ఇప్పటికే 'అనూ, సూరి'లాంటి యూనీకోడేతర ఖతుల్లో ముద్రితమై ఉన్న విస్తారమైన తెలుగు సాహిత్యాన్ని తెలుగు యూనీకోడులోకి మార్చే మార్పిడి సాధనాలు కావాలి. పదాల శుద్ధియంత్రం, గుణింత, వ్యాకరణ పరిష్కార యంత్రం, సాంకేతిక నిఘంటువులు, మాండలిక నిఘంటువులు, డిజిటల్ నిఘంటువులు, అమరకోశాలు, పదశోధనా యంత్రాలు, ఉచ్చారణ పద ప్రయోగ నిఘంటువులు, లిపి బోధినులు, సాహిత్య శోధనా పరికరాలు, పదానుక్రమణికలు -ఇలా ఎన్నో రావాల్సిన అవసరం ఉంది. కంప్యూటర్ చదువులు కూడా తెలుగులో రావాలి. అలా చదివిన విద్యార్థులకు పోటీ పరీక్షల్లో ప్రోత్సాహకాలు ప్రకటిస్తే తెలుగు చాలాకాలం బతుకుతుంది. యంత్రాను వాదాలకూ, లిప్యంతరీకరణకూ, విషయాలకు అకారాది సూచికలను తయారు చేయటానికీ, వెతకటానికి అనుకూలంగా తెలుగులో కంప్యూటర్ వాడకం పెరగాలి.

లిపి సంస్కరణ తెలుగు లిపి సంస్కరణ జరగాలనే వాదనలు ఎప్పటి నుంచో ఉన్నాయి. "ముత్యాల్లాంటి తెలుగక్షరాలంటూ లిపి మీద లేనిపోని సెంటిమెంట్లు పెట్టుకోవడం మాని రోమన్ లిపిలో తెలుగును నేర్పితే మన దేశం ఆధునిక యుగంలోనికి ప్రవేశిస్తుంద"ని శ్రీశ్రీ లాంటివారూ సూచించారు. వత్తులు, గుణింతాల ఇబ్బందిని అధిగమించలేకనే చాలామంది బాగా తెలుగు వచ్చిన వాళ్లు కూడా తెలుగు టైపింగ్ జోలికి రాలేకపోతున్నారు. అయితే.. లిపి సంస్కరణ విధివిధానాల మీద ఇంకా విస్తృత చర్చ జరగాలి. చరిత్రలో తెలుగు లిపి ఎన్నోసార్లు మారింది. ప్రస్తుత కాలమాన అవసరాలకు తగ్గట్టు దాన్ని తీర్చిదిద్దుకోవడంలో తప్పులేదు.

అన్నిచోట్లా తెలుగుకే ప్రాధాన్యం

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో కూడా అన్నిస్థాయిల్లో పదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలో ఉండాలి. కూడిక, తీసివేత లాంటి తెలుగు పదాలకు బదులు సంకలనం, వ్యవకలనం, పరిచ్ఛేదము లాంటి సంస్కృత పదాలను వాడి తెలుగు మాధ్యమం అంటేనే పిల్లలు భయపడేలా చేశారు. పాఠ్యపుస్తకాలన్నీ వాడుక తెలుగులో రూపొందించాలి. అలాగే, రాజ్యాంగంతో సహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలను వాడుక భాషలోకి తేవాలి. ఎనిమిదో షెడ్యూల్‌లో పేర్కొన్న భాషలన్నింటినీ అప్పటికప్పుడు తర్జుమా చేసే విధంగా పార్లమెంటులో ఏర్పాటు చేయాలి. న్యాయస్థానంలో తీర్పులు అధికార భాషలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అధికార భాషను అమలు చెయ్యని అధికారుల మీద చర్యలు తీసుకునే అధికారాన్ని అధికార భాషా సంఘాలకి ఇవ్వాలి. అలాగే, తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరాలు రాయగల ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్ని మాత్రమే ప్రజలతో సంబంధమున్న కీలక స్థానాల్లో నియమించాలి. తెలుగు విశ్వవిద్యాలయం, అధికార భాషా సంఘం, తెలుగు అకాడమీ, అన్ని విశ్వవిద్యాలయాల్లోని తెలుగు విభాగాలు కలసికట్టుగా కృషి చేసి ఏయేటికాయేడు అవి తెలుగు భాషాభివృద్ధి కోసం ఏం చేశాయో, ఏం సాధించాయో ప్రగతి నివేదికలను బయటపెట్టాలి. ఈ సంస్థలన్నీ ప్రజల నుంచి సూచనలు తీసుకోవాలి. పరిపాలక గ్రంథాలు అంటే.. కోడ్లు, మాన్యువల్ లాంటివన్నీ తెలుగులో ప్రచురించి అన్ని కార్యాలయాలకు పంపాలి. సర్వీస్ కమిషన్ పోటీ పరీక్షలు,

శాఖాపరమైన పరీక్షలను తెలుగులో నిర్వహించాలి.

ఉద్యోగాలు, ప్రోత్సాహకాలు

'ఎవరి భాషను వాళ్లు కాపాడుకోవాలి - అధికార భాషగా అభివృద్ధి చేసుకోవాలి' అని రాజ్యాంగంలోని 345వ అధికరణ స్పష్టం చేస్తోంది. కోయంబత్తూరులో జరిగిన ప్రపంచ తమిళ మహాసభల్లో తమిళ మాధ్యమ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు సులభంగా లభించేలా కొన్ని తీర్మానాలు చేశారు. తమిళ మాధ్యమం అభ్యర్థులకు ఉద్యోగాలు దొరక్కపోతే ప్రజలు పిల్లల్ని తమిళ మాధ్యమంలో చదివించరనీ, ఎవరూ చదవని భాష నశిస్తుందనీ, తమిళం పదికాలాలపాటు బతకాలంటే ఆ భాషలో మాత్రమే చదివిన వారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్మానించారు. ఇందుకోసం ఓ అత్యవసర ఆదేశాన్నీ (ఆర్డినెన్సు) తెచ్చారు. శాసనసభలో, స్థానిక సంస్థల్లో, ప్రభుత్వ కార్పొరేషన్లు, కంపెనీల్లో తమిళ అభ్యర్థులకు 20 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని శాసించారు. తమిళనాడులో తెలుగు బడుల్లోనూ తమిళాన్ని తప్పనిసరి చేశారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్రానికి రాసే లేఖల్లోనూ తమిళభాషను వినియోగిస్తారు. జతగా ఆంగ్లంతో కూడిన లేఖను ఉంచుతారు. ఉత్తర ప్రత్యుత్తరాలను తమిళంలోకి అనువాదం చేసేందుకు 35 మంది అనువాదకులను నియమించారు. తమిళ మాధ్యమంలో చదివే వారికి ఉద్యోగాల నియామకాల్లో అయిదు శాతం మార్కులు అదనంగా ఇస్తున్నారు. తమిళం చదివిన వారికి మాత్రమే 12వ తరగతి వరకు ర్యాంకులు ఇస్తున్నారు. అలాగే, కన్నడ మాధ్యమంలో దేశంలో ఎక్కడ చదువుకుంటున్నా కర్ణాటక ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.2,500 ఉపకార వేతనాన్ని అందిస్తోంది. ఉద్యోగాల్లో అయిదు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోంది. ప్రాథమిక విద్య తప్పనిసరిగా ఆయా రాష్ట్రాల మాతృభాషల్లోనే నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చేందుకు రాజ్యాంగ సవరణ

కోరారు. ఈ కృషిని తెలుగు రాష్ట్రాలు ఎందుకు చేయలేకపోతున్నాయి?

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు రెండూ భారీ ఎత్తున గ్రూప్-2, 3 సర్వీసు ఉద్యోగాలు భర్తీ చేస్తున్నాయి. వీటిలో చాలా ఉద్యోగాలు ప్రజలతో మమేకమై వారితో ముఖాముఖి మాట్లాడుతూ, వారిమధ్యే నివసిస్తూ వారికి సేవలందించాల్సినవి. ఈ

ఉద్యోగులు ప్రజల సమస్యలను సరిగ్గా విశ్లేషించాలి.

గ్రామ సామాజిక, ఆర్థిక వ్యవస్థపై తగిన అవగాహన తెచ్చుకోవాలి. ప్రజాపరిపాలన పరిజ్ఞానం పెంచుకోవాలి. అక్కడి ప్రజలు వారి భాషలో చెప్పే సమస్యలు, పరిష్కారాలు, సూచనలు వినాలి, రాయగలగాలి. ఈ నైపుణ్యాలన్నీ ప్రజల భాషలో తెలుగు మాధ్యమంలో చదివిన వారికే ఎక్కువగా ఉంటాయి. కాబట్టి.. గ్రూప్-1, గ్రూప్-2, 3 లాంటి సర్వీసు ఉద్యోగాల్లో తెలుగు మాధ్యమంలో చదివిన వారికి గతంలో ఇచ్చిన మాదిరే అయిదు శాతం ప్రోత్సాహక మార్కులు ఇవ్వాలి. తమిళనాడు మాదిరిగా ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్ ఇస్తే, అప్పుడు తెలుగులో కార్యాలయ వ్యవహారాలు నడిపేవాళ్లు రంగప్రవేశం చేస్తారు. కొంతవరకైనా కార్యాలయాల్లో తెలుగు బతుకుతుంది. ఉద్యోగాలొస్తాయన్న ఆశతో కొంతమందైనా తెలుగులో చదువుతారు. తెలుగులో చదివిన అధికారులు కార్యాలయాల్లో జరిగే పనులన్నింటికీ 'కొత్త పదాలు' పుట్టిస్తారు. తెలుగు పదకోశాలు అమలవుతాయి. పరిపాలనకు పనికొచ్చే శాస్త్రీయ పాలనా తెలుగు తయారవుతుంది. అధికార భాషగా తెలుగు అమలు కావాలంటే తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థుల్ని ప్రోత్సహించి అధికారులుగా చేయాల్సిందే.

కొరడా కూడా అవసరమే రోజువారీ పాలనాపరమైన కార్యకలాపాల్లో ప్రతిపాదన తయారు దశ నుంచి చట్టసభల్లో బిల్లు ప్రతిపాదన వరకు అన్నీ తెలుగులోనే జరపాలి. సచివాలయ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు, ఉత్తర్వులు అన్నీ విధిగా తెలుగులోనే ఉండాలి. తెలుగు అమలును నిర్లక్ష్యం చేసే అధికారుల మీద చర్యలు తీసుకోవాలి. వ్యాపార సంస్థలు, దుకాణాల మీద కన్నడ భాషలో నామఫలకాలు ఏర్పాటు చేయకపోతే వాటి లైసెన్సులు రద్దు చేసే అధికారం కన్నడ అధికార భాషా సంఘానికి ఉన్నట్లుగా, తెలుగు అధికార భాషా సంఘానికి కూడా ఉండాలి. మండలస్థాయి నుంచి సచివాలయం వరకు అధికార భాషను అమలు చెయ్యని అధికారులపై చర్యలు తీసుకునే అధికారం అధికార భాషా సంఘానికి ఇవ్వాలి. ప్రతిజిల్లాకు అధికార భాష అమలు పర్యవేక్షకుణ్ని నియమించాలి. తెలుగులోనే ఉత్తర్వులు, ఉత్తర ప్రత్యుత్తరాల నిర్వహణకు అవసరమైన పదజాలం, వాక్య నిర్మాణ విధానాలపై తగిన

శిక్షణ ఎప్పటికప్పుడు అందించాలి. ఇవన్నీ జరిగినప్పుడు మాత్రమే పరిపాలనా భాషగా తెలుగు పక్కాగా అమలవుతుంది. ఈ లక్ష్యం సాధ్యమైనంత త్వరగా సాకారం కావాలంటే పాలకులు, అధికారులు అమ్మభాష పట్ల గట్టి సంకల్పం చెప్పుకోవాలి. దాన్ని తు.చ. తప్పక పాటించాలి.

పాలనాభాషకు ఉండాల్సినంత పదసంపదను ఎన్నేళ్లు గడిచినా సమకూర్చలేకపోతున్నాం. అనువాదకులు తేట తెలుగుకు బదులు సంస్కృతం వాడి భయపెడుతున్నారు. కాలగమనంలో కొత్తకొత్త ఆంగ్లపదాలే మనకు అబ్బుతున్నాయిగానీ, కొత్త తెలుగు పదాలుగానీ, పాతవైనా కొత్తగా వాడకంలోకి రావడం లేదు. ఆధునిక అవసరాలకు ధీటుగా తెలుగు భాష తయారు కావాలి. ఆంగ్లంలో ఉన్న సౌలభ్యాలన్నీ తెలుగుకూ కల్పించాలి. పూర్తిస్థాయి పాలనాభాషగా తెలుగును తీర్చిదిద్దుకోవాలి.

తమిళ మాధ్యమంలో డిగ్రీ వరకూ చదివిన అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 20 శాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని మద్రాసు హైకోర్టు కూడా సమర్థించింది. ప్రభుత్వోద్యోగాలకు నేరుగా జరిపే నియామకాల్లో తమిళ మాధ్యమ అభ్యర్థులకు ఉద్యోగాలు రిజర్వు చేయడంలో ఎలాంటి తప్పూ లేదని తేల్చేసింది. రాజ్యాంగంలోని 345 అధికరణను ఉట్టంకిస్తూ ఎవరి భాషను వాళ్లు కాపాడుకోవాలని, ఆయా రాష్ట్రాల్లో పాలనా భాషగా అధికార భాషగా అభివృద్ధి చేసుకోవాలని తెలియజేసింది.

(ఈనాడు తెలుగు వెలుగు మాసపత్రిక డిశంబర్ 2017)


జన భాషకే జేజేలు!

2. జనభాషకే జేజేలు

మాటకు వాడుక గదా ప్రాణము ?

తెలుగు వారి కున్నంత పరభాషా సహనం, ఈ దేశంలో మరెవరికీలేదంటే అతిశయోక్తి కాదేమో. ఈ సహనం వలనే అనేక పరభాషా పదాలు తెలుగులోకివచ్చి స్థిరపడి దాని స్వంతమే అన్నట్లయిపోయాయి. అచ్చ తెలుగులో మాట్లాడబూనటం సాహసకార్యమే. గిడుగువారు ఇలా అన్నారు. "పండితులు పుస్తకాలు ఏ భాషలో వ్రాసినా శాస్త్రాలు ఎలాగు కల్పించుకున్నా లౌకిక భాషను నిర్మూలము చేయలేరు. అది వారి నోట్లోనే కాపురముంటుంది. నాలుక మీద నెక్కి నాట్యమాడుతూ ఉంటుంది. సలక్షణముగా వృద్ధి పొందుతుంది."తెలుగులో మిళతమైపోయిన ఉర్దూ ఆంగ్ల పదాలను పండితులు పుస్తకాల్లోంచి ఏరి పారవేయవచ్చు గాని జనం నోళ్ళలోంచి తీయలేరు.

లోకయాత్ర కొరకు లౌకిక భాషలు
పుట్టి ప్రజల నోట పొంది యుండు
జీవలోక మందు జీవించు భాషలు
జనుల తలపు దెలుపు సాధనములు.

మాల మాటయేని మాదిగ మాటేని
నాటిదేని గాక నేటిదేని
ఈడదైన నేమి యాడదైనను నేమి
ఏడదైన జెల్లు వాడికయిన

వాడిక గద మాట ప్రాణంబు మానంబు
వాడనట్టి మాట పాడువడును
చెల్లుబడిని బట్టి చేకొండ్రు లోకులు
మాడలైన కవుల మాటలైన

లోక సిద్ధమైన లౌకిక పదములు
సార్థకంబు లెల్ల జనుల కగును
మాసినట్టి మాట మరి మరి పరికింప
కోశమందెతెలియు కోవిదులకె.

పుస్తకాల లోన ప్రుచ్చిన మాటలు
ప్రాతలైన వాని ద్రవ్వి యెత్తి
నేడు ఎల్లవారు వాడ గావలెనన్న
గొంతు కడ్డపడదె క్రొత్త మాట? ---- గిడుగు బాలకవి శరణ్యము

ప్రపంచంలో ప్రతి ఏటా ఎన్నో భాషలు రక్షించే దిక్కులేక నశిస్తున్నాయి. వాటిలో తెలుగు కూడా త్వరలో చేరకూడదు. ఆంగ్లేయులు ఎన్ని ఎత్తులువేసి తమ భాషను బలిపిస్తున్నారో అందులో శతశాతం అన్నా తెలుగు వాళ్ళు కృషి చెయ్యాలి. దిక్కులేని వాళ్ళకు దేవుడే దిక్కు అన్నట్లు ఈ ప్రపంచంలో ఎన్నో దిక్కుమాలిన బాషలకు ఇంగ్లిషే దిక్కయింది. అవసరం అలాగా వచ్చింది మరి.

బడి, గుడి, తీర్పు ఈ మూడూ ఇంగ్లీషులో నడిచేలా ఆంగ్లేయులు ముందు తమ దేశంలో అమలు చేశారు. తరువాత ఇతర దేశాల మీద పడ్డారు. భాష విషయంలో ఇంగ్లీషులో వాళ్ళు ఇంటగెలిచాకే రచ్చ గెలిచారు. తెలుగు వాళ్ళతో పాటు మరెన్నో భాషల వాళ్ళు ఇంట గెలవలేదు. తమ బడుల్నీ, గుడుల్నీ, తమ తీర్పుల్నీ తమ భాషల్లోకి తెచ్చుకోలేదు. అందుకే వారివి ఆంగ్ల పాలిత ప్రదేశా లుగా మారిపోయాయి.

మాతృభాష అంటే పసిపిల్ల వాడికి తల్లి ఉగ్గుపాలతో పాటు రంగరించి పోసే భాష.మమ్మీ,డాడీ,ఆంటీ,అంకుల్,బ్యాగు,బుక్కు,స్లేట్‌పెన్సిల్ లాంటి మాటలు తెలుగు తల్లులు తమ పిల్లలకు రంగరించి పోస్తున్నారు. బయట స్కూలు, ఆఫీసు, మార్కెట్టు, కోర్టుల్లో ఎన్నెన్నో ఆంగ్ల పదాలు ఎడతెరిపి లేకుండా వాడుతున్నారు. మాటకు వాడుకే గదా ప్రాణం? వాడకం అంతా ఆంగ్లపదాల్లో జరుగుతూఉంటే తెలుగు గ్రంథానికి పరిమితమై పోయింది. కవులు, సాహితీవేత్తలు మాత్రమే భాష గురించి బాధ పడుతున్నారు. పాలక భాషకు ఉండవలసినంత


పదసంపద ఎన్నేళ్లు గడిచినా సమకూర్చలేక పోతున్నారు. అనువాదకులు తేటతెలుగుకు బదులు సంస్కృతం వాడి భయపెడుతున్నారు. కాలగమనంలో కొత్త కొత్త ఆంగ్లపదాలే మనకు అబ్బు తున్నాయిగానీ, కొత్త తెలుగు పదాలుగానీ, పాతవేగాని కొత్తగా వాడకంలోకి రావడం లేదు.

వేలాది ఆంగ్ల పదాలు మన తెలుగు ప్రజల నాలుకలపై నాట్యమాడుతూ, మన పదాలే అన్నంతగా స్థిరపడిపోయాయి. ఈ పదాలను విడిచిపెట్టి మనం తెలుగులో సంభాషణ చేయలేము. చేసినా ప్రజలకు అర్థంగాదు. ఉర్దూ, సంస్కృత, ఆంగ్ల పదాలెన్నింటినో తెలుగు తనలో కలుపుకుంది. అలాగే తెలుగు ప్రజల వాడుకలో బాగా బలపడిన, ఇక ఎవరూ పెకలించలేనంతగా పాతుకుపోయిన, ఇంగ్లీషు పదాలను మన తెలుగు డిక్షనరీలో చేర్చటం వల్ల మన భాష తప్పక బలపడుతుంది. వాడుక పదాల సంపద భాషకు జీవమిస్తుంది. అవి పరభాషపదాలు కూడా కావచ్చు. మనం తెలుగును సరిగా నేర్చుకోక ముందే మనకు ఇంగ్లీషు నేర్పారు. వందలాది ఏళ్ళు మనం ఇంగ్లీషును గత్యంతరం లేక హద్దు మీరి వాడినందు వల్ల, అది మన భాషాపదాలను కబళించి తానే తెలుగై మనలో కూర్చుంది. మన ఆత్మలను వశం చేసుకుంది. ఇకఇప్పుడు ఈ ఇంగ్లీషు పదాలను నిర్మూలించడం మన తరం కాదు. వాటిని మన పదాలుగా అంగీకరించడమే మంచిది. ఏఏటికాయేడు మన నిఘంటువుకి పదసంపద సమకూర్చాలి .

నిఘంటువులలో వాడుక భాష పదసంపద పెరగాలి - వాడుకభాష లోకి చట్టాలు మారాలి మన రాష్ట్రంలో తెలుగు మొదటి అధికార భాష కాగా ఉర్దూ రెండవ అధికార భాష. ఈ రెండు భాషల ప్రజల మధ్య వారివారి భాషా పదాల పరిచయం, అవ గాహన, మరింత పెరగటానికి నిఘంటువులు ఎంతగానో తోడ్పడతాయి. ఉర్దూ-తెలుగు నిఘంటువు, ఉర్దూ-తెలుగు జాతీయాలు, తెలుగు-ఉర్దూ సామెతలు లాంటి పుస్తకాలు ఎక్కడా అమ్మకానికి దొరకడంలేదు. ముద్రించాల్సిన అవసరంఉంది. ముషాయిరాల కంటే ముఖ్యమైన తెలుగు-ఉర్దూ, ఉర్దూ తెలుగు నిఘంటువులు కావాలి. వక్ఫ్‌బోర్డు నిఖా నామాలు (వివాహ ధ్రువపత్రాలు) తెలుగు భాషలో కూడా ప్రచురించాలి. తెలుగు జాతీయలూ, నుడికారాలూ, పదబంధాలూకూర్చిన నిఘంటువుల

అవసరంఉంది. ఆన్‌లైన్‌లోనే నిఘంటువులకు కొత్త పదాలను జోడించే అవకాశం అందరికీ ఇవ్వాలి. ఏయే ప్రాంతాల్లో ఏ పదాన్ని ఎందుకు, ఎలా వాడుతుంటారో ఆయా ప్రాంతాల ప్రజలనే చెప్పనివ్వాలి. సరిగాఉన్నట్లు భావించిన కొత్త పదాలను ఎప్పటికప్పుడు నిఘంటువుల్లో చేరుస్తూ పోవాలి. మన నిఘంటువుల సైజు పెరగాలి. అవి జన బాహుళ్యానికి వాడకంలోకి విస్తారంగా వస్తూనే ఉండాలి. వాడుక భాషలో నానా భాషలూ కలగాపులగంగా ఉంటాయి. అయితే అవన్నీ ప్రజలకు బాగా అర్థమౌతాయి.పరభాషా పదాలనే కారణంతో ఇప్పుడు తెలుగు వాడకంలోంచి సంస్కృతం, ఇంగ్లీషు, ఉర్దూ పదాలను తీసివేయకూడదు, తీసివేయలేము. ఎందుకంటే అవి మనభాషలో అంతర్భాగాలై పోయాయి. అక్కరలేని ఆపరేషన్ ఎవరు చేయించుకుంటారు? చేసినా గాయాలవడం తప్ప మరే మేలూ కలుగదు. అందువలన ఈ సంకర తెలుగు భాషలోనే ఆఫీసుల్లో ఫైళ్ళు నడిపితే అదే పదివేలుగా భావించాలి.

ఛాందసవాదులు-వాళ్ళు చెయ్యరు, ఇంకొకళ్ళను చేయనివ్వరు. ఒకవేళ ఈ పనిని వాళ్ళకప్పజెబితే ఎవరికీ అర్థంగాకుండా పాడుచేస్తారు. ప్రజలు ఇంతకంటే ఇంగ్లీషే నయమని వాపోయేలా చేస్తారు. మన శాసన సభలో ఎమ్మెల్యేలు ఈ మూడు భాషల పదాలు కలగలిపి మనోరంజకంగా మాట్లాడుతున్నారు. అదే నేటి తెలుగు, వాడుక తెలుగు. వారు అడిగింది అడిగినట్లు తెలుగు లిపితో సాగదనుకుంటే ఆంగ్లలిపినే వాడుకోండి. మన మాటముఖ్యం. వాళ్ళు ప్రజాప్రతినిధులు. వాళ్ళు మాట్లాడుతున్నది మనప్రజలభాష. ఆభాషలో, యాసలోజీవోలురావాలి. అప్పుడేతెలుగుఅధికారభాషగావి రాజిల్లుతుంది. వేలాది పరభాషా పదాలను ఆక్స్ ఫర్డ్ డిక్షనరీలో ఇంగ్లీషువాళ్ళు కలుపుకుంటూ రావటానికి కారణం ఏమిటి? ఆంగ్లేతర భాషా పదాలను తమ ఆంగ్ల నిఘంటువులలోకి చేర్చుకోటానికి ఆంగ్లేయులు ఏమాత్రం సిగ్గుపడలేదు. ఒకవైపు తమ భాషను ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేస్తూనే, అన్ని ఇతర భాష ల్లో బాగా ప్రాచుర్యం పొందిన వాడుక పదాలను తమ నిఘంటువుల్లోకి తీసుకొని తమ పద సంపద పెంచుకున్నారు. సామాన్య తెలుగు జనం ఈ పని ఏనాటినుండో చేస్తున్నారు. తెలుగు నిఘంటు కర్తలు కూడా ఆలోచించాలి. (ఆంధ్రప్రభ 29.11.2017)


చిన్న భాషల్ని మింగేస్తున్న
పెద్ద భాషలు

3. చిన్నభాషలు బలౌతున్నాయి

గత పది సంవత్సరాలలో 516 భాషలు దాదాపుగా అంతరించి పోయాయట. చాలా కొద్దిమంది పెద్దవాళ్ళు మాత్రమే ఆ భాషలు మాట్లాడుతున్నారట. ప్రస్తుతం 7299 భాషలు ప్రపంచంలో వాడకంలో ఉన్నట్లు గుర్తించిన సంస్థలు, వాటిలో సగానికి సగం రాబోయే తరానికి అందకుండా అంతరించిపోయే దశలో ఉన్నాయని చెబుతున్నాయి. అంతరించిపోయే దశలో ఒక భాష ఉంది అనటానికి ప్రాతిపదికలు ఏంటంటే `1. ఆ భాషను పెద్దవాళ్ళు పిల్లలకు నేర్పరు. 2. రోజువారీ వ్యవహారాల్లో వాడరు. 3. ఆ భాష మాట్లాడే జనం సంఖ్య తగ్గిపోతుంటుంది. 4. ప్రభుత్వం, దేవాలయం కూడా ఆ భాషను ఉపయోగించవు. 5. ఆ భాషను కాపాడుకోవాలని ప్రజలు సంఘటితంగా ఉద్యమించరు. 6. ఆ భాష పట్ల గౌరవ భావం ప్రజల్లో ఉండదు. 7. ఆ భాష అక్షరాలను గానీ, సాహిత్యాన్ని గానీ ఆ ప్రజలు విరివిగా వాడరు.

Ethnologue.com లో ఈ అంతరించిపోతున్న భాషల చిట్టా ఉంది. ఆఫ్రికాలో 46, అమెరికాలో 170, ఆసియాలో 78, ఐరోపాలో 12 పసిఫిక్‌లో 210 భాషలు ఈ చిట్టాలో ఉన్నట్టు తెలిపారు. ఇక ఇండియా విషయానికి వస్తే 17 భాషలు అంతరించాయట. అవి :

1. పుచిక్‌వార్: అండమాన్‌దీవుల్లో 2000 సంవత్సరంలో కేవలం 24 మంది షెడ్యూలు తెగల వాళ్ళు మాట్లాడుతున్నారు. ఈ భాషను హిందీ మింగేసింది.

2. కామ్యాంగ్: 2003 నాటికి అస్సాంలో 50 మంది ఈ భాషను మాట్లాడేవాళ్ళు మిగిలారు. కాస్త ముసలివాళ్ళు మాత్రం తాయ్‌లిపిలో ఈ భాష రాసేవాళ్ళట. ఇదీ గిరిజన భాషే. అస్సామీ భాష దీన్ని మింగింది.

3. పరెంగా : 2002 నాటికి ఒరిస్సా, కోరాపుట్‌జిల్లాల్లో 767 మంది మిగిలారు. ఈ భాష మీద మన తెలుగు విశ్వవిద్యాలయం వాళ్ళు కూడా పరిశోధన చేశారు. ఈ భాష మాట్లాడే 'గడబ' అనే గిరిజన తెగ క్రమేణా ఆదివాసీ ఒరియా భాషలోకి మారిపోయారు.

4. రూగా : మేఘాలయలోని ఈ భాష నామరూపాల్లేకుండా అంతరించి పోయింది. మిగిలిన కొద్దిమంది గారో భాషలోకి మళ్ళారు.

5. అహోం : అస్సాం ప్రాంతంలో పూర్వం 80 లక్షల మంది మాట్లాడే ఈ భాషను మాట్లాడే వాళ్ళే లేరు. కేవలం మంత్ర తంత్రాల్లో మాత్రమే ఈ భాషను వాడుతున్నారు.

6. అకాబియా : అండమాన్‌దీవుల్లోని ఈ భాషలు అంతరించి పోయాయి. అవి : 7. అకాబో, 8. అకాకరి, 9. అకాజెరు, 10. అకాకెడి, 11. అకాకోల్, 12. అకాకోరా, 13. అకర్‌బాలె, 14. ఒకొజువోయ్.

15. పాలి : బౌద్ధమత సాహిత్యం ఈ భాషలో ఓనాడు వికసించింది. 1835లో బైబిల్‌లోని కొత్త నిబంధన కూడా ప్రచురించారీ భాషలో. ఇండియాలో నాశనమైపోయింది. శ్రీలంక, బర్మా, టిబెట్‌లలో ఇంకా కొంతమంది ఈ భాష మాట్లాడే వాళ్ళున్నారంటారు.

16. రంగకస్: ఉత్తరాంచల్‌ప్రాంతాల్లో జొహరి అని కూడా పిలిచే ఈ భాషస్తులు ఓ వెయ్యి మంది ఉండొచ్చట. ఈ భాషాపోయింది.

17. తురుంగ్: అస్సాం గొలాగట్‌జిల్లాలోని ఈ గిరిజన జనం మెల్లగా సింగ్‌పో భాషలోకి మళ్ళారట.

ప్రతి రెండు వారాలకు ఒక భాష చచ్చిపోతోందని భాషా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రపంచంలోని 6800 భాషలలో 90 శాతం భాషలు ఈ శతాబ్దంలోగా అంతరించిపోతాయట. ఎందుకంటే వాటిలో సగం భాషలు మాట్లాడేవారు 2500 మంది కంటే తక్కువగా ఉన్నారట. వరల్డ్‌వాచ్‌సంస్థ హెచ్చరిక ఇది. యుద్ధాలు, హత్యాకాండలు, ప్రకృతి బీభత్సాలు పెద్ద భాషల్ని ఆశ్రయించటం లాంటివన్నీ ఇందుకు కారణాలట. ఒక తరం నుండి మరో తరానికి భాషను తరలించటానికి కనీసం లక్ష మందైనా ఆ భాష మాట్లాడే వాళ్ళుండాలని లేకపోతే ఆ భాష అంతరిస్తుందని యునెస్కో ప్రకటించింది.

ఏ మతం వాళ్ళు ఎంత మంది పెరిగారు. ఎంతమంది తరిగారు లాంటి లెక్కల్ని తప్పుల తడకలతో హడావుడిగా పార్లమెంటుకు అందజేసి, తరువాత నాలుక కరచుకున్న కేంద్ర గణాంక శాఖ 2001 నాటి భాషల వారీ జనాభా లెక్కల్ని ఇంతవరకూ మన ప్రజల ముందు ఉంచలేదు. భాషల అభివృద్ధికి, పంచవర్ష ప్రణాళికల్ని ఆపుచేసి దశ వర్ష ప్రణాళికగా మార్చుకోవాల్సిందేనా? భాషల జనాభా వివరాలు చెప్పటానికి ఆరేళ్ళు సరిపోలేదా? 90 లక్షల మంది గుడ్డివాళ్ళు,

కోటీనలభై లక్షల మంది చెవిటి వాళ్ళకు లేని బాధ మీకెందుకంటున్నారు సెన్సస్‌వాళ్ళు. ఇప్పుడు 2001 జనాభా లెక్కల్లో 428 భాషలు నమోదయితే వాటిలో 415 వాడకంలో ఉంటే 13 భాషలు నశించిపోయాయట. ఎనిమిదవ షెడ్యూలు లోకి మరో నాలుగు భాషలు కలిపినందున, షెడ్యూలు భాషల సంఖ్య 22కు పెరిగింది. వాటి వివరాలు పట్టికలో చూడండి.

(ఆంధ్రప్రభ 15.12.2017)


VIJAYA LIPI

ప్రతిపాదిత విజయలిపి ఇదే

తెలుగు–కన్నడం క'లిపి'!

» 'విజయ లిపి'కి రూపకల్పన.. ఆవిష్కరించిన సత్యసాయి

బెంగళూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు, కన్నడ.. లిపి చూస్తే రెండూ ఒకటేనా అనిపిస్తాయి. పలుకులో తేడా ఉంది. కానీ లిపిలో సారూప్యత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఐదారు అక్షరాలు మినహా తక్కినవన్నీ దాదాపు ఒకటే. ఈ సారూప్యతని ఆధారం చేసుకొని ఉమ్మడి లిపి తయారైంది. దీనికి మూలకారణం.. సత్య సాయిబాబా. రెండు భాషల వర్ణమాలల మధ్య సారూప్యతను గమనించిన బాబా.. రెండింటికీ కలిపి ఒకే లిపి ఉంటే బాగుంటుందని తలపోశారు. తన భక్తుడు, పారిశ్రామిక వేత్త అయిన డీకే ఆదికేశవులు నాయుడుకు ఆ బాధ్యత అప్పగించారు. కర్ణాటక గవర్నర్‌గా పని చేసిన పెండేకంటి వెంకట సుబ్బయ్య.. సత్య సాయి బాబా సూచనల మేరకు ఆయన ఆదికేశవులునాయుడుకు అండగా నిలిచారు. బెంగళూరు వర్సిటీ చాన్సలర్ హోదాలో ఉమ్మడి లిపిపై పరిశోధనకు వెంకట సుబ్బయ్య గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ప్రొఫెసర్ చిదానందమూర్తి అధ్యక్షతన అప్పటి బెంగళూరు వర్సిటీ తెలుగు విభాగాధిపతి తంగిరాల వెంకటసుబ్బారావు ఉపాధ్యక్షుడిగా 10 మంది భాషా నిపుణులతో ప్రత్యేక కమిటీ వేశారు. ఉభయ భాషల ప్రజలకు ఆమోదయోగ్యమైన రీతిలో ఆ కమిటీ రూపొందించిన లిపికి.. శ్రీకృష్ణదేవరాయల స్మృతి చిహ్నంగా.. విజయనగర సామ్రాజ్యాన్ని జ్ఞప్తికి తెచ్చేలా 'విజయ లిపి' అని పేరు పెట్టారు. బాబా చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఆయన గతించిన తర్వాత 'విజయ లిపి'ని పట్టించుకొనే వారే లేకుండా పోయారు. ఉభయ రాష్ట్రాల భాషా మంత్రిత్వ శాఖలు చొరవ తీసుకుని, విజయ లిపికి పట్టం కట్టాలని భాషాప్రియులు కోరుతున్నారు.

విజయలిపి ఆవిష్కర్తలు పుట్టపర్తి సాయిబాబా, డీకే ఆదికేశవులు నాయుడు,

ఆంధ్రజ్యోతి Mon, 18 December 2017
epaper.andhrajyothy.com//c/24612744


ప్రాంతీయ భాషలు చచ్చిపోవాలా?

UPSC

4. ప్రాంతీయ భాషలు చచ్చిపోవాలా?

మన దేశం భిన్న భాషలు, సంస్కృతులు గల దేశం. దేశ పాలనా నిర్వహణలో అన్ని ప్రాంతాల వారికీ ,అన్నీ భాషల వారికీ చోటివ్వాలి. గ్రామీణ అభ్యర్థులకు అన్యాయం కలిగేలా, కార్పొరేట్ విద్యాలయాల్లో ఆంగ్లమో, హిందీనో చదువుకున్నవారికి మాత్రమే ప్రయోజనం చేకూరేలా ప్రక్రియ సాగకూడదు. సివిల్ సర్వీసులకు ఎంపికయ్యేవారిలో ఇంగ్లిష్ ప్రావీణ్యం అడుగంటుతున్నదని 'కాలం చెల్లిన విధానాలకు' స్వస్తిపలుకుతున్నామని యూపీఎస్సీ కుంటిసాకులు చెబుతున్నది . ఇంగ్లిష్‌లో ప్రావీణ్యమే అభ్యర్థి జయాపజయాలను నిర్ణయించే స్థితి కల్పిస్తోంది. ఐ.ఏ.యస్.లు పనిచేయాల్సింది అమెరికాలో కాదు. మన దేశంలోనే, వ్యవహరించాల్సిందీ ఈ దేశ ప్రజలతోనే.ఇంగ్లిష్ పరి జ్ఞానంకన్నా సమస్యలను గుర్తించడంలో, వాటికి పరిష్కారాలను వెదకడంలో,ప్రజానీకానికి మేలు చేకూర్చడంలో వారికి ఉండే సమర్ధతను పరీక్షించాలి. వారిలో సమయస్ఫూర్తి, చొరవ, హేతుబద్ధత, అంకితభావం, దృఢ సంకల్పం, నైతికవర్తన వంటివి ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేయాలి.యూపీఎస్సీ హిందీకి ఇంగ్లిష్‌కు పెద్దపీట వేస్తున్నది. పరీక్షను ప్రాంతీయ భాషలో రాయొచ్చంటున్నారుగానీ ప్రశ్నపత్రాన్ని మాత్రం ఇంగ్లిష్ లేదా హిందీలో ఇస్తున్నారు. ఇంగ్లిష్ భాషా పరిజ్ఞానంపై కఠిన పరీక్ష పెడుతోంది.

1979 కి ముందు ధనవంతులు, ఉన్నత వర్గాలవారికే సివిల్ సర్వీసెస్ అందుబాటులో ఉండేవి. ప్రాంతీయ భాషల్లోనూ సివిల్స్ రాయడానికి 1979లో అవకాశం కల్పించినప్పటి నుంచి భారతదేశ భాషలన్నిటికీ ప్రాతినిధ్యం దక్కింది. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షల్ని రాజ్యాంగం గుర్తించిన 22 భాషల్లో నిర్వహిస్తున్నారు. తెలుగు మాధ్యమంలో యూపీఎస్సీ స్థాయి పుస్తకాలు లేవు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన తెలుగు అభ్యర్థులు పోటీ పడలేకపోతున్నారు. 2013లో తెలుగు మాధ్యమ అభ్యర్థి ఒక్కరైనా

విజయం సాధించలేదు. రెండు మూడుసార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లిన తెలుగు మాధ్యమం అభ్యర్థులు 2013 ప్రాథమిక పరీక్షలోనే తప్పారు. 2012 ఆగస్టులో నిగ్వేకర్ కమిటీ సీశాట్ పేపర్‌వల్ల గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు నష్టం వాటిల్లుతోందని స్పష్టీకరించింది.

పనిభారం ఎక్కువైనందువల్ల రాజ్యాంగం గుర్తించిన అన్ని భాషల్లో పరీక్షలు నిర్వహించలేక ప్రాంతీయ భాషల్లో పరీక్షలకు హాజరయ్యే గ్రామీణ అభ్యర్థులను దెబ్బతీసిందట ఆంగ్ల మాధ్యమంలో వృత్తివిద్య అభ్యసించేవారితో గ్రామీణ అభ్యర్థులు పోటీపడలేక ప్రాంతీయ భాషల అభ్యర్థులు పరీక్షలకు శాశ్వతంగా దూరమయితే తమకు పనిభారం తగ్గిపోతుందన్నది యూపీఎస్సీ దురాలోచన.

ప్రాంతీయ భాషల్లో ప్రశ్నపత్రాలు ఉండాలని కోరడం ఆయా రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన హక్కు. సివిల్ సర్వీసు అధికారులు ఉత్తరప్రత్యుత్తరాలను ఇంగ్లిష్‌లోనే సాగించాలి కాబట్టి ఇంగ్లిష్ భాషపై పట్టులేని అభ్యర్థులు అక్కరలేదనే పద్ధతిలో పరీక్షలు రూపొందించారు. ఇంగ్లిషు,హిందీ అసలు రాని అన్నాదురై ,ఆంధ్ర భోజుడుగా పేరెన్నికగన్న శ్రీకృష్ణ దేవరాయలు,మొఘల్ చక్రవర్తుల్లో అత్యుత్తమ పాలకుడిగా చరిత్రలో నిలిచిన అక్బర్, మైసూరు మహారాజు హైదర్ అలీ ఏమీ చదువుకోకపోయినా సమర్థులైన పాలనాదక్షులుగా గణుతికెక్కారు. ప్రజాప్రతినిధులకు తప్పనిసరికాని ఆంగ్ల భాషా ప్రావీణ్యత సివిల్ సర్వెంట్లకు మాత్రం ఎందుకు?విదేశీ ఇంగ్లిష్ కోసం దేశీయ భాషలను అణగదొక్కడం అన్యాయం.

వాస్తవానికి తెలుగుతో పాటు రాజ్యాంగం గుర్తింపు పొందిన ప్రాంతీయ భాషల్లో సివిల్స్ మెయిన్ పరీక్షలు రాయటానికి వీల్లేదనే నిర్ణయాన్ని 2013 లోనే ప్రభుత్వం రద్దు చేసింది. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గుర్తింపు పొందిన అన్ని ప్రాంతీయ భాషల్లో సివిల్స్ మెయిన్ పరీక్షలు రాయవచ్చని ప్రకటించింది. కనీసం 25మంది విద్యార్థులు ఉంటే తప్ప ప్రాంతీయ భాషలో పరీక్ష నిర్వహించటం జరగదన్న నిబంధనను రద్దు చేశారు. అదేవిధంగా అభ్యర్థులు ఏ భాషలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారో అదే భాషలో సివిల్స్ మెయిన్ పరీక్షలు రాయాలన్న నిబంధన కూడా వర్తించబోదని స్పష్టం చేశారు. ఇంగ్లీష్‌లో 100 మార్కుల వ్యాసరచనను ఉపసంహరించారు.

సి శాట్ అంటే సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ అనే ప్రాథమిక పరీక్ష. ఈ పరీక్షలో పాస్ అవ్వాలంటే ఇంగ్లిష్ బాగా వచ్చి ఉండాలి. మెయిన్ పరీక్షలు హిందీ వాళ్ళకి అనుకూలంగా ఉన్నాయి. తెలుగు జ్ఞానాన్ని ఏ దశలోనూ పరీక్షించరు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీషు, హిందీలో మాత్రమే ఇస్తున్నారు. తెలుగుతోపాటు ఇతర ప్రాంతీయ భాషల్లో ప్రశ్నపత్రం ఉండదు. ఇంగ్లీషులోనే ప్రశ్నపత్రాన్ని చదివి, అర్థం చేసుకుని పరీక్ష రాయాల్సిందే. హిందీ రాష్ట్రాల విద్యార్థులకు ఈ సమస్య లేదు.

తెలుగు అభ్యర్థులు ఇంగ్లీషునో హిందీనో ఆశ్రయించక తప్పని పరిస్థితి దాపురించింది. ప్రాంతీయ అభ్యర్థులు ఎవరూ తమ తమ మాతృభాషల్లో పరీక్షలు స్వేచ్ఛగా రాయలేని పరిస్థితిని కల్పించారు. ప్రశ్నా పత్రాలను ఎలా ఇచ్చినా ఎన్ని మార్పులు చేసినా అవి ఆయా ప్రాంతీయ భాషల్లో ఉంటే మిగతా భాషల వాళ్ళు హిందీ వాళ్ళతో సమానంగా పోటీపడి నెగ్గుతారు. తెలుగు విద్యార్థులు పోటీలో నిలదొక్కుకోవాలంటే తెలుగులోనే ప్రశ్నాపత్రం ఉండాలి. తెలుగులో పరీక్ష రాసేందుకు 1979 నుంచి ఉన్న అవకాశం ఇప్పుడు ఎందుకు తీసేయాలి? ఇది హిందీ దురభిమానం కాదా?హిందీలో ఉన్నట్లే తెలుగులో ప్రశ్నాపత్రం ఎందుకు ఉండకూడదు? భారతదేశం అంటే హిందీ దేశమా? అనేక భాషలున్న దేశమా?

డిగ్రీ తెలుగులో చదవాలి

ప్రాంతీయ భాషలో తగిన అవగాహన లేకున్నా ఆంగ్లం/హిందీ ద్వారా కీలక స్థానాలను దక్కించుకునే పరిస్థితే ఇప్పుడు ఉంది. ఇప్పుడు ఆంగ్లభాషాపరిజ్ఞానాన్ని ర్యాంకుకు పరిగణనలోనికి తీసుకుంటున్నారు. తెలుగు భాషా జ్ఞాన పరీక్షను పూర్తిగా తొలగించారు. ఇక తెలుగు నేర్చుకోవాలనే ప్రోత్సాహకాలు ఏమీ లేవు . ఇలా ప్రాంతీయ భాషలవాళ్ళను పొమ్మనకుండా పొగ బెట్టారు. యూపీఎస్సీ తాజాగా కొత్త నిబంధన ఒకటి పెట్టింది.దాని ప్రకారం డిగ్రీని తెలుగులో చదివితేనే మెయిన్స్ ను తెలుగులో రాసేందుకు అర్హత లభిస్తుంది. అదికూడా 25 మంది ఉంటేనే తెలుగులో పరీక్షలు రాసే సెంటర్ పెడతారట. విద్యా పరంగా తెలుగు అభివృద్ధి చెందాలంటే ఒక రకంగా ఇది మంచి నిర్ణయమే. అయితే రాష్ట్రం దానిని అందిపుచ్చుకొని ముందుకెళ్ళాలి. ఎలాగంటే పూర్వం మన ఏపీపీయస్సీ తెలుగులో డిగ్రీ చేసినవారికి

గ్రూప్ 1,2 పరీక్షల్లో 5 శాతం ప్రోత్సాహక మార్కులు ప్రధానం చేసింది. ఆ ప్రోత్సాహక మార్కులు మళ్ళీ ఇమ్మని మనం కోరుతున్నాం. అలాగే ఇంగ్లీషు మీడియంలో డిగ్రీ చేసిన వాళ్ళు కోర్టుకు పోయి ఆ ప్రోత్సాహక మార్కుల్ని రద్దు చేయించుకున్నారు గానీ మన రాష్ట్ర ప్రభుత్వం మళ్ళీ వాటిని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చింది. ఈసారి ఎవరూ కోర్టుకు వెళ్ళలేని పద్ధతిలో చట్టం తెచ్చే యోచన చేస్తోంది. పరీక్షలు ప్రాంతీయ భాషల్లో జరపాలని కోరే ప్రజలు ప్రాంతీయ భాషల్లోనే చదవాలి. పట్టుమని పాతికమందికూడా లేని చోట్ల పరీక్షా కేంద్రం ఎలా పెడతారు? ఏ లాభంలేని చదువును ఎవరు చదువుతారు?తెలుగు పదికాలాలపాటు బ్రతకాలంటే తెలుగులో చదివేవాళ్ళ సంఖ్య పెరగాలి. ప్రాంతీయ భాషల్లో డిగ్రీ చదువు నిర్బంధం చేస్తేనే ఆ భాషలు బ్రతుకుతాయి.ఇది ఖచ్చితంగా అమలు చెయ్యాలి.

అయితే ఇంగ్లీషు, హిందీలు మాత్రమే అనేక మినహాయింపులను పొందటం వింతగా ఉంది. అడుగడుగునా బాషా వివక్ష కనబడుతోంది. డిగ్రీ హిందీ మీడియంలో చదివినవారే హిందీ సబ్జెక్టుకు అర్హులు అని నిర్దేశించలేదు. తెలుగుకు పెట్టిన ఆంక్షలే ఆంగ్లం/హిందీలకూ పెట్టాలి. దేశవ్యాప్తంగా ఆంగ్లం, హిందీ భాషలను బలవంతంగా రుద్దుతున్నారు. ప్రాంతీయ భాషల్లో పరిపాలన లేదు. పరిచయం లేని తెలియని భాషలో పాలన సాగిపోతోంది. తల్లి భాష గొంతు నులిమేందుకు రాష్ట్రాలూ సిద్ధమేనని వాపోయేవారు చిత్తశుద్ధితో ఈ మార్పుకు సిద్ధపడాలి. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ వంటి ఉన్నత కోర్సులు కూడా తెలుగులో రావాలి. అప్పుడు ఆంగ్ల మాధ్యమంలో చదవకపోయినా పూర్తిగా తెలుగులోనే సివిల్స్ రాయొచ్చు. ఇంగ్లీషుకున్న వెయిటేజిని తెలుగుకు కూడా కల్పించాలి.తెలుగు రాని అధికారులతో తెలుగులో పాలన అమలుకాదు. తెలుగు మన రాష్ట్రం లో అదికార భాష. పరిపాలనా నిర్వహణ ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగు లోనే జరగాలి. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వోద్యోగాలన్నిటిలోను తెలుగు తప్పనిసరి.ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వ ఉద్యోగాలకోసం ఆ రాష్ట్ర మాతృభాషలో యోగ్యతా పరీక్షలో కనీస మార్కులు పొందాలి. మన రాష్ట్రం లో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించటానికి తెలుగు రానక్కరలేదు. తెలుగు చదవటం రాయటం రాకున్నా ప్రభుత్వ ఉద్యోగం వస్తుంది. మన పాఠశాలల్లో, కళాశాలలో కూడా తెలుగు ప్రథమ భాష కాదు -

ద్వితీయ భాష. తెలుగు స్థానంలో మరొక భాష తీసుకోవచ్చు. తెలుగు ఐచ్ఛికం మాత్రమే. ఆంగ్ల భాషా సామర్ధ్యం మాత్రం అందరికి తప్పనిసరి. అందరూ కలిసి తెలుగును అట్టడుగుకు నెట్టి పారేశారు. తెలుగులో పరిపాలన, కార్యనిర్వహణ చేయవలసిన అధికారులకీ తెలుగులో సామర్ధ్యం లేదు. మాతృభాష పై నిర్లక్ష్యం కూడదంటూ యన్.టి.ఆర్ పాలనలో తెలుగు మాధ్యమంలో చదివిన వాళ్ళకి ఉద్యోగాల్లో ఐదు మార్కులు అదనంగా కలిపి ప్రోత్సహించారు. తర్వాత అది రద్దయింది. తెలుగు మాధ్యమంలో చదివినవారిని ఏదో ఒక అదనపు ప్రయోజనంతో ప్రోత్సహిస్తేనే తెలుగు భాషకు మంచి రోజులు వస్తాయి. తెలుగు భాషా సామర్ధ్యం అంటే ఛందోబద్ధ సాహిత్యం కాదు.సామాన్యులు రోజువారీ వ్యవహారాల్లో వాడే తెలుగు.

విద్యార్థులు తెలుగు మీడియంలో చదువులు ప్రారంభించినా, ఇంటర్, ఇంజనీరింగ్‌లో ఇంగ్లీషు మీడియంకు వెళ్లిపోతున్నారు.తెలుగు మాధ్యమంలో చదువునేర్పే మంచి కాలేజీలు లేకపోవడమే దీనికి కారణం. తెలుగు మీడియంలో వివిధ కోర్సులు చేద్దామంటే అవకాశం లేదు. ఆరో తరగతి నుండే ఐఐటి ఫౌండేషన్ కోర్సుల్లో చేరుతున్నారు. గణితం, ఇతర సైన్స్ కోర్సులపైనే దృష్టి పెడుతున్నారు. తెలుగులో ఒక్క వాక్యం కూడా రాయలేని పరిస్థితి ఏర్పడింది. తెలుగులో మంచి భావవ్యక్తీకరణ శక్తి ఉన్నా తెలుగులో చదువుకొనే అవకాశాలు లేవు. వాటిని ఇకనైనా కల్పించుకోవాలి. తెలుగు వారికి అన్యాయం జరగకూడదనుకున్నప్పుడు వారు ఉద్యోగావకాశాలను సులభంగా పొందేలా తెలుగులో ఆయా కోర్సులూ పెరగాలి.

తెలుగులో సివిల్స్ రాయాలని ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులను ప్రోత్సహించాలి. మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సులూ తెలుగులో రావాలి. ఏదో విధంగా తెలుగు మీద ఆంక్షలు పెట్టాలనే ఉత్తరాది సంస్థల ఉద్దేశం కనిపిస్తోంది కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం మేలుకోవాలి. సివిల్స్ మెయిన్ పరీక్ష రాసే అభ్యర్థులు తెలుగులో పరీక్ష రాయాలంటే, తెలుగు మాధ్యమంలో డిగ్రీ చేసి ఉండాలనీ, డిగ్రీలో తప్పనిసరిగా తెలుగును ప్రథమ భాషగా ఎంచుకుని ఉండాలని యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యుపిఎస్‌సి) తాజాగా జారీచేసిన ఆదేశాలను

అడ్డంపెట్టుకొని,ఆధారంగా తీసుకొని రాష్ట్రంలోని కళాశాలల్లో తెలుగు మాధ్యమం ద్వారా అనేక డిగ్రీ కోర్సుల్ని ప్రారంభించాలి. తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులు పూర్తిగా తెలుగులోనే ఐ.ఏ.యస్ . పరీక్ష రాసి ఉద్యోగాలు సాధించగలిగితే మన భాష ఎంతో స్వేచ్ఛను శక్తినీ పొందినట్లే. దేశంలో అన్ని భాషలూ సమానమే. హిందీకి ఇంగ్లీషుకి ఇచ్చినంత విలువ,గుర్తింపు, గౌరవం, సమాన ప్రాధాన్యత ప్రాంతీయ భాషలకు ఇవ్వాల్సిందే. అందరికీ సాధికారికత కల్పించాలని చూడాలే తప్ప ఏకపక్షంగా కొందరికే ప్రయోజనం కల్పించాలని చూడటం సరికాదు.సివిల్స్ పరీక్ష పూర్తిగా తెలుగు మాధ్యమంలో కూడా నిర్వహించాలి.

అన్ని చోట్లా ఇంగ్లిష్‌కు పెద్దపీటవేస్తున్నారు.హిందీకి మేలుచెయ్యటం కోసం తెలుగుకు కీడుచేస్తున్నారు. ప్రాంతీయ భాషల వారికి చిక్కులు తెచ్చిమరీ హిందీ వారికి ప్రత్యేక ప్రయోజనాలు కట్టబెడుతున్నారు. అందరికీ ఆంగ్లభాషా బానిసత్వం, మాతృభాషా దారిద్ర్యం అంటగడుతున్నారు. ప్రపంచ తెలుగు మహా సభలు సన్మానాలు శాలువాలతో వ్యర్ధమయ్యాయి. సభల ద్వారా తెలుగుకు ఏం న్యాయం చేశారు? తెలుగులో ఎంత ప్రతిభ ఉన్నా అది ఉద్యోగాలకు పనికిరావటంలేదు. అంతటా ఆంగ్లభాషాభిమానమే, హిందీభాషా పక్షపాతమే రాజ్యమేలుతోంది. అనేక భాషలున్న దేశంలో అన్ని భాషలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలనే ఇంగిత జ్ఞానం పాలకులకు లేదు. ఆంగ్ల/హిందీయేతర భాషల అభ్యర్థుల పట్ల భాషాపరమైన వివక్ష కొనసాగుతోంది. అన్ని భాషలకూ సమాన హక్కులు లేవు.

ఇప్పుడు ఇలా కొత్త నిర్ణయాలు తీసుకున్నారు గనుక భవిష్యత్తులో తెలుగు అభ్యర్థులకు పరీక్ష రాసి, తెలుగు ద్వారానే పాలనాధికారులయ్యే అవకాశం కలిగించాలి. అన్ని డిగ్రీ చదువులు తెలుగు మాధ్యమంలోకి రప్పించాలి. అది మన రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. ఇంజనీరింగ్, మెడిసిన్ పరీక్షలు కూడా తెలుగులో నిర్వహించాలి. అప్పుడు ఇంజనీరింగ్ అభ్యర్థులు తెలుగులో సివిల్స్ పరీక్ష రాస్తారు. ప్రాంతీయభాషలపట్ల వివక్ష అని బాధపడకుండా ఇలాంటి ఆంక్షలను అడ్డంపెట్టుకొని మన భాషలో ఎగబాకటానికి ప్రయత్నించాలి. ఈ ఆంక్షలనే ప్రైవేటు కార్పోరేటు విద్యా సంస్థలూ చచ్చినట్లు పాటించేలా చెయ్యొచ్చు. తెలుగులో మాట్లాడిన పిల్లలను కొట్టకుండా నెత్తిన

ఎక్కించుకొని తెలుగులోనే ముద్దాడేలా తెలుగుకు ఆయా సంస్థల్లో పెద్దపీటవేసేలా మార్చుకోవచ్చు.

దేశమంతటా ఆ రెండు భాషలే దిక్కు అంతర్జాతీయ భాషగా ఇంగ్లీషు, రాజభాషగా హిందీ. దేశ వ్యాప్తంగా అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలో సెప్టెంబర్ 14న రాష్ట్రీయ దివస్‌గా, హిందీ దివస్‌గా నిర్వహిస్తున్నారు. కేంద్ర పాలకులకు ఆయా ప్రాంతాల ప్రజల మాతృ భాషలతో పనిలేదు. అసలు ఆయా భాషస్తుల మొర కూడా వినరు. హిందీ కోసం తప్ప మిగతా భారతీయ భాషలకోసం కేంద్రం తరుపున ఒక్క పండుగా ఉండదు. కేంద్ర ప్రభుత్వ కార్యకలాపాలు ఇంగ్లీష్, హిందీ భాషలలో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం త్రిభాష సూత్రం ప్రకారం మన తెలుగు ప్రజలు మాతృభాషను నేర్వకపోయినా రాజభాషగా హిందీని, అంతర్జాతీయ భాషగా ఇంగ్లీషును అభ్యసిస్తున్నారు. కేంద్రప్రభుత్వం హిందీ భాషాభివృద్ధి కోసం హిందీప్రచార సభ, హిందీ అకాడమి, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హిందీ తదితర సంస్థలను ఆయా రాష్ట్రాల రాజధానులలో ఏర్పాటుచేసింది. ఈ సంస్థలు పాఠశాల విద్యార్థులకు హిందీ పరీక్షలు అక్షరమాల నుంచి ఉపాధ్యాయ శిక్షణ వరకు వివిధ స్థాయిలో హిందీ ప్రచారం కోసం, భాషాభివృద్ధి కోసం పరీక్షలు, శిక్షణా కార్యక్రమాలు, సదస్సులు, సెమినార్లు నిర్వహిస్తారు. ఇన్ని పనులు తెలుగుకోసం ఏనాడన్నా చేశారా?అన్ని రైల్వే స్టేషన్లలో బోర్డులు ఇంగ్లీషుతో పాటుగా హిందీలో కూడా వుంటాయి. ఎల్లైసీ పాలసీలు, రశీదుల మీద, టెలిఫోన్ బిల్లుల మీద తెలుగు ఉండదు కానీ ఇంగ్లీషుతో పాటు హిందీ ఉంటుంది. హిందీ అర్థం కాకపోతే ఇంగ్లీషులో చదువుకోవాలి. అంతేగానీ మన ప్రాంత కార్యాలయాల్లో కూడా మన మాతృభాషలో ముద్రించరు. కేంద్రం మనకు మన భాషలో ముద్రణకు అనుమతించింది ఓటర్ లిస్టు ఒకటే. ప్రభుత్వ వెబ్ సైట్లలో ఇంగ్లీషుతో పాటు హిందీలో కూడా సమాచారం వుంటుంది. ఈ మధ్య సోషల్ వెబ్ సైట్లలో కూడా హిందీకి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సూచన చేసింది. పార్లమెంటులో హిందీ రాజ్యమేలుతోంది. హిందీయేతరులు అనుమతులు పొందాకే మాట్లాడాల్సి వస్తోంది. ఆనాడు రాజ్యసభలో హరికృష్ణ తెలుగులో మాట్లాడటం మొదలుపెట్టగానే డిప్యూటీ ఛైర్మన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలుగులో వద్దు, ఇంగ్లిష్ లో గాని, హిందీలో గాని మాట్లాడమన్నప్పుడు హరికృష్ణ నాకు తెలుగులో

మాట్లాడే హక్కుంది అంటూ తెలుగులోనే మాట్లాడారు. అనువాదకులు లేని సభలో మాట్లాడినందున ఆయన మాటలు రికార్డుల్లోకి ఎక్కవన్నారు. సభ జరిగేరోజుల్లో షెడ్యూల్డ్ భాషలన్నిటికీ అనువాదకులు అక్కరలేదా? హిందీని మాత్రం సభ్యులందరూ తమ భాషల్లో అర్థం చేసుకోవాలా? ఇలాంటి గత్యంతరం లేని పరిస్థితుల్లో హిందీయేతర సభ్యులు ఇంగ్లీషులో నెట్టుకొస్తున్నారు గానీ తమ మాతృభాషల్లో మాట్లాడినంతగా ఆయా అంశాలపై అనర్గళంగా ఆవేశంగా మాట్లాడలేకపోతున్నారు. తమ మాతృభాషలో ధీటుగా వాదించి గెలిచే ఆయాచిత వరం హిందీ వాళ్ళకు మాత్రమే దక్కింది. మిగతా భాషలవాళ్ళకు ఈ సదుపాయం నేటికీ లభించలేదు. ఇంగ్లీషు,హిందీలు మాత్రమే తెగ బలిసిపోతున్నాయి. మిగతా భాషలకు పార్లమెంటులో ఇంగ్లీషు, హిందీలతో పాటు సమాన గౌరవం దక్కుతుందా?కనీసం తమ తమ ప్రాంతాలలోని కేంద్ర కార్యాలయాల ఫైళ్ళలో కూడా ప్రవేశించలేని ప్రాంతీయ భాషలు పోషణలేక క్రమేణా పరమపదించటం ఖాయం. శక్తిచాలని ప్రజలు ఉపాధికి పనికిరాని తమ భాష బాగోగుల కోసం ఎన్నాళ్ళని పోరాడుతారు?ఉద్యోగాలిచ్చే రాజభాషకు ఏనాటికైనా సాగిలపడక ఏంచేస్తారు?కేంద్ర ప్రభుత్వ కోరిక కూడా ఇదేనేమో. అందుకే ఈ నిరంకుశ ఆధిపత్య పోకడలు.

(సూర్య 29.7.2014)



తెలుగు అధికార భాష కావాలంటే..,తెలుగుదేవభాషే పుస్తకాలలో నా అభిప్రాయాలకు ఆకురాతి గోపాలకృష్ణ గారు(ఫోన్.9493513850) ఇచ్చిన పద్యరూపమే ఈ శతకం:

5. తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

1. పాలనాధికార పగ్గాలతో, ప్రజా
బ్రతుకు తెరవొసంగు బాటలన్ని
ఒరులకిచ్చి వారికూడిగం సేతువా?
తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

2. ప్రాచ్యభాష యెదిగి ప్రాంతీయ భాషకు
ఊపిరంద నీక యుసురు తీసె
మ్రింగి వేయదా తిమింగ్గ రూపు దాల్చి
తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

3. ప్రాణ వాయు వాంగ్ల భాషకే అందిస్తె
మాతృభాష కింక మనుగడేది ?
గొప్పదైన పాము కప్పను మ్రింగదా ?
తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

4. కొంప పెత్తనమ్ము ఉంపుడు గత్తెకా ?
ఎంత ధారుణమ్ము ? ఎంత తెగవు ?
తల్లి సవతి యైన పిల్లల భవితేమి ?
తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

5. పసి వయస్సులోనే పరభాష చొప్పించి
లేత మెదడు మీద వాత లిడకు
పులుల స్వారీ పగటి కలలు గావింపదా ?
తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

6. అమ్మవడిని మాన్పి అతిచిన్న బిడ్డల
సవతి కప్పగించి సాకమనిన
గొప్ప సవతి ప్రేమ చెప్పు నాకింపదా?
తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

7. మమత పుంజుకొన్న మమ్మీలు, డాడీలు
కుమ్ముచుండే తల్లి రొమ్ము మీద
ముద్దు లాడ దివ్వె మూతిని కాల్చదా?
తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

8. తమిళము మలయాళ తల్లులకీనాడు
బిడ్డలిచ్చుచున్న పెంపు చూడు
తల్లిభాష నీకు తగనిదై పోయెనా?
తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

9. పరుల భాష కెంత పాండిత్యమున్ననూ
భావ వ్యక్తీకరణ భ్రష్టు గుండు
అలవిగాని బండ తలకెత్తుకున్నట్లు
తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

10. అట్టహాసమైన ఆంగ్ల వక్తల మధ్య
తెల్లబోయి మిగులు తెలుగు వక్త
సానిడాబుగాంచి జంకేటి భార్యలా
తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

11. యెల్ల వనరులున్న తల్లి భాషీనాడు
బ్రతుకు చూపలేని బడుగు దయ్యె
మేపులేనిగోవు చేపి పాలిచ్చునా
తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

12. దేశభాషలందు తెలుగు లెస్సన్నట్టి
కృష్ణదేవరాయ కీర్తి శిఖలు
అన్ని దిశల చాటి వన్నె కెక్కిన భాష
తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

13. చరితయున్ను తగిన సాహిత్య ప్రాచీన
ప్రతిభ కల్గినట్టి ప్రముఖ భాష!
కన్న తెలుగు తల్లి ఉన్నతిని కాపాడు
తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

14. ఇంపు చేయవచ్చు కంప్యూటరందుండు
అచ్చరాల బెడద ఖచ్చితముగ
అలవికానిదంటు అన్వేషణకు లేదు
తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

15. ఉన్నలోపములను తిన్నగా సవరించి
తల్లిభాష నున్నతముగ తీర్చి
అప్పగింపవోయి అధికార పీఠాన్ని
తెలివి తెచ్చుకొని తెలుగు బిడ్డ

16. దేశ భాషలందు తేజరిల్లిన తెలుగు
వాసి తగ్గి ఆంగ్ల దాసి యయ్యె
కుక్క వాత పడ్డ బక్క సింహం భంగి
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

17. ఆంగ్ల సంస్కృతాల నాలింగనం గొనీ
సరకుగొనని తెలుగు సన్నగిల్లె

కూరుచున్న కొమ్మ కూలిపోబోతోంది
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

18. అచ్చ తెలుగు వదలి ఆసంస్కృతంబునే
మంత్రములకు వాడు తంత్రమేమి ?
శ్రేష్టమైన వృత్తి చేజారుననికదా ?
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

19. తెలుగు దేశ బిడ్డ తెలుగు పండిత పోష్టు
ఆంగ్ల భాషలోన ఆర్డరేసి
అచ్చ తెనుగు వాణ్ణి బిచ్చమెత్తింతురా
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

20. అన్యదేశమందు ఆంధ్రులిర్వురు కలువ
మాత్రు భాష దాచి మసులు కొంద్రు
మాటు దాచు కొనెడి మర్మాంగ జబ్బల్లే
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

21. ఆంధ్రభాష మనకు అధికారి యైయింత
అన్నమిచ్చుననెడి ఆశయుండె
ఆంగ్లమిచట జేరి అడియాశ జేసెరా
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

22. అర్ధమవని భాష కధికార మందిస్తె
బడుగు మూకనెల్ల పారద్రోలి
కనక పీఠమందు శునకమై వర్ధిల్లు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

23. రూకలిచ్చు భాష కాకతో నేర్చేరు
యేమి యివని దాని నేర్వరెవరు
పాలు యివని పశు కబేళాల కర్పితం
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

24. మిసిమి కల్లు కవుల పసిడి పల్కుల తల్లి
సిరుల రాజసమ్ము తరిగిపోయె
తిరుమలేశు నగలు అరువు కేగిన రీతి
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

25. పేద తెలుగు వారు పిరియాదు లందిస్తె
ఆంగ్లమందు తీర్పు లదరగొట్టు
కోతి కందినట్టి కొబ్బరి కాయల్లె
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

26. స్వంత భాషతోని సౌలభ్య మేనాడు
అన్యభాషలందు అందబోదు
తల్లిప్రేమ, మారు తల్లిలో దొరకునా ?
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

27. ఆంగ్ల భాష సుంత అలవడినంతనే
తెలుగు నీసడించు ధీరులార
యేరు దాటి తెప్ప నేల తగలేతురు ?
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

28. పెర్రి తెలుగు కవికి యెర్ర పైసా కూడ
రాల్చు దిక్కు లేదు రాష్ట్ర మందు
తనదు కలమె తనకు తల కొర్వి యైపోయె
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

29. ఇంచుమించుగా ప్రపంచ వ్యాప్తంబుగా
పదునెనిమిది కోట్ల ప్రబలమైన
సంతు యుండు తల్లి కింత అన్యాయమా ?
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

30. అష్ట దిగ్గజాల హావభావాలతో
కృష్ణ దేవరాయ కొలువులోని
తెలుగు వైభవమ్ము తిరిగి మళ్ళొచ్చునా
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

31. పొరుగు భాషతనకు భుక్తి కల్పించినా
తనదు మాతృభాష దైన్య స్థితికి
కఠిన ఆకురాయి కరిగి ఆక్రోశించె
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

32. తెలుగు ఉద్యమాన్ని ధీరతన్ చేపట్టి

లౌక్యమౌ పధాన రహంతుల్లా
గారు,బండి ముందు కరదీపికై నిలిచే
(బండి ముందు నడుచు బంటు తానై నిలిచే)
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

33. అంటు వ్యాధి వోలె వ్యాపించి దేశాన
ఆంగ్ల మోజు ప్రజల కంట గట్టి
కులుకుచుండె స్వార్ధ బలుపుతో కాన్వెట్లు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

34. తెలుగు నేల మీద తెలుగు బిడ్డే తెలుగు
ఉచ్ఛరింప, పట్టి శిక్షవేయు
బంటు పెత్తనమ్ము ఇంటి కెగ బ్రాకింది
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

35. మిసిమి కోలు పోయి పసిడి బాల్యంలోనె
బండబారు తోంది భరత జాతి
కానివెంట్లు జైళ్ళు, ఖైదీలె పిల్లలై
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

36. అమ్మ యనెడి తెలుగు కమ్మని పిలుపును
మమ్మి వచ్చి చేరి మట్టు పెట్టె
మేక వన్నె పులిని సాకిన ఫలమిదే
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

37. పదవి నున్న వారు పలుకరు స్కూళ్ళలో
సెట్టబడియెతెలుగు కట్ట కడకు
దిక్కు లేని శిశువు కుక్క పాలైనట్లు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

38. మొదటి తరగతందె ముదనష్ట పింగ్లీషు
తెలుగు భాష గొంతు నులుముచుండె
పోతపాలుబిడ్డవాత కొట్టిరి కదా||
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

39. చంటిబిడ్డ త్రాగు చనుబాలురా తెలుగు
అమ్మ రొమ్ము మార్చి ఆంగ్లమనెడి
ఖరము చన్ను గుడుచు ఖర్మ పట్టించిరి
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

40. ప్రధమ విద్య మాతృ భాషా సిమెంటుతో
దిట్ట పరచు బేసు మట్టమెపుడు
అన్యబూడిదేది అంటరాదిచ్చోట
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

41. తెలుగు మీడియమ్ము తెలుగు విద్యార్థులకు
చదువు కొనుట కెంతో సౌఖ్యప్రదము
ఇంపిత మగుదారి కంప కొట్టించారు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

42. గుండెలోని బాధ దండిగా వివరింప
మాతృభాష యొకటె మహిని చెల్లు
మనసు దోచు పండు మామిడి ఒక్కటే||
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

43. తెలుగు నేల మీద తిన్నగా జన్మించి
తెలుగు పాలు త్రాగి తెలుగు ప్రగతి
విస్మరించినారు భస్మాసురుల భంగి||
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

44. పెద్ద భాష వచ్చి గద్దెపై కూర్చుంటె
మాతృభాష నోట మన్ను పడును
పక్షి గూటి లోకి పాము జొర పడ్డట్లె
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

45. పొరుల కిచ్చి పొలము వారి వద్దే కూలి
చేయబోవు టెంత హేయ కరము
ఆంగ్ల ఆదిపత్యమటువంటిదే గురూ
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

46. ఇరుగు పొరుగు భాష కిచ్చేరు గౌరవం
స్వంత భాష నెవరు సరకుగొనరు
ఎదటి వాడి భార్య యెల్లరకుతీపియే
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

47. విధినెరింగి నేటి అధికార గణమంత
ఆంగ్ల భేషజాన్ని అట్టె వదిలి
తెలుగు నాదరిస్తె తిరిగి రాదా గతము
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

48. అమెరికాకు బోవు ఆ నల్గురి కొరకు
ఆంగ్ల కుంపటెత్తిరందరికిని

పేరిగాడి బండి పీరు సాహెబ్ యెడ్లు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

49. పరుగు లెత్తి యచట పాలు ద్రావే కంటె
నిలబడింట త్రాగు నీరు మేలు
అబ్బురమనుకోకు అమెరికా బెగ్గింగు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

50. చదువు చక్కనైన సంస్కార లావణ్య
అందమైన తెలుగు ఆడపిల్ల
కన్ని యుండె, యిప్పు డయిదవ తన మివ్వ
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

51. సర్వమతము లందు సామూహ ప్రార్థనల్
స్వీయ భాషలందు చేయరేల
దేవుడితరభాష తెలియని మూర్ఖుడా ?
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

52. ఆంధ్రముస్లిములను అరబి ఆకర్షించె
సంస్కృతమ్ము తెలుగు జాతి నొంచె
బల్లి యొడిసి పట్టు బలహీన జీవులన్
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

53. రక్తి చూపకుంటె ముక్తి సున్నాయంచు
భక్త తతికి త్రొక్కి పట్టి యెపుడు
మౌఢ్యమతపు నేర్పు మతస్తుగా తమభాష
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

54. శాస్త్ర యుక్తమైన సంస్కృతమేనాడో
తెలుగు భాష మీద తిష్ట వేసి
కొలువు తీరినట్టి గోముఖ వ్యాఘ్రహం
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

55. వేల యేండ్ల నుండి విలువైన గ్రామీణ
పారిభాషికాల పట్టరైరి
ఎక్కడున్న గొంగళక్కడే నన్నట్లు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

56. మాతృభాష తోసె మహనీయుడైనట్టి
సత్య సాయి గొప్ప చరిత చూడు
నేల విడిచి సాము మేలు కాదెన్నటికి
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

57. లోటు పాటులుంటె నీటుగా సవరించి
పాటు చేసి తెలుగు మీట నొక్కు
ఎలుకలున్న వంచు యిల్లు తగలేతుమా
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

58. A,B లు C,D లు, యే శివాజీకొచ్చు?
ఆంధ్ర భోజుకేమి ఆంగ్లమొచ్చు?
ఆంగ్ల కోడిలేక అవని తెల్లారదా?
కోడికూయకుంటె కొంప తెల్లారదా?
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

59. జన్మమిచ్చినట్టి జననిగా వేనోళ్ళ
పొగడగానె తల్లి దిగులు పోదు
పూజసేయ గోవు పుష్టికి నోచునా
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

60. భక్తి మహిమ పెంచు భారతం రామాయ
ణాది కావ్యధారలందు తడిసి
తెలుగు నేలలందు వెలుగు లీనిన భాష
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

61. బడుగు భాష యనుచు బాణాలు సంధించి
తెనుగు తల్లి యుసురు తీయబోకు
నిందమోపి సతిని బొందపెట్టిన రీతి
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

62. చిన్న చూపదేల చీదరింపదియేల?
తెలుగు తల్లి మీద ద్వేషమేల?
ఆంగ్లకోటు దాల్చి అధికుడ ననుకోకు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

63. మాతృభాష నొదిలి మరియొక భాషపై
కాలుమోపు వాడు కూలిపోవు
నాటు పడవ నొదిలి ఓటి పడవెక్కకు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

64. చిన్నతనము నందె కన్నతల్లిని వీడి
అన్యదేశవాస ఆంధ్రులంత
తెలుగు దైన్యస్థితికి దిగ్భ్రాంతి చెందేరు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

65. అర్థమవని భాష అధికార మందుంటె
అనువదించి తెల్పు అల్పులైన
మాయ మోసగాళ్ళు మనకొంప ముంచరా
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

66. పాలనాధికార పగ్గాలు చేపట్టి
సాటిభాష లన్ని సాగు చుండ
దాస్యమందు తెలుగు ధంసమైపోతొంది
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

67. సకలమైన యితర జాతి పదాలతో
సంకరించె నన్ను శంక పడకు
యెట్టిదైన పిల్లి యెలుకను పట్టదా?
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

68. రాజపీఠమందు రంజిల్లు భాషకు
మతపు భాషలకును క్షతియులేదు
ప్రాణ హానియెపుడు ప్రాంతీయభాషకే
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

69. వట్టిమాట లంటు కొట్టిపారేయక
పట్టుతోడ బుద్ధి పదును చూపి
ఇంటిపెత్తనమ్ము యిల్లాలిదేనని||
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

70. వచ్చి రాని ఆంగ్ల భాషతో కుస్తీలు
పట్టు లెక్చరర్ల బాధచూడు
కుక్కతోక పట్టి గోదావరీదేరు||
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

71. మాతృభాష నెపుడు మరువకు మరువకు
మాతృభాష మీది మబ్బువీడి
వెల్లివిరిసి నపుడె యిల్లు స్వర్గంబగున్
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

72. దేశమేమొ తెలుగు దేశీయులు తెలుగు
అమలు చేయు వారలంత తెలుగు
ఆంగ్ల భాషకేల అధికార పీఠమ్ము?
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

73. ప్రజల నోళ్ల నుండు భాషోన్నతిన్ పొందు
ప్రజకు దూరమైన భాష చచ్చు

తైలమిడని దివ్వె తిన్నగా కొండెక్కు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

74. ఒరుల గొప్ప చూచి పరవశించుట మాని
స్వంత జాతి ప్రతిభ చాటనెంచు
కుంటి యైన కూడ యింటి బిడ్డే మేలు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

75. ఆంగ్ల భాషయేమొ అసలు నేర్వను రాదు
తెలుగు చదవ బ్రతుకు తెరవు లేదు
నొంత కూడు పాయె బంతి కూడూ పాయె
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

76. ఆలయాల పూజ కర్తృత లేదని
తెలుగు మంత్రములకు విలువ నివరు
తెలుగు రాని వాడు దేవుడెట్లాయెనో
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

77. కామధేను వంటి కమ్మని తెలుగుండ
ఇంగిలీషు కోతినెత్తుకోకు
గంగి గోవు నొదిలి గాడిద కొలువట్లు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

78. బానిసత్వమందు బ్రతికిన జాతికి
తగ్గదాయె మోజు దాస్యమందు
పోదు బిడ్డతోనె, పురిటి కంపన్నట్లు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

79. ఆంగ్ల భాష మీద అభిమానమున్ బెంచి
తెలుగును విడనాడు తెగువ యేల ?
ఆలి చిక్కగానె అమ్మను విడుతురా
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

80. తేనె లొలుకు నట్టి తెలుగును విడనాడి
గొంతు దిగని ఆంగ్ల చింతయేల?
అక్షయమ్ము నొదలి భిక్షెత్తు కొన్నట్లు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

81. లిపిని సంస్కరించి అపర వజ్రమ్ముగా
తీర్చి దిద్ది చూడు తెలుగు భాష
రాజ పీఠమునకె తేజస్సు నింపదా?
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

82. ఇళ్ళలో యింగ్లీషు బళ్ళలో యింగ్లీషు
తల్లి భాష విలువ తరుగుతోంది
చుప్పనాతి ప్రభుత చోద్యం చూస్తోంది
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

83. కంటిపాప వోలె కాపాడగల బిడ్డ
ఎరుగనట్లు తల్లి నే మరిస్తే
మాతృ మూర్తి కింక మరణమే శరణమ్ము
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

84. స్వంత తల్లి నగలు, సవతికి అందించి
బాధపెట్టు సుతులు బ్రతుకనేల
మాతృభాష ద్రోహ మదియెంతచెడ్డదో||
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

85. బలసినట్టి భాష, బలహీనమగు దాని
యిట్టె మింగి వేసి గుట్ట గూల్చు
మేక సెక్కడైన సాకునా తోడేలు||
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

86. ఆంధ్ర ప్రభుత తెలుగు కంగీకరించినా
తెలుగు ఆఫీసర్లె తెమలనీరు
పారునీళ్ళ పాచి తెగులయేట్లు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

87. తెగులుపట్టినట్టి తెలుగు బిడ్డల్లోని
అంతరించినపుడె ఆంగ్లతిక్క
మాతృభాష కొచ్చు మంచి రోజానాడు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

88. ఇళ్ల లోనె కాదు బళ్లలో గుళ్లలో
కోర్టులందు ప్రజల హార్టులందు
చోటు గొన్న భాష సుస్థిరమై నిలుచు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

89. ఆంగ్లముండు వారి కన్ని ఉద్యోగాలు
తెలుగు భాష కింక విలువ యేది
అద్దె వాడికిల్లు అసలు వాడికి నిల్లు
(బంటుకు విలువిస్తే బాసును మ్రింగడా?)
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

90. లోకమార్పు తోడ పోకడలు మారాలి
మారనట్టి దెల్ల మరణ మందు
తెలుగు తల్లి కట్టి స్థితిని పట్టింపకు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

91. కొన్ని కోట్ల ప్రజలు ఎన్నో తరంబులు
కూర్చుకున్న భాష కూలెనంటె
భాషతోడ జాతి భవిత మరణింపదా
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

92. ఆంధ్ర భాషకంటె ఆంగ్లమే మేలైతే
చదివి నీవె అందు చతురు డగుము
ఆంగ్ల గజ్జి తెచ్చి అందరికి పుల్మకు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

93. తెలుగు వేషధారణ తెలుగు వేదికలందె
వేదికలను దాటి వెలికిరాదు
ఆంగ్లమైక మందె ఆఫీసు గణముండు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

94. అసలు చిత్త శుద్ధి ఆఫీసరందుంటే
తెలుగు కూడ మంచి స్థితి గడించు
మెగడు చచ్చుగుంటె ధగడిదే రాజ్యమ్ము
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

95. విలువ తరిగినట్టి తెలుగు మీడియాన్ని
యెంచుకున్నవాడు కించవడును
గొడ్డుటావు నెవరు కొనుగోలుసేతురు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

96. అరచి పిలుచుచుండిరక్బరు ననుకొంటి
అల్లాహో అకబరు అని వచింప
అర్థమవని భాష తర్జుమా యిట్లుండు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

97. పట్టి మతములన్ని పల్కించు ప్రార్థనల్
వేదభాషలందె విన్నవించు
అర్థమవని ఘోష వ్యర్థ ప్రయాసరా
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

98. సకల మతములందు సమభావ దృష్టితో
తెనుగు భాష యున్నతికి తపించు

రహంతుల్లా గారి తహతహను గుర్తించి
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

99. బడుగు తెలుగు భాష పాలింప యోగ్యమా
సాధ్యమెట్టులనకు చవట వోలె
నూర్ బాషా గారి పరిశీలించి||
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

100. అరయ యూనికోడు కందరూ క్రమముగా
మారి మాతృభాష మనుగడకును
సహకరించినపుడె సమకూడు సమృద్ధి
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

101. కన్నతల్లి కింత గంజి పోయుట మాని
సానికొంప మరిగి చంపజూచు
బిడ్డలుండు పురిటి గడ్డ కాదీ భూమి
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

102. పూర్వరాజసాన పుట్టి పెరిగిన భాష
ప్రజలు రేబవళ్ళు పలుకు భాష
కవుల గంటమందు కదం త్రొక్కిన భాష
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

103. ఆంధ్రదేశ రాజ అధికార పీఠాన
తెలుగు తల్లి పఠిమ తీర్చి దిద్ది
నిలుపకల్లు వరకు నిద్రపోరాదని
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

104. పరుల పాలనమ్ము పనికి రాదంటి మే
వారి తోక (భాష) పట్టి వదల రేమి?
ఊడిగమ్ము కింత ఉబలాటమెందుకో ?
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

105.ఐక్యరాజ్యసమితి అల్పాయు భాషల్లో
తెలుగు చేరెనంచు తేల్చి చెప్పె
కళ్ళు తెరవకుంటె ఇల్లు కొల్లేరగున్
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

106. అటపాటలందు హాయిగా నేర్చేటి
అరటి పండువంటి అమ్మభాష
ఆంగ్లకోతి జేరి ఆరగింకేసింది||
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

107. కాలుమోపగానె కానెవెంటులో బిడ్డ
అమెరికా డాలర్లు అందినట్లు
పగటి కలలు కంటు నగువాటు పాలవకు||
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

108. ఆంగ్ల భాష మీద అత్యాశ మానుకో
అందలేవు యెన్ని చిందివిడిన
నక్కలకు ద్రాక్ష నిక్కితేఅందునా||
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

109. మాన్యచరితులైన మన తెల్గుపెద్దలే
ఆంగ్ల భాష పెట్టి రన్ని దిశల
తమను గట్టి తాళ్ళుతా తెచ్చుకొన్నట్లు||
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

110. ఆంగ్లభాష నేమో అందలమెక్కించి
చచ్చు సంస్కృతాన్ని చంకపెడితె
స్వంతతెల్గు కింక స్వర్గప్రాప్తే కదా||
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

111. తెలుగు కీర్తి దేశాల బ్రాకినా
తమజనాల గుండె తట్టదాయె
మణులకుండు మెరుపు ఫణి యెరుగదన్నట్లు||
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

112. ఇండియా లెవెల్లో రెండవ స్థానాన్ని
పుణికి పుచ్చుకున్న తెనుగు తల్లి
దుష్టసుతుల నడుమ కష్టాలు పడుతోంది
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

113.ఉట్టికెక్కనమ్మ ఉరుకునా స్వర్గాని
కనుప్రచార దోరణనుసరించి
కన్నతల్లి పరువు గంగలో కలుపకు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

114.దేశ భాషలందు దేదీప్యమానమై
వెలుగునిచ్చినట్టి తెలుగు దివ్వె
ఆంగ్లహోరులోన ఆరిపోబోతోంది
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ ||

(2012 తిరుపతి ప్రపంచ తెలుగు మహాసభలలో నేను పంచిన పుస్తకం)



కక్షిదారుల 'భాష'లోనే తీర్పులు

కక్షిదారులకు సులువుగా అర్థమయ్యేలా, వారి భాషలోనే హైకోర్టులు తీర్పులు వెలువరించాలి. తీర్పుల అనువాదిత ప్రతులను అందజేసే వ్యవస్థ ఏర్పాటు కూడా అవసరం. నిరుపేదల కేసులను త్వరితగతిన విచారించాలి.

- రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

(కేరళ హైకోర్టు వజ్రోత్సవాల్లో ప్రసంగిస్తూ..)

ఆంధ్రజ్యోతి Sun, 29 October 2017 epaper.andhrajyothy.cc



6. హైకోర్టులో తెలుగు

10.2.2018 న ఘంటసాల మండలం శ్రీకాకుళం లో జరిగిన తెలుగు భాష బ్రహ్మోత్సవానికి హాజరయ్యాను. పాలనా భాషగా తెలుగు అనే అంశంపై మాట్లాడాను. 18 వ శతాబ్దం లో బుడ్డావెంగళరెడ్డి గారికి విక్టోరియా మహారాణి బహూకరించిన పతకం తెలుగులోనే రూపొందించగా లేనిది మనరాష్ట్రంలో మనము తెలుగు అమలు చేయలేమా అని అడిగాను.

ఇక్కడ కూర్చొని ఆముక్తమాల్యద రాసిన శ్రీకృష్ణదేవరాయలను మరోసారి గుర్తుకు తెచ్చుకున్నాము.చట్టాలను తేలికైన తెలుగులోకి అనువాదం చేస్తాను,నన్ను ఉపయోగించుకోండి అని నల్గొండ మాజీ కలక్టర్ ముక్తేశ్వరరావు గారు విజ్ఞప్తి చేశారు.

ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుగారు పాలనలో తెలుగు భాష అమలు కోసం చేసిన శపథం ఇది : "మన భాషలో మనల్ని మనం పరిపాలించుకుందాము. జన ఘోషకు స్పందించాల్సిన సర్కారీ యంత్రాంగం జన భాషకు పట్టం కట్టాలి. దస్త్రం తెలుగులో రూపొందిస్తేనే సంతకం చేస్తాను". తెలుగు పాలకుని ఈ మాటల స్ఫూర్తి తో నేటి మన నాయకులు, అధికారులూ పనిచెయ్యాలని కోరాను.

హైకోర్టుల్లో ప్రాంతీయభాషలు ఇప్పటికైనా ప్రవేశించాలని కోరాను: హైకోర్టుల్లో స్థానిక భాషల్లో వాదనలు, తీర్పులు ఉండాలని కోరుతూ చదివిన పత్రం: హైకోర్టులో తమిళం వినియోగంపై చేసిన విన్నపాన్ని కేంద్రం తిరస్కరించిందని, మద్రాసు హైకోర్టులో తమిళాన్ని అధికార భాషగా వినియోగించేందుకు అనుమతించాలని తమిళనాడు శాసనసభ పంపిన తీర్మానాన్ని పునఃపరిశీలించాలని ఏఐఏడీఎంకే ఎంపీ శశికళ పుష్ప కేంద్రప్రభుత్వాన్ని కోరారు.దానిపై స్పందిస్తూ స్థానిక భాషలను హైకోర్టుల్లో అధికార భాషగా ఉపయోగించడం ఆదర్శవంతంగా

ఉంటుందని రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. అయితే అందుకు విస్తృతస్థాయిలో ఏకాభిప్రాయం అవసరమని వ్యాఖ్యానించారు. (ఈనాడు 8.2.2018)

ఏకాభిప్రాయం రాలేదు – అసలు ఇంగ్లీషు తప్ప మరేభాషా హైకోర్టుల్లో వద్దన్నారు 2008 లో హిందీ వాళ్ళు రాజ్యాంగం లోని ఆర్టికల్ 248ని సవరించి హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో హిందీ తీర్పులు తేవాలని ప్రతిపాదించారు. లాకమీషన్ దేశవ్యాప్తంగా నిష్ణాతులైన న్యాయమూర్తుల్ని సంప్రదించి ఇంగ్లీషులో తప్ప హిందీ లో గానీ ఇంకా ఏ ఇతర భారతీయ భాషలలో గానీ వాదనలు తీర్పులు కుదరవని ఏకగ్రీవంగా తీర్మానించింది. అది చెప్పిన కారణాలు:

“భాష దేశ ప్రజల భావోద్వేగాలను ప్రభావితం చేస్తుంది. భాష ప్రజలను ఐక్యపరుస్తుంది. ఎవరిమీదా ఏ భాషనూ బలవంతంగా రుద్దకూడదు. ఉన్నతన్యాయస్థానాలలోని వాదనలు తీర్పులు మామూలుగా జరిగేది ఆంగ్ల భాష లోనే. భారతీయ న్యాయ వ్యవస్థ ఇంగ్లీషుకు అమరికా న్యాయ పుస్తకాలకు అలవాటుపడింది. కాబట్టి ఉన్నత న్యాయమూర్తుల్ని ఇంగ్లీషుకే స్వేచ్ఛగా వదిలెయ్యాలి. ఒక రాష్ట్ర హైకోర్టు జడ్జి మరో ప్రాంతానికి బదిలీపై వెళితే ఆ రాష్ట్ర భాష నేర్చుకొని ఆ భాషలో తీర్పులివ్వాల్సివస్తుంది. అది చాలా కష్టం. జడ్జీలమీద అనేక భాషల భారం మోపకూడదు. వాళ్ళమీద ఏ భాషనూ రుద్దకుండా జడ్జీలను వాళ్ళ భాషకు వాళ్ళను స్వేచ్ఛగా వదిలెయ్యాలి. దేశప్రజలందరూ తప్పక సర్వోన్నత న్యాయస్థానం తీర్పులిచ్చే ఏకైక భాష అయిన ఇంగ్లీషును అర్ధం చేసుకోక తప్పదు. అన్ని కోర్టుల్లో ఇంగ్లీషే ఉంటే వివిధ భాషా ప్రాంతాలమధ్య న్యాయవాదుల కదలిక సులభం అవుతుంది. కోర్టుల్లో హిందీ అమలు కోసం కావాల్సిన చట్టపరమయిన నియమాలు నిబంధనలుమాత్రం ముందు ఇంగ్లీషులోనే చెయ్యాలి. దానికి అధి కారపూర్వకమైన అనువాదం చేసుకోవచ్చు. ఉన్నత న్యాయ స్థానాలను మాత్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆంగ్ల భాషను మార్చుకోమని అడగవద్దు”. అన్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో తెలుగు తీర్పులు ఆశించగలమా?

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి లాంటి పెద్దలంతా కక్షిదారుల భాషలోనే హై కోర్టుల్లో కూడా వాదనలూ తీర్పులు ఉండాలని చెబుతున్నారు కదా అన్న ధైర్యంతో 2017 లో ఒక కేసులో తెలుగులో ప్రతివాదన తయారుచేసి తీసికెళితే హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది దానిని తిరస్కరించారు. హైకోర్టులో తెలుగు వాదన చెల్లదు అన్నారు. తెలుగులో వాదన తెచ్చినందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంగ్లీషులో వాదించలేని నేను డిప్యూటీ కలక్టర్ పదవికి తగనని ఎగతాళి చేశారు. చివరికి నాతెలుగు ప్రతివాదాన్ని ఇంగ్లీషులోకి మార్చి ఇస్తేనే తీసుకున్నారు. హైకోర్టు స్థాయికి తెలుగు భాష ఇంకా వెళ్ళలేదు. మనము మన మాతృ భాషలను వదిలి ఆంగ్లానికి దాసోహమవటానికి సగం కారణం కోర్టులు, కోర్టులిచ్చే ఆంగ్ల తీర్పులే. ఇంగ్లీషు రాని వాళ్ళెవరూ కోర్టుల్లో పనికిరాని పరిస్తితి దాపురించింది.

దేశానికి ఆంగ్లమే దిక్కు అంటున్న న్యాయమూర్తులు కల్పించే ఇలాంటి అడ్డంకుల్ని అధిగమించి ప్రజల భాషలలో న్యాయస్థానాలు నడిచేలా చేయాలి. హైకోర్టుల్లో ప్రాంతీయ భాషలలో వాదనలు వినిపించేలా న్యాయవ్యవస్థతో సంప్రదింపులు లేకుండా కేంద్రమే ఓ నిర్ణయం తీసుకునేందుకు తగినన్ని అధికారాలను రాజ్యాంగం కల్పించిందని పార్లమెంటరీ సంఘం పేర్కొందికాబట్టి ఇప్పటికైనా కేంద్రం ప్రాంతీయ భాషలు బ్రతకడం కోసం తనకున్న రాజ్యాంగ అధికారాలు వినియోగించుకోవాలి. ప్రాంతీయ భాషలలో తీర్పులు ఇవ్వాలని చట్టం చెయ్యాలి. అవసరమైన చట్టాలు లేకుండా భాషోత్సవాలు ఎన్ని జరుపుకున్నా ఫలితం ఉండదు.



7. పార్లమెంట్ లో తెలుగు వినపడాలి

ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు అసలే కనిపించదన్నది చాలా మంది అనుకునే మాట. కర్నూలు జిల్లా శ్రీశైలం భూసేకరణ విభాగంలో ప్రత్యేక కలెక్టర్ నూర్ బాషా రహంతుల్లా లాంటి వారు ఈ అభిప్రాయానికి మినహాయింపుగా నిలుస్తారు. మూడు దశాబ్దాలుగా తెలుగును పాలనా భాషగా అమలు చేసేందుకు కృషి చేస్తున్న ఆయన... 'తెలుగు దేవభాషే' అంటారు. రహంతుల్లాతో 'తెలుగు వెలుగు' ముఖాముఖి...

తెలుగుపై అభిమానమెలా పెంచుకున్నారు?

మాతృభాషనాకుతల్లిలాంటిది.నాతల్లినినేనుగౌరవించుకోనా?చిన్నప్పటి నుంచి తెలుగంటే చెప్పలేనంత మమకారం. తీయనైన తెలుగును మింగేస్తున్న ఇతర భాషల ఆధిపత్యంపై అసంతృప్తి, ఆవేదనల నుంచే మాతృభాషాభివృద్ధి, పరిరక్షణకు ఏదో ఒకటి చేయాలన్న తపన కలిగింది మూడు దశాబ్దాలుగా భాషాభివృద్ధి పరిరక్షణకు కృషిచేస్తున్నారు.

ఈ క్రమంలో మీ అనుభవాలు, విజయాలు?

అమ్మభాషలోనే మన ఆలోచనలు వికసిస్తాయి. అందులోనే మన భావాలను సూటిగా, స్పష్టంగా రాయగలం. పశ్చిమ గోదావరి జిల్లాలో తహశీల్దారుగా పని చేస్తున్నప్పుడు 23 రిట్ పిటీషన్లకు తెలుగులోనే సమాధానాలు రాసి పంపితే పై అధికారులు కోప్పడ్డారు. అయినా చలించలేదు. న్యాయస్థానంలో విజయం సాధించా. నా కార్యాలయానికి వచ్చే విద్యార్థుల నుంచి రైతుల వరకు ధరఖాస్తులు, అభ్యర్థన పత్రాలను వారే రాసుకునే విధంగా నమూనాలను తెలుగులో తయారు చేయించి అందించా. ఇస్లాం, క్రైస్తవ మతాల మీద తులనాత్మక అధ్యయనం చేస్తూ తెలుగులో 10 పుస్తకాలు రాశా. తెలుగు సామెతలతో 1986 నుంచి 1991 వరకు గీటురాయి వారపత్రికలో 'ఉబుసుపోక' శీర్షికతో వ్యంగ్య వ్యాసాలు రాశా. 2003 లో అధికారభాషా సంఘం నుంచి విశిష్ట భాషా పురస్కారం అందుకున్నా. తెలుగులో డిగ్రీ చదివిన నాకు 5 శాతం ప్రాధాన్యత మార్కులు ఇవ్వడం వల్లే ఉద్యోగం వచ్చింది. గుంటూరు

జిల్లాలో భూసేకరణ అధికారిగా పనిచేసేటప్పుడు భూసేకరణ అవార్డు పత్రాలను తొలిసారి మాతృభాషలో ఇచ్చాం. చేయాలన్న సంకల్పం ఉంటే ఏదీ అసాధ్యం కాదు.

మాతృభాష పరిరక్షణ గురించి ఏమంటారు?

'మాతృభాషను ప్రేమించే వాడే నిజమైన దేశభక్తుడు' అని గిడుగు రామమూర్తి అన్నారు. మాతృభాషలో చదువుకుంటేనే ఆలోచనలు వికసిస్తాయి. కోర్టుల్లో, వాదనలు, తీర్పులు ఆంగ్లంలో ఉండటంవల్ల బాధితులు, ముద్దాయిలకు మధ్య లాయర్లు దుబాసీలుగా వ్యవహరించాల్సి వస్తోంది. శాస్త్ర సాంకేతిక విషయాలు ఆంగ్లంలో ఉండటం వల్ల ఆయా రంగాల ఫలాలు ఆ భాష రాని వారికి ఆమడదూరంలో ఉండిపోతాయి. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్లు, 'విద్యార్థుల గ్రాహ్యతకు, భావవ్యక్తీకరణకు మాతృభాష కీలకం. మాతృభాషలో విద్య నేర్పడం, నేర్వడం ఎంతో సులభం.' అన్న అంశాన్ని బలంగా నమ్ముతాను.

తెలుగును పాలనా భాషగా ఎందుకు అమలు చేయలేకపోతున్నాం?

తెలుగులోనే ఉత్తర, ప్రత్యుత్తరాలు జరగాలని అవిభాజ్య రాష్ట్ర ప్రభుత్వం గతంలో నాలుగు ఉత్తర్వులను ఇచ్చింది. వాటిని అమలు చేసే అధికారులే లేరు. నల్గొండ జిల్లాలో కలెక్టర్ ముక్తేశ్వరరావు ఈ ఉత్తర్వుల ఆధారంగానే ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో ఉండేలా చేయగలిగారు. పాలనా వ్యవహారాల్లో తెలుగుకు పెద్దపీట వేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లు దీనిని ఆదర్శంగా తీసుకోవాలి. ప్రభుత్వం తెలుగు అమలు తప్ప వేరే గత్యంతరంలేని పరిస్థితి కల్పించాలి. అప్పుడు పాలనా భాషగా తెలుగుకు ఆదరణ వస్తుంది. తెలుగు మాతృభాషగా ఉన్న ఉద్యోగులు లక్షలాది మంది పనిచేస్తున్నారు. మీ మాతృభాషలోనే దస్త్రాలు (ఫైళ్ళు) రాయండి. మీ మాతృభాషలోనే కార్యాలయ కార్యక్రమాలు నిర్వహించండి అని ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఏ ఉద్యోగీ వెనుకాడరు. కార్యాలయాల్లో కంప్యూటర్ల వినియోగం అధికంగా ఉంది. వాటిని మాతృభాషకు అనుసంధానం చేసుకోలేకపోతున్నాం. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఒక తెలుగు సాఫ్ట్ వేర్ ఉచితంగా ఇచ్చినా దాన్ని ఇన్‌స్టాల్ చేసుకోవడంలో విఫలమవుతున్నారు. ఆంగ్లాన్ని సులువుగా టైప్ చేసినట్లు తెలుగును కూడా టైప్ చేసే విధానం తీసుకురావాలి.

తెలుగు మాధ్యమ విద్యపై ఇప్పటి వారిలో అయిష్టత పెరుగుతోంది. కారణం? ఆంగ్లంలో నేరిస్తేనే వేగంగా ఉద్యోగాలు వచ్చి, అధిక సంపాదనకు అవకాశం ఉంటుందనే భ్రమతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆ భాష మీద మోజు చూపుతున్నారు. తెలుగువారి హృదయభాషను మన ప్రభుత్వం పాఠశాలల్లో తప్పనిసరి చేయలేకపోతోంది. తన దగ్గరికి వచ్చే భక్తులకు తెలుగులోనే సందేశాన్నిచ్చే వారు సత్యసాయి బాబా. అలా తెలుగు వినక తప్పని పరిస్థితి కల్పించారు. నా ఉద్దేశంలో రాజకీయ రంగంలో ఎన్టీరామారావు లాగా ఆధ్యాత్మిక రంగంలో సత్యసాయి తెలుగు భాషకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టారు. ఇక్కడ బాగా చదువుకుని ఎక్కువ జీతం వస్తుందని డాలర్ల కోసం విదేశాలకు వెళ్తున్న వారి గురించి 'ఎబ్రాడ్ లో ఏముంది బ్రాడ్ నెస్ మీలోనే ఉంది. దానిని వదిలిపెట్టి విదేశాలకు పోవడం పొరపాటు' అని బాబా చెప్పిన విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి.

ఆధునిక సాంకేతిక అవసరాలకు తగ్గట్టు తెలుగు లిపిలో మార్పులు అవసరమా? "56 అక్షరాలు ఉన్న తెలుగుభాష కంటే 26 అక్షారాలే ఉన్న ఇంగ్లీషు ఎక్కువ వాడుకలోకి వచ్చింది. ప్రపంచ భాష అయింది. కాబట్టి తెలుగుభాషకు 16 అక్షరాలే పెట్టి నంబర్ వన్ పొజిషన్ కు తెస్తాను చూడండి" అంటాడో నాయకుడు ఓ సినిమాలో. భాషా సంస్కర్తలు ఈ పనికి పూనుకోవచ్చు. తెలుగులో ఎదురయ్యే మొదటి సమస్య గుణింతాలు, ఒత్తులు. అవసరమైన అక్షరాలను, ఒత్తులను వదిలించుకోవాలి. బ్రౌన్ కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా తెలుగు ముద్రణ చాలా లోపాలతో సాగుతూ వచ్చింది. ముద్రాక్షరాల సంఖ్యను 405 కన్నా తగ్గించడం ఎవరికీ సాధ్యం కాలేదు. బందరులోని కళ్యాణి టైపు ఫౌండ్రీ అధిపతి కె.వి. కొండయ్య అక్షరాల సొంపు చెడకుండా ముద్రణా యంత్రానికి ఒదిగే విధంగా టైపు తయారీలో సాంకేతిక మార్పులు చేసి 350 కి తెలుగు లిపి రూపాలను కుదించారు. దీన్ని 'కళ్యాణి' టైపు అన్నారు. ఇది కంప్యూటర్ యుగం. వేగం నేటి యుగధర్మం. ఈ వేగానికి తట్టుకోలేనిదేదీ నేడు నిలవలేదు. తెలుగుభాషకు ఇది సంధిదశ. మద్రాసులో మురళీ కృష్ణ అనే ఇంజనీరు బాపు అక్షరాలతో సహా అందంగా అక్షర స్వరూపాలను కంప్యూటర్ ప్రింటింగ్ కు అనువుగా కీబోర్డు రూపొందించారు. లిపిని ఇంకా సంస్కరించి తెలుగుభాషా స్వరూపాన్ని ఆధునీకరించడానికి

ప్రయత్నించాలి. చిన్నారులపై లిపి భారం అధికంగా ఉంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలి.

కంప్యూటర్లలో తెలుగు వాడుక ఎలా ఉంది. ఇంకా పెంచాలంటే ఏం చేయాలి? ఇప్పుడు మంచి సాంకేతిక ఉపకరణాలు వచ్చాయి. కొన్ని సమస్యలు తీరాయి. ఇంకా కొన్ని సమస్యలు తీరాలి. అన్ని రకాల ఖతుల(ఫాంట్ల)ను యూనికోడ్ లోకి మార్చుకునే వెసులుబాటు ఉండాలి. రకరాల కీబోర్డులు, ఖతులతో కుస్తీ పడుతున్నాం. ఈ అవస్థ తీరాలంటే యూనికోడ్ లో మాత్రమే పుస్తకాలు ముద్రించమని కోరాలి. అలా చేస్తే ప్రపంచంలో ఉండే తెలుగువాళ్ళు ఎక్కడి నుంచైనా తెలుగు పుస్తకాలను, వ్యాసాలను కంప్యూటర్లలో సులభంగా చదవగలుగుతారు, రాయగలుగుతారు. విషయాలను వెతకగలుగుతారు. రాష్ట్రంలోని ప్రభుత్వ వెబ్ సైట్లను తెలుగులోకి అనువదించనున్నారు. తెలుగు రాయడానికి, తెలుగులో సమాచారం చదవడానికి, చూడటానికి అనుకూలంగా బ్రౌజర్లు ఉండేలా చూడాలి. సమాచారం అంతా తెలుగులో డాక్యుమెంట్ రూపంలో అందుబాటులో ఉండాలి. ఆరు భిన్న రూపాల్లో ఏక సంకేత లిపి తెలుగు ఫాంట్ అభివృద్ధి చేయాలి. తెలుగు అక్షర క్రమం సరిచూసుకోవడానికి పదాల విశ్లేషణ సాఫ్ట్ వేర్ అభివృద్ధి చేయాలి. ఇది ఉచితంగా అందరికీ అందుబాటులో ఉండాలి. గౌతమి, వేమన, పోతన, అకృతి వంటి 50 కి పైగా యూనికోడ్ ఫాంట్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే అందుబాటులో ఉన్న తెలుగు వాడే పద్ధతులను ప్రజల్లో ప్రచారం చేయాలి.

తెలుగు కీర్తనలకు దిగివచ్చిన దేవుళ్ళు బమ్మెర పోతన, కంచర్ల గోపన్న (రామదాసు), త్యాగయ్య, అన్నమయ్య, ఉమర్ అలీషా లాంటి ఆధ్యాత్మిక వేత్తలు, సంగీతకారులు, మహాభక్త గాయకులు, భగవంతుని దయానుగ్రహాలపై తమకు హక్కు ఉన్నట్లుగా రచించిన కీర్తనలన్నీ తెలుగులో ఉన్నాయి. ఆ కీర్తనలు విని దేవుళ్ళే దిగి వచ్చారని బడాయిపోతుంటాం. వాళ్ళ భాషను మాత్రం దైవ భావన లేకుండా అగౌరవ పరుస్తాం. ఇదేం నీతి? రామభద్రుడు పలికిస్తేనే భాగవతం తాను పలికానని పోతనే స్వయంగా చెప్పుకున్నాడు. ఇక పోతన రాయలేక వదిలేసిన పద్యాలను రాముడే వచ్చి తెలుగులో పూరించాడనీ, తానీషాకు డబ్బు చెల్లించి రామదాసును చెర

విడిపించాడనీ ఎన్నో గొప్పలు చెప్పుకుంటాం కదా! అలాంటప్పుడు తెలుగు దేవభాషే కదా! ఒక వేళ అలా అనిపించకపోతే మనలో ఏదో తేడా ఉన్నట్లే.

మీ 'మహా నిఘంటువు' యజ్ఞం ఎంత వరకు వచ్చింది... దాని లక్ష్యం?
మహా నిఘంటువు నిర్మాణం తెలుగు భాషాభివృద్ధికి దోహదం చేస్తుంది. అదింకా ఆరంభ దశలో ఉంది. తెలుగునేల భిన్న ప్రాంతాల్లోని ప్రజల తెలుగు మాండలికాలు, ఆయా ప్రాంతాలకే పరిమితమైన కొన్ని వేల ప్రత్యేక పదాలు ఇప్పుడున్న నిఘంటువుల్లో లేవు. దీంతో ప్రస్తుతమున్న నిఘంటవులు కొంత మేరకే ఉపయోగపడుతున్నాయి. ఆయా కొత్త పదాలన్నింటినీ సేకరించి, వరస క్రమంలో పేర్చి కొత్తగా నిఘంటువు నిర్మాణం చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. కొల్లేరు ప్రాంతంలో పదుల సంఖ్యలో చేపల పేర్లు వాడుకలో ఉన్నాయి. కమ్మరి, కంసాలి ఇలా ప్రతీ కులానికి, వృత్తికే ప్రత్యేకమైన పద సంపద ఎంతో ఉంది. ఇదంతా నేడు కనుమరుగైపోతోంది. ఇవన్నీ నిఘంటువులో చేర్చాలి. హైదరాబాద్ లోని 'ఫ్లై ఓవర్' లను చూసి కొందరు పల్లె వాసులు 'పైదారులు' అన్నారు. తాను చూసిన వస్తువుకు తన భాషలో ప్రతి మనిషీ ఒక పేరు పెట్టుకుంటాడు. ఆ పేరును గౌరవించి నిఘంటువుల్లో చేర్చుకున్న జాతి ఆ జాతి భాషా బలపడతాయి. మన పాలకులు, సాహితీవేత్తలు, అధికారులు ఈ సత్యాన్ని గ్రహించి ముందుకు నడవాలి.

భాషా పరిరక్షణలో ప్రసార మాధ్యమాల పాత్ర?
తెలుగుభాషా పరిరక్షణకు రామోజీరావు చిత్తశుద్ధితో తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఆయన వ్యక్తిగా చేస్తున్న ప్రయత్నాలను ప్రభుత్వాలు ఒక వ్యవస్థగా చేయాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు సాఫ్ట్ వేర్ వినియోగంలో అధికారులు పడుతున్న ఇబ్బందుల్ని 'ఈనాడు' వంటి తెలుగు పత్రికలు సునాయాసంగా అధిగమిస్తున్నాయి. ఇలాంటి సులభమైన సాంకేతిక మెలకువలు అందరికీ వివరించి, ఆయా సాఫ్ట్ వేర్ లను ప్రభుత్వానికి అందించి సాధారణ పౌరులు సైతం వినియోగించేలా సాయం చేయాలి. పత్రికలు తెలుగుపై అనురక్తిని పెంచేందుకు కృషి చేయాలి. తెలుగుభాషకు సేవ చేసే వాళ్ళను గుర్తించి వారి పరిచయాలను అందరూ ప్రచురిస్తే ఆ స్ఫూర్తి మరింతమంది భాషాభిమానులను తయారు చేస్తుంది.

నూర్ బాషా రహంతుల్లా 1959 ఏప్రిల్ 18న గుంటూరు జిల్లా కంకటపాలెంలో జన్మించారు. నూర్ బాషా రోషన్ బీ, మౌలాలీ దంపతులు ఆయన తల్లిదండ్రులు. ఎం.కాం. చదివిన రహంతుల్లా వివిధ పత్రికల్లో తెలుగు భాష, పరిపాలన సంబంధమైన వ్యాసాలు ప్రచురించారు. వివిధ అంశాలపై 10 తులనాత్మక పరిశీలనా గ్రంథాలు రాశారు. అన్ని మాండలికాల పదాలతో ఆధునిక అవసరాలు తీరేట్లుగా తెలుగు మహా నిఘంటువు నిర్మాణం, తెలుగు లిపి సంస్కరణ, పాలనా వ్యవహారాలు తెలుగులో సాగించడం కృషి చేస్తున్నారు.

మీ కార్యాలయంలో తెలుగు వినియోగంపై ఎలాంటి శ్రద్ధ తీసుకుంటున్నారు? ఈ విషయంలో సహోద్యోగుల తోడ్పాటు?
మా కార్యాలయంలో గతంలో ఆంగ్లంలో ఉన్న అన్ని దరఖాస్తు నమూనాలను తెలుగులోకి మార్పించా. మా నుంచి జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ విధిగా తెలుగులోనే నిర్వహించాలని ఆదేశించా. దాన్ని వంద శాతం అమలు చేస్తున్నాం. సాధ్యమైనంత వరకు అన్ని అధికారిక కార్యక్రమాల్లో తెలుగుకే ప్రాధాన్యత ఇస్తున్నాం. ముఖ్యంగా న్యాయస్థానాలతో చేసే ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే నిర్వహించేందుకు కృషి చేస్తున్నాను.

ఉన్నతాధికారులకు పని ఒత్తిడి ఉంటుంది మరి మీరు తెలుగుకు సమయం ఎలా కేటాయిస్తున్నారు? అధికార భాష అమలు కావడానికి ఉన్నతాధికారులే ఆటంకం అన్న వాదనలున్నాయి. మీరేమంటారు?
నెలలో రెండు, మూడు రోజులు అమ్మ భాష సేవ కోసం కేటాయించలేనంత పని ఒత్తిడి ఏమీ లేదు. ఉన్న సమయాన్నే ప్రణాళికాబద్ధంగా వినియోగించుకుంటున్నాను. వ్యక్తిగా ఏ ఉన్నతాధికారీ అధికారభాష అమలయ్యేందుకు ఆటంకమని నేను అనుకోను. వ్యవస్థలో ఉన్నతాధికారులు అధికారభాష తెలుగును పక్కాగా అమలు చేయడానికి కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ సమస్యలు తొలగించాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాల్లో జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులో ఉంటూ ఇతర రాష్ట్రాలు, కేంద్రంతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలు ఆంగ్లంలో ఉన్నా ఫర్వాలేదు. అయితే అంతర్గత ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే ఉండాలన్న నిబంధన, అమలయ్యేలా అధికార భాషా సంఘం ఒత్తిడి తీసుకురావాలి.

ఏ కార్యాలయంలోనైనా కీలక పత్రాలు ఆంగ్లం, హిందీల్లోనే ఉంటాయి. మరి సగటు తెలుగువాళ్ళ పరిస్థితి ఏంటి?
దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య, ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య సేతుభాషగా ఇంగ్లీషు రూపొందడమే అధికారభాషగా తెలుగు అమలుకు ప్రధాన అవరోధంగా కనిపిస్తోంది. ఆంగ్లం ప్రభావం ముందు ప్రాంతీయ భాషలు వెలవెలబోతున్నాయి. తెలుగుజాతికి గౌరవం దక్కాలంటే రెండో జాతీయ అధికార భాష తెలుగు కావాలి. అందుకు తెలుగు ఎంపీలందరూ కృషి చేయాలి. పార్లమెంటులో రాష్ట్ర విభజన సమయంలో తెదేపా ఎంపీ హరికృష్ణ తెలుగులో మాట్లాడతానంటే స్పీకర్ ఎగతాళిగా చూశారు. రెండో అధికారభాషగా గుర్తిస్తే హిందీ వాళ్ళలా పార్లమెంట్ లో తెలుగులోనే మాట్లాడొచ్చు. కేంద్ర ఉత్తర్వులను తెలుగులో పొందవచ్చు. హిందీ వల్ల హిందీ మాట్లాడేవాళ్ళు ఎన్ని ప్రయోజనాలు పొందుతున్నారో అవన్నీ తెలుగువాళ్ళు కూడా పొందవచ్చు. స్థానిక భాషలోనే సమాధానాలు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం నిబంధన. ఇక్కడేమో తెలుగులో సమాచారం ఇవ్వడం లేదు... ప్రభుత్వ దస్త్రాలు తెలుగులో ఉంటే సమస్యే లేదు. సమస్య అంతా ఆంగ్లంలో ఉండటం వల్లనే. ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ తెలుగులోనే ముద్రిస్తారు. ఎందుకో తెలుసా? చట్టం గట్టిగా చెబుతుంది కాబట్టి. ఇదే చట్టం తెలుగుభాష అమలుకు కూడా వర్తించాలి. చట్టం, నిర్బంధం ఉంటే తెలుగు అమలుకు ఆటంకమే ఉండదు.

ప్రస్తుతం విశ్వవిద్యాలయాల్లో పరిశోధన ఎలా ఉంది?
మన భాషను మనమే పాడుచేసుకుంటూ పోతున్నాం. తెలుగు మీద అన్యభాషల ప్రభావం ఉందని పరిశోధనలు చేశారేగానీ, ఫలానా భాష మీద తెలుగు ప్రభావం ఉందని ఒక్కరూ పరిశోధన చేయలేదు. ఈ పని తెలుగు విశ్వవిద్యాలయం చేయాలి. విద్యార్థులను ప్రోత్సహించాలి.

ముస్లింలకు తెలుగులోనే నిఖానామా రూపొందించారు. దానిపై స్పందన...తెలుగులో పెళ్ళి తంతు జరగాలనే కోరిక తెలుగువారిలో పెరుగుతోంది. వివాహ విధి వాధానమంతా మనకు తెలియాలి అంటూ సామల రమేష్ బాబు తన ఇద్దరు కొడుకుల పెళ్ళి తెలుగులోనే చేశారు. కవిరాజు త్రిపురనేని రామస్వామి పెళ్ళిళ్ళన్నీ తెలుగులోనే చేయాలని

ఉద్యమం చేపట్టారు. వెనిగళ్ళ సుబ్బారావు 'పెండ్లి మంత్రాల వెనుక బండారం' అనే పుస్తకంలో తీవ్రమైన ప్రశ్నలు కూడా లేవనెత్తారు. ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు ఉర్దూలో ముద్రించిన 8 పేజీల పెళ్ళిపుస్తకం నిఖానామా ఖాజీలకు సరఫరా చేస్తుంది. దీన్ని తెలుగులో ముద్రించాలని వక్ఫ్ బోర్డుకు రాశాను. ప్రస్తుతం తెలుగులో కూడా నిఖానామాలు అందుతున్నాయి.

ప్రస్తుతం మన సాహిత్యం పరిస్థితి? తెలుగు సాహిత్యాన్ని యువత ఆకర్షించాలంటే...?

ప్రస్తుతం తెలుగులో చదివితే మంచి జీతాలొచ్చే ఉద్యోగాలు రావేమో అన్న భ్రమలో ఉన్నారు. ఇక తెలుగులో విజ్ఞాన శాస్త్ర సాహిత్యం అంత ఎక్కువగా రాలేదు. కంప్యూటర్ రంగంలో నిలదొక్కుకోవాలంటే ఆంగ్లం బాగా రావాలి అనుకుంటున్నారు. కంప్యూటర్ కోసం తెలుగును బలిపెట్టడమంటే ఎలుకలున్నాయని ఇంటిని తగులబెట్టడమే. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో మాతృభాష కన్నడం కాని వారైనా సరే.. మూడో భాషగానైనా కన్నడం చదవాల్సిందే. కన్నడం లేకుండా అక్కడ పాఠశాల విద్య పూర్తికాదు. ప్రభుత్వోద్యోగాల్లో 15 శాతం మార్కులు కన్నడ మాధ్యమం వాళ్ళకు ప్రోత్సాహకంగా కేటాయించారు. ఇలాంటి విధానాలు మనమెందుకు అమలు చేయలేక పోతున్నాం. భాషను సాహిత్యానికి, కవిత్వానికి మాత్రమే పరిమితం చేస్తే, భాషతో పాటు ఆ భాష మాట్లాడేవారూ వెనుకబడి పోతారు. అందుకే భాషను ఉపాధితో ముడిపెట్టాలి. అప్పుడే యువతరంలో తెలుగుపై అభిమానాన్ని ప్రోది చేయగలుగుతాం.

(తెలుగు వెలుగు ఆగస్టు 2014)

తెలుగును రెండో జాతీయ భాషగా ప్రకటించాలి

ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమ డిమాండ్

21.12.2017

ఈనాడు, అమరావతి: తెలుగును రెండో జాతీయ భాషగా ప్రకటించాలని ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా 15 కోట్ల మంది తెలుగు భాష మాట్లాడుతున్నట్లు చెప్పిన రాష్ట్రపతి కోవింద్, ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ విషయాన్ని ప్రధాని మోదీకి చెప్పి జాతీయ స్థాయిలో రెండో భాషగా తెలుగును గుర్తించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ట్యాంక్‌బండ్‌పై కాళోజీ నారాయణరావు, ఆచార్య జయశంకర్, చాకలి ఐలమ్మ, వినోభాభావే, మల్లు స్వరాజ్యం, నల్లమలగిరి ప్రసాద్, భాగ్యరెడ్డి, చొక్కారావు, వెంగళరావు, చెన్నారెడ్డి, రాజమల్లు, అంజయ్య తదితరుల విగ్రహాలను కూడా ఏర్పాటు చేయించాలని తెలంగాణ ముఖ్య మంత్రి చంద్రశేఖర్‌రావుకు ఈ సందర్భంగా ముద్దుకృష్ణమనాయుడు సూచించారు.


సర్వీస్ కమిషన్లకు తెలుగు భాషా సేవ చేసే ఛాన్స్!

8. సర్వీస్ కమీషన్లు తెలుగు సేవ చెయ్యాలి !

ఉద్యోగాల భర్తీకి కసరత్తు చేస్తున్న సర్వీస్ కమిషన్లు
-తెలుగు మాధ్యమ విద్యార్థులకు ఛాన్సు ఇవ్వాలి
-5 శాతం అదనపు మార్కులతో ప్రోత్సహించాలి
-తెలుగు మాట్లాడే జనం సమస్య తీర్చే పోస్ట్ లు
-తెలుగుభాషలోనే వ్యవహారాలు సాగాలి
-ప్రజలతో మమేకమైతేనే రాష్ట్రాల అభివృద్ధి
-జనం భాషకు ప్రభుత్వాలు పట్టం కట్టాల్సిందే

తెలుగుభాషకూ, తెలుగు విద్యార్థులకూ సేవ చేసేందుకు సర్వీస్ కమీషన్లకు మంచి అవకాశం వచ్చింది. త్వరలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలు రెండూ భారీ ఎత్తున గ్రూప్-2,3 సర్వీసు ఉద్యోగాలను భర్తీ చేయబోతున్నాయి. వీటిలో మున్సిపల్ కమిషనర్, ఏసీటీఓ, సబ్ రిజిస్ట్రార్ , డిప్యూటీ తహసిల్దార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, అసిస్టెంట్ డెవలప్ మెంట్ ఆఫీసర్, ఎక్సైజ్ టెన్షన్ ఆఫీసర్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సీనియర్ ఆడిటర్, సీనియర్ అకౌంటెంట్, జూనియర్ అకౌంటెంట్, జూనియర్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ సెక్రెటరీ లాంటి ఉద్యోగాలున్నాయి. తెలుగు ప్రజలతో వ్యవహరించే ఉద్యోగాలే ఇవన్నీ ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్. లాంటి ఉన్నతోద్యోగాలు కావు. తెలుగు ప్రజలతో మమేకమై వారితో ముఖాముఖి తెలుగులో మాట్లాడుతూ వారిమధ్యే నివసిస్తూ వారికి సేవలందించే ఉద్యోగాలు. తెలుగు ప్రజల సమస్యలను సరిగ్గా విశ్లేషణ చేయాలి. గ్రామ సామాజిక, ఆర్థిక వ్యవస్థ పై తగిన అవగాహన తెచ్చుకోవాలి. ప్రజా పరిపాలన పరిజ్ఞానం పెంచుకోవాలి. అక్కడి ప్రజలు వారి భాషలో చెప్పే సమస్యలు, పరిష్కారాలు, సూచనలు వినాలి, రాయగలగాలి . ఈ నైపుణ్యాలన్నీ ప్రజల భాష లో తెలుగు మాధ్యమంలో చదివిన వారికే ఎక్కువగా ఉంటాయి.

తెలుగు విద్యార్థులకు ఎన్ని ఉద్యోగాలు?

ఈ ఉద్యోగాలలో తెలుగు మాధ్యమం ద్వారా డిగ్రీలు చేసిన వారికి ఎన్ని దక్కుతాయనేదే నేటి ప్రశ్న. జన్మభూమినీ మాతృభాషను మరువకండి అని పదే పదే తెలుగు నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు. మన తెలుగుకు ప్రాచీన భాష హోదా రాకుండా అడ్డుపడిన తమిళులతో పోరాడి మరీ సాధించారు. ప్రాచీన భాషా కేంద్రాన్ని కూడా తెలుగు నేలపైకి త్వరలో తేబోతున్నారు. ప్రజల భాషకు పరిపాలనలో పట్టం కడతామనే నాయకుల వాగ్దానాలు రెండు రాష్ట్రాల్లో వినబడుతున్నాయి. తెలుగును ఉపాధి వనరుగా మార్చాలని అందరూ కోరుతున్నారు. కొందరైతే ప్రజల భాష పదికాలాలపాటు పాలించాలని తపిస్తున్నారు కూడా. తెలుగు విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు పొందేలా ప్రజా సేవ (పబ్లిక్ సర్వీస్) చేసే బంగారం లాంటి అవకాశం మన సర్వీసు కమీషన్లకు వచ్చింది.

తెలుగు మాధ్యమ అభ్యర్థులను ఆదరించాలి

2012 ప్రపంచ తెలుగు మహాసభల్లో చేసిన తీర్మానాలు ప్రకటించిన విధానాలు చూస్తే తెలుగు ప్రాణం పోసుకొని తిరిగి లేస్తుందనిపించింది. కాల గమనంలో మన ఆశలు నీరుగారిపోయాయి. 2016లో కూడా మళ్ళీ అవే అంశాలపై అవకాశాలు అన్వేషిస్తున్నాం. తెలుగునాట తెలుగు మీడియం విద్యార్థులకు పోటీ పరీక్షల్లో ఇంగ్లీషు చదువు వల్ల, విదేశాల్లో కొలువులవల్ల డబ్బు సంపాదన విపరీతంగా ఉంది కాబట్టే అటు జనం పరుగులు పెడుతున్నారు. ఇక్కడే ఉండి దేశ ప్రజలకే సేవ చెయ్యండి, విదేశాలకు పోకండి అని వావిలాల, కాళోజీ లాంటి మహనీయులు ఎంతగా చెప్పినా ఎవరూ వినలేదు. వినటం లేదు. కారణం తెలుగు మాత్రమే చదివితే ఉద్యోగాలు రాని పరిస్థితి ఉంది. తెలుగు భాష ద్వారా కూడా ఉద్యోగాలూ, డబ్బు వస్తుంటే అప్పుడు కొందరైనా స్వార్థం కొంత చంపుకొని తెలుగులో విద్యభ్యాసం చేస్తున్నారు. భాషతో సాంకేతిక, ఆర్థిక విషయాలను ముడిపెట్టకుండా అభివృద్ధి సాధ్యం కాదు. సమస్త వ్యవహారాలు మాతృభాషలో జరిగే దేశాలే అభివృద్ధి చెందుతాయి. భాష పేరుతో ఐక్యత కోరే వాళ్ళు ఆ భాషను బ్రతికించటానికి కూడా కృషి చెయ్యాలి. మాతృ భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనదే ప్రోత్సాహకాలు కావాలి.

తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు పోటీ పరీక్షల్లో

ప్రోత్సాహకాలు ప్రకటిస్తే తెలుగు మనుగడకు దోహద పడుతుంది. గ్రూప్ 1, గ్రూప్ 2 సర్వీసు ఉద్యోగాలలో డిగ్రీ తెలుగు మీడియంలో చదివిన వారికి గతంలో ఇచ్చిన మాదిరే 5% ప్రోత్సాహక మార్కులు ఇస్తే, తెలుగులో కార్యాలయ వ్యవహారాలు నడిపే వాళ్ళు రంగప్రవేశం చేస్తారు. కొంతవరకైనా ఆఫీసుల్లో తెలుగు బతికి బట్టకడుతుంది. తెలుగు మీడియంలో చదివితే ఉద్యోగా లొస్తాయన్న ఆశతో కొంత మందైనా తెలుగులో చదువుతారు. తెలుగులో చదివిన అధికారులు కార్యాలయాల్లో జరిగే పనులన్నిటికీ "కొత్తపదాలు" పుట్టిస్తారు. తెలుగు పదకోశాలు అమలవుతాయి. పరిపాలనకు పనికొచ్చే శాస్త్రీయ తెలుగు తయారవుతుంది. అధికార భాషగా తెలుగును అమలు చేయాలనే పట్టుదల, ఆకాంక్ష ఉంటే తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థుల్ని ప్రోత్సహించి అధికారులుగా చేయాలి. కేవలం తెలుగు మీడియంలో మాత్రమే చదివిన వాడికి ఇంగ్లీషురాక పోయినా ఎటువంటి శాస్త్ర సాంకేతిక రంగంలోనయినా ఉద్యోగం గ్యారంటీగా వస్తుందనే భరోసా కల్పించాలి. భాషను ఉపాధికి సాంకేతికతకు ముడి పెట్టాలని దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం అన్నారు. అంటే తెలుగు మాధ్యమంలో చదివినా కలెక్టరు, డాక్టరు, ఇంజనీరు కాగలిగే విధంగా మన విద్యా వ్యవస్థ మారాలి! తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు సర్వీసుకమీషను పరీక్షల్లో రిజర్వేషన్లో, ప్రోత్సాహక మార్కులో తిరిగి ఇప్పించటానికి కృషి చేస్తామని 2012 ప్రపంచ తెలుగు మహాసభల్లో చేసిన ప్రకటన ప్రభుత్వ ఉత్తర్వుగా రావాల్సిఉంది.

తమిళనాడు భాషా విధానం అనుసరణీయంకోయంబత్తూరులో జరిగిన ప్రపంచ తమిళ మహాసభల్లో తమిళ మాధ్యమ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు సులభంగా లభించేలా కొన్ని తీర్మానాలు చేశారు. తమిళ మీడియం అభ్యర్థులకు ఉద్యోగాలు దొరకక పోతే ప్రజలు పిల్లల్ని తమిళ మాధ్యమం లో చదివించరనీ, ఎవరూ చదవని భాష నశిస్తుందనీ, తమిళం పదికాలాలపాటు బ్రతకాలంటే ఆభాషలో మాత్రమే చదివిన వారికి వెనుక బడిన కులాలవారికి ఇస్తున్నట్లుగా ఉద్యోగాలలో కూడా రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్మానం చేశారు. అందుకోసం అత్యవసరంగా ఒక ఆర్డిన్స్ తెచ్చారు. శాసన సభలో, స్థానిక సంస్థల్లో, ప్రభుత్వ కార్పోరేషన్లు, కంపెనీలలో తమిళ అభ్యర్థులకు 20 శాతం ఉద్యోగాలు

ఇవ్వాలని శాసించారు. తమిళనాడు ప్రభుత్వం జీవో ఎం ఎస్ నంబర్ 145 డిపార్ట్ మెంట్ తేదీ. 30.09.2010 ద్వారా తమిళ మీడియం లో డిగ్రీ వరకు చదివిన అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో 20 శాతం రిజర్వేషన్ ఇస్తున్నారు. చెన్నై హైకోర్టు కూడా 23.2.2016 న ఈ చట్టాన్ని సమర్థించింది. ప్రమోషన్లలో కాకుండా ప్రభుత్వోద్యాగాలకు మొదటిసారిగా నేరుగా జరిపే నియామకాలకు తమిళ మాధ్యమంలో చదివిన అభ్యర్థులకు 20% ఉద్యోగాలు రిజర్వు చేయడంలో ఎలాంటి తప్పూ లేదని తేల్చేసింది. రాజ్యాంగంలోని 345 ఆర్టికిల్ ప్రకారం ఎవరి భాషను వాళ్ళు కాపాడుకోవాలని, ఆయా రాష్ట్రాలలో పాలనాభాషగా అధికారభాషగా అభివృద్ధి చేసుకోవాలని కూడా తెలియ జేసింది.

తెలుగు రాష్ట్రాల 'సర్వీస్' కమీషన్ల కర్తవ్యం

తెలుగు మీడియంలో డిగ్రీ చదివిన వారికి తమిళనాడు తరహాలో 20% ఉద్యోగాలు రిజర్వేషన్ ఇవ్వాలి ఉమ్మడి రాష్ట్రంలో 1985 వరకు ఇచ్చినట్లు పోటీ పరీక్షల్లో 5% ప్రోత్సాహక మార్కులు ఇవ్వాలి. తెలుగు అభివృద్ధి మంత్రిత్వ శాఖల పెద్దలందరూ ఇలాంటి ప్రతిపాదనల అమలుకు ఆహ్వానం పలుకుతున్నారు. అడ్డుచెప్పటం లేదు. కాబట్టి తెలుగు నిరుద్యోగులకు ప్రోత్సాహకాలు అందజేసే మంచి అవకాశం సర్వీస్ కమీషన్లకు వచ్చింది. ఉద్యోగ నియామకాలు పూర్తయ్యే లోపు ఈ ప్రతిపాదనలను పబ్లిక్ సర్వీసు కమీషన్లు ప్రభుత్వానికి పంపి ఆమోదం పొందాలి.

(సూర్య 12.11.2016)


భాషకు పెద్దపీట వేయాలి

9. తెలుగు వాడుక భాషలో పాలన జరగాలి

8 తెనాలి తెలుగు మహోత్సవంలో నేను చదివి సమర్పించిన వినతి పత్రం: పాలనా భాషగా తెలుగుఅమలులో ఎదురౌతున్న సమస్యలు – అనుభవాలు -పరిష్కారాలు తెలుగులో పాలన కోసం అవసరమైన పనులన్నీ చేస్తామని ముఖ్యమంత్రులు అందరూ ప్రకటించారు. ప్రజాస్వామ్య పాలనలో ప్రజావాక్కే శిరోధార్యం. తెలుగులో పరిపాలన కార్యక్రమం విజయవంతం కావటానికి కేవలం ప్రభుత్వ సాయం మాత్రమే సరిపోదు. ప్రజల పట్టుదల,ప్రయత్నం, ఆదరణ కూడా కావాలి. వాస్తవానికి అధికారభాషగా తెలుగును పాలనలో అమలు చేయటంలో పాలకులకు, అధికారులకు ఇంకా కొన్ని సమస్యలు ఎదురౌతున్నాయి. ప్రభుత్వం అవసరమైన ఉత్తర్వులు చాలావరకు ఏనాడో ఇచ్చింది. ఆ ఉత్తర్వులను అమలు చేయాల్సిందిఅధికారులే. వాటినిఎందుకుఅమలుచేయలేకపోతున్నారో కారణాలు తెలుసుకోవాలి. నిర్లక్ష్యంతో తెలుగులో దస్త్రాలను నిర్వహించని వారిని శిక్షించాలి. కాలయాపనకు సహేతుకమైన కారణాలు ఉంటే వాటికి పరిష్కార మార్గాలు అన్వేషించాలి. ఇప్పటి వరకు వచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులు సరిగా అమలుకు నోచుకోలేదు. ఉత్తరువులను అమలుచేయటంలో అధికారులకు కలుగుతున్న ఆటంకాల పరిష్కారానికి అవలంబించదగ్గ పద్ధతులు పరిశీలిద్దాం.

నేను ఒక గుమాస్తా స్థాయి నుండి తహసీల్దారు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలక్టర్ వరకు అనేక ఉద్యోగాలు చేశాను. తెలుగు భాషలో ఫైళ్ళ నిర్వహణ, ఉత్తరప్రత్యుత్తరాలలో నాకు ఎదురైన అనుభవాలు, సమస్యలు, నాకు తోచిన సలహాలు పరిష్కార మార్గాలు మీతో పంచుకుంటాను: అనుభవం1 : ఆంగ్ల న్యాయవ్యవస్థతో: పశ్చిమ గోదావరిజిల్లా మొగల్తూరు మండలంలో ఎమ్మార్వోగా ఉండగా 23 రిట్ పిటీషన్లకు పేరావారీ జవాబులు తెలుగులోనే రాసిపంపాను. కలెక్టరేట్ నుండిఫోన్. తెలుగులో ఎందుకు పంపారనే ప్రశ్న. తెలుగులోనైతే జవాబులుతప్పుల్లేకుండా సూటిగా, స్పష్టంగా ఇవ్వగలననీ, అర్థంకాక పోవడమనే సమస్యేరాదనీ, వాటిని యధాతథంగా హైకోర్టుకు సమర్పించమనీ, కాదు కూడదంటే ఇంగ్లీషులోకితర్జుమా చేయించి

జిల్లా కేంద్రం నుండే హైకోర్టుకు పంపించండనీ వేడుకున్నాను. అప్పుడు 167/19.3.1988 అనే ప్రభుత్వ ఉత్తర్వు నన్ను ఆదుకుంది. దాని ప్రకారం ఆంగ్లంలో వచ్చిన ఏ ఉత్తరం పైనా, ప్రతిపాదనపైనా ఎలాంటి చర్యతీసుకోకుండా తిప్పి పంపే అధికారం ప్రతి గజిటెడ్ అధికారికీ ఉంది. తమకంటే పై అధికారుల కార్యాలయాలనుండి వచ్చినా సరే ఆంగ్లంలో వచ్చిన లేఖలను తిప్పిపంపవచ్చు. ఈ విధంగా చేయడం వల్ల జరిగే కష్ట నష్టాలకు, జాప్యానికీ వాటిని ఆంగ్లంలో పంపిన అధికారులదీ, కార్యాలయాలదే బాధ్యత. ఈ జీవో పుణ్యాన వారు నన్నేమీ అనకుండా వాటిని ఆంగ్లంలోకి మార్పించి హైకోర్టులోనివేదించారు.

మన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంఘ్వీ ఇలా అన్నారుః "మాతృమూర్తికి ఎంతటిగౌరవం ఇస్తామో మాతృభాషకు అంతటి సమున్నత స్థానం దక్కాలి. నేను తల్లితోసమానంగా తల్లిభాషనూ గౌరవిస్తాను. అందరూ మాతృభాషలో మాట్లాడండి. న్యాయస్థానాల్లో వాదనలు కార్యకలాపాలు ఆంగ్లంలో కొనసాగడమేంటి? ఇంకా ఎంతకాలం ఈదారుణం? న్యాయస్థానాల్లో వ్యవహారాలు సామాన్యుడి భాషలో కొనసాగినప్పుడే సామాన్యుడికి న్యాయం అందివ్వగలం." ("అమ్మనే మరుస్తారా!" ఈనాడు 27-2-2006). కరీంనగర్ జిల్లా సిరిసిల్ల ఆర్డీవో నాగేందర్150 పేజీల ప్రతివాదనను తెలుగులో రూపొందించి హైకోర్టులో దాఖలు చేస్తే, దానిని హైకోర్టు కూడా సదభిప్రాయంతో స్వీకరించింది. ఇందుకు ఎ.బి.కె. ప్రసాద్ గారు హర్షం వ్యక్తం చేస్తూ, ఆర్డీవోకు అభినందనలు తెలియజేశారు. (ఈనాడు 28.6.2006) ఇలాంటి వారిని గుర్తించి ప్రోత్సహించాలి.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి లాంటి పెద్దలంతా కక్షిదారుల భాషలోనే హై కోర్టుల్లో కూడా వాదనలూ తీర్పులు ఉండాలని చెబుతున్నారు కదా అన్న ధైర్యంతో ఇటీవల ఒక కేసులో తెలుగులో ప్రతివాదన తయారుచేసి తీసికెళితే హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది దానిని తిరస్కరించారు. హైకోర్టులో తెలుగు వాదన చెల్లదు అన్నారు. తెలుగులో వాదన తెచ్చినందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంగ్లీషులో వాదించలేని నేను డిప్యూటీ కలక్టర్ పదవికి తగనని ఎగతాళి చేశారు. చివరికి నా తెలుగు ప్రతివాదాన్ని ఇంగ్లీషులోకి మార్చి ఇస్తేనే తీసుకున్నారు. హైకోర్టు స్థాయికి తెలుగు భాష ఇంకా వెళ్ళలేదు.

తెలుగులో వాదించుకునే పరిస్తితి ఇంకా దిగజారింది.

పరిష్కారమార్గాలు : జిల్లా స్థాయి కోర్టుల్లో దిగువ స్థాయి న్యాయస్థానాల్లో వాదప్రతివాదాలు తెలుగులో జరగాలి. తీర్పులన్నీ తెలుగులోనే ఇవ్వాలి అని 29.3.1974 న హోమ్ శాఖ 485 నంబరు తొలిసారిగా జీవో జారీ చేసింది. దానిని ఖచ్చితంగా జిల్లాస్థాయి న్యాయవాదులు న్యాయమూర్తులు అమలు చేసేలా చూడాలి. ఈ సౌలభ్యం హైకోర్టుల్లో కూడా దొరికేలా చెయ్యాలి. అన్ని న్యాయస్థానాలతో పాటు అన్ని ఆఫీసుల్లో కూడా తెలుగులోకి అనువదించి రాయగల రైటర్లను నియమించాలి. పోలీసు స్టేషన్లు, హైస్కూళ్ళలో లాగా ఈ రైటర్లు వివిధ పత్రాలను దస్తాలను తెలుగులో రాసి కంప్యూటర్లో భద్రం చెయ్యాలి. ప్రతి ఆఫీసుకు అవసరమైన రైటర్లను సర్వీసు కమీషన్ పరీక్ష ద్వారా నియమించుకోవాలి. రైటర్లకు కంప్యూటర్ లో తెలుగు భాషా పరిజ్ఞానం తప్పనిసరి అర్హతగా నిర్ణయించాలి. 587/28.10.1988,218/22.3.1990,420/13.9.2005, 11/14.9.2016 జీవోల ప్రకారం రాష్ట్రంలో ప్రభుత్వఉత్తర ప్రత్యుత్తరాలన్నీ సాధ్యమైనంత తెలుగులోనే జరగాలి. అన్ని ప్రభుత్వ ఉత్తర్వుల జారీకి తెలుగు భాషనే ఉపయోగించాలి. ఆంగ్లం వాడకూడదు. కాబట్టి తెలుగు రైటర్ల విస్తృత నియామకం వలన వేలాది తెలుగు యువకులకు ఉపాధి దొరుకుతుంది. తెలుగు భాషను కాపాడే రక్షకులు కూడా ఏర్పడతారు. పరిపాలన పూర్తిగా తెలుగులోనే జరుగుతుంది.

అనుభవం2:మాదిరి తెలుగు ధరఖాస్తులు:ఒక మండలంలో ఎమ్మార్వోగా ఉండగా దరఖాస్తు ఫారాలు నింపడానికి ఆఫీసుబయట ఒకప్రైవేటువ్యక్తి పనిచేస్తూ ఉండేవాడు. వచ్చిన వ్యక్తుల అవసరాలనుబట్టి ఇంతింత ఈ ఫారం నింపడానికివ్వాలని వసూళ్ళు చేస్తున్నాడని ఫిర్యాదులు వచ్చాయి. ఆ ఫారాలు ఇంగ్లీషులో ఉండేవి. ఏయే పనులకోసం ఈ ఆఫీసుకు ప్రజలువస్తున్నారు, ఏమేమి ఫారాలు వాళ్ళు పూరించి ఆఫీసులో ఇవ్వాలో తెలుసుకున్నాను. ఓపికగా ఆయా దరఖాస్తులు తెలుగులోకి అనువదించాను. నాలుగైదు తరగతులు చదివిన వారెవరైనా పూర్తిచేయటానికి వీలుగా అన్ని రకాల దరఖాస్తుఫారాలు తయారయ్యాయి. వాటిని ఆ ఊళ్ళోని జిరాక్సు షాపులన్నిటికీ ఇచ్చి కేవలం అర్ధరూపాయికే ఏఫారమైనా అమ్మాలని చెప్పాము. ఎవరికివారే ఫారాలు నింపుకొని వస్తున్నారు. ప్రతిఫారమూ

నాలుగైదు దశలు దాటివచ్చే పద్ధతి తీసేశాం. గ్రామ పాలనాధికారి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సంతకాలు చేస్తే చాలు. వాటిపైన నేను సంతకంచేసే వాడిని. ఆఫీస్లో గుమాస్తాల ప్రమేయం తగ్గింది. పత్రాల జారీ వేగం పెరిగింది.

పరిష్కారమార్గాలు:అన్ని రకాలదరఖాస్తులు తెలుగులో ముద్రించి అన్ని శాఖల వెబ్ సైట్లలో ఉంచాలి. తెలుగుభాషా సంస్కృతుల అభివృద్ధి అధ్యయన కమిటీ చేసిన ఈ సూచనలు అమలు చెయ్యాలి: 1. తెలుగు భాషాభివృద్ధిప్రాధికార సంస్థ - ఏడు విభాగాలు : అధికార భాష అమలు, తెలుగుభాషాభివృద్ధి, ఈ-తెలుగు, అనువాద, ప్రచురణలు, అంతర్జాతీయ తెలుగుభాషాభివృద్ధి, గ్రంథాలయాలు అన్ని అధికారాలతో ఏర్పాటు చేయాలి. తెలుగు భాషను కించపరిచే అధికారులను దండించే అధికారం ఈ సమ్స్థకు ఉండాలి.

* సచివాలయం స్థాయినుంచి గ్రామస్థాయి వరకూ ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు, ఉత్తర్వులు అన్నీతెలుగులోనే ఉండాలి. తెలుగు అమలును నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యతీసుకునే అధికారం ప్రాధికార సంస్థకు కల్పించాలి.

* తెలుగు మాధ్యమవిద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రతి విభాగంలోనూ 10శాతం రిజర్వేషన్లు కల్పించాలి.

* అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక విద్యను తెలుగులోనే బోధించాలి.

* ఆంగ్ల మాధ్యమంలో తెలుగును, తెలుగు మాధ్యమంలో ఆంగ్లాన్ని ఒక బోధనాంశంగాఉంచాలి. డిగ్రీ స్థాయిలో అన్ని సెమిస్టర్లలో తెలుగును తప్పనిసరిగాబోధించాలి.

* ఇంటర్మీడియట్, డిగ్రీల స్థాయిల్లో తెలుగు, సంస్కృతం మిశ్రమ బోధనా విధానాన్ని పాటించాలి.

* హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పరిచి, న్యాయపాలనలో తెలుగు అమలు కోసం సత్వర చర్యలు తీసుకోవాలి. తెలుగులో తీర్పులువెలువరించేలా న్యాయమూర్తులను ప్రోత్సహించాలి.

* ఆన్లైన్లో ఈ-తెలుగు పద్ధతిలో తెలుగు బోధన, అంతర్జాలంలో తెలుగు సాహిత్యం, శాస్త్రసాంకేతిక గ్రంథాల వ్యాప్తి, శాసనాల డిజిటలీకరణ, వెబ్సైట్ల నిర్వహణ, కంప్యూటర్లలో తెలుగు ఉపకరణాల అభివృద్ధికి

చర్యలు తీసుకోవాలి.

అనుభవం3: పనుల జాప్యం :

నేను హై స్కూల్ చదువుకు రోజు 7 కి.మీ. కంకటపాలెం నుండి బాపట్ల నడిచి వచ్చే వాడిని. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం తహసీల్ దార్ ఆఫీస్కు వారం రోజులపాటు తిరిగేవాడిని. ప్రతిరోజు డఫేదారు దగ్గర ఒకటే సమాధానం- దొరగారు క్యాంపు కెళ్ళారు, రేపురండిఅనేవాడు. ఎర్రటి ఎండ తట్టుకోలేక ఆవరణలో ఒక చెట్టు క్రింద చేరేవాడిని. ఆ చెట్టుకింద ఆనాడు అనుకున్నాను. నేను గనక తాసీల్దారునైతే చిన్నపిల్లలకు చకచకా సంతకాలు చేసి పంపిస్తాను అని. తహసీల్దారునయ్యాక మాట నిలుపుకున్నాను.

పరిష్కారమార్గాలు:ఇప్పుడు 'విద్యార్థుల సేవలో' రెవిన్యూ' అనే మంచి కార్యక్రమం జరుగుతోంది. "జన్మభూమి-మన ఊరు"లో కూడా ఇలా పాత పెండింగ్ కేసులన్నీ పరిష్కరించవచ్చు. తెలుగులో చక్కగా స్వేచ్ఛగా పని చేయవచ్చు. కంప్యూటర్లో కూడా తెలుగులో పనిచేయగలిగే సిబ్బంది మనకు మంచి సంపదే. తెలుగులో కంప్యూటర్ల వాడకంపై మంచి శిక్షణ ఇప్పిస్తూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు రైటర్ల సంపదను పెంచాలి.

అనుభవం 4.అనువాదాలు, మొదటి తెలుగు అవార్డు :

2008 లో పులిచింతల ప్రాజెక్ట్ లో భూసేకరణ సమ్మతి అవార్డు తెలుగులో ఇచ్చాను. అంతకు ముందు ఎలాంటి మాదిరీ లేని పరిస్థితుల్లో కొత్తగా అనువాదానికి స్వయంగా పూనుకొని రాసిన ఆ అవార్డు రాష్ట్రంలో మొదటి తెలుగు అవార్డు అయ్యింది. అధికారులారా! ఇలా మీరెందుకు రాయలేరు? అంటూ అప్పటి అధికారభాషా సంఘం అధ్యక్షులు వారి మాసపత్రిక పాలనాభాష (సమాచారనేత్రం) జనవరి, 2009, లో ఆ అవార్డును ప్రచురించారు. కాబట్టి ఎవరో ఒకరు పూనుకొని కొత్త పత్రాల్ని తయారు చేయాలి. అవే కాలక్రమేణా మెరుగు పడుతూ వాడుక భాషలోకి మారుతూ అందరికీ మార్గదర్శక మౌతాయి.

పరిష్కారమార్గాలు:తెలుగుఅనువాదాలు ఇంకా బాగుపడాలి. ప్రస్తుతం ఇంగ్లీషు నుండి తెలుగులోకి, తెలుగు నుండి ఇంగ్లీషు లోకి కంప్యూటర్ పై జరిగే అనువాదాలు సవాలక్ష లోపాలతో ఉన్నాయి. తెలుగువారు సాంకేతికంగా ఎంత ఎదిగినా నేటివరకూ అనువాద యంత్రాల తయారీలో బాగా వెనుకబడే ఉన్నారు. కారణం సర్వ సమగ్ర తెలుగు-ఇంగ్లీషు

నిఘంటువు లేకపోవటమే!

అనువాదాలను తప్పుల్లేకుండా చేసి ఇచ్చే సాఫ్ట్ వేర్ల తయారీదార్లపై తెలుగు ప్రజలు,నాయకులు దృష్టి సారించాలి. మంచి తమిళంలో ఉత్తమ సాఫ్ట్వేర్ ను ఎంపిక చేసి, దాని రూపకర్తకు కన్యన్పూంగుండ్రనాథ్ పేరుతో రూ.1 లక్ష నగదు అవార్డు, ప్రశంసపత్రం ప్రతి సంవత్సరం ఇస్తున్నారు. తెలుగులో కూడా ఉత్తమ సాఫ్ట్'వేర్ లు తయారుచేసిన సాంకేతిక నిపుణులకు, తెలుగు భాషకు ఉపకరించే సులభ ఉపకరణాలను తయారు చేసిన సాంకేతిక పరిజ్ఞానులకు తెలుగు వైతాళికుల పేరుమీద ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలి. మనకు కూడా కొలిచాల సురేశ్ ,వెన్నానాగార్జున, రహమాన్ లాంటి కంప్యూటర్ తెలుగు లిపి సాంకేతికులు చాలామంది ఉన్నారు. తెలుగులోకి తర్జుమాలో తప్పులు రాకుండా మెరుగు పరిచే వారికి ఆర్థిక సహాయం చెయ్యాలి. అనువాద ఉపకరణాలు లెక్కకు మిక్కిలిగా రావాలి. ఆన్లైన్లోనూ ఆఫ్లైన్లోనూ వాటిని విరివిగా లెక్సికన్లు వాడుకునే సౌలభ్యాలు కలగాలి. యంత్రాను వాదాలకూ, లిప్యంతరీకరణకూ, విషయాలకు అకారాది సూచికలను తయారు చేయటానికీ, వెతకటానికి అనుకూలంగా తెలుగులోకంప్యూటర్ వాడకం పెరగాలి. తెలుగు నుండి ఇంగ్లీషు తదితర భాషల్లోకి అలాగే ఇంగ్లీషు నుండి తెలుగులోకి తర్జుమా చేసే ఉపకరణాలు ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందలేదు. అనువాదంలో చోటుచేసుకుంటున్న లోపాలను తప్పుల్ని సరిదిద్దటానికి తెలుగు సాంకేతిక నిపుణులు అందరూ పూనుకోవాలి. ఈ అనువాద సామాగ్రి ఎంత నాణ్యంగా అభివృద్ధి చెందితే తెలుగులో పాలన అంత నాణ్యత గా ఉంటుంది. ఫైళ్ళ కదలికలో వేగం పెరుగుతుంది. ఏ ఏటికాయేడు విడుదలైన అనువాద ఉపకరణాలలో నాణ్యమైన వాటికి బహుమతులివ్వాలి.

అనుభవం 5.వాడుక పదాలు: 1986-90 ప్రాంతాల లో హైదరాబాదు డైరెక్టరేట్ల లో పనిచేసాను. నండూరి రామకృష్ణమాచార్య గారు అధికార భాషా సంఘం తరుపున నేను పనిచేస్తున్న కార్యాలయాన్ని దర్శించారు. అచ్చగా తెలుగులోనే ఫైళ్ళు నడిపే వారిది ఒక్క సీటు చూపించండి అని అడిగితే నాదగ్గరకు తీసుకొచ్చారు. ఆయన నా ఫైళ్ళను చూసి ఆనందం వ్యక్తంచేశారు. ఆంగ్ల పదాలకు అర్థం తెలియకపోతే భయపడకుండా అందరికీ వాడుకైన ఆంగ్లపదాలనే

తెలుగులో స్వేచ్ఛగా సరళంగా రాస్తున్నారు. ఇదే మేము కోరుతున్నది" అని ప్రశంసించారు.

"సార్, తెలుగు మాతృభాషగా గల 'తెలుగు ముస్లిములు' నిఖానామాను తెలుగులో ప్రచురించి ఇవ్వమని కోరుతున్నారని వారిని అడిగితే వక్ఫ్ బోర్డు వారిని సంప్రదించారు. కొన్ని ఉర్దూ పదాలు తెలుగు ముస్లిములు కూడా పలుకుతారు కాబట్టి వాటినే తెలుగులో ప్రచురిస్తే చాలు అన్నారు.

2009 లో అధికార భాషాసంఘం అధ్యక్షులు ఏ బి కె ప్రసాద్ గారికి ఐ.కొండలరావు గారి ఉర్దూ –తెలుగు నిఘంటువును అందజేశాను. 2009 ఏప్రిల్ 25వ తేదీన ఈనిఘంటువును పునర్ముద్రించి విడుదలచేశారు. ఉర్దూ అకాడమీ డీటీపీ తరువాత ప్రచురించకుండా ఆపివేసిన పటేల్ అనంతయ్య కమిటీ తెలుగు-ఉర్దూ నిఘంటువును తెలుగు అధికారభాషాసంఘం నిధులతో పూర్తి చేయించడానికి ప్రయత్నించారు.

2013 లో తెలుగు అధికార భాషాసంఘం అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ గారు కూడా తెలుగు- ఉర్దూ నిఘంటువు ప్రచురణకు ఆదేశించారు కూడా. పరిష్కారాలు:మనం మాట్లేడేటప్పుడు ఎలా మాట్లాడుతామో రాసేటప్పుడు కూడా అలానే రాస్తే అందరికీ తేలికగా అర్ధమౌతుంది. రైలు ను ధూమశకటం అననక్కరలేదు. ఇంగ్లీషును ఉర్దూను పరభాషాపదాల పేరుతో తోసివేయ నక్కర లేదు. తెలుగు జనం కొన్ని పరభాషా పదాలనే వాడుకలో పలుకుతున్నారు. అందువలన నిఘంటువులలోకూడా వాడుక భాష పదసంపద పెరగాలి. వాడుకభాష లోకే చట్టాలు, దస్త్రాలు మారాలి. ఏ పదాన్ని ఎలా వాడాలో తెలియజేసే సోదాహరణ పదకోశాలు పంపిణీ చెయ్యాలి. అనేక అవసరాలలో ఉపయోగించేలా మాదిరి ఉత్తరాలను, ఆదేశాలను తెలుగులో తయారు చేయించి వాటిని నెట్ లో ఉంచాలి. ఫైళ్ళ నిర్వహణలో కలిగే అనుమానాలను నివృత్తి చేసే యంత్రాంగాన్ని సిద్ధం చెయ్యాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు భాష వాడకం పరిరక్షణ నిరంతర కార్యక్రమంగా సాగాలి.

ఆన్లైన్లోనే నిఘంటువులకు కొత్త పదాలను జోడించే అవకాశం అందరికీ ఇవ్వాలి. ఏయే ప్రాంతాల్లో ఏ పదాన్ని ఎందుకు, ఎలావాడుతుంటారో ఆయా ప్రాంతాల ప్రజలనే చెప్పనివ్వాలి. సరిగా

ఉన్నట్లు భావించినకొత్త పదాలను ఎప్పటికప్పుడు నిఘంటువుల్లో చేరుస్తూ పోవాలి. మన నిఘంటువుల సైజు పెరగాలి. అవి జన బాహుళ్యానికి వాడకంలోకి విస్తారంగా వస్తూనే ఉండాలి. వాడుక భాషలో నానా భాషలూ కలగాపులగంగా ఉంటాయి. అయితే అవన్నీ ప్రజలకు బాగా అర్ధమౌతాయి. పరభాషా పదాలనే కారణంతో ఇప్పుడు తెలుగు వాడకంలోంచి సంస్కృతం, ఇంగ్లీషు, ఉర్దూ పదాలను తీసివేయలేము. ఎందుకంటే అవి మనభాషలో అంతర్భాగాలై పోయాయి. తెలుగు లోపాలించటం అంటే గ్రాంథుఇక తెలుగులో కాక, జనవ్యవహారంలో ఉన్న భాషలోనే పాలించడం అనే విషయాన్ని మొదట గుర్తించాలి. ప్రజలు ఇంతకంటే ఇంగ్లీషే నయమని వాపోయేలా తెలుగు అనువాదాలు ఉండకూడదు. అందరికీ అర్థమయ్యే రీతిలో, సరళంగా క్లుప్తంగా, వేగంగా పలికేందుకు వీలుగా ఉండేలా తెలుగు మాటలను వాడటం అలవాటు చేసుకోవాలి.

సంస్కృతం, ఇంగ్లీషు భాషల మితిమీరిన వాడకం వల్ల, అవి మన భాషాపదాలను కబళించి తామే తెలుగై కూర్చున్నాయి. ముఖ్యంగా ఇంగ్లీషు మాటలు జనం నాలుకలమీద విస్తారంగా వాడబడుతున్నవాటిని యథాతథంగా పాలనాభాషలో వాడుకోవటం ఉత్తమం. ఇక ఇప్పుడు ఈ ఇంగ్లీషు పదాలను నిర్మూలించడం మన తరం కాదు. వాటిని మన పదాలుగా అంగీకరించడమే మంచిది.

అనుభవం 6.కంప్యూటర్లో తెలుగు టైపు సమస్యలు :

కంపూటర్లో తెలుగు టైపు చేసేటప్పుడు తెలుగు ఫాంట్లు లేక యూనీకోడ్ లోకి మార్చటానికి రకరకాల సమస్యలు వచ్చేవి. 2009లో అను నుండి యూనికోడ్ లోకి మార్చే ఒకమారకానికి anurahamthulla version అని నా పేరుని పెట్టారు. తెలుగు భాషలో మంచిఫాంట్లు అభివృద్ధి చేశారు. సాంకేతిక పరికరాలు వచ్చాయి.

పరిష్కారాలు: అక్షర రూపాలు పెరగాయి. లిపి, అనువాద సమస్యలు తగ్గాలి. ప్రపంచతెలుగు మహాసభల సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ, పెద్దన, తిమ్మన, తెనాలిరామకృష్ణ, సూరన్న, రామరాజు, మల్లన్న, ధూర్జటి, రామభద్ర, గిడుగు, గురజాడ, సురవరం, యన్.టి.ఆర్., మండలి, నాట్స్, పొన్నాల, రవిప్రకాష్, లక్కిరెడ్డి అనే18 అక్షరరూపాలను విడుదలచేశారు. అనూ, సూరిలాంటి యూనీ కోడేతర ఫాంట్లలో ముద్రితమై ఉన్న విస్తారమైన తెలుగుసాహిత్యాన్ని తెలుగు

యూనీకోడు లోకి మార్చే మార్పిడి సాధనాలు కూడా వచ్చాయి.

ఇప్పటికీ తెలుగు ప్రజలకు అనువాద సమస్య అలాగే ఉంది. తర్జుమాలో ఇప్పటికీ చాలా తప్పులు వస్తున్నాయి. అనువాద ఉపకరణాలు, నిఘంటువులు, లెక్కకు మిక్కిలిగా రావాలి. ఆన్ లైన్లోనూ ఆఫ్ లైన్లోనూ వాటిని విరివిగా వాడుకునే సౌలభ్యాలు కలగాలి. వాటిని తయారు చేసే సాంకేతిక నిపుణులకు నిధులు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలి.

అధికారుల దగ్గర కంప్యూటర్ అనువాదకుల్ని కూర్చోబెట్టి తెలుగునుండి ఇంగ్లీషుకు, ఇంగ్లీషు నుండి తెలుగుకు వందలాది వాక్యాలను అనువాదం చేయించి పరిశీలించాలి. భూత వర్తమాన భవిష్యత్ కాలాలలో రకరకాల పరిస్థితుల్లో మనం వాడుతున్న తెలుగు ఇంగ్లీషు వాక్యాలకు సరైన అనువాదం వస్తుందా లేదా అని పరిశీలించాలి. వేరే అర్ధం వస్తుందా?పదాల పొందిక క్రమము సరిపోతోందా? అనీ చూడాలి.

అనుభవం 7 .రోమన్ లిపి:వత్తులు, గుణింతాల ఇబ్బందిని అధిగమించలేకనే చాలామంది బాగా తెలుగు వచ్చిన వాళ్ళు కూడా తెలుగు టైపింగ్ జోలికి రాలేకపోతున్నారు. లిపి సంస్కరణ కూడా అవసరమే. వత్తులూ గుణింతాల బెడద లేకుండా ఒకే వరసలో సాగిపోయేలా రోమన్ లిపిని యంత్రానికి తగ్గరీతిలో ఆంగ్లేయులు ఎంతగానో అభివృద్ధి పరిచారు, అరబిక్ అంకెలను,భారతదేశపు సున్నాను అరువు తెచ్చుకొని మరీ ఆంగ్ల లిపిని విశ్వవ్యాప్తం చేశారు. ఆంగ్ల భాషనూ, అంకెల్ని మనం ఎలాగూ వాడుతూనే ఉన్నాం. ఇక అక్షరాలను కూడా వాడుకుంటే అధికార భాషగా రోమన్ తెలుగును పిల్లలకు నేర్పటం, ఫైళ్ళలో ద్వారా అమలు చేయటం ఎంతో సులువవుతుంది

పరిష్కారాలు:

వత్తులూ గుణింతాల బెడద అంటూ తెలుగు లిపిసమస్య సాకుతో అధికారభాష అమలును ప్రక్కన పెట్టటం కంటే అంతర్జాతీయంగా అమలవుతున్న లిపినే మన భాషకు వాడుకుంటే మేలు జరుగుతుంది. దేశమంతటికీ ఉమ్మడి లిపిగా ఆంగ్లాక్షరాలను ఉపయోగించుకోవాలి. ప్రపంచం మొత్తం చదవగలిగే స్థాయికి ఎదిగిన ఆంగ్ల లిపిని వాడుకోవటం ద్వారా మన దేశ భాషలన్నింటికీ జవసత్వాలు సమకూరుతాయి.పైగా

అన్ని భాషల వాళ్ళూ సెల్ ఫోనుల్లో ఆంగ్ల లిపి ద్వారానే మెసేజీలు ఇప్పటికే పంపుకుంటున్నారు. ప్రపంచ దేశాలలో ఆంగ్ల లిపిలోని సంస్కృత శ్లోకాలను, అరబీ సూరాలను చదువు కుంటున్నారు. దేశ వాసులందరినీ రోమన్ లిపి ద్వారా త్వరగా అక్షరాస్యుల్ని చేయవచ్చు. దేశ మంతటా ఒకే లిపి ఉండటం వలన అందరూ అన్ని భాషలనూ అర్థం చేసుకోలేకపోయినా కనీసం అన్ని భాషలనూ చదవగలుగుతారు, కార్యాలయాలనుండి వచ్చే ఉత్తర్వులను చదవటం, చదివించుకోనటం సులువౌతుంది. లిపి ద్వారా ఐక్యత వస్తుంది.అందువలన తెలుగులో పాలన వ్యవహారాలు సులువుగా జరగాలంటే వేటూరి ప్రభాకర శాస్త్రి గారు ఆనాడు కోరినట్లు లిపి సంస్కరణన్నా జరగాలి లేదా శ్రీ శ్రీ గారి సలహా మేరకు రోమన్ లిపిలో అయినా కార్యాలయ వ్యవహారాలు నడపాలి.

అనుభవం 8. తెలుగు మాధ్యమం : తెలుగు తెలుగు రక్షణ అంటూ తెగ అరిచేవాళ్ళు తమ పిల్లల్ని ఇంగ్లీషు మీడియంలో ఎందుకు చదివిస్తున్నారు?అనే ప్రశ్నకు ఆన్సర్ ఇవ్వలేని పరిస్థితి అనేకసార్లు ఎదురయ్యింది. ఇంగ్లీషు మీడియం స్కూళ్ళ స్థాయిలో తెలుగు బడులు లేవు. కార్పోరేట్ స్కూళ్ళతో పోటీ పడలేక కునారిల్లుతున్నాయి. తెలుగు స్కూళ్ళ ద్వారా చదివితే ఉద్యోగాలు వస్తాయో రావో అనే సందేహమే తల్లిదండ్రుల తటపటాయింపుకు కారణం. తెలుగు మాధ్యమంలో అసలు ఉన్నత విద్యే లేనప్పుడు ఎంత తెలుగు భాషాభిమాని అయినా, భాషోద్యమకారుడైనా తమ పిల్లల్ని ఎక్కడ ఎలా చదించగలడు?

పరిష్కారాలు:

తెలుగు మాధ్యమంలో చదువులు పెరగాలి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో కూడా అన్ని స్థాయిల్లో తెలుగు మీడియం ఉండాలి. వివిధ వృత్తివిద్యలు, న్యాయ, వైద్య సాంకేతిక విద్యలు కూడా తెలుగు మాధ్యమంలో నేర్వగలిగిన నాడు తెలుగు సమాజమంతా తెలుగులో పాలన పరిధిలోకి దానంతట అదే వచ్చేస్తుంది. తెలుగులో ఉన్నత విద్యా సదుపాయాలు అత్యంత అవసరం. తెలుగులో చదువు చెప్పేశాస్త్ర సాంకేతిక విద్యా సంస్థలనూ కళాశాలల్నీ, తెలుగులో చదివే విద్యార్థులనూ రాయితీ లిచ్చి ప్రోత్సహించాలి. రాష్ట్రంలోని కేజీ టూ పీజీ

వరకూ అన్ని స్థాయిల్లో తెలుగు భాషను తప్పనిసరి చేస్తామని ప్రభుత్వం వారు ప్రకటించారు. అయితే పిల్లల పాఠ్యపుస్తకాలు వాడుక తెలుగులో చెయ్యాలి. సంకలనం, వ్యవకలనం లాంటి పదాల స్థానంలో కూడికలు, తీసివేతల్లాంటి మాటలు రావాలి.

అనుభవం 9.ప్రోత్సాహకాలు, ఉద్యోగాలు : కోయంబత్తూరులో జరిగిన ప్రపంచ తమిళ మహాసభల్లో తమిళ మాధ్యమ విద్యార్థులకుప్రభుత్వ ఉద్యోగాలు సులభంగా లభించేలా కొన్ని తీర్మానాలు చేశారు. తమిళమీడియం అభ్యర్థులకు ఉద్యోగాలు దొరకక పోతే ప్రజలు పిల్లల్ని తమిళ మాధ్యమంలో చదివించరనీ, ఎవరూ చదవనిభాష నశిస్తుందనీ, తమిళం పదికాలాలపాటు బ్రతకాలంటే
ఆ భాషలో మాత్రమే చదివిన వారికి వెనుక బడిన కులాలవారికి ఇస్తున్నట్లుగా ఉద్యోగాలలో కూడా రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్మానం చేశారు. అందుకోసం అత్యవసరంగా ఒక ఆర్డినెన్స్ తెచ్చారు. శాసన సభలో, స్థానిక సంస్థల్లో, ప్రభుత్వకార్పోరేషన్లు, కంపెనీలలో తమిళ అభ్యర్థులకు 20 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని శాసించారు.

తమిళనాడు ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 145 P & AR (S) డిపార్ట్ మెంట్-ది. 30.09.2010 ద్వారా తమిళ మీడియం లో డిగ్రీ వరకు చదివిన అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వఉద్యోగాలలో 20 శాతం రిజర్వేషన్ ఇస్తున్నారు. చెన్నై హైకోర్టు కూడా 23.2.2016 న
ఈ చట్టాన్ని సమర్థించింది. ప్రమోషన్లలో కాకుండా ప్రభుత్వోద్యాగాలకు మొదటిసారిగా నేరుగాజరిపే నియామకాలకు తమిళ మాధ్యమంలో చదివిన అభ్యర్థులకు 20% ఉద్యోగాలు రిజర్వు చేయడంలో ఎలాంటి తప్పూ లేదని తేల్చేసింది. రాజ్యాంగంలోని 345 ఆర్టికల్ ప్రకారం ఎవరి భాషను వాళ్ళుకాపాడుకోవాలని, ఆయా రాష్ట్రాలలో పాలనాభాషగా అధికారభాషగా అభివృద్ధిచేసుకోవాలనికూడా తెలియ జేసింది. కాబట్టి, తమిళనాడును ఆదర్శంగా తీసుకొని ఒకటవ తరగతి నుండి డిగ్రీ వరకుతెలుగుమాధ్యమంలో చదివిన విద్యార్థులకు పోటీ పరీక్షల్లో ప్రోత్సాహకాలు ఇవ్వాలేరా ? తమిళనాడులో లాగా ఉద్యోగాలలో 20% రిజర్వేషన్ ఇవ్వవచ్చు కదా? లాంటి ప్రశ్నలు కొన్నిచోట్ల అడిగారు.
పరిష్కారాలు:

గ్రూప్ 1, గ్రూప్ 2,3 లాంటి సర్వీసు ఉద్యోగాలలోతెలుగు మీడియంలో చదివిన వారికి గతంలో ఇచ్చిన మాదిరే 5% ప్రోత్సాహక మార్కులు ఇకమీదట కూడా ఇవ్వవచ్చు. తమిళ మాధ్యమంలో చదివే వారికి ఉద్యోగాల నియామకాల్లో ఐదు మార్కులు అదనంగా తమిళనాడులో ఇప్పటికే ఇస్తున్నారు. మనకు కోర్టు కేసులు ఏమన్నా ఉంటే తెలుగు మాధ్యమ అభ్యర్థులకు ఎందుకు ఇలా ప్రోత్సాహక మార్కులివ్వాల్సి వస్తుందో కారణాలను స్పష్టంగా తెలియజేయాలి. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం వారి భాషలను ఆయారాష్ట్రాల పాలక భాషలుగా అభివృద్ధి చేసుకోవాలంటే ఇలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వకపోతే బలహీన భాషల రక్షణ ఎలా జరుగుతుంది? సొంత వాళ్ళ రక్షణ, ఆదరణ కరువైనందువల్లే మరోమార్గం లేక అన్నిభాషలు ఆంగ్లాన్ని ఆశ్రయిస్తున్నాయి.

అంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల సర్వీస్ కమీషన్లు రెండూ భారీ ఎత్తున గ్రూప్-2,3 సర్వీసు ఉద్యోగాలు భర్తీచేస్తున్నాయి. వీటిలో మున్సిపల్ కమిషనర్, ఏసీటీఓ, సబ్రిజిస్ట్రార్, డిప్యూటీ తహసిల్దార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, అసిస్టెంట్ డెవలప్మెంట్ ఆఫీసర్, ఎక్స్టెన్షన్ ఆఫీసర్, ఎక్సైజ్ సబ్ఇన్స్పెక్టర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సీనియర్ ఆడిటర్,సీనియర్అకౌంటెంట్, జూనియర్ అకౌంటెంట్, జూనియర్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ సెక్రెటరీ లాంటి ఉద్యోగాలున్నాయి. ఇవన్నీ తెలుగులో చేసే ఉద్యోగాలే. ఐ ఏ ఎస్, ఐ పి ఎస్ లాంటి ఉన్నతోద్యోగాలు కావు. తెలుగు ప్రజలతోమమేకమై వారితోముఖాముఖి తెలుగులో మాట్లాడుతూ వారిమధ్యే నివసిస్తూ వారికి సేవలందించే ఉద్యోగాలు. వీరు తెలుగు ప్రజల సమస్యలను సరిగ్గా విశ్లేషణ చేయాలి. గ్రామ సామాజిక, ఆర్థిక వ్యవస్థ పై తగిన అవగాహన తెచ్చుకోవాలి. ప్రజా పరిపాలన పరిజ్ఞానం పెంచుకోవాలి. అక్కడి ప్రజలు వారి భాషలో చెప్పే సమస్యలు, పరిష్కారాలు, సూచనలు వినాలి, రాయగలగాలి. ఈ నైపుణ్యాలన్నీ తెలుగు మాధ్యమంలో చదివిన వారికే ఎక్కువగా ఉంటాయి.

గ్రూప్ 1, గ్రూప్ 2 సర్వీసు ఉద్యోగాలలో డిగ్రీ తెలుగు మీడియంలో చదివిన వారికి గతంలో ఇచ్చిన మాదిరే 5 శాతం ప్రోత్సాహక మార్కులు ఇవ్వాలి. తమిళనాడు తరహాలో తెలుగు మాధ్యమ అభ్యర్థులకు 20 శాతం ఉద్యోగాలు కూడా రిజర్వేషన్ ఇస్తే, అప్పుడు తెలుగులో

కార్యాలయ వ్యవహారాలు నడిపే వాళ్ళు రంగప్రవేశం చేస్తారు. ఆఫీసుల్లో తెలుగు బ్రతుకుతుంది. తెలుగు మీడియంలో చదివితే ఉద్యోగాలొస్తాయన్న ఆశతో కొంత మందైనా తెలుగులో చదువుతారు. తెలుగులో చదివిన అధికారులు కార్యాలయాల్లో జరిగే పనులన్నిటికీ "కొత్తపదాలు" పుట్టిస్తారు. తెలుగు పదకోశాలు అమలవుతాయి.



తెలుగు అమలు చేయని బడులపై చర్యలు

- తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: ఒకటి నుంచి పదో తరగతి వరకు ఒక సబ్జెక్టుగా తెలుగు బోధన అమలు చేయని పాఠశాలల యాజమాన్యాలపై తెలంగాణ ప్రభుత్వం కొరడా ఝుళిపించనుంది. ఇలాంటి బడులకు రెండుదఫాలు జరిమానా విధించి.. తర్వాత కూడా చట్టాన్ని అతిక్రమిస్తుంటే అనుమతులను రద్దు చేస్తుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 2018-19 విద్యా సంవత్సరం నుంచి తెలుగు తప్పనిసరి చేస్తూ మార్చిలో ప్రభుత్వం చట్టం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర పాఠ్య ప్రణాళికతోపాటు సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ తదితర బోర్డుల ప్రైవేట్ పాఠశాలలు తెలుగు అమలు చేయకుండా మొదటిసారి పట్టుబడితే రూ.50 వేలు జరిమానా, రెండోసారి అయితే రూ.లక్ష జరిమానా విధిస్తారు. మొదటిసారి నిబంధనలు అతిక్రమించారని గుర్తిస్తే అధికారులు యాజమాన్యానికి నోటీసులు జారీ చేస్తారు. ఒకవేళ ఉల్లంఘన చేస్తున్నారని నిర్ధరణకు వస్తే లోపాలను సవరించుకోవడానికి నెల గడువు ఇస్తారు. ఆలోపు అమలు చేయని పక్షంలో మొదటి ఉల్లంఘనగా రూ.50 వేలు జరిమానా విధిస్తారు. రెండోసారి ఉల్లంఘిస్తే రూ.లక్ష జరిమానా విధిస్తారు. తర్వాత కూడా నిబంధనల ఉల్లంఘన కొనసాగితే జీఓ 1 ప్రకారం డీఈఓ లేదా విద్యాశాఖ కమిషనర్ ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేస్తారు. 3.6.2018


దక్షిణాది వారిది ద్రావిడ సంగీతమే

10. తెలుగు సంగీతం - ద్రావిడ సంగీతం

...ళ్ళ సంగీతాన్ని హిందూస్థానీ సంగీతం అన్నట్లుగానే దక్షిణాది వాళ్ళ సంగీతాన్ని ద్రావిడ సంగీతం అనాలని ద్రావిడ మున్నేట్ర కజగం పార్టీ గతంలోనే కోరిందట. నాకూ ఈ కోరిక సమంజసమే అనిపించింది. ఉత్తరాది సంగీతానికి పెట్టిన హిందూస్థానీ అనే పేరు ఒక ప్రాంతాన్నీ,మతాన్నీ, భాషనో సూచిస్తోంది.అదే ఒరవడిలో కర్ణాటక అనే పేరుకు అర్థం చెప్పండి. అది కర్ణపేయమైన, శ్రీవణానందకరమైన సంగీతం అని కాక కర్ణాటక ప్రాంతంలో పుట్టిన సంగీతం కన్నడిగుల సంగీతం అన్నట్లుగా ఉంది. ఎక్కడికక్కడ ఎవరి గుర్తింపు కోసం వాళ్ళు పోరాడుతున్నారు. ద్రావిడ సంగీతం మొత్తానికీ కలిపి 'కర్ణాటక సంగీతం' అనే పేరు సాధించుకున్న కన్నడిగులు కన్నడ జెండా కూడా రూపొందించుకున్నారు.

మనకు ఎన్టీ రామారావు తెలుగు దేశం పేరుతో ఒక పార్టీ స్థాపించి మన ప్రజల భాష తెలుగులో రాసిన ఫైళ్ళు తెస్తేనే సంతకం పెడతానని భీష్మించాడు. అప్పుడు తెలుగులో దస్త్రాలు బాగా నడిచాయి. అంతేకాక తెలుగు మాధ్యమంలో డిగ్రీ చదివిన అభ్యర్థులకు సర్వీస్ కమీషన్ పరీక్షలలో 5 శాతం ప్రోత్సాహక మార్కులు ఇచ్చి ఎక్కువమంది తెలుగు చదివిన అభ్యర్థులు ఉద్యోగాలలోకి వచ్చేలా చేశారు. ఆతరువాత ఆంధ్రాను ఆంగ్లం కమ్మేసింది. అప్పటిదాకా తెలుగు మాధ్యమ అభ్యర్థులకు ఇచ్చిన ప్రోత్సాహక మార్కులను ఏ నాయకుడూ పునరుద్ధరించలేదు. తెలుగులో మాట్లాడితే తప్పంటూ పిల్లల మెడలో పలకలు కట్టి అవమానించే రోజులు దాపురించాయి. నాకు ఇంగ్లీషు తప్ప తెలుగు రాదు అని చెప్పుకోవటమే గొప్పతనమైపోయింది. తెలుగుకు ఎక్కడా స్థానం లేకుండా పోయింది. దానికి రావలసిన గౌరవం రావటం లేదు. పోరాడితే తప్ప తెలుగు విలువ, పేరు నిలవనివ్వని శక్తులు నలువైపులా కాచుకొని ఉన్నాయి.

స్వాభిమానం ఏది?

త్యాగయ్య తెలుగులో తప్ప మరే భాషలోనూ పాడలేదు. తాను నివసించిన తమిళనాడు లో తమిళంలో కానీ, కర్నాటక సంగీతం అని పేరుగాంచిన కన్నడ భాషలో గానీ కీర్తనలు రాయలేదు. త్యాగయ్య

తెలుగు కీర్తనలు ద్రావిడులంతా తెలుగులోనే పాడుతారు. తెలుగువారు పెద్దగా తమిళ, మళయాళ కీర్తనలు పాడరు. దక్షిణ భారతదేశ ద్రావిడ సంగీతాన్ని ఇంతగా ప్రభావితం చేసిన త్యాగయ్య తెలుగు కీర్తనలను బట్టి దీనిని "తెలుగు సంగీతం" లేదా "ద్రావిడ సంగీతం" అనో అనకుండా కర్నాటక సంగీతం అని ఎందుకు అన్నారో? ఎందుకోగానీ తెలుగు సంగీతం, ఆంధ్ర సంగీత సాంప్రదాయమన్న మాట ప్రాచుర్యానికి నోచుకోలేదు. తెలుగు వాళ్ళు శాంత స్వభావులు. ద్రావిడ ప్రాంతంలో ఎంతో విలువైన సంగీత సంపదను తెలుగు విద్వాంసులు పోగుచేసి పెట్టారు. తమకు రావలసిన పేరు ఇతరులు ఎగరేసుకు పోతున్నా నోరుమెదపని సహనశీలురు తెలుగు పెద్దలు. పక్కన కన్నడభాషను కించపరిస్తే ఊరుకోము అని కన్నడిగులు ఆగ్రహిస్తున్నారు.అయినా తెలుగు భాషకు న్యాయబద్ధంగా రావలసిన కీర్తిని రాబట్టడంలో తెలుగు ప్రజలు ఉదాసీనంగా ఉన్నారు. సంగీతమంతా తెలుగువాళ్ళది పెట్టుకొని పేరు మాత్రం తెలుగేతరులు పొందుతున్నారు.

తెలుగును ద్రావిడీకరించినవాడు, తొలి తెలుగు భాషోద్యమకారుడు నాదృష్టిలో త్యాగయ్యే. కర్ణాటక సంగీత మంటే అది చెవికి ఇంపైనది అని కొందరు అర్థం చెబుతారు. మరే ద్రావిడభాషకూ అంత ఇంపు లేదనా అర్థం? ఇది భాషారాజకీయమే. సంగీతానికి ఒక ప్రాంతము పేరో ఒక భాషపేరో పెట్టేటప్పుడు ఆయా భాషల వాళ్ళు ఆయా ప్రాంతాలవాళ్ళూ ఆ సంగీతానికి చేసిన విశేషమైన కృషి ఏమిటో చెప్పితీరాలి. మన అన్నమయ్య త్యాగయ్య రామదాసు లు ఎవరికీ తీసిపోరు. వాళ్ళు కర్ణాటక సంగీతాభివృద్ధికి చేసిన కృషి పడినపాట్లు చరిత్రలోకి ఎక్కాలి. కర్ణాటక సంగీతం అని పేరు ఎందుకు పెట్టారో,అలా పేరు పెట్టినప్పుడు తెలుగువాళ్ళు మెదలకుండా ఎందుకు ఒప్పుకున్నారో అసలు కారణం తెలుసుకుందామనే ఈ చర్చ.

కర్ణాటక సంగీతం అంటే దక్షిణాది సంగీతమే. కానీ దానికి ద్రావిడ సంగీతం అని పేరు పెట్టకుండా కర్ణాటక సంగీతం అని పేరు పెట్టటం వెనుక భాష ప్రాంతాల ప్రభావం ఏమైనా ఉందేమో తెలుసుకుందామని ఈ ప్రయత్నం. మరాఠీ వాడైన పురందరదాసు (1484 – 1564) కన్నడంలోనే కీర్తనలు రాశాడు. అతన్ని కర్ణాటక సంగీత పితామహుడు, కన్నడ వాగ్గేయకారుడు అన్నారు. అలిపిరి దగ్గర అతని విగ్రహం పెట్టారు.ఆయన ఆంధ్ర పదకవితా పితామహుడు,

తెలుగు వాగ్గేయకారుడైన అన్నమాచార్యులను గురువుగా భావించాడు. అన్నమయ్యను శ్రీనివాసుని అవతారం అని పొగిడాడు. కర్ణాట సంగీతాభివృద్ధికి కృషిచేసిన విద్వాంసులలో త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి, అరుణాచల కవి, నారాయణ తీర్థులు, విజయదాసు, రామదాసు, సదాశివ బ్రహ్మేంద్ర, ఊటుకూరి వెంకటకవి లాంటి తెలుగు,తమిళ,కన్నడ మహానుభావులు ఎందరో ఉన్నారు. ప్రాంతాలవారిగా చూస్తే కర్ణాటక సంగీతానికి మద్రాసు కేంద్రబింధుపై నిలిచింది. దక్షిణాది రాష్ట్రాల విద్వాంసులెందరో తమిళనాడు చేరారు. కర్ణాటక సంగీత విద్వాంసులలో తెలుగువాళ్ళే ఎక్కువమంది ఉన్నారు. పురందరదాసుకు గురుతుల్యుడూ సమకాలికుడైన అన్నమాచార్యుని కృషిని గుర్తిస్తే ఆంధ్ర సంగీతమనో తెలుగు సంగీతమనో పేరు పెట్టవచ్చు. తెలుగు వాళ్ళను ఎలా ఎందుకు తప్పించారో తెలుసుకోవాలి.

దక్షిణాది వారిది ద్రావిడ సంగీతమే ఉత్తరాది వాళ్ళ సంగీతానికి భారతదేశం మొత్తం కలిసిన దేశ జాతీయ సంగీతమనే అర్థం స్ఫురించేలా హిందూస్థానీ సంగీతం అన్నారు. దక్షిణాది అంతటా ఒకే విధంగా వినపడే సంగీతానికి ద్రావిడ సంగీతం అని పేరు పెట్టినా బాగుండేది. తమిళంలో ముత్తయ్య భాగవతార్,సదాశివ బ్రహ్మం, పాపనాశం శివం మళయాళంలో స్వాతి తిరునాళ్,.... ఇలా ఎందరో ద్రావిడ మహానుభావుల కృషి ఫలితమే ద్రావిడ సంగీతం. తన పేగులనే తీగలుగా వీణ వాయించి పరమ శివుణ్ణి ప్రసన్నం చేసుకున్నా రావణుడు గొప్ప ద్రావిడ సంగీత వేత్త కాదా? ద్రావిడ శబ్ధమే ఉత్తరాది పాలకులకు రుచించటంలేదు. సంగీతం విశ్వజనీన భాష. అది అందరికీ అర్థమయ్యే ప్రపంచభాష, హృదయ భాష.మరి అందులో రాణించిన తెలుగు వాళ్ళ పేర్లు ఆ సంగీతానికి ఎందుకు పెట్టలేదు? పోనీ ప్రాంతం పేరుతో అయితే విశ్వకవి జాతీయగీతంలో అన్నట్లు దక్షిణాదిన ఉన్న నాలుగు రాష్ట్రాలనూ కలిపి ద్రావిడ సంగీతం అనే అనాలి. ఎందుకంటే ఈ సంగీతం ద్రావిడ రాష్ట్రాలలో పుట్టి పెరిగింది కాబట్టి. తెలుగు కీర్తనలకు దేవుళ్ళు దిగి వచ్చారు బమ్మెర పోతన, కంచర్ల గోపన్న (రామదాసు),త్యాగయ్, అన్నమయ్య,లాంటి ఆద్యాత్మిక వేత్తలు, సంగీత కారులు, మహా భక్త గాయకులు, భగవంతుని దయానుగ్రహాలపై తమకు హక్కు ఉన్నట్లు గా రచించిన కీర్తనలన్నీ తెలుగులోనే ఉన్నాయి. ఆ తెలుగు కీర్తనలు విని దేవుళ్ళు దిగి వచ్చారని బడాయి పోతుంటాము. వారి భాషను

మాత్రం దైవ భావన లేకుండా అగౌరవ పరుస్తాము.ఇదేం నీతి?

“పలికెడిది భాగవతమట,పలికించెడువాడు రామభద్రుండట” అని పోతన అంతటోడే అన్నప్పుడు తెలుగును దేవ భాష అనీ ,తెలుగు భాషలో పాడిన సంగీతాన్ని దైవ సంగీతం అనీ అనటానికి మనకెందుకు సిగ్గు,సందేహం? సంస్కృత వాసనలేమీ సోకకుండా అచ్చ తెలుగులో లక్ష్మీదేవి హావ భావాలను ఆ రామ భద్రుడే ఎలా పలికించాడో చూడండి:

“అడిగెదనని కడు వడి జను నడిగిన దన మగడు నుడువడని నడ యుడుగున్ వెడ వెడ సిడిముడి తడబడ

నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్” - (శ్రీమదాంధ్ర భాగవతం 8:103)

రామ భద్రుడే ఇలా తెలుగులో పలికించాడనీ,పోతన రాయలేక వదిలేసిన పద్యాలను రాముడే వచ్చి స్వయం గా తెలుగులో పూరించి పోయాడనీ, తానీషాకు డబ్బు చెల్లించి రామదాసును విడిపించాడనీ. ఇంకా ఎన్నో గొప్పలు చెప్పుకుంటారు. అలాంటి వాళ్ళకు కూడా తెలుగు దేవభాషే అనీ, తెలుగు సంగీతం దివ్య సంగీతం అనీ అనిపించటంలేదా?సంగీత జ్ఞానము భక్తి వినా సన్మార్గము కలదే ఓ మనసా అన్నాడు త్యాగయ్య. సరిగమలు రాని పామరులనోట కూడా అలవోకగా సాగిన రంగస్థల పద్యాలు తెలుగు వాళ్ళ సొంతం కాదా?ఎన్నెన్ని పద్యాలు ఎన్నో రాగాలతో చెవులతుప్పు వదిలేలా

కొండంత దీర్గాలు తీసి పాడుకున్నది తెలుగు వాళ్ళు కాదా?

కోట్లాది ప్రజలు విని పాడి ఆనందించే ఒక సంగీత సంప్రదాయానికి పేరు పెట్టేటప్పుడు అందుకు నిర్ణయించిన ప్రాతిపధికలు ఏమిటో చెప్పాలి. ఆ ప్రాంతంలో నివసించే ప్రజల అభిప్రాయాలూ అడగాలి.ప్రజాస్వామ్య దేశంలో అమలు చేసే పద్ధతే ఇది.

అన్నమాచార్యులు,త్యాగయ్య, రామదాసు లాంటి ఎందరో మహానుభావులు, గొప్ప తెలుగు సంగీత విద్వాంసులు అభివృద్ధి చేసిన సంగీతానికి తెలుగు సంగీతం అని పేరు పెట్టలేనప్పుడు ఏదో ఒకరాష్ట్రం పేరే ఎందుకు? మిగతా దక్షిణాది ప్రాంతాలన్నిటిని కలుపుకొని ద్రావిడ సంగీతం అనకూడదా? తెలుగు పెద్దలు ఆలోచించాలి.

(ఆంధ్రప్రభ 28.3.2018)


దేవుడికి తెలుగురాదు

11. దేవుడికి తెలుగురాదు

ర్ధనేమిటి నీ మొహం? దేవుడికి తెలుగురాదు. -భమిడిపాటి, మనం తెలుగువాళ్ళం-ఏమీచాతగాని వాళ్ళం కొడవటిగంటి

''జనగణమన అధినాయకుడెవరనుకున్నారు?
జార్జి మహారాజు'' (మారుతీరావు ''మళ్ళీ మధుమాసం'')
''మైలాగియిలా ఈ ఇంగ్లీషువారికి లక్ష్యం లేదు'' (గురజాడ అప్పారావు ''కన్యాశుల్కం'')

''తాజా కాలిన్స్ ఇంగ్లీష్ డిక్షనరీలో బద్మాష్, చంగా, చుడ్డీ, దేశీ, ఆంటీజీ, అంకుల్‌జీ, గోరా, కుర్తా, కుత్తా, కుత్తి, హరామ్‌జాదా, హరామ్‌జాదీ, యార్, మహల్, లాంటి పదాలు చోటుచేసుకున్నాయి. 'ఇంగ్లీషు ఇంత అందమైన భాష కావటానికి కారణం అది మొదటి నుండీ ఇతర భాషల నుండి పదాలను స్వీకరించటమే' అని ఎడిటర్ ఇన్‌చీఫ్ జెరిమీ బట్టర్ ఫీల్డ్ అనారు''. (డక్కన్ క్రానికల్ 9-6-2005) మహారాజా, మహారాణి, మహాత్మాలాంటి ఎన్నో భారతీయ పదాలు ఇంగ్లీషు డిక్షనరీల్లోకి ఎప్పుడో ఎక్కేశాయి. కనీసం ఈ పదాలు ఫలానా భాష నుండి అరువు తెచ్చుకున్నవని కూడా ఇంగ్లీషు నిఘంటువుల్లో గుర్తులు పెట్టడం లేదు. అవి ఇంగ్లీషు వాళ్ళు స్వంతం చేసుకుంటున్నారు. ఇలాంటి పని మన భారతీయ భాషల వాళ్ళు ఎంత మాత్రం చేయటం లేదు. అంటరానితనం వంటబట్టించుకున్న జనం అప్రాచ్యపు భాషల పట్ల గూడా ఇదే తత్వాన్ని ఆచరిస్తున్నారు. హింగ్లీష్, తెల్గిష్, భాషలు మాట్లాడుతూ అప్రాచ్యులతో ఉపాధికోసం అంటకాగుతున్న వారే, స్వదేశంలో సంస్కృతి, సంప్రదాయం, సాహితీవిలువలు అంటూ ప్రజలు వాడుకలోకి తెచ్చిన అప్రాచ్యపు పదాలను కూడా నిఘంటువుల్లోకి తేకుండా భాష శక్తివంతం కాకుండా అడ్డుకుంటున్నారు.

తెలుగువాళ్ళ గురించి, ఇంగ్లీషువాళ్ళ గురించి, కొన్ని పాత్రలతో మన తెలుగు ప్రముఖ రచయితలు కొన్ని మరువరాని మాటలు చెప్పించారు. (సంకలనం: బూదరాజు రాధాకృష్ణ 2004): మళ్ళీ ఒకసారి ఆమాటలు గుర్తు చేసుకుందాం :

''తిట్లకు ఇంగ్లీషూ, దీవించటానికి సంస్కృతమూ అయితే,

తెలుగు కూరలు బేరం చేయడానికి తప్ప దేనికీ పనికి రాదు" -కొడవటిగంటి, ఐశ్వర్యా
"తెలుగులో అచ్చుతప్పులు లేకుండా పుస్తకం వస్తుందని గ్యారంటీ లేదు" -కొడవటిగంటి, అనామిక"ఇంగ్లీషుకి తండ్రి ల్యాటిన్. తెలుక్కి తల్లి సంస్కృతం, అవటం చేత ఇంగ్లీషు తెలుగూ కలవ్వేమో అని కొందరికి డౌటేహం" -భమిడిపాటి, బాగుబాగు తెలుగులో నూటికి తొంభైతొమ్మిది అనుకరణం -భమిడిపాటి, తెలుగు వ్యాకరణం తెలుగులో తలకట్లు ప్రత్యేకించి పిలకలు అయిపోయినాయి అందుకని అక్షరాల తెలుగు వ్యక్తులు కచటతపలు. - భమిడిపాటి, కచటతపలు.

తెలుగులో ప్రార్థనేమిటి నీ మొహం? దేవుడికి తెలుగురాదు. -భమిడిపాటి, వేషం తగాదా తెలుగు వాళ్ళందరినీ భర్జించేది తెలుగుతో నిమిత్తం లేనిదే. -భమిడిపాటి, తుక్కుముక్కల హక్కుచిక్కుఈ పదేళ్ళ మధ్య మన యూనివర్శిటీలు మూడు కనీసం యాభై మంది తెలుగు డాక్టర్లను తయారుచేశాయి. కాని మన భాషలో విమర్శ సాహిత్యం ఇంచుమించు లేనేలేదు. -మహీధర, స్వయంవరణం తెలుగురాని వాళ్ళు తెలుగు పుస్తకం ఎలాగూ చదవరు. ఇంగ్లీషు చదివిన తెలుగు వాళ్ళు తెలుగు పుస్తకం కేసి చూడనైనా చూడరు. అందుకే తెలుగు రచయిత ఈనాడు అరకప్పు కాఫీకి దిక్కులేక అలమటిస్తున్నాడు. -సూర్యారావు, నీలితెరలు మనం తెలుగువాళ్ళం, ఏమీ చాతగాని వాళ్ళం. -కొడవటిగంటి, అనామిక గొప్ప తెలుగువాళ్ళు తెలుగు వచ్చినా వాడరు. తెలుగు వాడకుండా ఉంటేగానీ తెలుగు వాళ్ళచేత గొప్పవాళ్ళనిపించుకోలేరు. -భమిడిపాటి, తెలుగు గర్వించవేలరా తెలుగోడా గత కీర్తి తలబరువు గలవాడా -మల్లారెడ్డి, ఆంధ్రప్రబోధము
మనకి ఇంగ్లీషు అచ్చిరాదని చెబితే విన్నావు కావు. ఈ వెధవ ఇంగ్లీషు చదువు నించి బ్రాహ్మణీయం చెడిపోతుంది. మన శాస్త్రాల్లో మాటలు మనం మరిచిపోయినాము. ఆ మాటలే తెల్లవాళ్ళు దొంగతనంగా పట్టుకుపోయి శాస్త్రం చెప్పినట్లలా ఆచరించి మనరాజ్యం లాగుకున్నారు. ఇంగ్లీషువాడు 'తింక్' అన్నాడోయ్. ఆలోచిస్తేగానీ నిజం బోధపడదు. ఇంగిలీషు వాడు సోమరితనం వొప్పడండీ. మన పుస్తకాల్లో మర్మం కనుక్కొని దొర్లు బాగుపడుతున్నారు. మన పుస్తకాలు బూజెక్కించి మనం చెడుతున్నాం. -గురజాడ, కన్యాశుల్కం
ఇంగ్లీషు చదువుకునే వారందరూ రౌరవాది నరకాలలో పడిపోతారు.

-కందుకూరి, హాస్య సంజీవని

తెలుగులో కోపం ఎట్లా వస్తుందోయ్, ఇంగ్లీషులో అన్నా -గంగాధరరావు, బంగారు సంకెళ్ళు

మనకి ఇంగ్లీషు రాజభాషే కాకుండా మన్మథభాష కూడా అయిపోయింది.
-లక్ష్మణరావు, అతడు -ఆమె

ఇంగ్లిషులో మాట్లాడుతుంటే కులం ఏదయిందీ అసలు తెలుసుకోలేం.
-కొడవటిగంటి, అనుభవం.

ఇంగిలీషోడి అమల్లో ఏపని చేసిన బంగారం పలుకుతుంది. ఈ ఇంగ్లీషువాళ్ళు చదువులు పెట్టి మన వేళ్ళతో మనకళ్ళే పొడుస్తున్నారు.
-గురజాడ, కొండుభట్టీయము

ఈ మాటలన్నీ మన భాషపట్ల మక్కువతో అన్నవే. దురుద్దేశమేమీ లేదు. మంచి పలుకు లెప్పుడైనా, ఎవరిపైనా ఉదాహరించవచ్చు.

'మన వాళ్ళు వట్టి వెధవాయలోయ్' అంటే ఇక మనవాళ్ళు ఎన్నటెన్నటికి వెధవాయలుగా ఉండిపోవాల్సిందే అనే కోర్కె ఆ మాట అన్నవాడికి లేదు. వీళ్ళు బాగుపడాలి అనే ఆశ అందులో ఉంది. అసలు ఎప్పటి కైనా బాగుపడతారా అనే అనుమానమూ ఉంది. ఇదేం జాతిరా బాబూ ఇలాంటి మాటలతో పొడిస్తేనన్నా కదులుతారనే తాపత్రయమూ ఉంది. ఇంగ్లీషు వాళ్ళు తమ భాషాభివృద్ధి కోసం ఎంత శ్రమ పడుతున్నారో అలాంటి శ్రమ మన తెలుగు వాళ్ళు కూడా పడాలని వారికోరిక. రచయితల మనోభావాల్ని అర్థం చేసుకోలేనంత అజ్ఞానులెవరూ తెలుగు ప్రజల్లో లేరు. కాకపోతే వందల సంవత్సరాల పాటు పరభాషల పాలనలో మగ్గిపోయి నందువల్ల సంక్రమించిన బానిస మనస్తత్వం స్వేచ్ఛ స్వాతంత్రం లభించిన తరువాత కూడా వదుల్చుకోలేక పోయారు. దానికి నాయకులు, అధికారులే వందలాది కారణాలు చెబుతున్నారు. కారణం తెలిసినప్పుడు తెలివిగలవాడెవడైనా పరిష్కారం కనుక్కుంటాడు. పరిష్కారం అక్కరలేదు అనుకునేవాడు ప్రయత్నించడు. ప్రయత్నమే చెయ్యనివాడు పరాన్నజీవిలా బ్రతుకుతాడు. పరాన్నజీవికి స్వంత ఆలోచనలు, ఆవిష్కరణలు ఉండవు. మరొకడు అభివృద్ధి పరిచిందాన్ని పడి మేయటం తప్ప, తాను కూడా శ్రమపడడు. ఒకవేళ శ్రమ పడినా ఆయాచితంగా ఫలాలు వచ్చి పడటం కోసమే శ్రమ పడతాడు. స్వంత గుర్తింపు లేనందుకు సిగ్గుపడడు. సిగ్గుపడితే, స్వేచ్ఛ వచ్చాక కూడా బానిస బుద్ధి

ప్రదర్శించడు. తన భాషకు కూడా అధికారం ఇస్తాడు. అధికారపూర్వకంగా తన భాషను ఉపయోగిస్తాడు. అదేమి విచిత్రమో కానీ తెలుగువాడు భాషపేరుతో ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించాడు కానీ తన భాషకు అధికార దండం అందించలేక పోయాడు.

అధికార భాషా సంఘానికి కొన్ని అధికారాలను ఇస్తూ చట్టంలో మార్పులు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు 8-6-2005 న ఎ.బి.కె. ప్రసాద్ గారు నాతో చెప్పారు. అధికారభాషా సంఘాలకు ఇప్పటికైనా అవసరమైన అధికారాలు ఇవ్వాలి. తిరుమల తిరుపతి దేవస్థానాల అధికారిగా హిందీ వాడైన అనిల్ కుమార్ సింఘాల్ ను నియమించినపుడు విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి తెలుగురాని వ్యక్తిని ఆ పదవిలో నియమించటాన్ని వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళతామన్నారు. 21 తెలుగు కులవృత్తులు ఆగమాలు శ్రీవారి ఆలయ వ్యవస్థలో ఇమిడి ఉన్నాయి తెలుగు భాష రాని వ్యక్తికివి అర్థం కావు అన్నారు.

ఇలాంటివి పరిశీలిస్తుంటే తాడిపత్రి దగ్గరలోని చినపొడమల ఆశ్రమాధిపతి త్రైత సిద్ధాంతకర్త శ్రీ ప్రబోధానంద యోగి గారు భాషల గురించిన ఇంకో దేవరహస్యం బయటపెట్టారు: దేవుళ్ళకు కూడా **ప్రాంతీయ భాషలు మాత్రమే వస్తాయట :**

“మాట్లాడే భాష దేవతలకు కూడా ఉండును. అందరినీ పుట్టించిన దేవునికి భాషలేదు గానీ, సృష్ఠించబడిన దేవతలకు భాష కలదు . దేవతలు ఏ ప్రాంతము వారికి ఆ ప్రాంత భాష మాత్రమే తెలియును. ఒక ప్రాంతములో తెలుగు మాట్లాడు ప్రజలుంటే ఆ ప్రాంతములోని గుడిలో గల దేవతలకు మనుషులు మాట్లాడు తెలుగు వచ్చును. తెలుగు మనుషులు గుడికి వచ్చి పోవుట వలన దేవతకు తెలుగు భాషనే వచ్చును. తమిళనాడు రాష్ట్రములో ఒక గుడిలోని దేవత ఇతరు మీదికి వచ్చి మాట్లాడునప్పుడు తమిళమే మాట్లాడుటను చూచాను. అలాగే ఆంధ్రరాష్ట్రములో కొన్ని గుడులలోని దేవతలు మాట్లాడునప్పుడు తెలుగు లోనే మాట్లాడడమును చూచాను. మనము తమిళనాడుకు పోయి అక్కడి దేవతతో మాట్లాడవలెనని ప్రయత్నించినా, ఆ దేవతకు తెలుగు తెలియదు, కావున తెలుగు లో మాట్లాడలేదు. ఆమె తమిళములో మాట్లాడినా అది మనకు అర్థము కాదు. అదే విధముగా తెలుగు రాష్ట్రములో నేను చాలామంది దేవతలతో

అక్కడక్కడ మాట్లాడడము జరిగినది. అప్పుడు వారు తెలుగు మాట్లాడినా ఆ ప్రాంతములో మాట్లాడు యాసలోనే మాట్లాడడము చూచాను. తెంగాణలో అక్కడి తెంగాణ యాసలో అక్కడి దేవతలు మాట్లాడడము, రాయలసీమ ప్రాంతములోని దేవతలు రాయలసీమ ప్రాంత యాసలో తెలుగులో మాట్లాడడము చూచాను. దీనినిబట్టి ఏ ప్రాంతము వారికి ఆ ప్రాంత భాషే అలవాటై యున్నదని తెలియుచున్నది. కొన్ని దేవాయముల లోని ముఖ్యమైన దేవతలు కూడా నాతో మాట్లాడడము జరిగినది. అప్పుడు వారిని నేను కొన్ని ప్రశ్నలు అడగడము జరిగినది. నిత్యము పూజలు చేయు పూజార్లు సంస్కృతములో మంత్రము చదువుచుందురు కదా! అప్పుడు ఆ మంత్రము మీకు అర్థమగుచుండునా యని అడుగగా! “మాకు తెలుగు భాష మాత్రము తెలియును. చిన్నప్పటి నుండి తెలుగు భాష అలవాటై పోయినది. సంస్కృతమును అప్పుడప్పుడు పూజలో మాత్రము వింటున్నాము. ఆ భాష మాకు తెలియని దానివలన వారు ఏమి చెప్పుచున్నారో ఏమాత్రము తెలియదు అని అన్నారు”---- .ఆచార్య ప్రబోదానంద యోగి ,భావము-భాష 2016

ప్రబోధానంద స్వామి గారి మాటలు నిజమేననిపిస్తోంది. ఎందుకంటే నేను పేరుకు సాయిబునైనా నాకు ఉర్దూరాదు. ఇంట్లో తెలుగు మాత్రమే మాట్లాడుకొనే తెలుగు సాయిబులం మేము.

నా మాతృభాషే తెలుగు. మనందరినీ కలిపేది తెలుగు. మనం ఒకరికొకరం అర్థమయ్యేది తెలుగు భాషద్వారానే. చివరికి మనం దేవుడికి పెట్టుకునే మొరకూడా తెలుగులోనే.ఇప్పుడు ప్రబోదానంద గారి ద్వారా కొత్తగా తెలిసిన విషయం ఏమిటంటే మన తెలుగు ప్రాంతంలోని దేవుళ్ళకు తెలుగు మాత్రమే వస్తుందని మరో భాష పెద్దగా రాదని. . తెలుగురాని దేవుళ్ళకు తెలుగు జనం మొరలు అర్థం కావు. తెలుగునేలపైనే అంటిపెట్టుకొని ఉన్న తెలుగువాళ్ళకు తిరపతి వెంకన్న మొదలు బోలెడంతమంది తెలుగు దేవుళ్ళు, తెలుగు దేవతలు ఉన్నారు. విదేశాలకు పోయినోళ్లే పాపం తెలియని భాషలో తెలియని దేవుళ్ళకు నివేదించుకోవాలి. ఇక్కడ మనకు ఇతరభాషల ఇబ్బంది లేదు. అన్నమయ్య,త్యాగయ్య, రామదాసు ల్లాగా మన తెలుగులోనే స్వేచ్ఛగా ధారాళంగా దేవుళ్ళకు ప్రార్థన చేద్దాం. ఎందుకంటే వీళ్ళ

తెలుగు కీర్తనల దెబ్బకు దేవుళ్ళే దిగి వచ్చారు .

(ఆంధ్రప్రభ 17.12.2017)

తెలుగులోకి 15 చట్టాల అనువాదం

9.6.2018

ఈనాడు డిజిటల్, అమరావతి: పాలనలో తెలుగుభాష వినియోగానికి సంబంధించి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో రూపొందించిన 15 ముఖ్య చట్టాలను తెలుగులోకి అనువదించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయశాఖ కార్యదర్శి దుప్పల వెంకటరమణ ఈ ఉత్తర్వును తెలుగులో జారీ చేయడం విశేషం. చట్టాలను తెలుగులోకి అనువదించాలని ఉత్తర్వులివ్వడంపట్ల భాషావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రూపొందించిన, రూపొందించబోయే చట్టాలు మాతృభాషలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆయా శాస్త్రాలకు సంబంధించిన ఆంగ్ల పదాలకు సమాంతరంగా తెలుగుపదాలుండేలా చొరవ చూపాలని తెలుగు భాషా పరిరక్షణ సంఘం ఉభయ రాష్ట్రాల అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.



ంస్కరించాలి



లిపిని సంస్కరిస్తేనే మంచి రోజులు

ఆంగ్ల భాష ప్రపంచంలో అతిపెద్దభాషగా ఎదిగి అక్షరాలు నాలుగు బడుల్లో ఉండటం ఒక కారణమని ఆచార్య ప్రబోధానంద యోగి గారు అంటుంటే నిజమేనా అని ఆగి ఆలోచించవలసి వచ్చింది. ప్రపంచం లో ఎన్నో భాషలు ఉంటే లిపి నాలుగు రకాలుగా ఏ భాషకన్నా ఉందా అని ఆయన ప్రశ్నించాడు. నిజమే కదా ? నాలుగు రకాల లిపులు ఇంకే భాషకన్నా ఉన్నాయో లేదో తెలిసినవాళ్ళు చెప్పాలి. చాతుర్వర్ణం మయా సృష్ట్యామ్ అనే శ్లోకం ఆధారం చేసుకొని అదే మాదిరిలో నాలుగు బడుల అక్షరాలు చేసుకున్నారేమోనని ఆయన సందేహమూ వ్యక్తం చేశారు. భాష ఎదగాలంటే లిపి కూడా ముద్రణకు, రాయటానికి అనుకూలంగా బాగుండాలన్నమాట. 56 అక్షరాలున్న మన అతిపెద్ద తెలుగు లిపికి కూడా నాలుగు బడుల అక్షరాలు సమకూర్చలేము కానీ ఉన్న ఒకే ఒక్క లిపిని ముద్రణకు రాతకూ ఎలా అనుకూలంగా చెయ్యాలో ఆలోచిద్దాం.

ఇ, ఙ ,ఞ ,న్య

ఇది ఇటీవలే ఎదురైన సమస్య. జ్ఞానము అని రాయకుండా జ్ఞానము అని రాస్తే ఫేస్ బుక్ అంగీకరిస్తోంది. జ్ఞా అనే తెలుగు అక్షరం ఎక్కడ కనబడ్డా మొత్తం పోస్టునే తొలగిస్తోంది. జ్ఞా లోని ఇఙ గుర్తు సురక్షితమైనదే కాబట్టి అనుమతించాలని అభ్యర్థన పంపాను. ఇఙ గుర్తు తెలుగు అక్షరమాల లో ఒక అక్షరం. దాని ప్రత్యేకత దానిది. ఈ అక్షరాన్ని వదిలేద్దామా కాపాడుకుందామా?అని మిత్రులను అడిగితే అక్షరాన్ని వదులుకోకూడదు అని కొందరు, ఇది తాత్కాలిక సమస్యే త్వరలో తొలగిపోతుంది అని కొందరు అన్నారు. యూనీకోడ్ లో ఉన్న అక్షరమే అయినప్పటికీ ఈ అక్షరం ఉన్న వ్యాసాలను అది ఎందుకో తిరస్కరించి ఫేస్ బుక్ మిత్రులను ఇబ్బంది పెట్టింది.

ప్రపంచ తెలుగు మహాసభలు ఇన్ని సార్లు జరిగినా ఎవరూ

సరిగా పట్టించుకోని సమస్య లిపి సమస్య. మన జాతి వెనుకబడి పోవటానికి, తెలుగులో చదువులు బండబారిపోవటానికి, ఇంగ్లీషుతో సమానమైన వేగం అందుకోలేకపోవటానికి మన లిపే ప్రధాన కారణమని పండితులు, మేధావులు ఎప్పటినుండో చెబుతూనే ఉన్నారు. అయినా లిపి సంస్కరణ జోలికి వెళ్ళకుండానే మహాసభల్ని ముగించేస్తున్నారు. భాషను బాగుచేసే లిపి సంస్కరణ కార్యక్రమాన్ని ఇప్పటికైనా చేపట్టడం మంచిది.

బ్రహ్మ ఏర్పరచిన లిపి 'బ్రహ్మలిపి' అనుకుంటున్నారేమోగాని మనవాళ్ళు లిపి సంస్కరణకు భయపడుతున్నారనిపిస్తోంది. సవర భాషకు గిడుగు కొత్త లిపిని తయారు చేశాడు అంటారు. కానీ కొత్త లిపి ఎందుకు?తెలుగు లిపినే వాడుకోవచ్చుకదా?కొత్త లిపి జనామోదం పొందటం కష్టమే. భాష వాక్కు రూపంలో ధ్వనిస్తే, ఆ ధ్వనికి సంకేతమే లిపి, ఈ లిపి మనిషి తన సౌలభ్యంకోసం తయారు చేసుకున్నాడు. మోషేకు పది ఆజ్ఞలు దేవుడు రాతి పలకల మీద హెబ్రూ లిపిలో చెక్కి ఇచ్చాడట. ఎందుకంటే మోషే భాష హెబ్రూగనుక. మనమంతా కలిసి ఈ శబ్దాన్ని ఈ అక్షరంతో రాయాలి. ఇలా రాయాలి అని నిర్ధారించుకుంటే అదే మన లిపిగా నిలబడుతుంది. ప్రపంచంలో వేలాది బాషలకు లిపి లేదు. ఆ భాషలు రానురాను నాశనమై పోతున్నాయి. కేవలం 26 అక్షరాలతో వత్తులు, గుణింతాలను కూడా కల్పించుకొని సాఫీగా యంత్రాల మీద సాగిపోతున్న ఇంగ్లీష్ తరహాలో తెలుగు లిపిని కూడా సంస్కరించుకోవాలి.

భూపతి నారాయణమూర్తి 'భోధన, పాలన జనజీవన రంగాలలో తెలుగు' (1998) అనే పుస్తకంలో ఇలా అంటారు: మన లిపిలో ఉపయోగం లేని అక్షరాలు మూడోవంతు వరకు ఉన్నాయి. వాటిని రద్దుచెయ్యాలి. ఉ,ఖ,ఘ,ఞ,ఝ,థ,ణ వగైరా అక్షరాలను తీసి వేయాల్సి ఉంది. చైనా 3 సార్లు తన లిపిని సంస్కరించింది. శాస్త్ర సాంకేతిక పరికరాలకు అనుకూలంగా లిపిని తయారు చేసుకున్నారు. అలాగే తెలుగు లిపిని కూడా సంస్కరించాలి. అప్పుడే అధికార భాషగా తెలుగు రాణించగలదు. లిపిని సంస్కరించటం వల్ల అత్యధిక సంఖ్యలో ఉన్న నిరక్షరాస్యుల్ని కూడా అక్షరాస్యులుగా చేయటం తేలిక అవుతుంది." ఇప్పటికే మనం ఋ,ౠ,ఌ ,ఁ,ఱ,చ,జ,లాంటి అక్షరాలను వదిలించుకున్నాము. "అక్షర దీక్ష" వాచకాల్లో కేవలం 30 అక్షరాలే

ఉపయోగించారు.

బూదరాజు రాధాకృష్ణ "భాషాశాస్త్ర వ్యాసాలు" (1990) అనే పుస్తకంలో ఇలా అన్నారు. "నిజానికి పారిశ్రామిక విప్లవం, సాంస్కృతిక పునరుజ్జీవనం మొదలైన రోజుల్లో యూరప్‌లోని దేశాలు లాటిన్, గ్రీకు భాషల ప్రభావం నుంచి వేర్పడి దేశభాషల్లో సమస్త వ్యవహారాలు జరుపుకోవటం మొదలుపెట్టినప్పుడు ఇప్పుడు మనం పడుతున్న కష్టాలన్నీ తామూ అనుభవించాయి. అన్ని సమస్యలూ మనకే రాలేదు. ప్రయత్నలోపం వల్ల, భాషాస్వభావ పరిజ్ఞాన లోపం వల్ల, మాతృభాషాభిమాన లోపంవల్ల, తెచ్చిపెట్టుకున్న చిక్కులే మనకెక్కువ. ఉపయోగం వల్ల భాష పెరుగుతుంది. తెలుగును అధికార భాషగా వినియోగించినప్పుడు అదే సహజంగా అభివృద్ధవుతుంది."

"...56 అక్షరాలున్న తెలుగు భాషకంటే 26 అక్షరాలే ఉన్న ఇంగ్లీషు ఎక్కువ వాడుకలోకి వచ్చింది, ప్రపంచ భాష అయ్యింది. కాబట్టి తెలుగు భాషకు 16 అక్షరాలే పెట్టి నంబర్ వన్ పొజిషన్ తెస్తాను చూడండి.." అంటాడొక నాయకుడు సినిమాలో. అది అతను భావావేశంలో సాధ్యసాధ్యాలను గమనించకుండా అన్నమాట అయినప్పటికీ భాషా సంస్కర్తలు ఈ పనికి పూనుకోవచ్చు. తెలుగులో ఎదురయ్యే మొదటి సమస్య గుణింతాలు, వత్తులు. వీటివలన అక్షరానికి క్రిందా పైనా మరో రెండు లైన్లు స్థలం అవసరమవుతుంది. టైపుమిషను, కంప్యూటర్‌లలో అక్షరాలు ముద్రించేటప్పుడు ఈ విషయం తెలుస్తుంది. ఇంగ్లీషులో కేవలం AEIOU అనే అచ్చులతో మిగతా 21 హల్లులు కలిసి భాష ఒకే లైనులో సాఫీగాసాగి పోతుంది. "తెలుగు లిపి పరిణామం" అనే వ్యాసంలో డాక్టర్ తిరుమల రామచంద్ర వెలిబుచ్చిన కొన్ని అభిప్రాయాలివి. "..తెలుగు లిపి గుండ్రంగా అవటానికి 2500 ఏళ్ళు పట్టింది. అంతకు ముందు ఇవి అడ్డపు, నిలువు గీతలే. భాష ధ్వనిరూపం. ఈధ్వనికి సంకేతాలే లిపులు. అచ్చు వచ్చిన తరువాత లిపి స్వరూపం మరింత సుందరమయి స్థిరపడింది. ఇక్ష్వాకుల కాలంలో శిల్పులు అక్షరాలకు ఒంపులు వయ్యారాలు చేకూర్చారు. అక్షరాల నిలువు గీతలు అడుగున పొడపై కుడి వైపునకు వంపు తిరిగాయి. శాలంకాయనుల కాలంలో కొన్ని అక్షరాల తలపై అడ్డగీత ఏర్పడింది. కొన్ని అక్షరాలు గుండ్రతనం వదిలి కోణాకారం దాల్చాయి. విష్ణుకుండినుల కాలంలో తలపై అడ్డుగీత అన్ని అక్షరాలపై కనిపించింది.

వీరి కాలంలో 'ళ్ల' అనే వింత అక్షరం ఉండేది. తరువాత అంతరించింది. చాళుక్య లిపి చక్కగా నిలువుగా ఉంటుంది. నన్నయ కాలం నుంచి వేంగీ చాళుక్య లిపిలో మార్పులు ప్రారంభమై 200 ఏళ్ళకు కన్నడ, తెలుగు లిపులు విడిపోయాయి. తెలుగు మరీ గుండ్రమై పోయింది, కన్నడ లిపి కోణాకార మయ్యింది. నన్నయ్య కాలపు అక్షరాలకు మధ్యన అడ్డంగా గీత గీస్తే తలకట్టు దగ్గర తెగుతుంది. అంటే తలకట్టు సగమూ, తక్కిన అక్షరం సగమూను. కాకతీయుల అక్షరాలలో తలకట్టు చిన్నదై తక్కిన భాగం పెద్దది కావటంతో అక్షరాలు పొంకంగా, దీర్ఘవర్తులంగా అయి అందం వచ్చింది. ప, హలు తలకట్టు విదిల్చుకున్నాయి. చాప, జల్లెడ వంటి వాటిలో 'త ఒత్తు' వంటి గుర్తు 19వ శతాబ్దంలో సి.పి. బ్రౌన్ పెట్టించాడు. మరో వింత అక్షరం అరసున్న. 16వ శతాబ్దానికి ముందు కనిపించదు.

ముఖ్యాక్షరాలు ఎంతగా మారాయో గుణింతాల గుర్తులు అంతకు రెండింతలుగా మారాయి. క్రావడి మరొక్క రూపం వలపల గిలక 'కర్మ' అని వ్రాయడానికి కమ్ అని వ్రాసేవారు. ఈ విధంగా తెలుగు లిపి 23 వందల సంవత్సరాలలో ఎన్నో మార్పులు పొంది నేటికీ రూపానికి వచ్చింది. ప్రస్తుత యంత్రయుగంలో ఎన్నో మార్పులు పొందవచ్చు. లోహాక్షరాలు చేతితో పేర్చుకొనే అవసరం పోయి, ఆంగ్లంలో లాగా మోనోటైప్ యంత్రాలలోను, లైనోటైప్ యంత్రాలలోను టైప్‌లాగా కొట్టే వరకు అభివృద్ధి చెందింది. అక్షరాలను విడగొట్టి కలిపే పద్ధతిలో స్వరూపాలు గూడా ముందుకన్నా మారాయి. కంప్యూటర్ ద్వారా కంపోజ్ చేసే పద్ధతి ప్రస్తుతం గొప్ప విప్లవం. ఒకచోట వాడిన మాట పలుచోట్ల అక్షరరూపం దాల్చే పద్ధతి కూడా వచ్చింది. శ్రమ తగ్గించుకొని లాఘవం కోరే మానవుని బుద్ధి ఈ వర్ణమాలలోనూ ఎన్నోమార్పులు తలపెట్టవచ్చు.

విజయ లిపి –భారతి లిపి

భారతదేశం లోని అనేక భాషల లిపులను కలపటానికి ఉమ్మడి లిపులను తయారు చేయటానికి కొన్ని ప్రయత్నాలు జరిగాయి : సత్య సాయిబాబా కోరికమేరకు కన్నడ –తెలుగు లిపులను కలిపి విజయ లిపి రూపొందించే ప్రయత్నం జరిగింది. శ్రీకృష్ణదేవరాయల స్మృతి చిహ్నంగా.. విజయనగర సామ్రాజ్యాన్ని జ్ఞప్తికి తెచ్చేలా 'విజయ లిపి' అని పేరు పెట్టారు. బాబా చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. మద్రాసు

ఐ.ఐ.టి. ప్రొఫెసర్ వడ్డాది శ్రీనివాస చక్రవర్తి భారతి లిపి రూపొందించారు. పెరియార్ రామస్వామి కూడా తమిళ అక్షరమాలను ఆధునీకరించారట. ఇవన్నీ ప్రజలకు లిపి బాధలు తొలగించటానికే.

"కొన్ని తెలుగు ముద్రాక్షరాలు అచ్చు కూర్పరులకు విసుగు పుట్టించేవి. తెలుగు లిపిలో ఉన్న క్లిష్టత వల్ల తెలుగులో అచ్చు కూర్చటానికి (కంపోజింగ్‌కు) చాలా ప్రయాస పడేవారు. ఉదాహరణకు ఆనాడు అచ్చులో ఉపయోగిస్తున్న అర్ధచంద్రాకారంలో వేరొక వర్ణానికి కిందరాస్తూ ఉండిన రావడి కూర్పు చాలా శ్రమ కలిగించేది. దీన్ని సి.పి. బ్రౌన్ తెలుగు శాసనాలలో ఉన్న గుర్తును నమూనాగా గ్రహించి లాంటి రెండు రూపాలు కల్పించారు. ఈ సంస్కరణల వల్ల కూర్పరులకు కొంత శ్రమ తగ్గింది. అచ్చు కూర్పు కొంత మేరకు వేగవంతమయ్యింది. ఈ కొత్త రూపాలకు 'బ్రౌన్ రావళ్ళు' అనే పేర్లు కలిగాయి. ఇలాగే ప,వ,న, స, ల విషయంలో లిపిలో ఉన్న సామ్యాన్ని బట్టి పొరబాటు పడటానికి అవకాశం ఉన్న దాన్ని గ్రహించి కన్నడంలో ఉన్నట్లు ఈ అక్షరాలలో స్పష్టంగా మార్పు కనబడే విధంగా టైపులు పోత పోయించి సి.పి.బ్రౌన్ వాటిని వాడుకలోకి తెచ్చారు. కాని ఇవి తెలుగులో నిలిచినట్లు కనబడదు. బ్రౌన్ కొన్ని సంస్కరణలు ప్రవేశ పెట్టినా, తెలుగు ముద్రణ పెక్కు లోపాలతో సాగుతూ వచ్చింది. ముద్రాక్షరాల సంఖ్యను 405 కన్నా తగ్గించటం ఎవ్వరికీ సాధ్యం కాలేదు. బందరులోని కళ్యాణీ టైపు ఫౌండ్రీ అధిపతి కె.వి. కొండయ్యగారు అక్షరాల సొంపు చెడకుండా ముద్రణా యంత్రానికి ఒదిగే విధంగా టైపు తయారీలో సాంకేతిక మార్పులు చేసి, 350కి తెలుగు లిపి రూపాలను కుదించారు. దీన్ని "కళ్యాణీ టైపు" అన్నారు. తక్కువ వ్యవధిలో అచ్చుకూర్చి తక్కువ వ్యయంతో తెలుగు పుస్తకాలు ముద్రించవలసిన అవసరం ఏర్పడింది. దీనికి తెలుగు లిపి ప్రతిబంధక మైంది. అది ముద్రణకు అనుకూలంగా లేదు. గుణింతపు గుర్తులు (తలకట్టులు, గుడులు, సుడులు) మొదలైనవి అక్షరానికి పైనా కిందా ఉండటం, సంయుక్తాక్షరాలు, ద్విత్వాక్షరాలూ, వీటి గుర్తులు కొన్ని సూటిగా అక్షరం కింద ఉండటం, అక్షరాలు అధికంగా ఉండటం అనే అంశాలు తెలుగు లిపిలోని క్లిష్టతకు ముఖ్యమైన కారణాలు. ఇలాంటి క్లిష్టత వల్లే తెలుగులో పుస్తక ముద్రణ వేగంగా జరగటం లేదు. లోపాలను తొలగించి తెలుగు లిపి సంస్కరణ తప్పనిసరిగా జరపవలసి ఉంది.

మన మీనాడు కంప్యూటర్ యుగంలో పురోగమిస్తున్నాం. పరిణామాలను ఆహ్వానిస్తున్నాం. వేగం నేటి యుగధర్మం. ఈ వేగానికి తట్టు కోలేనిదేదీ నిలవదు. మందకొడిగా అక్షరాలు కూడా నడక సాగించలేవు. తెలుగు భాషకు ఇదొక సంధియుగం. మద్రాసులో మురళీకృష్ణ అనే ఇంజనీరు బాపు అక్షరాలతో సహా అందంగా అక్షర స్వరూపాలకు కంప్యూటర్ ప్రింటింగ్‌కి అనువుగా కీ బోర్డులు రూపొందించాడు. లిపిని ఇంకా సంస్కరించి తెలుగు భాషా స్వరూపాన్ని ఆధునీకరించటానికి ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.” ప్రభుత్వం, అధికార భాషా సంఘం తెలుగు విశ్వవిద్యాలయం
“లిపి సంస్కరణ” కొరకై నడుము బిగించాలి.

ఒకసారి నేనే న్యాయమూర్తినయ్యాను. రంపచోడవరం మొబైల్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్. అంతా గిరిజనులు, మన అచ్చ తెలుగువాళ్ళు, ఆహా, ఇంకేం తెలుగులో తీర్పులివ్వొచ్చు అని ఆనందపడుతూ వెళ్ళాను. అక్కడా పదిమంది లాయర్లు ‘యువరానర్’ అంటూ ప్రత్యక్షమయ్యారు. ఆంగ్ల భాషాకోవిదులైన అడ్వకేట్లు నల్లకోట్లు వేసి నాముందుకొచ్చి, నేను తెలుగు న్యాయం మాత్రమే చెప్పబూనటం అపూర్వం, సాహసం, ప్రమాదభరితం అని ఆంగ్లంలో ఉపదేశించారు. అడివిలో కూడా ఆంగ్లమేనా ఇక నా తెలుగెక్కడ తల్లీ? అని తడుముకున్నాను, మదనపడ్డాను. వాది, ప్రతివాది, సాక్షులు అంతా తెలుగులో చెబుతున్నారు. వాళ్ళు చెప్పింది చెప్పినట్లు వాంగ్మూలం టైపు చేయమంటే “తెలుగు టైపు మిషన్ లేదు, అయినా అది కష్టం, మీరు ఇంగ్లీషులోకి మార్చి చెప్పండి కొడతాం” అని సిబ్బంది ఇబ్బంది పడ్డారు. శక్తిచాలనివాడు సాధుత్వం వహించినట్లుగా బహుశా తెలుగును అభిమానించే న్యాయమూర్తులంతా ఇటువంటి ఇబ్బందుల్ని నెగ్గుకు రాలేక మౌనం దాల్చారని స్వానుభవం మీద అర్థం అయ్యింది.

కంప్యూటర్లొచ్చాయి, కోర్టులో తెలుగు సాఫ్ట్‌వేర్ వాడుకోవచ్చుగదా అని కొందరు ఉచిత సలహాపడేశారు. నిజమే గదా అని కంప్యూటర్ అడిగాం. ఇస్తామన్నారు అయితే దానికి ఇంగ్లీష్ కీబోర్డే ఉంటుంది. ఇంగ్లీష్‌లో కొడితే తెలుగు అక్షరాలు ప్రత్యక్షమవుతా యన్నారు. మాడుమీద కొడితే మోకాలు పగిలినట్లు ఈ బాధ **మనకెందుకు** తెలుగు మాటల్నే ఇంగ్లీషులో కొడదాం తేలికగా పనైపోతుంది annaru kondaru అసలు విషయం అర్థంకాకుండా

పోతుంది annaru inkondaru ఇలాంటి తీర్పులు ఎవరు ఒప్పుకొంటారండీ అని ఇంకొంత మంది ఆక్రోశించారు. వత్తులు గుణింతాలతో పడిలేచి చచ్చేకంటే, యంత్రానికి అనువైన ఆంగ్లాక్షరాలతో పనిచేసుకోవచ్చు గదా అప్పుడు మన తెలుగును ఇంగ్లీషొచ్చినోళ్ళంతా చదువుతారు, తద్వారా అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఇంగ్లీష్ సౌలభ్యాలన్నీ మనం కొట్టేయవచ్చు అన్నారింకొందరు . అయ్యవారిని చెయ్యబోతే కోతి అయినట్టవు తుందేమోనని అన్నారు మరికొందరు. ఆచర్చ అంతటితో ఆపాము.

ఇంతకీ తెలుగుకు వైభవం తేవటానికి ప్రభుత్వం నడుం బిగించిదనే వార్తలు, ప్రజల భాషకు పట్టం కట్టడానికి పలుచర్యలు తీసుకుంటామని అధినేతలు ప్రకటించటం సంతోషాన్ని కలిగిస్తున్నాయి. ఎన్టీరామారావుగారు న్యాయ పంచాయితీలు ఏర్పాటు చేయాలని ప్రయత్నించారు. అవి వస్తే ప్రజల భాషలో తీర్పులొస్తాయి. పరాయి ప్లీడర్లు, పరాయిభాష, పరాయి ప్రాంతం లాంటి సమస్యలు ఉండవు. ఏ భాషలో న్యాయస్థానం తీర్పులిస్తుందో అదే నిజమైన అధికార భాష. తెలుగుకు ఆ స్థాయి రావాలి అని నాఆకాంక్ష! ఇంగ్లీషు ప్రభావంతో తెలుగు తెల్లబోతోంది. ఆధునికులు మాట్లాడే నాలుగు ముక్కల తెలుగులో మూడుమాటలు ఇంగ్లీషువే ఉంటున్నాయి. ఇంగ్లీషు మాటలతో చక్కగా కలిసి పోయి కొత్తరకం ''తెల్గిష్'' భాష తయారయింది. ప్రస్తుతం ''తెల్గిష్'' వీరవిహారం చేస్తోంది.

సంస్కృతం, తమిళంతోపాటు తెలుగు కన్నడ భాషలను కూడా ప్రాచీన భాషలుగా కేంద్రం ప్రకటించింది. ప్రాచీన హోదాతో వచ్చే నిధుల్ని ఆధునిక అవసరాలకు వినియోగించాలనే వాదనలు అప్పుడే మొదలయ్యాయి. చైనా భాష తమిళంకంటే ప్రాచీనం. వారు లిపి ఆధునిక అవసరాలకు అనువుగాలేదని చాలాసార్లు సంస్కరించుకున్నారు. మనం కుండపెంకుల మీద, బండరాళ్ళమీద రాసుకుంటున్న రోజులలో ఒక లిపి సహితం లేని రష్యావాళ్ళు, జపాన్‌వాళ్ళు వారి భాషలను ఆధునిక అవసరాలకు అనువుగా మార్చారు. మన లిపిని మనం ఎందుకు మార్చుకోలేము? జాతి ఎదుగుదలకు కావలసింది వారి భాషను ప్రాచీనహోదాతోపాటు ఆ భాషను ఆధునిక అవసరాలకు కూడా సరిపడేలా తీర్చిదిద్దుకోవడం. భాషాభిమానంతో పాటు ప్రజల నిత్య జీవితానికి సంబంధించి పాలనా వ్యవహారాలలో స్వభాష పెత్తనం చేయాలి.

తెలుగు లిపి ఎన్నో సార్లు మారింది
“ఇంపు చేయవచ్చు కంప్యూటరందుండు
అచ్చరాల బెడద ఖచ్చితముగా
అలవికానిదంటు అన్వేషణకు లేదు
తెలిసి నడుచుకొమ్ము తెలుగు బిడ్డ

ఉన్న లోపములను తిన్నగా సవరించి
తల్లిభాష నున్నతముగా తీర్చిదిద్ది
అప్పగింపవోయి అధికార పీఠాన్ని
తెలివి తెచ్చుకోని తెలుగు బిడ్డ

అరయ యూనికోడు కందరూ క్రమముగా
మారి మాతృభాష మనుగడకును
సహకరించినపుడె సంపూర్ణ సమృద్ధి
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ

లోటు పాటులుంటె నీటుగా సవరించి
పాటు చేసి తెలుగు మీట నొక్కు
ఎలుకలున్న వంచు యిల్లు తగలేతుమా
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ

లిపిని సంస్కరించి అపర వజ్రమ్ముగా
తీర్చి దిద్ది చూడు తెలుగు భాష
రాజ పీఠమునకె తేజస్సు నందించు
తెలిసి నడుచు కొమ్ము తెలుగు బిడ్డ “

--- ఆకురాతి గోపాలకృష్ణ

లిపిని మార్చుకోవడం ఎందుకు ?

ఇంగ్లీషు స్థాయిలో మన భాషకుకూడా అభివృద్ధి చేసిన యాంత్రిక సదుపాలు కల్పించడం కోసమే. వాస్తవానికి లిపి సంస్కరణ యంత్రాలకనుగుణంగా జరగాలి. కంప్యూటర్‌లలో వాడకానికి ప్రస్తుతం తెలుగు సాఫ్ట్‌వేర్‌లో ఏయే సమస్యలు తలెత్తుతున్నాయో వాటిని నిశితంగా, పరిశీలించి నిరంతరం వాటిని బాగుచేసే నిపుణుల్ని నియమించాలి. పరిశోధకుల్ని ప్రోత్సహించాలి. అలాంటి మంచి పనులు ఏవీ ఏళ్ళతరబడి తెలుగువాళ్ళు చేసి తెలుగు ప్రజలకు తెలుగు ద్వారా సౌకర్యం కల్పించలేదు.

భాషను పాడుచేసుకోవడం, మళ్ళీ బాగుచేసుకోవాలన్న అలోచనే లేకపోవటం, అరకొరగానైనా చేపట్టిన పనిని పూర్తి చేసుకోలేక చతికిల పడుతూ ఆంధ్రులు ఆరంభ శూరులు అన్న నానుడిని సార్థకం చేశారు.

పూర్వం మన భాష నశించిపోతుందే అని కొంత మంది నాయకులైనా బాధపడేవారు. కానీ ఇప్పుడు తెలుగు ఎందుకూ పనికిమాలిన భాషనీ, ఇంగ్లీషు, హిందీ వస్తే మనం ఎక్కడైనా చలామణీ కావొచ్చనీ, పదవులు దక్కాలన్నా, పరపతి పెరగాలన్నా కేవలం తెలుగు వస్తే చాలదనీ, హిందీ, ఇంగ్లీషు భాషలు తప్పనిసరిగా నేర్వాలనీ, చచ్చిపోయే ముసలి భాషను ఎవరూ బ్రతికించలేరనీ మన తెలుగు మేధావులే వాదిస్తున్నారు. మన నాయకులు అందుకు వంతపాడుతున్నారు. ఇక వీళ్ళు తెలుగుకు అధికార పీఠం దక్కనిస్తారా? తెలుగు జనం ఉద్యోగాల కోసం, విజ్ఞానం కోసం ఇంగ్లీషును ఆశ్రయించక తప్పదంటున్నారు మన మేధావులు.

తెలుగు అధికార భాష కావాలంటే ఇంగ్లీషు స్థాయికి దానిని అభివృద్ధి చెయ్యాలి. తెలుగు నేర్చుకునే వాళ్ళ సంఖ్య పెరగాలి. ఎందుకు? ఎలా? అని మన పాలకులు, ప్రజలు ప్రశ్నించుకోవాలి. మన ప్రభుత్వం నడుపుతున్న తెలుగు మీడియం స్కూళ్ళన్నీ ఇంగ్లీషు లిపి లోకి మారిస్తే చాలు. ఒక్క చర్యతో అన్నిసమస్యలూ పరిష్కార మవుతాయి. కానీ, ఇప్పుడున్న ఇంగ్లీషు మీడియం స్కూళ్ళన్నింటినీ తెలుగు మీడియం లోకి మార్చాలంటే అడుగడుక్కీ అడ్డంకులొస్తాయి. ముందు ఇంగ్లీషులో తీర్పులిచ్చే కోర్టులే అడ్డుపడతాయి. కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతుంది. గవర్నర్లు, ఇతర భాషల ఐ.ఎ.యస్. ఆఫీసర్లు అడ్డుపడతారు.

ఈనాడు అమెరికాలో కంటే ఎక్కువగా ఇండియాలోనే ఇంగ్లీషు మాట్లాడే వాళ్ళున్నారు. ఆ మేరకు మన భాషలు నాశనం అయిపోయాయి. దీనికి ప్రధాన కారణం మన దేశానికి లింకు భాష కావాలి. జాతీయ, అంతర్జాతీయ భాషల్ని మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా దేశం కోసం మోస్తూ, మన భాషను గత్యంతరం లేక నిర్లక్ష్యం చేస్తూ పోవాలి.

ఒక్కో భాష మాట్లాడేవారు ఒక్కో జాతి. ఎవరి భాష వారికి గొప్ప. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని మనమంటే కాదు హిందీయే గొప్ప అంటారు ఉత్తరాది వాళ్ళు. అలాంటి పరిస్తితుల్లో ఇంగ్లీషే భారతీయులందరికీ అవసరమైన లింకు భాషగా తప్పనిసరి అయ్యింది. నిరాఘాటంగా ఇండియాను పాలిస్తోంది.

మరి ఇటువంటి పరిస్థితుల్లో ఇంగ్లీషు భాషను పాశ్చాత్యులే కాకుండా భారతీయులు కూడా సాంకేతికంగా, శాస్త్రీయంగా ఎంతో అభివృద్ధి చేశారు. కోట్లాది మంది భారతీయులు ఇంగ్లీషు నేర్చారు. అఆలు రాకపోయినా ABCD లు వచ్చేస్తున్న రోజులివి. తప్పదు మరి. వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకుని భవిష్యత్తు ప్రణాళిక వేసుకోవాలి. ఇంగ్లీష్ వాళ్ళు I,II,III, IV లాంటి రోమన్ అంకెలు వాడేవారు. తరువాత 1,2,3,4,5,6,7,8,9 అనే అంకెల్ని అరబ్బుల నుండి, '0' ను ఇండియా నుండి తీసుకెళ్ళి తమవిగా చేసుకున్నారు. ఏమీ సిగ్గుపడలేదు. దొంగతనంగా, నామర్దాగా భావించలేదు. పరాయి భాషలకు చెందిన అంకెలని ద్వేషించలేదు. తమ అంకెలు నామ రూపాల్లేకుండా పోతున్నాయే అని బాధపడలేదు. కేవలం సౌకర్యం చూసుకున్నారు. తమ భాష చెలామణీ కావటం చూసుకున్నారు.

మరి మనవాళ్ళు లింకు భాషగా ఇంగ్లీషును ఎన్నుకున్న రోజున, ఇంగ్లీషు లిపిని కూడా లింకు లిపిగా జాతీయ లిపిగా నిర్ణయించినట్లయితే భారతీయ భాషల నడక వేగం పెరిగి ఉండేది. దేశ వ్యాప్తంగా అన్ని భాషల వాళ్ళకూ ఒకే లిపి నేర్పబడేది. భారతీయ భాషలు శబ్ద రూపంలో ఎన్ని విన్యాసాలు చేసినా, ఒకే లిపిలో ఉంటే కనీసం దేశస్తులంతా చదివే వాళ్ళు. ఒక లిపికి అలవాటైన మనిషి తన భాషను మరో లిపిలో రాయటానికి, తన భాషను మరో లిపిలో చదవటానికి అంత సులువుగా ఇష్టపడడు. లిపి మారితే తన భాషే మారిపోయినట్లుగా ఫీలవుతాడు. కానీ ఈనాడు మనం మన పొరుగు

భాషలను కూడా చదవలేకపోతున్నాం. దేశమంతటికీ ఒకే లిపి ఉన్నప్పుడు ఇరుగు పొరుగు భాషలు అర్థం కాకపోయినా, మాట్లాడలేకపోయినా కనీసం చదవటం వస్తుంది. ఏ భాష వాడికైనా చదివిపెట్టడం వస్తుంది. వంద రూపాయల నోటు మీద 18 లిపుల్లో ముద్రించనక్కరలేదు. ఆయా భాషల వాళ్ళు వందరూపాయల్ని ఏమని పలుకుతారో ఆ శబ్దాన్ని ఇంగ్లీషు లిపిలో ముద్రించవచ్చు. వందరూపాయల్ని ఏ భాష వాళ్ళు ఏమని పిలుస్తారో మిగతా అన్ని భాషల వాళ్ళూ చదివి తెలుసుకోవచ్చు. దీన్ని Transliteration అంటారు. సంస్కృత శ్లోకాల్ని, అరబీ సూరాలను మనం తెలుగు లిపిలో రాసుకుంటున్న మాదిరిగా నన్న మాట.

మన ఆర్టీసీ బస్సుల మీద తెలుగు అంకెలు వేశారు కానీ అరబీ అంకెల్ని అంటే నేటి ఇంగ్లీషు అంకెల్నే జనం చదువుతున్నారు. కాలగమనంలో పారవేయబడిన వాటిని వెతికి తీసుకొచ్చి జనానికి అలవాటు చేస్తామంటున్న భాషాప్రియులు, అంతకంటే సులువుగా జనమందరికీ అలవాటైన వాటితోనే భాషాభివృద్ధి చేయవచ్చు. వాక్కు రూపంలో ఉండే భాషకు మనిషి కల్పించిన రూపమే లిపి. లిపిరాని వాడికీ భాష ఉంటుంది. అసలు భాషే రాని వాడికి లిపి ఏముంటుంది? భాషను చదవటానికీ, రాయటానికీ పెట్టుకున్న గుర్తులే అక్షరాలు. అవి మన దేశంలో అందరికీ ABCD ల రూపంలో నేర్పబడ్డాయి. "అఆ" అనే అక్షరాలొచ్చిన పిల్లలు దేశమంతటా ఉండరు కానీ ABCD అనే అక్షరాలొచ్చిన పిల్లలు దేశమంతటా ఉన్నారు. వండి వడ్డించిన దాన్ని తినటానికి తిరస్కరించినందువల్ల మన జాతి శుష్కించిపోతున్నది. తెల్లవాడు అందరివీ దొంగలించి తిని బలిసిపోయాడు. నల్లవాడు అలిగి నలిగి నీలిగి నీరసించాడు.

సుప్రీం కోర్టు నుండి, ఈ దేశ సర్వోన్నత పాలక పీఠాల నుండీ ఇక ఇంగ్లీషును తొలగించటం సాధ్యం కాదు గనుక రకరకాల లిపుల్ని సంస్కరించి యావత్తు భారత జాతికీ అర్థం అయ్యేలా చేయటం అసాధ్యం గనుక, ఆంగ్ల లిపిని స్వంతం చేసుకుని, దేశంలోని అన్ని భాషలకూ దాన్నే జాతీయలిపిగా అమలు చేస్తే మనకు ఎన్నో కష్టాలు తగ్గుతాయి. అంతర్జాతీయంగా ఆంగ్లభాష లిపికి సమకూరిన యాంత్రిక ప్రయోజనాలన్నీ మన దేశీయ భాషలకూ సమకూరుతాయి. ఈ మార్పుకొక తరం పడుతుంది. వివిధ లిపులకు అలవాటు పడిన

పెద్దలు తప్పనిసరిగా ఇబ్బంది పడతారు. కానీ కొత్తగా నేర్చుకునే పిల్లలు సునాయాసంగా ఇంగ్లీషుతోపాటే తమ మాతృభాషల్నీ ఒకే కీ బోర్డుతో సాధన చేస్తారు. ఇంగ్లీషు అక్షరమాలలో లేని కొన్ని శబ్దాలకు కొత్త అక్షరాలను జోడించుకోవటం కన్నా, ఉన్న అక్షరాలకే కొన్ని గుర్తులు జోడించటం ద్వారా ఈ శబ్దం వస్తుందని శాసనం చేయవచ్చు. దేశీయ భాషల మధ్య నిఘంటువుల తయారీ కూడా సులువవుతుంది. భాషలు నేర్చుకోవటం కూడా తేలికవుతుంది.

మీసేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు తెలుగు ఫిర్యాదులు రోమన్ లిపిలోనే పంపుతున్నారు. ఇంగ్లీషు రాని వాళ్ళు కూడా ఇంగ్లీషు లిపిలో తమ తెలుగు ఫిర్యాదుల్ని ఎంతో చక్కగా పంపించారు. ఒక ఫిర్యాదు ఇలా ఉంది:-

Ayyaa,

NAA BHARTHA CHANIPOYI NAALUGELLAYYINDI. KUTUMBHASANKSHEMA PADHAKAM KINDA NAAKU SAHAYAM INKAAANDALEDU. TAMARU DAYATO AA SAHAYAM IPPINCHAGALARU.

ఈ ఫిర్యాదు యధాతథంగా కలెక్టర్ నుండి MROకు వెళితే, MROకూడా Telugu లోనే చక్కగా జవాబిచ్చాడు. పనిలో వేగం పెరిగింది. ఆంగ్ల భాష రాకపోయినా, అనువదించి కూర్చుకునే నేర్పు లేకపోయినా భావం చక్కగా చేరాల్సిన చోటికి చేరింది. ఆంగ్ల లిపి ద్వారా ఒన గూడే ఈ సదుపాయాన్ని మనం ఎందుకు స్వంతం చేసుకోకూడదు? నేటి పెద్దలు ముందు చూపుతో చేసే త్యాగాలే రేపటి పౌరులకు సుఖమైన జీవితాన్నిస్తాయి.

గుండ్రని అందమైన నా లిపి అంతరిస్తోందనే బాధ నాకూ ఉంది. కానీ లిపిని అంకెల్ని యంత్రానికి తగ్గరీతిలో ఆంగ్లేయులు అభివృద్ధి పరిచారు. వాళ్ళ అంకెల్ని మనం ఎలాగూ వాడుతూనే ఉన్నాం. ఇక అక్షరాలను కూడా వాడుకుంటే అధికార భాషగా రోమన్ తెలుగును ఫైళ్ళలో కంప్యూటర్ల ద్వారా అమలు చేయటం ఎంతో సులువవుతుంది. లిపిసమస్య సాకుతో అధికారభాష అమలును ప్రక్కన పెట్టటం కంటే అంతర్జాతీయంగా అమలవుతున్న లిపినే మన భాషకు వాడుకుంటే మేలు జరుగుతుందని ఆశ. రానున్న రోజుల్లో దేశమంతటికీ ఉమ్మడి లిపిగా ఆంగ్లాక్షరాలను ఉపయోగించుకునే విషయమై విస్తృతంగా

చర్చలు జరగాలి. దేశ భాషలన్నింటికీ జవసత్వాలను సమకూర్చే నిర్ణయాలు జరగాలని ఆశిద్దాం.

లిపిని మార్చుకోవటం ఎలా?

"ప్రపంచంలోని అన్ని భాషల ముద్రణ ఒక ఎత్తు. తెనుగు ముద్రణే ఒక ఎత్తు. ఇదొక గారడీ. తెనుగు అక్షరాలు కూర్చడానికి కంపోజిటరు 700 దిమ్మలు, గళ్ళు జ్ఞాపకం ఉంచుకోవాలి. ప్రతి కంపోజిటరు శతావధాని, సహస్రావధాని కావలసి ఉంటుంది. ఈ చిక్కును తొలగించుకోడానికి ఏ రోమన్‌లిపినో అనుసరిస్తే అచ్చు సౌకర్యం కలుగుతుందనుకుంటే అనూచానంగా వచ్చిన ఈ లిపిని **వదులుకోడం ఎలా?"**

(తిరుమల రామచంద్ర, మన లిపి పుట్టు పూర్వోత్తరాలు 1957) "ముత్యాలలాంటి తెలుగక్షరాలంటూ లిపిమీద లేనిపోని సెంటిమెంట్లు పెట్టుకోవడం మాని రోమన్ లిపిలో (a,aa,i,ee ఈ విధంగా) తెలుగును నేర్పితే అప్పుడు మన దేశం ఆధునిక యుగం లోనికి ప్రవేశిస్తుందని నా నిశ్చితాభిప్రాయం. ప్రపంచ తెలుగుమహాసభ వారు ఈ విషయమై ఆలోచించడం మంచిదని నేననుకుంటున్నాను" అని అన్నారు మహాకవి శ్రీ శ్రీ ---ప్రజాతంత్ర (18.4.1976) "అనంతం" పేజీ196 భారతీయ భాషలకు ఏకలిపి అవసరమే

అంతర్జాతీయ ధ్వని విధేయ లిపి కాకపోయినా, ఆ పద్ధతిలో సవరింపబడిన రోమను లిపి భవిష్యత్తులో ప్రపంచ భాషలన్నిటికి సర్వవిధాల తగినదై సర్వోత్తమమూ, అభ్యుదయకరమూ అయిన లిపి కాగలదు. టైపుమిషను, లైనోటైపు మొదలైన వాటికి ఒకే విధమైన ముద్రాఫలకాలు(Key boards) మనకు లభిస్తాయి. ప్రపంచ మంతటా ఒకే విధమైన ముద్రణ వ్యవస్థ ఏర్పడుతుంది. అంటే ఇప్పుడు ఆంగ్ల అక్షరాలు రాస్తున్న పద్ధతిలోరోమ న లిపిలో రాసే విధానం అన్నమాట) - కస్తూరి విశ్వనాథం (1989 నవంబర్ తెలుగు వైజ్ఞానిక మాసపత్రిక)

ముస్తఫా కమాల్ ఆటా టర్కీ లిపి సంస్కరణ

టర్కీ జాతిపిత,టర్కీ మొదటి అధ్యక్షుడు. 1928 నవంబర్ 1 నుండి టర్కీభాషకు కొత్త అక్షరమాల ప్రవేశపెట్టాడు.అప్పటివరకు ఉన్న పార్శీ -అరబిక్ లిపి స్థానంలోకి అప్పటికే పాలకభాషగా అభివృద్ధి చెంది,ప్రజాదరణ పొందిన లాటిన్ లిపిని రప్పించాడు. టర్కీ భాష

ఉచ్ఛరణకు వీలుగా 23 ఆంగ్లాక్షరాలకు అదనంగా అవసరమైన అనే 6 గుర్తులను కలిపి 8అచ్చులు,21హల్లులుతో 29 అక్షరాలను సమకూర్చారు. ఇందువలన భాష చదవటం రాయటం సులభమై అక్షరాస్యత పెరిగింది. మనం కూడా త,ద,ణ,ళ,శ,లాంటి కొన్ని అక్షరాలకు గుర్తులు కల్పించుకోవచ్చు. ప్రస్తుతం యూనికోడ్లో మన తెలుగు అక్షరాలు అన్నీ ఇంగ్లీషు కీబోర్డు ద్వారానే టైపు చేస్తున్నాము కదా?

ప్రపంచీకరణ వచ్చిన తరువాత భాషల మధ్య పోటీ అనివార్యం అయ్యింది. ఏ భాష నేర్చుకుంటే ఉపాధి లభిస్తుందో, ఆ భాష వైపుకే మనిషి పరుగులు తీస్తున్నాడు. అది అతని అవసరం. తెలుగుభాష మాత్రమే వచ్చిన వాడికి కూడా శాస్త్ర విజ్ఞానం,వృత్తి, ఉపాధి లభిస్తుందనే హామీ దొరికిన నాడు తెలుగు తప్పని సరిగా బ్రతుకుతుంది. తెలుగు భాష ఇంకా పది కాలాలపాటు మనుగడ సాగించేందుకు ఉన్న అన్ని మార్గాలలో ప్రతి ఒక్కరం ప్రయత్నిద్దాం.

Nalini Mohan Kumar Kalva డిప్యూటీ కార్యదర్శి, ఆర్థికశాఖ, సచివాలయం, అమరావతి : బాగుంది " లిపి సంస్కరణ " లో భాగంగా ఇక్కడ నా స్వీయానుభవం చెప్పదలచేదేమంటే ,ఇప్పుడు నేను ఉపయోగించే పద్ధతి "గూగుల్ ట్రాన్స్ లిట రేషన్ - తెలుగు " ను డౌన్ లోడ్ చేసుకోవడం ద్వారా ,నేను ఇంగ్లీష్ కీ బోర్డ్ ద్వారానే ఈ విధంగా ఇంగ్లీష్ అక్షరాలు ను ఉపయోగించే " తెలుగు లిపి " ఆటో మేటిక్ గా కనబడే సౌలభ్యం వచ్చింది . వాస్తవానికి నేను ఏ టైపు మిషన్ పైన టైపు చేయడం(ఇంగ్లీష్ ,గాని తెలుగు కానీ) నేర్చుకోలేదు. కానీ నేను అలవాటు ద్వారా ఈ విధంగా తెలుగు లో వ్రాయడం ,(అదే టైపు చేయడం) అవలీలగా చేయగలుగుతున్నాను . కాబట్టి తెలుగు భాషాభిమానులు ప్రతి ఒక్కరు ఈ విధంగా కంప్యూటర్ లోనూ అదేవిధంగానే సెల్ ఫోన్లో గూడాను ఇదే విధంగా చేసుకోవచ్చు . ముఖ్యంగా ఈ విషయ ప్రక్రియను నాకు చెప్పి అలవాటు చేసిన వాడు **మిత్రుడు రహంతుల్లా నే !. అందుకు నేను మిత్రుడికి ఋణ పడిఉంటూ ధన్యవాదాలు తెలుపుతున్నాను .**


విక్టోరియా మహారాణి బంగారుపతకం తెలుగులో ఉంది

13.విక్టోరియా మహారాణి బంగారు పతకం తెలుగులో ఉంది


ఇది బుడ్డా వెంగళరెడ్డి గారికి విక్టోరియా మహారాణి ఇంగ్లాండులో చేయించి పంపిన బంగారు తెలుగు పతకం. నేను దానిని తీసుకొని పరిశీలించాను.దాని వెనుకవైపు తెలుగు అక్షరాలే ఉన్నాయి.తెలుగు అంకెలున్నాయి.ఈ అక్షరాలు చదవటానికి అనుకూలంగానే ఉన్నాయి. “1866 (౧౮౬౬) సంవత్సరము లో సంభవించిన క్షామకాలమందు నిరాధారముగా వుండిన తన స్వదేశస్థులపట్ల జరిగించిన వుత్కృష్టమయిన ఔదార్యమునకు గాను హర్ మెజస్టీ రాణి గారి వల్ల చేయబడిన శ్రేష్ఠమయిన గణ్యతకు ఆనవాలుగా బుడ్డావెంగళరెడ్డి గారికి బహుమానము ఇయ్యబడ్డది.” అని ఉంది.

ఆంగ్లపాలకులు ఆంగ్లంలోనే పతకం ఇస్తే ఎవరూ కాదనలేరు. పరభాష అనో,పాలితుల భాష అనో వివక్షతో చిన్నచూపు చూడకుండా ఎక్కడికక్కడ మన ప్రజల భాషలు నేర్చుకొని మరీ పాలించారు. పతకం మనపూర్ణకుంభాన్ని పోలి ఉంది. మన రాజులు ఏర్పరచుకున్న రాజముద్రలు,పూర్ణకుంభాల రూపాలను కూడా బ్రిటీష్ పాలకులు అంత్యంత నిశితంగా గమనించి ఆయా ప్రాంతాల ప్రజల భాషలతోపాటు సంస్కృతీ చిహ్నాలను కూడా స్వీకరించి వాటి రూపాలలోనే పతకాలు కూడా ప్రదానం చేశారన్నమాట. పాలనలో తెలుగు అమలు చేసిన విషయంలో మన వాళ్ళకంటే బ్రిటీష్ పాలకులే కొంత నయమనిపించారు. కర్నూలు జిల్లా కోయిలకుంట్లలోని వ్యక్తికి బ్రిటన్ దేశంలోని లండన్ లో తెలుగు అక్షరాలతో బంగారుపతకం చేయించి ఆంగ్లపాలకులు ఇవ్వటం అద్భుతమే. భాషాప్రాతిపదికమీదనే తెలుగురాష్ట్రాన్ని సాధించుకున్న మనము మన ప్రజలకు తెలుగులో పరిపాలన అందించగలము. తెలుగులో తీర్పులు ఇవ్వగలము. శాస్త్ర సాంకేతిక విద్యలను మాతృభాష లోకి మార్చగలము.ప్రభుత్వ కృషితో పాటు తెలుగు ప్రజలలో కూడా ప్రతి స్థాయిలోనూ తెలుగుకై కదలిక రావాలి. మన భాషలో మనల్ని మనం పరిపాలించుకుందాము అనే పట్టుదల కలగాలి. జన ఘోషకు స్పందించాల్సిన సర్కారీ యంత్రాంగం జన భాషకు పట్టం

కట్టాల్సిందేనంటూ పట్టుపట్టి, దస్త్రం తెలుగులో రూపొందిస్తేనే సంతకం చేస్తానన్నాడు, చేశాడు తెలుగు దేశ అదినేత తెలుగు పాలకుడు ఎన్టీఆర్ ఆయన చూపిన బాటలో మనమందరమూ గట్టిగా కలిసి ప్రయత్నిస్తే తెలుగులో పాలన సాధ్యమే. 2.9.2014 న గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గారితో కలిసి కోయిలకుంట్ల వెళ్ళి బుడ్డా వెంగళరెడ్డి గారి వారసులను కూడా దర్శించాను. నన్ను ఎంతగానో ఆకర్షించిన అంశం బుడ్డా వెంగళరెడ్డి గారికి విక్టోరియా మహారాణి ఇచ్చిన పతకం వెనుక ముద్రించిన తెలుగు అక్షరాలు.ఆయన వారసులు దానిని ఆనాటి చెక్కపెట్టెతో సహా భద్రపరిచారు. ఆయన ఇల్లు,వారసులు,పతకం పెట్టె ఇక్కడ చూడవచ్చు

(అమ్మనుడి ఫిబ్రవరి 2018)








14. తెలుగే దేవభాష ...
ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు

తెలుగు భాష కోసం ఏరంగం లోనైనా కష్టపడి పనిచేసే వ్యక్తి గురించి నా చెవిన బడితే వెళ్ళి అతని కృషిని గురించి తెలుసుకుంటాను. 2014 విజయవాడ పుస్తకాల సంతలో ప్రబోధానంద యోగిగారి తెలుగు సామెతలు పుస్తకం కొన్నాను. అదిగో అలా పరిచయమయ్యింది ఈయన తెలుగు కృషి. నేను బాబాలు స్వాముల మహిమలు మహత్యాల జోలికి వెళ్ళను. వారు వెలువరించిన తెలుగు జ్ఞానం వరకే పరిమితమౌతాను. తెలుగు భాషకోసం వాళ్ళు ఆధ్యాత్మికరంగంలో కల్పిస్తున్న పదాలు, అర్థాలు తెలుగు విన్యాసాలు చూసి ఆకర్షితుణ్ణవుతాను. తెలుగు దేవభాషే పుస్తకంలో పుట్టపర్తి సాయిబాబా గారు చేసిన తెలుగు భాషా సేవ గురించి ఒక వ్యాసం రాశాను. అందులో ఆయన తెలుగు తన హృదయ భాష అన్నారు.

ఆకోవలోనే ఆచార్య ప్రబోధానంద యోగి గారు తెలుగును తన నెత్తిన పెట్టుకొని మోస్తున్నారు.మన తెలుగు సామెతలకు ,పొడుపుకథలకు, తిట్లు దీవెనలకు అసలు అర్థాలు ఇవి, అనర్థాలు అపార్థాలు ఇవి అని విడమరచి చెబితే ఆయన చెప్పిన అర్థాలు వింతగా ఉన్నా అంగీకరించక తప్పలేదు.

కులాంతర, మతాంతర వివాహాలకు తన ఆశ్రమాన్ని వేదికగా చేశారు. అన్ని మతాలవారినీ సమంగా ఆదరిస్తున్నారు. కాళ్ళకు మొక్కించుకోరు. నేనూ మనిషినే అంటారు. త్రైత సిద్ధాంతాన్ని బోధిస్తూ భగవద్గీత తో పాటు బైబిల్, ఖురాను గ్రంథాలు కూడా దైవగ్రంథాలనీ, అవి ఒకే దైవ గ్రంథంలోనివేననీ, బ్రహ్మ విద్యలో భాగాలైన ఆ మూడింటిని సమాదరిస్తూ, వాటిలోరిఫరెన్సులతో సహా పేర్కొంటూ సమావేశానికి వచ్చిన వారితో అలా ఉందో లేదో చూడమని చదివిస్తున్నారు. ఆయన గ్రంథాలయం సర్వమతగ్రంథాలకు నిలయంలాఉంది.

కర్నూలులో శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలక్టర్ గా ఉన్నప్పుడు 12.7.2014 గురుపౌర్ణమి నాడు తాడిపత్రి దగ్గర చినపొడమల గ్రామం వెళ్ళాను. ప్రబోధానంద యోగి గారితో కాసేపు మాట్లాడాను.

ఆస్తిక హేతువాద ధోరణి ప్రతి పౌర్ణమికీ త్రైతసిద్ధాంత ప్రసంగాలిస్తారు. ఈ భజనలు, ఆస్థులూ చచ్చేటప్పుడు అక్కరకు రావనే సదా గ్రహింపుకోసం అక్కడే ఒక ఖాళీ సమాధిని కూడా కళ్ళముందు ఉంచుకున్నారు. స్వామిగారి ఉద్దేశంలో మతమనేది ఒక మాయ, మనిషి నుంచి దైవాన్ని దూరం చేసే ఒక అధర్మం. మతం అనే ప్రాథమిక అజ్ఞానంనుంచి మనిషి బయటపడాలి, దైవజ్ఞానము గల విశ్వనరుడు కావాలి. మూడు మత గ్రంథాలలో కూడా ఉన్న దైవజ్ఞానాన్ని ఏ మతస్థుడైనా స్వేచ్ఛగా పొందాలి. మనిషి పూర్తిగా మతవిముక్తుడై దైవజ్ఞాని మాత్రమే కావాలనేదే ఆయన కోరిక.

అసలైన దైవద్రోహం అంటే మతమార్పిడి మాత్రమే కాదు, అన్నిమతాలలో ఉన్న దైవజ్ఞానాన్నీ పరమతమనే వంకతో స్వీకరించకపోవటమే నిజమైన ఆత్మద్రోహమూ దైవద్రోహమూ అన్నారు. మనిషికి దైవజ్ఞానం కావాలి కానీ ఏ మతమూ అక్కరలేదు. మనిషి ఒక మతంలో బిగుసుకుపోతే పరమతస్థులపట్ల అతనికి అశాంతి ఆవహిస్తుంది. దైవజ్ఞానికి మాత్రం సర్వమతాలలో ఇప్పటికే నిక్షిప్తమై ఉన్నదైవవాక్కులు గోచరిస్తూ, వాటి అవగాహన కలిగి అతనిని శాంతి ఆవరిస్తుందన్నారు.

తెలుగు భాషపట్ల ఆయన భావాలను నేను ఎందుకు ఉదాహరిస్తున్నానంటే ఇవి కొందరికి అతిశయోక్తులుగా అనిపించవచ్చు. కానీ మన భాష గొప్పతనం గురించి అనేకమంది మేధావులు రకరకాలుగా చెప్పిన విశేషాలను నిరంతరం నేను సేకరిస్తూనే ఉంటాను. అది నాకు ఇష్టమైన పని. ప్రబోధానంద గారు తెలుగే దేవభాష అంటూ చెప్పిన కొన్ని అభిప్రాయాలను చూడండి:

తెలుగు దైవభాషే, తెలుగుభాష శాశ్వతం "తెలుగు భాష "జ్ఞానచిహ్నము" గా భూమి మీద తయారయినది కానీ ఆవిషయము ఇంతవరకు ఎవరికీ తెలియదు. మన భాషకు "తెలుగు" అని పేరు పెట్టిన వాడు సూర్యుడని ఎవరికీ తెలియదు. నేడు సూర్యునకున్న పేర్లన్నీ తెలుగు భాషలోనివే. ఆదిత్యుని చేత పేరు పెట్టబడిన ఆదిభాష 'తెలుగు'. చాలా భాషలపేర్లలో అర్థములేదు. అట్లే భాషయొక్క లిపిలో కూడా అర్థము లేదు. భాషకు అర్థము, మరియు భాషయొక్క లిపికి అర్థము ఒక్క తెలుగు భాషకే ఉంది. ప్రపంచములో మొదట పుట్టినభాష తెలుగు భాష అయినందున, సూర్యుడు భూమిమీద తన జ్ఞానమును

తెలుగు భాషలోనే తెలియజేసియుండుట వలన, తెలుగు భాష దైవజ్ఞానమునకు దగ్గరగా అర్ధములను కలిగియుండుట వలన తెలుగు భాషను అన్ని విధములా దైవభాషగా చెప్పవచ్చును. తెలుగుభాష ప్రపంచములో మొట్టమొదట పుట్టిన భాష. అయినా ఆనాడు భాషకు పేరు లేకుండాయుండెడిది. సంస్కృతము చాలా వెనుక పుట్టినదని తెలియవలెను. తెలుగుభాషలో యున్నన్ని అక్షరములు మరి ఏ ఇతర భాషలో లేవు. అందువలన ఏ చిన్న శబ్దమునయినా, ఎంత కఠినమైన శబ్దమునయినా తెలుగు లిపిలో వ్రాయవచ్చును. సంస్కృత భాషకు లిపిలేదు. సంస్కృతమును వ్రాయుటకు ఇతర భాషలను వాడుకోవలసి వచ్చినది. భాష అన్న తర్వాత అది భావమును తెలుపుటకే ఎక్కువగా ఉపయోగపడవలసి యుండగా, సంస్కృత భాష మాత్రము భావమును తెల్పు సందర్భములలోబహు తక్కువగా వాడబడుచున్నది. అర్చనలందును, పొగడ్తలందును, మంత్ర జపములందును వాడుకొంటున్నారు. అంతేకాక మొదట పుట్టినతెలుగు భాషలోని పదములను ఎక్కువగా సంస్కృతములో పెట్టుకోవడము జరిగినది. ప్రపంచములో మొదట పుట్టిన భాష తెలుగు. ప్రపంచములో అన్నిటికంటే పెద్దదయిన బ్రహ్మవిద్యను చెప్పబడిన భాష తెలుగు. ప్రపంచములోని ఎన్నో భాషలలో తెలుగు భాషా బీజములు కనిపించుచున్నవి. తెలుగు పదములు అన్ని భాషలలో ఉన్నాయి. తెలుగు కంటే పెద్దభాష ఏదీ లేదు. వాస్తవానికి ప్రపంచ భాషలన్నిటికీ రాజుగా, చక్రవర్తిగా తెలుగు భాష ఉండాలి. శ్లోకము తప్ప పద్యము వ్రాయుటకు పనికిరాని సంస్కృతము కంటే పద్యమును శ్లోకమును రెండిటినీ వ్రాయగల తెలుగే గొప్ప. ఆధ్యాత్మికమునకు తెలుగులో యున్నంత అర్ధము, వివరము వేరే భాషలో లేదు. "ఆత్మ" అను పదము తెలుగుభాషలోనే పుట్టినది. వాస్తవముగా తెలుగు భాష దైవభాషయే". (లు అంటే ఏమిటి? 2016)

భూమి మీద పుట్టిన మొదటి భాష తెలుగే దేవునికి సృష్ట్యాదిలో పరమాత్మ, సృష్టికర్త, అల్లాహ్ అను మూడు బిరుదు పేర్లు మాత్రము ఉండేవి. ఈ మూడు పదములను, అర్ధమును బట్టి, భావ సహితముగా ఆదిలో గల తెలుగుభాషలో చెప్పడమైనది. . దేవుడు ఒక మతమునకు సంబంధించినవాడు కాడు. మొదటి జ్ఞానమును తెలుగు భాషలో,

మనుషుల భావములో చెప్పడము వలన భూమి మీద మొదట భారతదేశములో దక్షిణ భాగమునగల శ్రీలంక ప్రాంతములో తెలుగుభాష తయారయినది. తెలుగుభాష తయారయినప్పటి నుండి భాషను మాట్లాడు వారిని ప్రతి దినము చూచి చూచి తాను తెలుగుభాషను సులభముగా నేర్వగలిగాడు. అంతకుముందు ఆకాశము తనశబ్దము ద్వారా తెలియజేసిన జ్ఞానమును గ్రహించిన సూర్యుడు తనకు తెలిసిన జ్ఞానమును భూమిమీద తెలియజేయాలని అనుకోవడము జరిగినది. అప్పుడు దక్షిణభారతదేశములో కలిసియున్న శ్రీ లంకలోని మనువు అను వ్యక్తికి తనకు తెలిసినజ్ఞానమును తెలుగుభాషలోనే చెప్పాడు. తౌరాత్ అనగా 'మూడు రాత్రులు' అను తెలుగు అర్థమేనని తెలియవలెను.తెలుగు దేవభాషే. తెలుగే దేవభాష . ప్రపంచములోనే మొదట పుట్టిన భాష తెలుగు. ఆత్మజ్ఞాన వివరణకు తగ్గట్టుగా కృతయుగములోనే దేవుడు అందించిన దేహి భాష తెలుగు.

ఖురాన్ తెలుగులో చదవండి మేము అన్ని మతములను, అన్ని గ్రంథములను సమానముగా చూస్తున్నాము. అట్లుకాకుండా ఒక గ్రంథమే గొప్పది, మిగతా గ్రంథములు గొప్పవికావు అని మేము చెప్పలేము. అలా చెప్పితే మతబోధవుతుందిగానీ, జ్ఞాన బోధఅనిపించుకోదు. మేము మూడు గ్రంథములు చదువాలని ఖురాన్ గ్రంథములో వాక్యము ప్రకారమే చెప్పాముగానీ మేము స్వయముగాచెప్పలేదు. ఖురాన్ (5:68)

ముస్లీమ్ లందరూ అరబ్బీ భాషలోనే ఖురాన్ ను చదువవలెనని చెప్పుచున్నవారు, అరబ్బీ భాషరాని ముస్లీములను అరబ్బీ భాష నేర్చుకొని చదవమనీ, తెలుగులో చదవరాదని చెప్పుచున్నారు. నేడు భారతదేశములోని ముస్లీమ్లు అరబ్బీ భాష రాని కారణముగా 80 శాతము మంది ముస్లీమ్ లు ఖురాన్ గ్రంథమును చదువలేదు. ఖురాన్ గ్రంథములో ఏమున్నదో వారికి తెలియదు. వచ్చిన ప్రాంతీయ భాషలోగానీ, తెలుగుభాషలోగానీ చదువుతామనుకొంటే అలా చదువకూడదు, ముస్లీమ్ అయిన వాడు అరబ్బీ భాషలోనే ఖురాన్ను చదువవలెనను, మత నియమమును తమ మత పెద్దలు చెప్పుచుండుట వలన వారు చదువలేకపోవుచున్నారు. తెలుగుభాష మాత్రమే వచ్చిన ఎందరో ముస్లీమ్ లు అరబ్బీ భాషలోనే చదువవలెనను మత నియమముతో దైవగ్రంథమునకు దూరము చేయబడి అరబ్బీ

భాషలో చదువలేకయున్నారు. అయితే నేడు తెలుగుభాషలో ఎన్నో అనువాద ఖురాన్ గ్రంథములు తయారైనాయి. తెలుగుభాష వచ్చిన ఎందరో ఇస్లామ్ పండితులు ఖురాన్ గ్రంథమును తెలుగు లో అనువదించి వ్రాసి గ్రంథమును తయారు చేశారు. అయినా తెలుగు గ్రంథమును ముస్లీమ్ లు చదువకూడదు అను నియమము ప్రకారము చదవకూడదు. అలాంటప్పుడు తెలుగుభాషలోఖురాన్ గ్రంథమును ఎందుకు వ్రాశారు? ఎవరు చదువాలని వ్రాశారు? అలావ్రాయడములో వారి ఉద్దేశ్యము ఏమి? అని ఆలోచించిన వారి భావము స్పష్టముగా బయటికి కనిపించుచున్నది.

తెలుగు మూలపదాలు నమాజ్ మరియు అల్లాహ్ అను రెండు పదములు స్వచ్ఛమయిన తెలుగు పదములు. ప్రపంచములో మొదటి భాష తెలుగు భాష. తెలుగు భాష నుండే మిగతా భాషలు పుట్టాయి.. .కాలక్రమములో కొన్ని తెలుగు పదములు మిగతా అనేక భాషలలో చేరిపోవడము జరిగినది. అలా అరబ్బీ మొదలైన భాషలలో చేరిపోయిన ముఖ్యమైన పదములు అల్లాహ్, నమాజ్. ఈ రెండు పదములు తెలుగు భాషలో పుట్టిన పదములని ముస్లీములకు ఎవరికీ తెలియదు. తెలుగు భాషలో ప్రతి పదము భావముతో కూడుకొన్న పదమైయుండును. పదములోని శబ్దమును బట్టి అందులోని సారాంశము తెలియునదిగా ఉండును.

అ+ల్లాహ్=అల్లాహ్. ల్లాహ్ అనగా అంతు లేక గట్టు అని అర్థము. అ అనగా లేదు, కాదు అని అర్థము. ఈ అర్థముల ప్రకారము అంతులేని వాడు, హద్దులేనివాడు, లేక గట్టు లేనివాడు దేవుడు అని తెలియుచున్నది. అల్లాహ్ అంతు ఎవరికీ తెలియదు. అందువలన పూర్వము తెలుగు భాషలో దేవున్ని అల్లాహ్ అని అన్నారు. తెలుగులో దేవుడు అనినా వెతకబడేవాడు అని అర్థము గలదు. అల్లాహ్ అనినా, దేవుడు అనినా ఎవరికీ తెలియనివాడే యని అర్థమగుచున్నది.
న అనగా లేదు, కాదు అని అర్థము గలదు. మ అనగా నేను, నా యొక్క అని అర్థము. జ్ అనగా పుట్టుక లేక జన్మయని అర్థము. దీనిని అంతటినీ కలిపి చూస్తే 'నాకు జన్మ వద్దు' అని అర్థము.తెలుగు భాషలో నమాజ్ అను పదమునకు జన్మరాహిత్యమును తెలుపు అర్థము కలదని చెప్పవచ్చును".

(ద్యానము - ప్రార్థన - నమాజ్ 2017)

నమాజ్ లోని మూడుఅక్షరములకు అర్థమును చెప్పుకొంటే 'న' అనగా వద్దు అని అర్థము. 'మ' అనగా నాకు యని అర్థము. 'జ' అనగా జన్మఅని అర్థము. "నాకు జన్మవద్దు" అని అర్థమును తెల్పునదే నమాజ్. నమాజ్ ఆదినుండి యున్న తెలుగుపదమే యనిచెప్పవచ్చును. కృతయుగము లోనే స్వచ్ఛమయిన తెలుగుపదముగా నమాజ్ మరియు రోజా అను పదము ఉండేవి.

'రోజా' అనగా 'జన్మ నాశనము' అని అర్థము. నమాజ్లో నాకు జన్మవద్దు, నాకు జన్మలేదు అని అర్థము. రంజాన్, రోజా, నమాజ్ అను మూడు పదములు తెలుగుభాషలో మంచి అర్థమును కలిగియున్నవి.మొదట భూమి మీద పుట్టిన భాష తెలుగుభాష. తెలుగుభాషలో 'రం' అంటే 'నాశనము' అని అర్థము గలదు .రంజాన్ పదములో రం+జాన్=రంజాన్ అనుట వచ్చినది. 'జా' అను శబ్దమునకు 'పుట్టుక' అని అర్థము. రంజాన్ అనగా జన్మ నాశనము అని అర్థము.

'అల్లాహ్' అను పదము కూడా సృష్టి ఆదిలోనిదే. ఈ పదములన్నియూ ఆనాడున్న తెలుగుభాష లోనివే అయినా, ఆ విషయము ఈనాడు ఏమాత్రము ఎవరికీ తెలియదు. 'అల్లాహ్' అనునది దేవుని పేరు కాదు. ఆయనకున్న బిరుదు. 'దేవుడు' అనగా దేవులాడబడేవాడు, వెతకబడేవాడు అని భావము. ఆయన ఎవరికీ దొరకడు, కనిపించడు కావున ఆ బిరుదును ఉంచి 'దేవుడు' అన్నాము. దేవుడు పేరు లేనివాడని చెప్పవచ్చును. ఇంతవరకు చెప్పిన బిరుదులన్నీ తెలుగుభాషలో గలవే. కృతయుగములో మొదట పుట్టిన భాష తెలుగు. అందువలన నేడు దేవున్ని పిలుచుపదములన్నీ తెలుగుపదములుగానే యున్నవి.

ఖురాన్ గ్రంథములోగల దేవున్ని, దేవుని ఆరాధనను గురించి చెప్పిన పదములు అరబ్బీ భాషవని అందరూ అనుకోవడము జరిగినది. అయితే సృష్ట్యాదిలో కృతయుగమందే ఆ పదములు ఉండేవని నేడు ఎవరికీ తెలియదు. దేవుని ఆధ్యాత్మిక భావమునకు సరిపోవు అర్థముతో కూడిన తెలుగుభాషలోని పదములే నేడు గలవు. నేడు దేవునికి, దేవుని ఆరాధనకు సంబంధించిన పదములకు అరబ్బీ భాషలో ఆధ్యాత్మికమునకు సరిపోవు అర్థము తెలుగుభాషలోయున్నట్లు లేవు. నేడు కొందరు అరబ్బీ భాషలో కొన్ని పదములకు అర్థముచెప్పినా అవి ఆధ్యాత్మిక భావమునకు పూర్తి దగ్గరగాయుండవు. ఉండినా తెలుగుభాషలో యున్నంత దగ్గర పదములుగా ఉండవు. నేడు అరబ్బీ

భాషలో కొన్ని పదములున్నా అవి తెలుగుభాషకు దగ్గర సంబంధముగా యున్నట్లు కనిపించుచున్నవి.

తెలుగు లో "జ" అను అక్షరము పుట్టుకకు సంబంధించినది. 'జాతకము' అనగా పుట్టినప్పుడు నిర్ణయించబడిన కర్మఫలము అని అర్థము. దానిని పూర్వము 'జాఫతకము' అని అనెడివారు. అయితే కాలక్రమమున జాఫతకములో 'ఫ' అనుఅక్షరము పోయి జాతకము అని అసంపూర్ణముగా మిగిలిపోయినది. 'జ' అనునది జన్మకు సంబంధించిన భావము. నమాజ్, జకాత్, రోజా, హజ్, రంజాన్. అట్లే తౌరాత్, తౌహీద్ అను పదము 'త్రి' అను శబ్దముతో ముడిబడి యున్నవి. 'తౌ' అనగా తెలుగుభాషలో మూడుయని అర్థము.

- **త్రైత సిద్ధాంత ఆధారంగా తెలుగులిపి**

తెలుగు లిపి లోని అచ్చులు హల్లులు జీవాత్మ, ఆత్మ, పరమాత్మ ల వరుస క్రమములోనే పేర్చబడ్డాయి తెలుగు అక్షరాల ద్వారా కూడా "ఆత్మ జ్ఞానం" చేర్చబడింది అంటారు.("అక్షర జ్ఞానము"10.05.2017)

- **త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక ఘంటు**

తెలుగులో చాలా పదాలు పూర్వము ఏ అర్థంతో ఉండేవో మళ్ళీ ఆ ఆధ్యాత్మిక అర్థాలను వివరిస్తుంది.

- **తెలుగు సామెతలు, పొడుపుకథలు**

మన తెలుగు సామెతలు, పొడుపుకథలలో "అక్షర జ్ఞానం"తో పాటు ఆత్మ జ్ఞానం కూడా ఉంది. ఆత్మ జ్ఞాన సంబంధ సమాచారాన్ని కూడా మన పూర్వీకులు ఈ తెలుగు సామెతల్లో, పొడుపుకథల్లో పొందుపరిచారు. వేమన పద్యాల్లో,జానపద గేయాల్లో, వీర బ్రహ్మం గారి తత్వాలలో నిగూఢముగా ఎంతో ఆత్మ జ్ఞానము ఉంది.వాటిని పరిశీలనగా చదివిన తరువాత తెలుగు దేవభాషే అని అంటున్నాను .సర్వమత సమభావన చాటుతున్న ప్రబోదానంద స్వామీజీ సామాజిక సేవలో కంచి, సిద్ధగంగ, పుట్టపర్తి లాంటి పీఠాల సరసన తన పొడమల ఆశ్రమాన్ని కూడా చేర్చేందుకు బీజాలు వేస్తారని కోరుతున్నాను.


తెలుగులో పాలన చేయలేమా?

15. తెలుగులో పాలన చేయలేమా?

జన ఘోషకు స్పందించాల్సిన సర్కారీ యంత్రాంగం జన భాషకు పట్టం కట్టాల్సిందేనంటూ పట్టుపట్టిన ఎన్టీఆర్, దస్త్రం తెలుగులో రూపొందిస్తేనే సంతకం చేస్తానన్నాడు. ఫైలు తెలుగులో తెస్తేనే సంతకం పెట్టాడు. యధారాజా తధా ప్రజా అన్నట్లు అధికారులు తెలుగులో ఫైళ్ళను పరుగులెత్తించారు.తెలుగులోనే తీర్పులు వచ్చేలా గ్రామ న్యాయాలయాలను నెలకొల్పుతానన్నారు. ప్రజలు ఎంతగానో సంతోషించారు. ఆయన 1983 నుండి 1989 వరకు ముఖ్యమంత్రిగా పనిచేశారు. మండలాల స్థాపన తరువాత కొత్త జిల్లాలను కూడా ఏర్పాటు చేయమని నేను కోరగా ఆయన ప్రభుత్వంలో నాకు తెలుగులో సమాధానం ఎంత శ్రద్ధగా ఇచ్చారో చూడండి. 21.9.1988 న సచివాలయం నుండి నాకు జవాబు చేతిరాతతో ఇచ్చారు.ఇంటర్నెట్టూ, కంప్యూటర్లు అప్పటికి లేవు. తెలుగు టైపు మిషన్లు కూడా పూర్తిగా వాడుకలోకి రాలేదు. అయినా సరే సచివాలయస్థాయిలో కార్బన్ పేపర్ పెట్టి చేతితోనే తెలుగులో రాసి నాకు జవాబు ఎలా పంపారో 175 పేజీలో చూడండి.

అది చాలు నాకు. ఒక సామాన్య పౌరుడినైన నాకు కూడా సచివాలయం నుండి సమాచారం తెలుగులోనే పంపారని ఎంతగా ఆనందించానో! 1988 లో ముప్పై ఏళ్ళక్రితమే ఇంత చక్కగా తెలుగులో సచివాలయ దస్త్రాలు నడపగా ఎంతో సాంకేతిక ప్రగతి సాధించిన ఈనాడు తెలుగులో ప్రభుత్వ కార్యకలాపాలు నడపలేమా? ఎన్టీ రామారావు లాంటి తెలుగు భాషాభిమానులైన పాలకులు రావాలి. పాలకులు తెలుగు భాషలో మాత్రమే దస్త్రాలు నడపమని ఎన్టీ రామారావు లాగా అధికారులను ఆదేశించాలి. తెలుగు అమలుకోసం వెంటపడాలి. 2018 ని తెలుగు భాషా సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణాలో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. రెండు రాష్ట్రాలలో కొన్ని మంచి నిర్ణయాలు చేస్తూ ఆంధ్ర,తెలంగాణా ముఖ్యమంత్రులు ఇద్దరూ తెలుగులో పాలనకు మద్దతు ప్రకటించారు. కాబట్టి మళ్ళీ ఎన్టీ రామారావు గారి తెలుగు పాలనాపద్ధతులను ప్రభుత్వాధికారులు,నాయకులు పునరుద్ధరించాలి. మన భాషకు మేలు

చేసే వనరులన్నీ సమకూర్చాలి. ఆధునిక అవసరాలకు పనికొచ్చేలా తెలుగు భాషను సంస్కరించాలి. ఇప్పుడు ఉపరాష్ట్రపతిగా రాజ్యసభ స్పీకర్ గా మన తెలుగు వ్యక్తి వెంకయ్యనాయుడు గారు తెలుగును ఉద్యోగాలకు అర్హతగా పెట్టాలని చెబుతూ ఉన్నారు. జాతీయభాష హోదా కూడా సాధిస్తే తెలుగులో పాలన కూడా సులభం అవుతుంది. తెలుగు భాషా పరిరక్షణకు అనేక వనరులు, శక్తులు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ కలిసివస్తాయి.

అసలు తెలుగులో ఓనమాలు మొదలు పెట్టకుండానే అదిలేదు ఇదిలేదు అని సాకులు చెప్పే ఉద్యోగులను అలా వదలకూడదు. తెలుగులో రాయటానికి ప్రయత్నం చెయ్యమని ఒత్తిడి చెయ్యాలి. ఈ ఒత్తిడి సచివాలయంలోనే మొదలవ్వాలి.ఈ విషయంపై తెలుగు భాషాభిమానులైన, అనుభవజ్ఞులైన ఐ.ఏ.ఎస్. అధికారులను సూచనలు సలహాలు అడిగి మరింత పట్టుదలతో కార్యాచరణలోకి దిగాలి. తెలుగులో పాలన సజావుగా సాగటానికి ఇంకా ఏమేమి చెయ్యాలో మీ సూచనలు సలహాలు కామెంట్ చెయ్యండి.ఎందుకంటే నా రాబోయే పుస్తకం 'తెలుగులో పాలన" ద్వారా మీ సూచనలు సలహాలనే ప్రభుత్వానికి నివేదిస్తాను :-

వచ్చిన సలహాలు,సూచనలు : (ఆంధ్రప్రభ 3.4.2018)



కర్లపాలెం హనుమంతరావు, ప్రముఖ రచయిత :- ఎన్టీ రామారావుగారు తమను తాము శ్రీకృష్ణ దేవరాయలుగా భావించుకునేవారని వినేవాళ్ళం. ఆయనపాలనా కాలంలో తెలుగుకిదక్కినమన్ననను ఇలాంటిఎన్నో కథలద్వారావింటున్నప్పుడు మనం నిజంగా తెలుగురాష్ట్రం లోనే ఉన్నామా అని చెయ్యిగిల్లుకొని ఖాయం చేసుకోవాలనిపిస్తుంది. ప్రజాస్వామ్యంలోప్రజలఓట్లకుమాత్ర మేనా ప్రజల మాటలకు విలువఇవ్వరా? ఇప్పుడూ పది, పన్నెండు తరగతుల వరకు తెలుగు అంటున్నారు కానీ..తెలుగు చెప్పని పాఠశాలలమీద ఏలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారో గట్టిగాచెప్పరు! ఎందుకంటే తెలుగు భాషకు పాలనా సామర్థ్యం కావాలని కన్నీళ్లు కార్చేమెకాలే మానస పుత్రులు మన ప్రభుత్వ అధికార పదవుల్లో నే ఉన్నారు. మా శ్రీమతిఎం.ఏ .. తెలుగులో. బి ఇడి చేసి హైదరాబాద్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు

ఉపాధ్యాయునిగా చేశారు. తాను సీనియర్ మోస్ట్ గా సర్వీసులోఉన్నప్పటికీ కేవలం ఆంగ్లభాషలో ఉత్తర ప్రత్యుత్తరాలు చేసే పాటిసామర్థ్యంలేదన్న మిష కల్పించి తనకన్నా జూనియర్ కి ప్రధానోపాధ్యాయునిగా పదోన్నతి కల్పించారు. ఆ విధమైన ప్రభుత్వ ఆదేశాలు లేకపోయినా విద్యాధికారులుసైతం మా శ్రీమతి గారి అర్జీలను బుట్ట దాఖలు చేసారు. రామారావుగారి వంటి పాలకులు, మీ వంటి నిక్కచ్చి అధికారులు లేనిలోపంకొట్టొచ్చినట్లుకనిపించింది మాకు! అంతర్జాల యుగం వేగం పుంజుకొంటున్న ఈసంధి దశలో అయినా తగిన వనరులు, పరికరాలు, పారిభాషికా పదాలు గట్రాలేవన్నకుంటి సాకులు చూపకుండా ప్రజల వాడుక భాష తెలుగుకు పాలనాస్థాయి నిక్కచ్చిగాకల్పించాలి. అన్నగారి పేరు చెప్పుకుంటూ పబ్బం గడుపుకొనే ప్రభువులు అన్నగారిఆలోచనా విధాలను కూడా ఆచరణలోకి తేవాలి. మాటలూ- మార్పులూ- డా॥ బూదరాజు రాధాకృష్ణ

పుస్తక పరిచయం -1

తెలుగులోరెండు మూడు నిఘంటువులు ఉన్నాయి. శబ్దరత్నాకరం, సూర్యరాయాంధ్రం, ఆంధ్రవాచస్పత్యం.. వగైరా. ఇంకా ఏమైనా ఉంటే ఉండవచ్చు, వేటి దారిది వాటిదిగాసాగింది పదనిఘంటువుల నిర్మాణం. తక్కిన ద్రవిడ భాషలకు మహానిఘంటువులునిర్మితమయ్యాయి.. కానీ తెలుగువాడికి ఆ అదృష్టం లేదు. వేదం వెంకటరాయశాస్త్రి, గిడుగు రామ్మూర్తి పంతులుగారు వంటి ఉద్దండులు నిఘంటువుల నిర్మాణానికి కొంత ప్రయత్నం చేసారు. వాటిని వేటినీ కాదని ఆంధ్రసాహిత్యపరిషత్తువారు సూర్యరాయాంధ్ర నిఘంటువు నిర్మాణం తలపెట్టారు! ఆ నిఘంటునిర్మాణ పోషణకు పూనుకున్న పిఠాపురం రాజావారు చివరకు బికారి దశకుచేరుకున్నారంటారు. తెలుగు అకాడమీ ప్రారంభమయిన తరువాత శబ్దసాగరం పేరుతో ఒకనిఘంటువు నిర్మించాలన్న తలంపు పెట్టుకున్నది. కానీ అఖండ భాషాభిమానులయినపాలకులు ఆ క్రతువు పూర్తి కాకుండా ఉండేందుకు శక్తి వంచన లేకుండాపాటుపడ్డారని బూదరాజు రాధాకృష్ణగారు ఒక సందర్భంలో వ్యంగ్యాస్త్రాలుసంధించారు. ఒక వ్యక్తి తన జీవితకాలమంతా శ్రమించినా ఒక మహానిఘంటువు

నిర్మాణంసాధ్య పడదు. అలా పడదని ప్రపంచ దేశాల నానా భాషాచరిత్రలు నిరూపిస్తున్నాయికూడా. అయినా కాలం, ఖర్మం కలసి వచ్చి భవిష్యత్తులో అలాంటి మహానిఘంటువునిర్మాణంతలంపు మొదలయితే.. ఉపకరణంగా ఉంటుందన్న మంచి ఉద్దేశంతో బూదరాజురాధాకృష్ణగారు ఈనాడు ఆదివారం అనుబంధంలోసుమారు నాలుగేళ్ళపాటు (1997, జూన్ 8 - 2001, ఫిబ్రవరి 2) 'మాటలూ-మార్పులూ' శీర్షిక నిర్వహించారు. మహానిఘంటువు నిర్మాణం కానీ చేపట్టదలిస్తే గమనించవలసిన అంశాలు బోలెడున్నాయి. వాటినన్నింటినీఏకరువుపెట్టడంఆరంభంలోనేబెదరగొట్టినట్లవుతుందని రాధాకృష్ణగారి అభిప్రాయం. అయినా కాలక్రమంలో శబ్దాల్లో, అర్థాల్లో వచ్చేస్వాభావికమైన మార్పులను కొంతలో కొంతైనా సూచిస్తే బుద్ధిమంతులకు, శక్తిమంతులకు మహానిఘంటువు లేదన్న కొరత స్వల్పంగా అయినా తీరుతుందన్నఉద్దేశంతో బూదరాజుగారు నిర్వహించినమంచి ధారావాహిక శీర్షిక ఇది. దీనిద్వారా తెలుగువారిలో ఎవరికయినా మళ్ళీ భాషాభిమానం రేకెత్తి.. మహానిఘంటువునిర్మాణ సంకల్పం మొలకెత్తితే తానుపడ్డ శ్రమకొంత సార్థకమవుతుందని రాధాకృష్ణగారి భావన.

600 మాటలకు సంబంధించిన కొంత సమాచారం ఈశీర్షిక ద్వారా అందించారు. పదానికి ఉన్న అర్థాల్లో కాలక్రమంలో వచ్చినమార్పుల వివరణ ఉంది. సందర్భాన్ని బట్టి ఆధునిక శాస్త్ర రచన అవసరాలనూదృష్టిలో ఉంచుకొని పాతమాటలకే కొత్తపదబంధాలు కల్పించి వాటినే సాంకేతికశబ్దాలుగా ప్రయోగిస్తున్న పైనాన్నీ పరిశీలించారు ఇందులో ఇలాంటి ప్రయత్నం ఈశీర్షిక ముందు.. తరువాత కూడా మళ్లీ ఎవరు తలపెట్టక పోవడం విచారించదగ్గవిషయం. అంతర్జాల యుగంలో తెలుగు పద సంపదకు మరింత పుష్టికలిగించాలన్న దృష్టి కల భాషాభిమానులు, భాషోద్ధరణకు కృషి చేసే సంస్థలు, సమాచార పత్రికలు ఈ తరహా కృషిని మరింత ముందుకు కొనసాగిస్తారన్న ఆశతో ఇక్కడ ఈచిరు పరిచయాన్ని ఇవ్వడం జరిగింది!

ఈనాడు విశ్రాంత ఉద్యోగులు శ్రీధర మూర్తిగారుఅందించిన అదనపు అత్యంత విలువైన సమాచారాన్ని కూడా ఇక్కడ జత చేస్తున్నాను :

"జయంతిరామయ్య పంతులు గారిచే రచింపబడిన "శ్రీ సూర్యరాయంధ్ర నిఘంటువు " కాకినాడఅంధ్రసాహిత్య పరిషత్ వారు 1936 లొ ప్రచురించారు.దానిని ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమి వారు 1979 లొ పునర్ముద్రించారు, 6 సంపుటాలు గావెలువడింది. దీని గొప్ప దనం ఏమిటంటే, అలుక అని ఒకమాటకు ఎన్ని అర్థాలున్నాయోతెలుపుతూ, ఆ మాట వాడబడిన పద్యం గాని, వాక్యం గాని ఉదాహరణలు ఇచ్చారు. తరువాతి కాలం లొ వచ్చిన పుర్ముద్రణలో ఈ పద్యాలు ఉదాహరణలు లేకుండా ఒకేసంపుటం గా ముద్రించారు. ఇక తెలుగు అకాడెమీ వారు ఇంగ్లీష్ తెలుగునిఘంటువును A4 size లొ 3 కాలంస్ తో 1300 పేజీ ల నిఘంటువు ప్రచురించారు. అప్పట్లోడిప్యుటీడైరెక్టర్స్ గా పనిచేసిన, ముకురాల రామారెడ్డి, పొరంకిదక్షిణామూర్తి ఈ నిఘంటువు ను తయారు చేసారు. ఇప్పుడు ఇది దొరకటం లేదు. నాదగ్గర మాత్రం ఒక కాపీ వుంది. ఇక, బూదరాజు గారు ఈనాడు జర్నలిస్ట్ ల కొసంవ్యవహార పదకోశం తయారు చేసారు. ఈనాడు దీనిని ముద్రించింధి. సచివాలయం లొన్యాయ శాఖ లో అనువాద విభాగం లో మేము తయారు చేసిన నిఘంటువు నుముద్రించటానికి మాకు నిధులు లేనందున తెలుగు అకాడెమి వారికి ఇచ్చాము. వారుదానిని న్యాయ పద కోశము పేరుతొ ముద్రించారు. నాకు తెలిసిన సమచారం ఇది.

 Nalini Mohan Kumar Kalva కాల్వ నళినీ మోహనకుమార్, ఉపకార్యదర్శి,ఆర్థికశాఖ ,సచివాలయం ,అమరావతి :- నిజంమాట్లాడితే ఇప్పుడు చాలా సులువు తెలుగు ను అధికార భాష గా అమలు చేయడానికి. ఎందుకంటే అన్ని ప్రభుత్వ కార్య కలాపాలన్నీ రేపు ఏప్రిల్ 1 వతేదీ నుండి "పేపర్ లెస్ - ఈ ఫైలింగ్ "విధానం గ్రామస్థాయి నుండి సచివాలయ స్థాయి వరకుఅన్నీ కంప్యూటర్ల పైనే జరగాలని ప్రభుత్వసాధారణ పరిపాలన శాఖ ద్వారా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ గారు ఆదేశాలు జారీచేసే ఉన్నారు. ప్రస్తుతం మనం ఎట్లాగైతే "గూగుల్ ట్రాన్స్ లిటరేషన్ - తెలుగు" పరికరం ను ఉపయోగించి ఈ విధంగా అవలీలగా మనలాటి వాళ్ళం అసలు తెలుగు గాని ఇంగ్లీష్ గాని టైపు చేయడమే నేర్చుకోనట్టివాళ్ళం సైతం చేయగలుగుతున్నామంటే, అది కంప్యూటర్ లో వుండే "ఇంగ్లీష్ కీ బోర్డ్" తోనే ఆ ఇంగ్లీష్ అక్షరాలతోనే నొక్కుతూ తెలుగును చూడగలుగుతున్నాము. కాబట్టి ప్రతి ఉద్యోగి కూడా

ఇదేతరహాలో వాళ్ళ ఆఫీస్ వ్యవహారాలు వాళ్ళ కంప్యూటర్ల ద్వారా తేలికగాచేసుకోవచ్చు. ఇక్కడ కావలసింది ఉద్యోగులకు తెలుగులో వ్రాయాలనే శ్రద్ధ, ఇష్టం, మాత్రమే!. ఎన్నో సంవత్సరాల క్రితమే తెలుగును అమలుచేయమని ఎన్నో ఆదేశాలు జారీచేసినా, మన ఉద్యోగులు వాటిని సీరియస్ గా తీసుకోవడం లేదు .ఏంచేస్తాం!. వీళ్ళకు భాషాస్వాతంత్రం వచ్చినా స్పృహ లేదు. ప్రభుత్వఉద్యోగం అంటే ఇంకా “ఇంగ్లీష్ భాష”లోనే చేయాలనే బానిస మనస్తత్వం నుండి విముక్తులు కాలేని “పెధవాయిలు” గానే మిగిలిపోయారు.! మనం ఎవరికోసం ఏ ప్రజలకోసం ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాం అనే కనీస జ్ఞానం లేకుండా సంవత్సరాలు గడిపేస్తూ , రిటైర్ అయిపోతున్నారే గాని, మన జీతభత్యాలు “తెలుగు ప్రజలు” కట్టే పన్నులు, ధనంతో అనే భావన ఎవరికి వారికి కలిగితేనే గాని అధికార భాష గా ఈరాష్ట్రంలో “తెలుగు అమలు” కాదు!. అందుకే సచివాలయంలో “బ్రౌన్” నిలువెత్తు విగ్రహాన్ని పెడితే, రోజు వస్తూ, పోతూ ,కనీసం, ఆ “ఇంగ్లీష్ వ్యక్తి” తెలుగుభాష కోసం ఎంత కృషిచేశాడో! అని , కనీసం “మనం ఉద్యోగులం, తెలుగు వాళ్ళుగా పుట్టి “ప్రజల భాష అయిన తెలుగు” ను ఎందుకు “పరిపాలన భాష” గా అమలు చేయలేము!?. అని ఎవరికివారు సిగ్గుపడి తెలుగు ను ఆఫీస్ వ్యవహారాల్లో అమలు చేయగలమనే పట్టుదల, సంకల్పం కలుగుతుందని నేనుభవిస్తున్నాను!. ప్రభుత్వం లోని మంత్రులంతా వాళ్ళకు పంపబడే ఫైళ్ళు అన్నీ ఖచ్చితంగా “తెలుగులోనే” ఉండాలనే నిబంధన పాటించాలి!. అదే విధంగానే “సెక్రటేరియట్ మాన్యువల్”, “బిజినెస్ రూల్స్” లో గూడా ఆ నిబంధనను చేర్చాల్సిన ఆవశ్యకతను ముఖ్యమంత్రి గారు గుర్తించాలి,! ఆ విధంగా ఆదేశాలు ఇవ్వాలి!.



Madhusudhanarao Kotapati కోటపాటి మధుసూదనరావు : రాజుతలచుకొంటే దెబ్బలకు కొదువా అనె సామెత ఉంది. ప్రభుత్వానికి చిత్తశుద్ధివుంటే ఇప్పుడు కూడా అమలవుతుంది. ముఖ్యంగా IAS అధికారులు కున్న ఆంగ్లంపైమోజు తెలుగును పరిపాలనలో అమలు కావాడానికి ఒక ఆటంకంగా భావించవచ్చు. తెలుగు లోరాయడం వలన పై అధికారులు ఏమనుకొంటారో ,అంగీకరిస్తారోలేదోననేభావన క్రింది వారిలో ఉంది. తెలుగు లోనే రాయాలని ఏ అధికారి అనడంలేదు. ముఖ్యంగా ఇంగ్లీషు లో రాయడం గొప్పగా భావిస్తూ అలా రాయని వారిని నిరక్షరాశ్యులు లాగా చూస్తూ ఉన్నారు మనకు పై ఆఫీసుల

నుండి తెలుగు లో వస్తేతెలుగులోనే రాయవచ్చు కానీ అలా జరగడం లేదు అంతే కాదు మీ లాగా ప్రతిజిల్లాలో ఒకరిద్దరు తెలుగు అమలుకు నిస్వార్థంగా కృషి చేస్తే కొంత ప్రయోజనండుంటుంది.


G Sathi Raju ఎనభయోదశకంలో తెలుగు బాష వైభవం ఇనుమడిస్తుంది పాలనలో విరివిగా వాడబడి నిజమయినఅధికారభాష అవుతుందని ఆశించాం. అది జరగాల్సినంత జరగలేదు. ప్రపంచం చుట్టిచూస్తూ ఈ మధ్య కొరియా వెళ్ళిన చంద్రబాబు అక్కడ మాతృబాషవల్ల ఎదుగుదలనుగ్రహించాల్సింది. తెలుగు లో పాలనా, విద్య అన్నీ జరిగితేనే జాతి మొత్తంఅభివృద్ధి సాధిస్తుంది. వారి స్థాయికీనివేదన చేరి చర్యలు తీసుకునేలాకృషిచేయాలి. నేనుచిన్నపటినుండి మాతృభాష తల్లిలాంటిది గౌరవించింద పూజించు లాంటి పాఠాలుచెప్పే టీచర్లు ఈ రోజులలో ఎదగాలంటే ఇది అనవసరమని చప్పరించడమూ చూస్తూ వచ్చా. చాలా మందిలో ఆ తప్పుడు భావాలు ఊరిపోయాయి. (ఆంగ్ల విద్య ద్వారా) ప్రగతిసాధించిన కొద్ది జనాభాకే ఇప్పటి శాస్త్రసాంకేతిక వైద్య రంగాలు అధికంగా పరిమితమవడం వల్ల మనకు ఆవిష్కరణల సంఖ్యపురోగతి తక్కువుగా ఉంది. యూరోపు, చైనా, జపాన్, కొరియాల మాతృభాషలో భోధనలుపాలనలవల్ల ప్రజలలో పెక్కుమందికి పాలుపంచుకుని పురోగతికి తోడ్పడే అవకాశంలభించడం వల్ల ఆ సమాజాలు దూసుకెళ్ళాయి అనేది మన పాలకులు, విద్యావేత్తలు, అధికారులు గ్రహించాలి. అలాగే విద్యను రాష్ట్రాల జాబితా లో చేర్చాలి. ప్రపంచానికి సేవలందించే వారికి అనుసంధాన భాషలుగ ఆంగ్లాది భాషలు నేర్పవచ్చు.



Nagendra Vara Prasad Vajjhala తెలుగులోమాట్లాడితేనే తప్పు అనుకునే పరిస్థితి నుంచి తెలుగులో మాట్లాడుతూ తెలుగులోరాయకపోతే తప్పు అనే పరిస్థితి వస్తుందని ఆశిస్తున్నాం



Wahed Abd గొప్ప సమాచారం అందించారు. నిజానికి ఇప్పుడు తెలుగును అమలు చేయడం చాలా సులభం. కావలసింది చిత్తశుద్ధి. సంకల్పం.


Venkata Butchi Raju Bojja తెలుగు రాష్ట్రాల్లో తెలుగును పాలనా భాషగా చేయాల్సిందే... తెలుగులోనే ఫైళ్లు నడవాలి.

Fazlur Rahman తెలుగు భాషాభిమానం ఎక్కువ మక్కువ

ఉన్న గుప్పెడు మంది కలిస్తే ఇంటింటా తెలుగు పంటలు ఊరూ వాడా తెలుగు వెలుగులే! మీకృషిని అల్లాహ్ స్వీకరించుగాక! ఇన్ షా అల్లాహ్


Saye Kumar Anisetty చాలాబాగుంది. ఇది ప్రభుత్వ అనువాద శాఖ వారు చేస్తే ఇంట మంచిగా ఉండేదికాదు. ఇంగ్లీషు పదబంధాల్ని, వాక్య నిర్మాణ పద్ధతినీ గురించి ఆలోచిస్తూ తెలుగులోరాయడం ఎక్కువమంది చేస్తున్నారు. తెలుగులో స్వేచ్ఛగా రాస్తే ఇంకాబాగుంటుంది.


Archana Rampalli తెలుగువారికి తమ సంస్కృతి ,భాష పైన గౌరవం, అభిమానం తక్కువ.ప్రజల వైపు నుండి వత్తిడి ఉంటె ప్రభుత్వమూ తగ్గ చర్యలు తీసుకుంటుంది. కిందటి సంవత్సరం ఆర్ టి ఐ దరఖాస్తును తెలుగులో ఇచ్చాను. వారు మాత్రం ఇంగ్లీష్ లో జవాబిచ్చారు. సంబంధిత అధికారి తెలుగువాడై ఉండి కూడా దరఖాస్తులోని వాక్యాలను చదవటానికి ఇబ్బంది పడ్డారు. ఇంత తెలుగు రాస్తే ఎలాగమ్మాఅన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వం తో ఉత్తరప్రత్యుత్తరాలను, ఫిర్యాదులనుతెలుగులోనే చెయ్యాలి, ప్రభుత్వమూ తెలుగులోనే జవాబివ్వాలని ఒత్తిడిచెయ్యాలి. వెంకయ్యగారన్నట్లు రెండురాష్ట్రాల్లో ఉద్యోగాలకు తెలుగు వచ్చిఉండటం ఒక అర్హత కావాలి, కోర్టుల్లో కూడా వాదోపవాదాలు ,తీర్పులు తెలుగులోనేఅమలయ్యేలా చూడాలి.


Nasreen Khan 1988లోనూజిల్లాల పునర్వ్యవస్థీకరణ గురించి చర్చ జరిగిందని తెలుసు కానీ ఈ లేఖద్వారా ప్రత్యక్షంగా చూడగలిగాను. చక్కగా తెలుగులో రాయడం వలన ఇంగ్లీష్ రానివారు తేలికగా. అర్థం చేసుకునే వీలుంది. అప్పుడు ఇంత బాధ్యతగా సామాన్యులకుజవాబులు రాసి పంపే వారంటే అప్పటి పాలకులు ఎంత జవాబుదారీగా ఉండేవారో అర్థమవుతున్నది.


తెలుగుభాషను క్షీణ దశ నుంచి బయటకు తీసురావాలంటే ప్రభుత్వం పూనుకుంటేనే సామాన్యులు అనుసరిస్తారు. ఇప్పటికే అందమైన భాష ఉర్దూను ఆ స్థితికిచేర్చాము. ఇప్పుడు తెలుగును కూడా అలా చేసుకుంటే ఆత్మాభిమానం లేని వాళ్ళమేఅవుతాం. ప్రభుత్వం తెలుగును స్కూల్స్ లో ఒక సబ్జెక్టుగా పెట్టిప్రోత్సహిస్తామని చెబుతున్నది కానీ ఆఫీసులలో మటుకు ఇంగ్లీష్ ఫైల్స్సర్క్యులర్లు

కొడుతున్నాయి. ఇక తెలుగు మాధ్యమంలో చదివిన వారికిఏ పోటీ పరీక్షలలోనైనా ఇంగ్లీష్ మీడియం వారికన్నా తక్కువ మార్కులొస్తున్నాయి. ఏ ధైర్యంతో తల్లి తండ్రులు తెలుగు మాధ్యమంలోచదివించగలరు?అందుకే ఇంగ్లీష్ మీడియంలో చదివిస్తూ తెలుగును ఒక భాషగా ప్రోత్సహించడంలో తప్పు లేదు.ఇక స్కూల్స్ లో పిల్లలందరూ తెలుగులో మాట్లాడేలా ప్రోత్సహించాలి. తెలుగు మీడియం లో చదివిన వారికి ఉద్యోగాలు కల్పించాలి.అప్పుడే తెలుగు భాష మృత భాషగా మారదు.



Lakshmi Vasanta తెలుగుమన మాతృ భాష అని కూడా మరిచిపోతామేమో కొంత కాలానికి. ప్రభుత్వం లో అధికారభాష ఇంగ్లీష్. ఫైల్స్ అన్నీ ఇంగ్లీష్ లోనే నడుస్తాయి. న్యాయ స్థానాలు లో మరీదారుణం..కక్షిదారులు కి తెలుగు తప్ప ఏ భాషా రాదు.అయినా సరే వాదాలు అన్నీ ఇంగ్లీష్ లో రాస్తారు.ఎందుకో అలా..అసలుతెలుగు అధికార భాష అని ప్రకటించారా లేదా.. ప్రకటించి ఉంటే ఇప్పటివరకుఎంతవరకు ప్రయత్నించారు..అంతా అయోమయం. ప్రజలు కూడా ఒక పక్క మా పిల్లలకి ఉద్యోగభాష కావాలి అంటూ ఆంగ్ల మాధ్యమం వైపే మొగ్గు చూపుతున్నారు..మన ఆంధ్రప్రదేశ్ లో తెలుగు భాష అధికార భాష అని ప్రకటించి ఇప్పటికైనా అధికారయుతప్రకటనలు తెలుగు లో రాయాలి.



Siva Racharla మీప్రతిపాదన ఫలించి కొత్త జిల్లాలు ఏర్పడి ఉంటే బాగుండేది సార్. P.V. నంద్యాలనుంచి పోటి చేసినప్పుడు నంద్యాలను జిల్లా చేస్తానని ప్రకటించారు. పాలనా వ్యవహారాలు తెలుగులో జరగటం మంచిది.


Suresh Kumar ప్రతి రాష్ట్రం లో మాతృభాష లో పాలన సాగుతోంది... మనకు మాత్రం తెగులు.


Pudota Showreelu బ్యాంక్ లావాదేవీలు గూడా తెలుగులోనే జరగాలి. మాతృభాషనుచక్కగా నేర్చుకున్నవారికి పరాయి భాషలు నేర్చుకోవటం సులువు...మన అమ్మభాషనుదయచేసి చదవండి,,నేర్చుకోండి ,అని బతిమిలాడాల్సిన దౌర్భాగ్యం పట్టిందిమనకు.. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి వుంటే కానిదిలేదు.....తెలుగు తప్పకుండా ఒకసబ్జెక్టు గా చదివిన వారికే ప్రభుత్వ వుద్యోగం అంటే తప్పకుండాచదువుతారు.అమ్మ ఒడి, బడి, ఏలుబడి''......ఈ


మూడింటిలోతెలుగును సంపూర్ణంగా అమలుచేసినపుడే మాతృభాష మనగలుగుతుంది.....లేదంటే మృతభాషగా మారిపోతుంది.


 Ponnada Lakshmi మనతెలుగుభాష ఉద్ధరింపబడాలంటే పాలకుల శ్రద్ధ అత్యవసరం. పాఠశాలలో తెలుగుకి ప్రాముఖ్యత ఇవ్వాలి. తెలుగులో పాలన వల్ల ఎవరికీ ఇబ్బంది లేదు, కేవలం పరభాషావ్యామోహం మనల్ని తినేస్తోంది. పాలకులు పూనుకోకపోతే మన భాషకి గౌరవం విలువఅన్నీ తగ్గిపోతాయి.

 భాగవత గణనాధ్యాయి అవునండితెలుగు పూర్తి వ్యవహారిక భాషగా 1990వ దశకంలోనే వచ్చేయాల్సింది. ఇప్పటికేబాగా ఆలస్యం అయింది ఇప్పటికేనా శీఘ్రమే చేయాలి. దీనికి భాషాపరంగా సాంకేతికతవిషయంలో కాని, భాషా సంపత్తిలో కాని ఎట్టి లోటూ లేదండి.తెలుగునువాడుకలోకి తీసురావడానికి ఎటువంటి సాంకేతిక ఇబ్బంది కాని. భాషలో పటుత్వంవిషయంలో గాని ఎట్టి లోపం లేదండి. దానికి నిలువెత్తు ఉదాహరణలుమీవంటి వారే... దీనివలన సామాన్య జనానికి వ్యవహారాలలో ఏమి జరుగుతోందోతెలియటంలేదు. వారి నిబ్బరాలు దెబ్బతింటున్నాయి. ఇది మంచిది కాదు. ఇంకసాంకేతికత అంటే గణని, చరవాణి వంటి పరికరాలలో తెలుగును ఆంగ్లంతో సమానంగాఅన్ని విధాలా వాడుకోవచ్చు. దానికి రుజువు ఇంటర్నెట్టులో తెలుగు వాడికచూడండి... ఇప్పుడు గూగులు మైక్రోసాఫ్టు వారు తెలుగుకి అన్నీఅనుకూలిస్తున్నారు మనం అవి బాగుండకపోయినా వాడుతుంటే అవే మెరుగు పడతాయి. తరువాత, ప్రభుత్వ ప్రయివేటు కార్యక్రమాలకు ఆధునిక పరికరాల వాడుక తప్పనిసరి వాటిలో తెలుగు అనుకూలం కనుక, తెలుగును ప్రభుత్వం కాని, న్యాయవిభాగం కాని, ప్రజలు కాని వ్యవహారికి భాషగా వాడటానికి ఏ ఇబ్బంది లేదండి. పైగా చాలాకాలం క్రితమే సమగ్ర ఆంధ్రప్రదేశ్ లో సచివాలయంతో సహా ప్రతి ప్రభుత్వ ఉద్యోగిఅంటే తెలుగు చదువుకుని ఉండాలి. లేదంటే ప్రభుత్వం పెట్టే తెలుగు పరీక్షరాయాలి లేకపోతే రెగ్యులైజేషను కాదు అనే వారు.. మరి ఆ రూలు ఏమైందో తెలియదు. ఇట్టి పరిస్థితికి కారణం రాజాదరణ లేకనా? అంతేకాకుండా మన ప్రక్కరాష్ట్రాలు సోదర భాష కన్నడను మన భాషలాగానే చదవడానికి మాట్లాడడానికి ఉంటుంది. వారిని చూడండి ఎంత బాగా వృద్ధి చేసుకుంటున్నారో. వారిని చూసి మనంమేలుకోవాలి. లేకపోతే జాతి మనుగడే దెబ్బతినవచ్చు.


 Raj Kumar Deni bhadhyatha yevariki appaginchalo varike appaginchali sir. Barrelu kaachukunevadu leader ayii Mla ga gelisthe, vadiki Badulu, Gudulaku sambhandinchi minister ga isthunnaru. Vadiki education gurinchi, schools infrastructure gurinchi, entho viluvaina, pavithramaina matha grandala gurinchi, Temples gurinchi yemi telusthundandi. Mundu e vidhanam marithe, Telugu bhasha viluva telust-hundi. Desha bhashalakella lessa Telugu bhasha annadi marachipokoodadu, daani viluvanu kapadukovali sir. Mundu mana politics vidhanam marali. Kevalam dabbukoraku den-inaina nashanam chesesthunnaru. Tharuvatha education vidhanam marali. Okka NTR education society lone antha goppa vidhya vidhaanaanni amalu chesthe saripodu, alanti service state motthaniki ivvagalagali sir. Ilanti vishayamlo Brahmini Lokesh garu mundukuvachhi state education de-partment tho kalasi panichesi, mana education vidhanamlo, standards lo improvement theesukuravali sir.


Vijaya Kumar Batchu మంచి ఆలోచన. రామారావు గారికి నా పాదాభివందనం.. తెలుగుని బ్రతికించటానికి ఊపిరిపోస్తున్న ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక పాదాభివందనం

 Vimala Chigurupati Vimala Chigurupatiమన భాష మన కుండగా , పొరిగింటి పుల్లకూర మనకెందుకు?

 Mangalagiri Jilani Noorbasha Rahamthulla Sab మీరు మొదటి నుండి తెలుగు భాషాభిమాని. Hyd లో మొదటి నుండి ఉర్దూ భాషమాట్లాడే వారు, అన్న ఎన్టీరామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలుగువాడకంపై ప్రత్యేక శ్రద్ధ కారణం గా తెలుగుకు మంచిరోజులు వచ్చాయనిఅనుకున్నాము కాని ఆయన తరువాతవచ్చిన వారుతెలుగుకు అంతగా ప్రాధాన్యత నివ్వని కారణంగా నేటి (దు)స్థితి. తెలుగులోపరిపాలన చక్కగా చేయవచ్చు. అప్పటి కంటే సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిననేటికాలం తెలుగులో పరిపాలనకుఅనుకూలం. ప్రభుత్వకార్యాలయాలుముందుగాతెలుగులో

పరిపాలన కు అవసరమైన దస్త్రాలను తయారుచేయాలి. దాని అమలుకు గట్టిగాకృషి చేయాలి. తెలంగాణలో కెసిఆర్ గారు 2018-19 విద్యా సం నుండి 10వ తరగతివరకు తెలుగు తప్పనిసరి అని చట్టం చేయటం తెలిసిందే. మరి అమలు చేయడం ఎలాజరుగుతుందో వేచిచూడాలి. ఆంధ్ర లో కూడా తెలుగు తప్పనిసరి చేయాలి.


Syamala Betha   Anni works name thone start aithai name hone end aithai law loni kotha marupu kavali Telugu vallu Telugu lo santakalu cheyali , Anni application Loni Telugu loni Telugu lo ne name vrayali vere language chelladu.


Raghavendra Rao Nutakki గౌరవనీయులుNoorbasha Rahamthullaగారికి నమ్రతతో మీ వేదన అర్ధం చేసుకోగలను .


రాజకీయాన్ని వంట పట్టించుకోని రామారావు గారి పాలనా సమయం లోతానుగా చేసిన వాగ్దానాలు
చిత్త శుద్ధితో అమలు చేయగలిగిన ఆయన చేతికందినఅధికారం పై తానుఎంతకాలం ఉండగలనో అన్న మీమాంస తోఆయన ఎన్నడూలేరు. తన పాలనలో ప్రాధమ్యాలనుతాను నిర్ధారించుకొని ముక్కు సూటిగా పాలన కొనసాగిన్చగలిగినఆయనకు ఎన్నో ఎదురుదెబ్బలు తగిలాయన్నది నిర్వివాదాంశం అయినా తాననుకున్నది అనుకున్నట్లు ఆచరించగలిగిన ధీశాలి. మాతృ భాష విషయం లో ఆయన చేపట్టిన విధి విధానాలు ఇతర పాలకులూ ప్రామాణికంగా పాటించ వచ్చు. పట్వారీ వ్యవస్థ రద్దు ,తహసీల్ల స్థానే మండలాలు ,
మద్యపాన నిషేధంఇలా ఎన్నో కార్యక్రమాలకు చిత్త శుద్ధితో పాటు ఆత్మస్థైర్యం చాలా అవసరం .


కానినేడున్న రాజకీయ పరిస్థితులలో ఆంధ్రరాష్ట పాలనా వ్యవహారాలలో ప్రాధమ్యాలలో పెను సవాళ్లు ఎదురు నిలిచాయి, అందులో మొదటిది ఆర్ధికం, రెండవది, పోలవరం ,మూడవది రాజధాని నిర్మాణం,నాలుగవది, వాగ్దానం చేసినసంక్షేమ కార్యక్రమాలు అయిదవది నిధుల కొరత.

ఇలా ఎన్నో పెను సవాళ్లుప్రభుత్వం ఎదుట.మరో ప్రక్కతోన్తికాల్లు అడ్డం పెట్టి అభివృద్ధికి సహకరించనిప్రతిపక్షాలు. కేంద్రం కుంటి సాకులు.

ఇలాఅనేక స్థితిగతులు ప్రస్తుత పాలకులకుఅడ్డంకులు గా నిలిచాయన్నది వాస్తవమే అయినా పాలనా వ్యవహారాలలో విద్యాలయాలలో ప్రాధమిక మాధ్యమికవిద్యా స్థాయిలలో మాతృభాష వినియోగం ఆచరణలోఅసాధ్యమేమీ కాదు.ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే.ప్రభుత్వం యిందుపై ప్రాధాన్యం ఇవ్వడం అసాధ్యమేమీ కాదు. ప్రభుత్వం యిందుపైశ్రద్ధ వహించక పోవడం విచారకరం .

 Narasimhraju Kvsl Telugu Leni samskurti Manam chdalemu Matru bashanu kapadukovali, gowrinchali, acharinchali

 Elchuri Muralidhara Ra మాన్యమిత్రులు శ్రీNoorbasha Rahamthullaగారికి అభివాదనం! అధికార భాషగా తెలుగుకు ప్రయోగవ్యాప్తిని కల్పించేందుకుమీరు చేసిన కృషి, కంప్యూటర్ల ప్రవేశం తర్వాత మీరు కొనసాగించిన కృషి ఎంతోవిలువైనవి. ఇప్పుడు తెలుగు భాష రాజకీయజ్ఞుల చేతిలో ప్రచారసాధనంగా మారింది. ఇప్పుడు ప్రజలే పూనుకొని ఉద్యమాన్ని తీసికొనివస్తే తప్ప - పరిస్థితి ఏమీఆశాజనకంగా లేదు. ఆ ఉద్యమకారుల్లో సైతం కొంతమందికి తమ ఉనికినినిలబెట్టుకోవటం కోసం లేనిపోని సరిక్రొత్త వాడుకను కల్పించాలన్న వ్యామోహమేకాని, ఉన్న వ్యవస్థను కాపాడుకోవాలన్న ప్రయత్నం అగుపించదు. మొత్తానికి గడ్డుసమస్యే. తెలుగు భాష రాజకీయవాదుల కబంధహస్తాల నుంచి బైటపడి విద్యారంగంద్వారా ఆంధ్ర రాష్ట్రపు ప్రజావ్యవహారంలో నిలదొక్కుకోవటం అంత సులభమనిఅనిపించటం లేదు!

 Gopireddy Srinivas Reddy పిల్లిఅంటే మార్జాలం అన్నట్లు కాకుండా వాడుకభాషలో చక్కగా అందరికీ అర్థమయ్యేట్లుతెలుగులోనే పాలన జరగాలి. ప్రస్తుత సోషల్ మీడియాలో ఎంత చక్కని తెలుగులో సామాన్యులూ తమ భావాలు వ్యక్తపరుస్తున్నది చూస్తూనే ఉన్నాము.

 పద్మా కుమారి పద్మా కుమారి ఇది యధారాజా తధా ప్రజా కానేరదు...ప్రజాభీష్టాన్ని గౌరవించే ప్రభుత ఉంటే...యధా ప్రజా తధా రాజానే....


Sireesha Sribhashyam తప్పకుండా చేయొచ్చు....మన భాష లో ఉన్న పట్టు పరాయి భాషలో ఉండదు...కృషి చేస్తే తప్పకుండా సాధించ గలుగుతాం..కష్టతరమైన పదాలు కాకుండా..సులువు గా అర్థమయ్యే రీతిలో ఉండాలి..మాతృభాషపై మమకారం..కొందరికే కాదు ప్రతీ ఒక్కరికీ ఉండాలి..వ్యవస్థ మారాలి ముందుగా..వేరే భాషలపై మోజు తగ్గి మన భాషపై ప్రేమ పెంచుకోవాలి..ఆ బాధ్యత పాఠశాల స్థాయి నుండే కాదు...మన ఇంట్లో నుంచి కూడా రావాలి

ఇప్పటిపిల్లలు తెలుగు మాట్లాడితే చిన్నతనంగా భావిస్తున్నారు..దానికి తగ్గట్టుప్రభుత్వం ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టింది..మన గొయ్యి మనమేతవ్వుకుంటున్నాం..ఇప్పటికయినా అందరి హృదయాల్లోంచి ఈ భావన స్వచ్ఛంగా రావాలి..అప్పుడే.. తెలుగు భాషని బ్రతికించుకోగలుగుతాం..తెలుగు భాషలో పాలనా చేయగలుగుతాం...

మీ కృషికిఅభినందనలు

Divi Kumar నూర్‌భాషా రహంతుల్లాగారి అలుపెరుగని కృషికి ధన్యవాదాలు.హిందీతో సహా తెలుగుమరో 20 భాషలు జాతీయ భాష లే. ఇదే తరహాలో భారత రాష్ట్రపతి శ్రీ కోవింద్ హిందీజాతీయ భాష అనీ, మిగిలినవన్నీ ప్రాంతీయ భాషలనీ ప్రకటించటం తప్పు. రాజ్యాంగ నిర్ణాయక సభలో (1949లో) తెలుగు, హిందీతో సహా మొత్తం 14 భాషలనుజాతీయ భాషలుగా గుర్తించారు. అధికార భాషగా ఏది ఉండాలి అన్న విషయంలో వివాదంఏర్పడింది. హిందీని అధికార భాషగా గుర్తించటానికి హిందీయేతర ప్రాంతాలనుండివ్యతిరేకత వచ్చింది. దానిపై రాజ్యాంగ నిర్ణాయక సభ వోటింగును కోరింది.ఆశ్చర్యకరంగా అనుకూల వ్యతిరేక ఓట్లు సమానంగా వచ్చాయి. రాజ్యాంగ నిర్ణాయకసభకు అధ్యక్షుడయిన బాబూ రాజేంద్ర ప్రసాద్ హిందీకి అనుకూలంగా ఓటు చేయటంతోహిందీ అధికార భాష అయింది కానీ, హిందీ ఒక్కటే జాతీయ భాష అనీ, మిగిలినభాషలన్నీ ప్రాంతీయ భాషలనే అవగాహన పూర్తిగా తప్పు. ప్రస్తుతం 22 భారతీయభాషలు జాతీయ భాషలుగా గుర్తింపుతో వున్నాయి. ఇటీవల రాజస్థానీ, భోజ్‌పురీనిజాతీయ భాషలుగా గుర్తించాలనే డిమాండు వస్తే, అలా హిందీ ప్రాంత స్థానికభాషలన్నిటినీ జాతీయ భాషలుగా గుర్తిస్తూ పోతే హిందీ భాష భవిష్యత్తుప్రమాదంలో పడుతుందని కొందరు హిందీ ప్రొఫెసర్లు ఆందోళన వ్యక్తం చేశారు.

Raghu Babu Yarlagadda చేయగలం నూటికి నూరుపాళ్ళూ. ప్రజల భాషలో కాకుండా ఇతర భాషలో ప్రభుత్వం నడపటం ప్రజాస్వామ్యానికే అవమానం



Venkata Subbaiah Somepalliరహంతుల్లా గారి కృషి అభినందనీయం. ఎన్.టి. రామారావు గారి తెలుగు భాషాభిమానం అందరికి స్ఫూర్తిదాయకం.

తెలుగులో పరిపాలన జరగటానికి...ముందుగా బలమైన రాజకీయ సంకల్పం ఉండాలి.పాలకపక్ష నేత, ప్రభుత్వాధినేత చిత్తశుద్ధితో తలచుకుంటే తెలుగులో పరిపాలనతప్పక జరుగుతుంది. ముఖ్యమంత్రిగారు తెలుగులో పరిపాలన పిలుపునిచ్చిదానికి కట్టుబడి ఉంటే కాదనే వారెవరు? కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఆయన వెంటే ఉంటారు.

తెలుగులో పరిపాలన అనేది దిగువస్థాయినుంచి కాకుండా పై స్థాయినుంచి అమలు కావాలి. సచివాలయం, కలెక్టరుకార్యాలయం నుంచి అమలైతే మిగివిన వాళ్ళందరూ తూ.చ తప్పకుండా పాటిస్తారు. కొందరు ఉద్యోగులకు తెలుగంటే చిన్నచూపు. దానికి కారణం ఆత్మవంచన తప్ప మరేమి కాదు. అధికారులందరూ తెలుగు భాషను ప్రేమించాలి.

దాదాపు పదేళ్ళ క్రిందట పోలీసుల ఉద్యోగ సంఘం ఓ పిలుపునిచ్చింది, తమఉద్యోగులంతా తెలుగులో కార్యకలాపాలు సాగించాలని కోరింది. అది ఎంతవరకు అమలుజరిగిందో తెలియదు కాని మంచి ఆలోచన. రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ సంఘాలుకలసికట్టుగా తెలుగును పాలనలో అమలు చేయాలనుకుంటే అది మంచి ప్రయత్నంఅవుతుంది. ఎట్లాగు ఉత్తర్వులున్నాయి కదా! ఆ దిశగా ప్రయత్నం జరగాలి.

తెలుగులో విద్యార్హత పొందిన వారికి ఉద్యోగాలలో ప్రాధాన్యత ఉండేలాచర్యలు తీసుకోవాలి. న్యాయపరమైన చిక్కులు ఉంటే కనీసం తెలుగు భాష పాటవ పరీక్షఒక పేపరుగా పెట్టి మెరిట్ లో కలపాలి. అపుడు తెలుగు ఊసే తెలియకుండాడిగ్రీలు, పోస్ట్ గ్రాడ్యుఏషన్లు చదివినవారికంటే తెలుగులో చదివినవారికిప్రాధాన్యత లభించినట్లవుతుంది.



Swechchaa Manavathanath Royతెలుగును అన్ని కార్యాలయాల లో , న్యాయ స్థానాల లో ప్రతి రంగం లో తప్పని సరిగావాడాలి అన్న ఉత్తర్వులు జారీ చెయ్యాలి . అంతకు ముందు తెలుగు అధికార భాషాసంఘాలు కొంత మేరకు సఫలీ కృతం అయ్యాయి తెలుగు భాష ను అధికార కార్యాలయాల లోఉత్తర్వులు జారీ చెయ్యటం, ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగు లో నే ఉండాలి అని మంచి సూచనలు ఇచ్చాయి .

తెలుగు రాని అధికారులు, తప్పని సరిగా తెలుగు నేర్చు కుని చక్కగా తెలుగు లో మాట్లాడు తున్నారు . ,

తెలుగుభాష కి ఉన్న గొప్ప తనము ఏమిటి అంటే, ద్రవిడ , కిరాతక, ప్రాకృతి , పాలీ , పోర్చుగీస్ , పారశీ , అరబ్బు , ఆంగ్లము, సంస్కృతం అన్ని భాష లను తనలోలీనము చేసుకుని పరిపుష్టి చెందినది .

ఉస్మానియా విశ్వవిద్యాలయం లో ఉర్దూ భాష ను అమలు చేసింది . అటువంటప్పుడు తెలుగు లో అమలు చెయ్యటం కష్టం కాదు


అన్ని ప్రాంతాల యాసలలోని పదాలు అర్థం కావాలి అంటే ఒక సమగ్ర నిఘంటువు రావాలి .

పారిభాషికపదాలు ను ఇతర భాష ల నుంచి అనువదించే టప్పుడు యాంత్రికంగా కాకుండా అందరికీఅర్థం అయ్యేలా చెయ్యాలి . తమిళులు ఏ భాషా పదాన్ని అయినా వెంటనే తమిళ్ లో కిఅనువదిస్తారు. న్యాయస్థానాలలో గూడాతెలుగులోనేవాదప్రతివాదాలు ను న్యాయవాదులు, చెయ్యాలి .అప్పుడేవాదీప్రతి వాదులకు, తమ తరఫున న్యాయవాదులు సక్ర మముగావాదిస్తున్నారో లేదో తెలుస్తుంది . చట్టాలు ను అందరికీ తేలిగ్గా అర్థంఅయ్యేలా తెలుగు లో అనువదించే ప్రయత్నాలు చెయ్యాలి . ఇప్పుడు ఉన్న చట్టాలు లో ఏమి ఉన్నదోచాలా మందికిఅర్థం కావటం లేదు .అన్నిసామాజిక మాధ్యమిక వేదికలు లోతెలుగు నేఉపయోగిద్దాము .తెలుగు భాషఔన్నత్యాన్ని గుర్తించి సుబ్రహ్మణ్య భారతి చాలా బాగాప్రశంసించారు .

అచ్చతెలుగు లో రాయబడిన కథలు, కావ్యాలు, నవలలును చదివితేఇంకా మంచిది. మీకృషి అభినందనీయం. వేరేభాషలు లో ని సాహిత్యాన్ని తెలుగు లో కి అనువదించాలి. ఆ అనువాదం సరళం గా ఉండాలి .తెలుగు శాస్త్రీయ సంగీతం నుతమిళులుఎంతోచక్కగా

ఆదరిస్తున్నారు. కానీ దురదృష్ట వశాత్తు, మన రాష్ట్రాలు లోతగినంత ఆదరణ లభించ లేదు. అలానే, తంజావురు లో ఉన్న తెలుగుపాత తాళ పత్రగ్రంథాల నుతెలుగు వారికి చేరువ అయ్యేలా కృషి చెయ్యాలి ప్రభుత్వాలు, తెలుగు భాషాభిమానులు. కత్తిపద్మా రావుగారు చెప్పినట్లు టిబెట్లో, చైనాలో, శ్రీలంకలో నిక్షిప్తంచేయ బడిన బౌద్ధ వాగ్మయాన్ని అంతా తెలుగు చేసే ఒక పీఠాన్నినిర్మించుకోవాల్సిన చారిత్రిక బాధ్యత తెలుగు వారి మీద ఉన్నది . దానికిముందు తెలుగు భాషను రక్షించు కోవాలి.

 Pratapa Pullaiah ప్రపంచము, ఇతర రాష్ట్రాలు వారి వారి బాషలకే ప్రాధాన్యం ఇస్తున్నాయు పరిపాలనలో. ఒక్కతెలుగువారు తప్ప. బాష పేరుతొ పార్టీని పెట్టుకొని, పరిపాలనలో ఉండికుడా..నేతి బీరకాయలో నేతిలాగా అయిపొయింది.

 Peter Paul Chimata Dear Sir, Kindly bear with me for my belated reply herein. I had gone through your posting herein. Also, kindly bear with me for I am writing in English since I do not know Telugu typing. NTR was not only a good human being, but also the finest CM of Telugu people hitherto. He toiled relentlessly for eradicating public grievance; for this, he appointed Rustomji Committee and I think the aforesaid Committee's report is gathering dust. He was a spotless CM. You know, people used to say that it was almost a regular practice that he used to conduct discussions in his house with the poets like Sam udrala Sr., Malladi Ramakrishna Sastry, Pingali Nagendram etc in the early morning hours.That was his love for Telugu literature. I strongly support your wish that AP Government's administration should be conducted in Telugu medium; but, this dream can be fulfilled only, when there is political will. Let us hope there will be positive beginnings in this regard; I can tell you only this much at this moment please.

 Abhilasha Mallipeddi దేశభాషలందు తెలుగు లెస్స!! అని తెగ గొప్పలు చెప్పుకుంటాం, మన భాష మన సంస్కృతిఅని బోలెడు సభలు ఏర్పాటు చేసి ఉపన్యాసాలు దంచి పారేస్తాం, తెలుగు వారంతాతెలుగులోనే మాట్లాడుదాం అని హిత బోధలు చేస్తాం!!

కానీ ఆచరణలో ఇవన్నీ శూన్యం, శుభోదయం, శుభ మధ్యాహ్నం, శుభ సాయంత్రం, శుభరాత్రిఅని తెలుగులో చెప్పుకుంటే సరిపోదు, పక్క రాష్ట్రం తమిళనాడులో వాళ్ళమాతృభాషకి ఇచ్చుకున్న ప్రాధాన్యం మనం మన భాషకి ఇవ్వడం లేదు, వాళ్ళ రాష్ట్రంవెళ్తే ఒక్క బోర్డ్ కూడా పరాయి భాషలో కనపడదు, అన్నీ తమిళంలోనే వుంటాయి, ఒకవేళ ఇంగ్లీష్ లో రాసినా కూడా మొదటగా వాళ్ళ మాతృభాషలో రాసి ఆ తర్వాత ఆంగ్లము అది వాళ్ళు వాళ్ళ భాషకి ఇచ్చే గౌరవ స్థానం, మర్యాద!!

కానీమనం, తేనేలూరు తెలుగు అని ప్రపంచం మొత్తం పొగుడుతూ వున్నా, మనకి మాత్రం మనభాష అంటే చిన్న చూపే, తెలుగులో మాట్లాడితే ఎక్కడ తేలికగా చూస్తారో అనిబోడి ఇంగ్లీష్ లో స్టైల్ గా మాట్లాడాలి అని చూస్తారు, ఇక కొంతమంది అమెరికాలేదా ఇతర దేశాలు వెళ్ళి అక్కడ స్థిర పడితే, ఇక అంతే.... వాళ్ళు ఇక్కడకివచ్చినా గానీ తెలుగు భాష వాడడం నామోషీగా భావిస్తారు, అలాంటి వాళ్ళని చూస్తేనాకు అరికాలి మంట నెత్తికి ఎక్కుతుంది, నేను మోహానే అడుగుతా, తెలుగుమర్చిపోయారా లేక మాట్లాడాలి అంటే నామోషీనా అని....

పరాయిభాష కేవలం అవసరం మాత్రమే, అదే మన ఆస్తి కాదు, అవసరానికి మించి ఏది వాడినాఅది ప్రమాదమే, ఆ ప్రమాదమే ఇక్కడ అణువణువునా వ్యాపించేసి వుంది....

తెలుగుభాషకి గౌరవం ఇచ్చి, తన స్థాయిని పెంచాలి అని మనస్పూర్తిగా కృషి చేసేవారిలో నా దృష్టిలో ప్రథమ స్థానం నూర్ భాషా రహంతుల్లా గారిదే, నాకుతెలిసినంత వరకూ నేను చూసినంత వరకూ రహంతుల్లా గారు తెలుగు కోసం తపించేంతగాఎవ్వరూ అంతగా కృషి చేయడం నేను చూడలేదు, ఎప్పుడు మాట్లాడినా గానీ ఆయనమాటల్లో

తెలుగు యొక్క ప్రాధాన్యం మహా దర్జాగా రారాణిలా వెలుగుతూ వుంటుంది, ఆయన మాట, మమత, గౌరవం, మర్యాద, మందలింపూ అన్నీ తెలుగే....

ఇకపోతే అన్నీ కార్యాలయాల్లో లావాదేవీలుతెలుగులో కొనసాగాలనే ఆయన అభిలాషచాలా చాలా గొప్ప సంకల్పం, ఈ విషయంలో ప్రభుత్వం చిన్న చూపు చూస్తుంది అనేది నా భావన, ఈ విషయం గురించి చర్చలు జరగాలి, ప్రతి పార్టీలో ఈ విషయం గురించిఅవగాహన కలిగించే ఒక కమిటీ వుండాలి, ప్రజల్లో చైతన్యం కలిగించేలా ప్రతిరాజకీయ పార్టీ ఈ విషయం గురించి మాట్లాడాలి, మార్పు తీసుకుని రావాలి....

మొదటమన భాషా మన రాష్ట్రం అనేది ప్రతి వారి నరనరానా రుధిరాన విప్లవ ఘోషలాప్రసరించాలి, ముందు నాయకులలో ఈ మార్పు, ఈ ఆలోచన మొదలయ్యి ఈ తెలుగు నాటప్రతి ఇంటా తెలుగు వెలుగులా నాట్యమాడి మన కంట తెలుగు తల్లి చిత్ర పటంసగర్వంగా రెపరెపలాడే రోజు అతి త్వరలో రావాలని మనస్పూర్తిగా ఆశిస్తూ....

నేను గౌరవంగా sir అని పిలిచే అతి కొద్ది మందిలో ఒక్కరైన శ్రీ నూర్ భాషా రహంతుల్లా గారికి సగౌరవంగాఅభినందనలుతెలియచేస్తూ....

Sir మీ యొక్క కోరిక కల్మషం లేనిది, స్వార్ధం లేనిది, తెలుగు వలే కమ్మనైనది, తెలుగు వెలగాలనే మీ కోరిక అతి త్వరలో తీరాలి అని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను...

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రెవెన్యూ (భూ.సం.) విభాగము

లేఖ నెం. 2081/భూసం 2/88-5 తేది. 21.9.88

from:-
శ్రీ. [illegible],
[illegible],
రెవెన్యూ (భూ.సం.) విభాగము
హైదరాబాదు

To
శ్రీ [illegible],
ఇంటి నెం. 10-16/1
[illegible]
[illegible]
హైదరాబాదు

అయ్యా,
విషయము:— [illegible]

సూచనలు:— 1) [illegible] 29.12.87 తేదీ.
2) జి.ఓ.ఎం.ఎస్. నెం. 33/1988 తే. 2.1.88
3) [illegible]
నెం. 3/661/88 తే. 1.8.88

[illegible]

[illegible] తెలియజేయడమైనది.

మీ విశ్వాసపాత్రుడు
[signature]
ఉప కార్యదర్శి

[initials]
14/10/88

25 ప్రపంచ ప్రసిద్ధ భాషలు

ప్రపంచ వ్యాప్తంగా 6 కోట్ల మందికి పైగా మాట్లాడుతున్న 25 భాషలు		
క్రమ సంఖ్య	భాష పేరు	జన సంఖ్య కోట్లలో
1	మండరిన్ చైనా	109
2	ఇంగ్లీష్	98.2
3	హిందూస్థానీ (హిందీ + ఉర్దూ)	54.4
4	స్పానిష్	52.7
5	అరబీ	42.2
6	మాలే	28.1
7	రష్యన్	26.7
8	బెంగాలీ	26.1
9	పోర్చు గీస్	22.9
10	ఫ్రెంచ్	22.9
11	హౌసా	15
12	పంజాబీ	14.8
13	జర్మన్	12.9
14	జపనీస్	12.9
15	పర్షియన్	12.1
16	స్వాహిలీ	10.7
17	తెలుగు	9.2
18	జావనీస్	8.4
19	వు చైనీస్	8
20	కొరియన్	7.7
21	తమిళం	7.5
22	మరాఠీ	7.4
23	యూ చైనీస్	7.2
24	వియత్నాం	6.8
25	ఇటాలియన్	6.6

https://en.wikipedia.org/wiki/List_of languages_by_total_number_of_speakers

తమిళనాడులో కలిసిపోయిన తెలుగు జనం


సదరన్ తెలుగు పీపుల్స్ ప్రోగ్రెసివ్ యూనియన్ వారిచే కూర్చబడిన తమిళనాడులోని స్థానిక భాషాపరమైన అల్పసంఖ్యాక జనాభా వివరాలు

క్రమ సంఖ్య	జిల్లా పేరు	మొత్తం జనాభా (1981 లెక్కల ప్రకారం)	తెలుగు	కన్నడ	మరాఠీ	సౌరాష్ట్ర	శాతం			
							తెలుగు	కన్నడ	మరాఠీ	సౌరాష్ట్ర
1.	కన్యాకుమారి	14.25	0.63	0.007	–	0.03	4.42	0.05	–	0.02
2.	తిన్నెవెల్లి	35.74	11.37	2.00	0.10	0.20	32.81	5.59	0.28	0.56
3.	రామనాథపురం	33.33	12.42	3.45	0.12	0.50	37.24	10.34	0.36	4.50
4.	మధుర	40.36	14.67	4.00	0.45	6.00	36.35	9.91	1.11	14.87
5.	తిరుచిరాపల్లి	36.12	12.83	0.60	0.25	3.25	35.52	1.66	0.68	9.00
6.	పుదుకోట	11.57	3.49	0.20	0.10	0.10	30.16	1.73	0.86	0.86
7.	తంజావూరు	41.64	10.21	0.74	1.25	0.85	24.52	1.88	3.00	2.04
8.	దక్షిణ ఆర్కాటు	43.02	14.32	1.45	0.25	0.25	33.29	3.37	0.58	0.58
9.	చెంగల్పట్టు	39.07	19.18	1.05	0.35	0.33	49.09	2.69	0.90	0.84
10.	ఉత్తర ఆర్కాటు	44.14	17.42	2.72	0.10	0.15	39.47	6.16	0.22	0.34
11.	ధర్మపురి	19.97	12.65	3.48	0.42	0.005	63.34	17.43	2.10	0.04
12.	సేలం	24.46	12.73	2.00	0.72	0.15	52.04	8.18	2.94	0.61
13.	పెరియార్	20.68	8.44	2.15	0.12	0.20	40.81	10.40	0.58	0.97
14.	కోయంబత్తూరు	30.60	12.83	6.00	0.45	0.02	41.93	19.61	1.47	0.07
15.	నీలగిరి	6.36	0.63	4.48	0.03	0.01	9.91	71.57	0.47	0.16
16.	మద్రాసు	42.77	26.85	4.583	3.25	0.28	62.78	10.72	7.50	0.65
		484.08	**190.67**	**38.910**	**7.86**	**13.325**	**39.96**	**8.05**	**1.65**	**2.69**

ఆయా భాషారాష్ట్రాలతో అన్ని సంబంధాలు తెగిపోయి ఇక్కడ భాషాపరమైన మైనారిటీలుగా ఉంటున్న వారి వివరాలు మాత్రమే యిక్కడ యివ్వబడ్డాయి. మళయాళం, బెంగాలీ, పంజాబీ, గుజరాతీ, మరాఠీ, ఒరియా, రాజస్థానీ, మార్వాడీ, బీహారీ, మైథిలీ, ఉర్దూ, హిందీ మరియు 1953 తరువాత ఆంధ్రరాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన తెలుగువారు యింకా తమ తమ భాషారాష్ట్రాలతో సంబంధాలు కొనసాగిస్తున్నందున వారి సంఖ్యలు ఇందులో యివ్వబడలేదు.

34 **నడుస్తున్న చరిత్ర**, ఆగస్టు 2002

చిత్రమాలిక



1.11.2004

"తెలుగు అధికార భాష కావాలంటే" పుస్తకావిష్కరణవిశాఖపట్నం కలక్టరేట్ లో



2011 అధికారభాషా సంఘం పురస్కారం శ్రీ ఏబీకే ప్రసాద్ గారు

ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గారు



15.11.2012

విజయవాడ సబ్ కలక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా అధికారుల

సమావేశంలో"తెలుగు దేవభాషే" పుస్తక ఆవిష్కరణ



“23.9.2012
కత్తిపద్మారావు గారితో”



1.4.2013
భూపతి నారాయణమూర్తి గారితో





29.8.2015 తెలుగు భాషా దినోత్సవం
శ్రీ గిడుగు వెంకట రామమూర్తి గారి 152 వ జయంతి సందర్భంగా ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి అభినందన పత్రం.



19.10.2016

తెలుగు మాధ్యమం విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలలో తమిళనాడులో లాగా 20 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరుతూ విజ్ఞప్తి



7.9.2013

చిత్తజల్లు వరహాలరావు, సయ్యద్ నశీర్ అహమద్ గార్లతో



11.10.2012
రావిపూడి వెంకటాద్రి గారితో



19.7.2013
పి.సత్యవతి, స.వెం. రమేష్, రమాసుందరి గార్లతో



9.10.2012
పరకాల పట్టాభి రామారావు గారితో